శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆశ్రమవాసపర్వము: ప్రథమాశ్వాసము

శ్రీసాదనపదపద్మో। పాసనవిద్యా! శమైకపరతానిత్యా
భ్యాసజనహృద్య! వేద। వ్యాస వచోవిభవవేద్య। హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= సంపదలకు; సాదన= నివాసమైన; పద పద్మ= తామరపూలవంటి పాదాలను; ఉపాసన= సేవించటం అనే; విద్యా!= విద్య కలవాడా!; శమ= శాంతిలో; ఏకపరతా= ప్రధాన మైన తాత్పర్యంతో; నిత్య= ఎల్లవేళలా; అభ్యాస= అలవాటుగా కలిగిన; జన= జనానికి; హృద్య!= మనోహరమైనవాడా!; వేదవ్యాస= వేదాలను వేరు చేసిన (వ్యాస) మహర్షియొక్క; వచస్= వాక్యాల; విభవ= మహిమచేత; వేద్య!= తెలియదగినవాడా; హరిహరనాథా!= విష్ణు - పరమేశ్వర స్వరూపుడా! (వినుము).

తాత్పర్యం: నీపాద పద్మాలను సేవించుకొనేవారికి సంపద లిచ్చేవాడా! ఎప్పుడూ శాంతంగా ఉండే వారి హృదయాలలో నిలిచేవాడా! వ్యాసమహర్షి బ్రహ్మసూత్ర, పురాణాది వాక్యాలవలన తెలియదగినవాడా! హరిహర స్వరూపా!. (తదుపరి వృత్తాంతం వినుము.)

విశేషం: పదసేవతో సిరు లివ్వటం అనే మొదటి అంశంలో హరి లక్షణమూ, శాంతపరుల హృదయంలో ఉండడం అనే రెండో అంశంలో హరలక్షణమూ, వ్యాసవాక్యాలలో తెలియబడటం అనే మూడో అంశంలో హరిహర ఉభయలక్షణమూ కనబడతాయి. శ్రీ అంటే మోక్షం కూడా. అదీ ఒక కామితమే.

యుధిష్ఠిరాదులును గాంధారీధృతరాష్ట్రులును నొండొరులయెడల నడచికొనిన ప్రవర్తనము: (సం.15-1-1)

వ. దేవా! జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె; నట్లు పితృపితామహక్రమప్రాప్తం బయిన సామ్రాజ్యంబు జగత్పూజ్యప్రకారంబునం గైకొని మహాధ్వరప్రముఖధర్మకార్యధుర్యులును సముపాసితార్యులును దయా విధేయులు నగు - పాండవేయులు ధృతరాష్ట్రువలన నెవ్విధంబు వారై నడచిరి? హతపుత్రమిత్రామాత్యుండును గతైశ్వర్యుండును నగు నా రాజును యశోమహితయగు గాంధారియు నెట్టిభంగి వర్తించి? రత్తెఱంగు నా కెఱింగింపుము. 2

ప్రతిపదార్థం: దేవా= హరిహరనాథా!; జనమేజయుండు= జనమేజయమహారాజు; వైశంపాయనునకున్= వైశంపాయనమునితో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు (అట్లులోగడ చెప్పినవిధంగా); పితృ= తండ్రి; పితామహ= తాతల; క్రమ= వరుసలో; ప్రాప్తంబు అయిన= లభించిన; సామ్రాజ్యంబు= సార్వభౌమత్వాన్ని; జగత్= ప్రజలచేత; పూజ్య= గౌరవించదగిన; ప్రకారంబునన్= పద్ధతిలో; కైకొని= స్వీకరించి; మహా అధ్వర= గొప్ప యజ్ఞాలు; ప్రముఖ= మొదలైన; ధర్మ= వేదవిహితాలు అయిన; కార్య= క్రియలను నిర్వహించటంలో; ధుర్యులును= నేర్పరులూ; సమ్ ఉపాసిత= చక్కగా సేవించబడిన; ఆర్యులును= పెద్దలు కలవారూ; దయా విధేయులును= దయకు లోబడినవారూ; అగు= అయిన; పాండవేయులు= పాండురాజు కొడుకులు; ధృతరాష్ట్రువలనన్= ధృతరాష్ట్రుడి విషయంలో; ఏ+విధంబు వారు అయి= ఎటువంటి ప్రవర్తనం కలిగి; నడచిరి?= వ్యవహరించారు?; హత= చంపబడ్డ;

పుత్త్ర= దుర్యోధనాదు లైన కొడుకులూ; మిత్ర= కౌరవపక్షాన నిల్చి యుద్ధంచేసిన రాజ స్నేహితులూ; అమాత్యుండును= మంత్రులూ కలవాడునూ; గత+ఐశ్వర్యుండును= ప్రాభవం కోల్పోయిన వాడునూ; అగు= అయిన; ఆరాజును= ఆధృతరాష్ట్రుడూ; యశస్ మహిత= కీర్తిచేత గొప్పది; అగు= అయిన; గాంధారియున్= ధృతరాష్ట్రుడిభార్యా; ఎట్టిభంగిన్= ఏవిధంగా; వర్తించిరి= వ్యవహరించారు; ఆ+తెఱంగు= ఆవిధం; నాకున్= నాకు (జనమేజయుడికి); ఎఱింగింపుము= తెలుపవలసింది.

తాత్పర్యం: హరిహరదేవా! జనమేజయుడు వైశంపాయనుడితో ఇట్లా అన్నాడు. గొప్పగొప్పయజ్ఞాలు మొదలైన వేదకర్మలను ఆచరించేవాళ్ళు, పెద్దలను గౌరవించేవాళ్ళు, కరుణా స్వభావులూ అయిన పాండవులు తాతల, తండ్రుల క్రమంలో తమకు లభించిన ప్రభుత్వాన్ని సర్వజనామోదకరంగా స్వీకరించిన తర్వాత ధృతరాష్ట్రుడి విషయంలో ఎట్లా నడుచుకున్నారు? కొడుకులనూ, హితులనూ, మంత్రులనూ, తనవారందరినీ, సార్వభౌమత్వాన్నీ పోగొట్టుకొన్న ధృతరాష్ట్రుడూ, మంచిపేరున్న గాంధారీ (పాండవులతో) ఎట్లా వ్యవహరించారు? ఆ సంగతి తెలియజెప్పవలసింది.

విశేషం: ఇందులో విశేషణాలన్నీ సాభిప్రాయాలు. పాండవులకు రాజ్యం హక్కుగా వచ్చిందే కాని బలవంతంగా లాక్కున్నది కాదు. దాయాదులను చంపి కాజేశారనీ, అది హేయమనీ ప్రజలు కూడా అనుకోలేదు. కాబట్టి యీవిషయంలో ధృతరాష్ట్రుడు పాండవులపై ద్వేషం పెట్టుకొనగూడదని ఉద్దేశం. ఆర్యులను సేవించే లక్షణం ఉన్నది. పైగా దయా విధేయులు గూడా కాబట్టి గాంధారీధృతరాష్ట్రులునూ పెద్దతల్లితండ్రులునూ పుత్రశోకంలో ఉంటారు. కాబట్టి సానుభూతితో గూడ పాండవులు తప్పక గౌరవించేఉంటారు. గతంలో తమ కష్టాలకు ధృతరాష్ట్రుడూ కొంత కారణం అని అతనిపై పాండవులకు కోపం ఉండదు - అని తన వంశంలో ఆర్యులైన పాండవులను గూర్చి జనమేజయుడి నమ్మకం. ఇంక హతపుత్రమిత్రామాత్యుడైన ధృతరాష్ట్రుడికే దానికి హేతువైన పాండవులమీద కోపం ఉండక తప్పదు. 'పవనాత్మజుండు సన్నిహితుఁ డైన యప్పు డజ్జనవిభుండు తన తనూజులఁ దలఁచి సంతాప మందు' (16వ.) తుండడం గమనిస్తాం (ఇట్లాగే 31స.) కాబట్టి, ధృతరాష్ట్రుడు పాండవులతో మనసు కలిసిఉండటం జరగదు. యశోమహిత అనటంలో గాంధారిమీద కొంత సదభిప్రాయం. మహాధ్వరకార్యధుర్యులు మొదలైన విశేషణాలు పాండవులకు సామ్రాజ్యం గైకొన్న తర్వాతే కాదు ముందూ అన్వయిస్తాయి.

సీ. **అనవుడు నమ్ముని యమ్మహీపతికి ని । ట్లనుఁ, బాండునందను లాంబికేయు**
నెడ భక్తివినయంబు లెసఁగంగ వర్తింతు । రతని యోగక్షేమ మరసి యెపుడుఁ
దత్సమీపంబునఁ దగ నిల్చి తమకు నె । య్యది యైన నెఱిఁగించునట్లు గాఁగ
నుందురు విదుర యుయుత్సు సంజయులు దా । రును నిత్యమును వచ్చి వినతిఁ జేసి

తే. **కొలిచి కూర్చుండి యా నృపు నలఘుకార్య । విధము లేర్పడ నడిగి యవ్విభుని చెప్పి**
నట్లు చేయుదు రతఁడును నాదరంబు । గాఢవత్సలత్వంబును గలిగియుండు. **3**

ప్రతిపదార్థం: అనవుడున్= (జనమేజయుడు పైవిధంగా) అనగా; ఆ+ముని= ఆ వైశంపాయన మహర్షి; ఆ+మహీపతికిన్= ఆ జనమేజయ భూపాలుడితో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నాడు; పాండునందనులు= పాండురాజుకొడుకులు, ఆంబికేయు+ఎడన్= ఆ ధృతరాష్ట్రుడి విషయంలో; భక్తి వినయంబులు= సేవాభావమూ, అణకువా; ఎసఁగంగన్= ఎక్కువగా; వర్తింతురు= నడుచుకొనేవారు; అతని= ఆ ధృతరాష్ట్రుడియొక్క; యోగక్షేమము= ఉన్నతస్థితీ, అది పదిలంగా ఉండేటట్లూ; అరసి= చూస్తూ; ఎపుడున్= అన్ని వేళల్లోనూ; తద్+సమీపంబునన్= ఆ ధృతరాష్ట్రుడి దగ్గరే; తగన్= తగువిధంగా (అతడి ఇచ్చకు భంగంకల్గకుండా); నిల్చి= ఉండి; ఏ+అది ఐనన్= ఎటువంటి పని అయినా; తమకున్= తమతో; ఎఱిఁగించునట్టుగాన్=

తెలియజేసేటట్లుగా; ఉందురు= ఉండేవారు; విదుర యుయుత్సు, సంజయులు= విదురుడూ, యుయుత్సుడూ, సంజయుడూ; తారును= తా మై (స్వయంగా= పిలవ నవసరం లేకుండానే); నిత్యమును= ఎల్లప్పుడూ (ప్రతిరోజూ); వచ్చి= ధృతరాష్ట్రుడి వద్దకు వచ్చి; వినతిన్= నమస్కారం; చేసి= చేసి; కొలిచి= సేవించి; కూర్చుండి= ఆసీనులై; ఆనృపు= ఆ ధృత (ధర్మ) రాష్ట్రుడి యొక్క; అలఘుకార్యవిధములు= ఉత్తమాలైన పనులూ; ఏర్పడన్= స్పష్టంగా; అడిగి; ఆ+విభుని= ఆరాజు; చెప్పిన+అట్లు= పేర్కొన్నవిధంగా; చేయుదురు= చేస్తుండేవారు; అతఁడును= ఆ ధృతరాష్ట్రుడు కూడా; ఆదరంబు= (పాండవాదులపై) అభిమానమూ; గాఢ= దృఢమైన; వత్సలత్వంబును= వాత్సల్యాన్నీ; కలిగి ఉండున్= కలిగి వ్యవహరించేవాడు.

తాత్పర్యం: జనమేజయుడు అడిగినదానికి సమాధానంగా వైశంపాయనుడు ఇట్లా చెప్పుతున్నాడు: పాండవులు ధృతరాష్ట్రుడిని వినయంగా సేవించేవాళ్ళు. అతడికి మేలు కలిగేటట్లుగా, ఔన్నత్యానికి భంగం రాకుండా నడుచుకొనేవారు ఏ సమయంలో అయినా ఎటువంటి పని అయినా తమకు ఆజ్ఞాపించటానికి వీలుగా ఎప్పుడూ అతడిసమీపంలో, అతడికి ఇబ్బంది కలగనివిధంగా ఉండేవాళ్ళు. విదురుడూ, యుయుత్సుడూ, సంజయుడూ ప్రత్యేకంగా పిలిపించవలసిన అవసరం లేకుండా రోజూ స్వయంగా వచ్చి ధృతరాష్ట్రుడిని సేవించేవాళ్ళు. ఏం కావాలో అడిగి చిన్నా పెద్దా పను లన్నీ చేసిపెట్టేవాళ్ళు. ధృతరాష్ట్రుడు కూడా పాండవాదు లందరిమీదా ప్రేమతో, వాత్సల్యంతో ఉండేవాడు.

విశేషం: జనమేజయుడు గతైశ్వర్యు డన్నా పాండవాదులు యోగక్షేమాలకు లోటు లేకుండా కింకరభావంతో సేవించటంవలనా, ధృతరాష్ట్రుడు 'నృపుడే' క్రమంగా చూస్తే ఆంబికేయుడికి పాండునందనులమీద ఆదరం, విదురాదులమీద గాఢవాత్సల్యం ఉన్నాయనాలి. యుయుత్సుడు స్వయానా (వైశ్యస్త్రీ వలన) కొడు కయితే విదుర సంజయులు మొదటినుండి తన్నాశ్రయించి ఉన్నవాళ్ళు కాబట్టి వాత్సల్యంలో గాఢత సహజమే. పాండునందనులమీద కొంతభేదభావం అంతరాలనుండి అపుడప్పుడూ బయటపడుతుంటుంది.

ఉ. **కౌరవనాథ! కుంతియును గౌరవ మొప్పఁగ వచ్చి కొల్చు గాం**
ధారి నతిప్రయత్నమున ద్రౌపది తాను సుభద్రయున్ ముదం
బారఁగ నిత్యముం గొలుతు రక్కురువంశమహత్తరన్ మహో
దారము లైన వస్తువు లుదాత్తత నిత్తురు వార లందఱున్. **4**

ప్రతిపదార్థం: కౌరవనాథ!= జనమేజయమహారాజా!; కుంతియును= కుంతీదేవి; కూడా వచ్చి= తానుగా వచ్చి; గాంధారిన్= ధృతరాష్ట్రుడి భార్యను; గౌరవము= గురువు అనే దృష్టి (పెద్దరికం); ఒప్పఁగన్= మెరిసే విధంగా; కొల్చున్= సేవించేది; అతిప్రయత్నమునన్= మిక్కిలిపూనికతో; ద్రౌపది, తానున్= ఆ ద్రౌపదీ; ముదంబు ఆరఁగన్= సంతోషం నిండగా; సుభద్రయున్= సుభద్రా; నిత్యమున్= ప్రతిరోజూ; ఆ+కురువంశమహత్తరన్= కురువంశంలో పెద్ద దయిన ఆ గాంధారిని; కొల్తురు= సేవించేవారు; వారలు+అందఱున్కుంతీ, ద్రౌపదీ, సుభద్రలు ముగ్గురూ; ఉదాత్తతన్= త్యాగబుద్ధితో; మహా+ఉదారములు+అయిన= గొప్ప విలువైన; వస్తువులు= కానుకలు; ఇత్తురు= గాంధారికి ఇస్తుండేవారు.

తాత్పర్యం: జనమేజయా? కుంతికూడ గౌరవము మెరిసే విధంగా వచ్చి గాంధారిని కొలిచేది. మిక్కిలి పూనికతో తానూ సుభద్రాకూడ సంతోషం నిండగా ఆ గాంధారిని నిత్యమూ కొలిచేవారు. వారందరూ గొప్ప విలువైన కానుకలను గాంధారికి గౌరవంతో ఇచ్చేవారు.

విశేషం: కుంతీ, ద్రౌపదీ, సుభద్రలను ప్రముఖంగా ప్రస్తావించడం విశేషం. ఈ ముగ్గురూ కురుక్షేత్రంలో తమ కొడుకులను పోగొట్టుకున్నవాళ్ళే. కుంతికి కర్ణుడూ ప్రియసుతుడే కదా! ద్రౌపదీ సుభద్రల పిల్లలు కౌరవుల మూలంగా వంచనతో మరణించినవారే అయినా వా ర దంతా మర్చిపోయారు. అందుకే ధృతరాష్ట్రుడిని గురించి భీముడు పలికే పరుషవచనాలు ద్రౌపది క్కూడా తెలియకుండా జాగ్రత్తపడడం జరిగింది. కుంతి 'గౌరవ మొప్పఁగ కొల్చి' అప్పగారిని గురువు చేసికొని శిష్యురాలివలె శాసించబడేది 'గౌరవ మొప్పఁగ వచ్చి' - రావడంలోనే రాజమాతగా గౌరవం. కుంతిలోనూ పట్టమహిషి గావటమే కాకుండా గాంధారీ పుత్ర వినాశానికి ప్రధానకారణ మైనదీ గాబట్టి తననూ ద్రౌపదినీ చూస్తూనే గాంధారికి విపరీతభావం కలగవచ్చు. తనకూ భర్తలకూ కూడా మంచితనాన్ని సంపాదించటంలో ద్రౌపది 'అతిప్రయత్నంతో' గాంధారిని కొలువవలసివచ్చింది. ప్రియసుతుడు అభిమన్యుడిని పోగొట్టుకొన్నా కృష్ణుడి చెల్లెలు సుభద్ర - సంతోషంగానే గాంధారిని సేవించింది. (తర్వాత ఈమె మనుమలే రాజ్యం చేశారు.) 'నిత్యముం గొలుచు నక్కురు' - అనే ముద్రితప్రతులపాఠం "తీసికొంటే" చెప్పనివాఁడును, సత్యముచెప్పనివాఁడును ఘోర నరకపంకమున పడున్ - అనేవిధంగా అన్వయం.

క. **చిత్రాంగదయు నులూపియు । ధాత్రీశ్వర! వత్తు రెపుడు ద్రౌపదితోడన్**
గాత్రములు భూరి వినయా । మాత్రములుగ సుబలసుతఁ బ్రమదమునఁ గొలువన్. 5

ప్రతిపదార్థం: ధాత్రీశ్వర!= ఓ రాజా! (జనమేజయా!); గాత్రములు= శరీరాలు; భూరి వినయ ఆమాత్రములు గన్= మిక్కిలి అణకువతో నిండినవి కాగా; చిత్రాంగదయున్= చిత్రాంగదా; ఉలూపియున్= ఉలూపీ; ప్రమదంబునన్= సంతోషంతో; సుబలసుతన్= గాంధారిని; కొలువన్= సేవించటానికి; ద్రౌపదితోడన్= ద్రౌపదితో కలిసి; ఎపుడున్= అన్నివేళలా; వత్తురు= వస్తుంటారు.

తాత్పర్యం: జనమేజయా! అర్జునుడి భార్యలైన చిత్రాంగదా, నాగకన్య ఉలూపీ అణకువతోనూ, సంతోషంతోనూ ద్రౌపదితో కలిసి వచ్చి నిత్యమూ గాంధారిని సేవిస్తుండేవాళ్ళు.

విశేషం: చిత్రాంగద అప్సరస. ఉలూపి నాగకన్య. అన్యలోక స్త్రీలు చిన్నవాళ్ళు కాబట్టి అక్కగారితో కలిసి వెళ్ళటం స్వభావానికి అనుగుణం. పైగా ఈ ముగ్గురూ అర్జునుని తీర్థయాత్రలో వలచి సతులయినవారు కావడం సాన్నిహిత్యానికి మరో కారణం. ఈ ముగ్గురి ప్రస్తావనతో ముల్లోకపు స్త్రీల సేవవలన గాంధారికి ప్రాభవం. పాండవస్త్రీలు గూడా గాంధారిని సేవించేవారే, అందులో విశేషం లేదని.

క. **ఆ తల్లికిఁ దండ్రికి సం । ప్రీతి యలరఁ గుడువఁ గట్టఁ నుదాత్త**
స్ఫీతంబు లైన వస్తు । వ్రాతంబుల నిచ్చు ధర్మరా జనుదినమున్. 6

ప్రతిపదార్థం: ధర్మరాజు= ధర్మతనయుడు; అనుదినమున్= ప్రతిరోజూ; ఆ తల్లికిన్= పెదతల్లి అయిన గాంధారికీ; తండ్రికిన్= పెద్ద తండ్రి అయిన ధృతరాష్ట్రుడికీ; సంప్రీతి= ఇష్టం; అలరన్= అతిశయించేటట్లుగా; కుడువన్= తినడానికీ; కట్టన్= ధరించడానికీ; పెట్టన్= అలంకరించుకొనటానికీ; ఉదాత్త స్ఫీతంబులు ఐన= రాజులకు తగినవీ, సమృద్ధము లైనవీ అయిన; వస్తు వ్రాతంబులన్= వస్తువుల సమూహాలను; ఇచ్చున్= ఇస్తుండేవాడు.

తాత్పర్యం: గాంధారీ ధృతరాష్ట్రులు సంతృప్తిపడే విధంగా తినటానికీ, కట్టుకొనటానికీ, పెట్టుకొనటానికీ, రాజులకు అర్హమైన భక్ష్యభోజ్యాలు, శయన, మాల్య అనులేపనాలు మొదలైన వివిధ వస్తువులు, వస్త్రాలు, ఆభరణాలు సమృద్ధిగా ధర్మరాజు వారికి ప్రతిరోజూ అందజేసేవాడు.

విశేషం: సంప్రీతి అలరుట పుచ్చుకొన్న గాంధారీ ధృతరాష్ట్రులకే కాకుండా ఇచ్చే ధర్మరాజులోనూ అన్వయిస్తుంది. తల్లి, తండ్రి అనే భావం వలన ఇచ్చేవాడికీ, పుచ్చుకొనే వాళ్ళకూ సంప్రీతి. పెట్టన్ అనేది గాంధారీ ధృతరాష్ట్రులు తాము అనుభవించటానికి మాత్రమే కాక తమ కిష్టమైన వాళ్ళకు పెట్టుకొనటానికి కూడా సరిపోయేంత సమృద్ధిగా వస్తువ్రాతం ధర్మరాజు ఇస్తున్నా డని తెలుపుతున్నది. అనుదినమూ ఇవ్వటంలో అత్యంత శ్రద్ధ. అప్రమత్తత.

తే. **గుళ్ళుఁ జెఱువులుఁ గట్టించుఁ, గోరి యూళ్ళు । లగ్రహారముల్ గావించు నాంబికేయుఁ**
డధిప! ధర్మతనూజుఁ డత్యంత హర్ష । చిత్తవృత్తి యై యనుమతి సేయుచుండ. **7**

ప్రతిపదార్థం: అధిప!= ఓరాజా!; ధర్మ తనూజుఁడు= ధర్మరాజు; అత్యంత= మిక్కిలి; హర్ష= సంతోషం నిండిన; చిత్త= మనస్సుయొక్క; వృత్తి+ఐ= వర్తనం కలవాడై; అనుమతి= అంగీకారం; చేయుచుండన్= తెలుపుతూ ఉండగా; ఆంబికేయుఁడు= ధృతరాష్ట్రుడు; కోరి= తన ఇచ్ఛానుసారంగా; (అడిగి); గుళ్ళున్= దేవాలయాలూ; చెఱువులున్= తటాకాలూ; కట్టించున్= నిర్మింపజేసేవాడు; ఊళ్ళులు= గ్రామాలు; అగ్రహారముల్= బ్రాహ్మణ నివాసస్థలాలూ; కావించున్= ఏర్పాటు చేయించేవాడు.

తాత్పర్యం: జనమేజయా! ధర్మరాజు సంతోషంగా ఆమోదించగా ధృతరాష్ట్రుడు గుళ్ళూ, చెరువులూ ఏర్పరిచేవాడు. ఊళ్ళూ, అగ్రహారాలూ కల్పించేవాడు.

విశేషం: ధర్మరాజు గూడా కింకరభావంతో ధృతరాష్ట్రుడిని సేవిస్తూ 'నీవు' రాజవుగాక నీ కేను రాజనే' అంటాడు. (34.స.) అయినా 'ఏ కార్యమైన నెవ్వఁ డేనియుఁ జేయఁ దొడఁగు నప్పుడు పుడమివేనిచే ననుజ్ఞాతుండై కాని తొడంగఁ గారు' (27స.) అంటాడు ధృతరాష్ట్రుడు. అందుకే రాజానుమతి ధర్మమని తప్ప ధృతరాష్ట్రుడి ఇచ్ఛకు అవరోధం లేదు. ఇక్కడ వాక్య రచనా విధానంలో ధర్మరాజు అనుమతికి అంతగా ప్రాముఖ్యం కనబడకపోవడం అందుకే. గుళ్ళూ, చెరువులూ, ఊళ్ళూ, అగ్రహారాలు ధృతరాష్ట్రుడేర్పరచటం మరణించిన తనవారికి పుణ్యగతులు సాధించటానికే. అయినా 'హర్షచిత్తవృత్తితో అనుమతించటం ధర్మరాజుసౌశీల్యం. అగ్రహారాలు బ్రాహ్మణులకు మాత్రమే ఇచ్చేవి; సాధారణంగా బ్రాహ్మణులే నివసించే ప్రదేశాలు. వీటిని వంశపారంపర్యంగా అనుభవించవచ్చును. రాజు మారినా ఇవి పోవు. పన్నులు వసూలు చేసికొనే అధికారం మాత్రం ఉండదు. ఊళ్ళు దీనికి వ్యతిరిక్తాలు అంటే పన్నులు వసూలు చేసికొనవచ్చును. రాజు మారితే ఇవీ పోతాయి.

క. **జనవర! ధర్మజుఁ గొలువం । జనుదెంచిన యట్టి వివిధ జనపతు లెల్లన్**
మును ధృతరాష్ట్రునిఁ గొలుతురు । విను మా కొడుకు మది పల్లవించున్ దానన్. **8**

ప్రతిపదార్థం: జనవర!= రాజా!; వినుము= వినవలసింది; ధర్మజున్= సమ్రాట్టు అయిన ధర్మరాజును; కొలువన్= సేవించటానికి; చనుదెంచిన అట్టి= వచ్చిన; వివిధ జనపతులు= వేర్వేరు దేశాల రాజులు; ఎల్లన్= అందరూ; మును= ధర్మరాజుకంటె ముందుగా; ధృతరాష్ట్రునిన్= ధృతరాష్ట్రుడిని; కొలుతురు= సేవించేవారు; దానన్= సామంతుల ఆ చర్యవలన; ఆ కొడుకుమది= ధర్మరాజు మనస్సు; పల్లవించున్= సంతోషించేది.

తాత్పర్యం: జనమేజయ మహారాజా! వినుము. సార్వభౌముడైన ధర్మరాజును సేవించటానికి వచ్చిన సామంత రాజు లందరూ ధర్మరాజునుకంటె ముందుగా ధృతరాష్ట్రుడిని సేవించేవారు. అందుకు ధర్మరాజు సంతోషించేవాడు.

విశేషం: తన కంటె ధృతరాష్ట్రుడికే ప్రాభవం అధికంగా ఉండడం ధర్మజుడికి సంతోషం. తన కొడుకులే మరణించగా పాండవులకు రాజ్యాధిపత్యం గల్గటంవలన కలిగే మనఃఖేదం ధృతరాష్ట్రుడికి ఈ చర్యవలన ఉపశమిస్తుంది. (9స.) సామంతులు ముందుగా

అతడిని కొలవటానికి కారణం అతడు ధృతరాష్ట్రుడు కావటం. ఆ తండ్రిని ముందుగా మన్నించడం వలన ధర్మజుడు తన ఆధిపత్యానికి భంగం కలిగిందని అనుకొనకపోగా సంతోషించటం. 'ఆ కొడుకు' కావటం వలన పైగా వారు 'ధర్మజుఁ గొలువం జనుదెంచినవారు.' వారి ఆంతర్యం ధర్మరాజుకు తెలుసు.

క. సూనులు లేమిం గలిగెడు। దీనత్వము దోఁపకుండఁ దేజస్సౌఖ్యా
నూనులుగఁ జేయు ధర్మజుఁ। డా నరపతి నతనిదేవి నతులిత భక్తిన్. 9

ప్రతిపదార్థం: ధర్మజుఁడు= ధర్మరాజు; అతులిత భక్తిన్= సాటిలేని సేవాభావంతో; ఆ నరపతిన్= ఆ ధృతరాష్ట్రుడినీ; అతనిదేవిన్= ఆయన భార్య, గాంధారినీ; సూనులు= కొడుకులు; లేమిన్= (యుద్ధంలో మరణించడం చేత) లేకపోవడం వలన; కలిగెడు= సంభవించే; దీనత్వము= దుఃఖం; తోఁపకుండన్= తలపులోకి రాకుండా; తేజస్+సౌఖ్య+అనూనులుగన్= ప్రాభవమూ, సుఖమూ తక్కువ కాకుండెడివారుగా; చేయున్= చేసేవాడు.

తాత్పర్యం: కొడుకులు లేకపోవటం వలన కలిగే బాధ మనసులోకి రాకుండా ప్రభుత్వానికీ, సుఖానికీ లోటు రాకుండా, గాంధారీ ధృతరాష్ట్రులను చూచుకొనేవాడు ధర్మరాజు.

సీ. వంశవృద్ధులు పుత్త్రవర్గ వియుక్తులై। యున్నవా రేమిట నుమ్మలింతు
రో యను పుయిలోట నా యుధిష్ఠిరుఁడు ద। మ్ములకును దగునమాత్యులకు నిష్ట
భృత్యులకును మీరు ప్రీతియు భక్తియు। నాంబికేయునిదెస నతిశయిల్ల
నారాజు పంచినయట్ల చేసి చరింపుఁ। డతని నారాధించు టస్మదీయ

ఆ. చిత్తమునకుఁ బ్రియము సేయుట యతనికి। మనసు గాని యట్టిపని యొనర్చు
టగ్గలంపు దుఃఖ మావహించుట యని। యనుదినంబుఁ జెప్పు మనుజనాథ! 10

ప్రతిపదార్థం: మనుజనాథ= రాజా! (జనమేజయా!); వంశవృద్ధులు= కురువంశంలో పెద్దవాళ్ళు; పుత్త్ర వర్గ వియుక్తులు= పెక్కురైన కొడుకులు దూరమైనవారు; అయి ఉన్నవారు= (జీవిస్తూ) ఉన్నారు; ఏమిటన్= ఏ విషయంలో; ఉమ్మలింతురో= బాధ పడతారో; అను పుయిలోటన్= అనే సంకోచంతో; ఆ యుధిష్ఠిరుఁడు= ఆ ధర్మరాజు; తమ్ములకును= భీముడు మొదలైన తమ్ముళ్ళతోనూ; తగు అమాత్యులకున్= అర్హు లైన మంత్రులతోనూ; ఇష్ట భృత్యులకును= ప్రియమైన సేవకులతోనూ; అనుదినంబున్= ప్రతిరోజూ- (ఇట్లా చెప్తాడు); మీరు= మీరు అందరు; ఆంబికేయుని దెసన్= ధృతరాష్ట్రుడి మీద; ప్రీతియున్= ఇష్టమూ; భక్తియున్= సేవాదృష్టీ; అతిశయిల్లన్= అధికం కాగా; ఆరాజు= ధృతరాష్ట్రుడు; పంచిన+అట్ల= ఆజ్ఞాపించినవిధంగానే; చేసి= ఆయాపనులు చేసి; చరింపుఁ డు= నడచుకొనండి; అతనిన్= ధృతరాష్ట్రుడిని; ఆరాధించుట= సేవించటం; అస్మదీయ చిత్తమునకున్= నా మనస్సుకు; ప్రియము= ఇష్టం; చేయుట= కల్గించటమే; అతనికిన్= ధృతరాష్ట్రుడికి; మనసు కాని అట్టిపని= ఇష్టం లేనిపని; ఒనర్చుట= చేయటం; అగ్గలంపు దుఃఖము= (నా మనస్సుకు) మిక్కిలి విచారం; ఆవహించుట= కల్గించటమే; అని= అనేవిధంగా; చెప్పున్= చెప్పుతుంటాడు.

తాత్పర్యం: రాజా! గాంధారీ, ధృతరాష్ట్రులు కురువంశంలో పెద్దవాళ్ళు. కొడుకులను పోగొట్టుకొని బ్రతుకుతున్నారు. ఎందుకైనా బాధ పడతారేమో అనే సంకోచంతో ధర్మరాజు, తమ్ములు, మంత్రులు, సేవకులతో ప్రతిరోజూ ఇట్లా చెప్పుతుంటాడు. మీరు ధృతరాష్ట్రుడు ఏ విధంగా ఆజ్ఞాపిస్తే ఆ విధంగా చేస్తూ ఆయన చెప్పిన ప్రకారం నడుచుకొనండి. అతడిని సేవిస్తేనే నా మనసూ సంతోషిస్తుంది. ధృతరాష్ట్రుడికి ఇష్టం లేని పని చేయటం అంటే నన్ను బాధ పెట్టటమే.

విశేషం: యుద్ధంలో చాలామంది పోగా మిగిలినవాళ్ళలో గాంధారీ ధృతరాష్ట్రులు 'వంశవృద్ధులు'. వార్ధకంలో కొడుకులతోడు ఉండవలసిన సమయంలో పుత్రవియోగం. పైగా పుత్ర 'వర్గ' వియోగం. కొడుకులు చాలామంది ఉన్నా ఒక్కడూ మిగలకుండా పోవటం. (యుయుత్సుడు క్షత్రియుడు కాదు కాబట్టి, సూనులు లేమి ఐయున్నవారు. వార్ధకం, బహుపుత్ర వియోగంతో 'బ్రతికి ఉండటం' బాధ. దీనివల్ల 'పుత్ర వియోగబాధ' అనుక్షణమూ ఉంటుంది. ఇవి వారిని సేవించవలసిన అవసరమూ, ఔచిత్యమూ సూచిస్తున్నాయి. అందుకే ధర్మరాజు వారి సేవావిషయంలో 'అనుదినంబు' జాగ్రత్తలు మళ్ళీ మళ్ళీ చెప్పటం.

క. విను మెల్లవారు నతని వ । చనములు మది నూఁది యట్ల చరియింప మరు
త్తనయుండును నమ్మెయి వ । ర్తనము నడపుచుండు మనసు తద్దయు నెరియన్. 11

ప్రతిపదార్థం: వినుము= జనమేజయ రాజా! వినుము. ఎల్లవారున్= అందరూ కూడా; అతని వచనములు= ఆ ధర్మరాజు మాటలు; మదిన్= మనసులో; ఊఁది= ఉంచుకొని (స్థిరపరచుకొని); అట్లు+అ= ధర్మరాజు చెప్పిన ప్రకారంగానే; చరియింపన్= నడుచుకుంటూ ఉండగా; మరుత్ తనయుండును= వాయుపుత్రుడు-భీముడు కూడా; మనసు= హృదయం; తద్దయున్= అధికంగా; ఎరియన్= బాధపడుతున్నా; ఆ+మెయిన్= ధర్మజుడు చెప్పినవిధంగా; వర్తనము= నడవడికను; నడపుచున్ ఉండున్= సాగిస్తూ ఉండేవాడు.

తాత్పర్యం: జనమేజయా! అట్లా ధర్మరాజు చెప్పిన మాటలు మనసులో ఉంచుకొని అందరూ, తమ్ములు, అమాత్యులు, భృత్యులూ, ఆ ప్రకారంగా ధృతరాష్ట్రుడిని కొలిచేవారు. భీముడు కూడా మనసులో బాధపడుతూనే అన్నగారి మాటలను అనుసరించి నడిచేవాడు.

విశేషం: భీముడు అన్నపై గౌరవం వలన ఇష్టం లేకున్నా ఎంత (నడపు-ప్రేరణ క్రియ) బలవంతంగా ఆచరించేవాడో తెలుస్తుంది. ఎరియు ధాతువుకు మండటం అనే అర్థమూ ఉన్నది. అనిష్టుల సేవ చేయవలసివచ్చినందుకు బాధా వారిపై కోపమూను.

క. ద్యూతంబున దుర్యోధను । చేతం దమ పడిన పాటు చిత్తంబున క
త్యాతురతఁ జేయుచుండుట । నాతఁడు ధృతరాష్ట్రుఁ జూచి యలుగు మనమునన్. 12

ప్రతిపదార్థం: ద్యూతంబునన్= జూదంలో; దుర్యోధనుచేతన్= దుర్యోధనుడు కారణంగా; తమ పడిన పాటు= తాము (పాండవులు) అనుభవించిన కష్టాలు; చిత్తంబునకున్= తన మనస్సుకు; అతి+ఆతురతన్= మిక్కిలి పీడను; చేయుచున్+ఉండుటన్= కలిగిస్తూ ఉండటం వలన; ధృతరాష్ట్రున్= ధృతరాష్ట్రుడిని; చూచి అతఁడు= ఆ భీముడు; మనమునన్= మనసులో; అలుగున్= కోపగించుకొనేవాడు.

తాత్పర్యం: దుర్యోధనుడివలన ఆనాడు జూదం మూలాన తాము అనుభవించిన కష్టాలు రాజ్యం పోవటం, భార్యకు సభలో అవమానం, అరణ్యవాసం మొదలైనవన్నీ భీముడి మనస్సును పీడిస్తుండేవి. అందువలన ధృతరాష్ట్రుడిని చూస్తేనే భీముడు మండిపడేవాడు.

విశేషం: పాండవులందరూ కష్టాలుపడ్డా ఆ స్మృతులు ఇంకా భీముడిని బాధిస్తున్నాయి. మిగిలిన నలుగురి కంటె భిన్నంగా భీముడి విషయంలోనే ఈ ప్రస్తావన. చూచి - మనసులో ఆ బాధ ఎపుడూ ఉన్నా ధృతరాష్ట్రుడిని చూసిన సమయంలో మాత్రం కోపం వచ్చేది. తమ కష్టాలకు హేతువైనవాడిని, అసలు రాజైన అన్నగారికంటె అధికంగా పూజించాల్సిరావటం కోపకారణం. మిగిలిన పాండవులు సర్దుకొన్నా స్వభావాన్ని బట్టి భీముడి కది కష్టం.

తే. **శ్రాద్ధ దివసంబులందుఁ బుత్త్రవ్రజమున । కాంబికేయుండు గో కనకాది దాన**
కీర్త్యముగఁ బారలౌకిక క్రియలు సేయు । నట్లుగా సంఘటించు ధర్మాత్మజుండు. 13

ప్రతిపదార్థం: ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; శ్రాద్ధ దివసంబులందున్= శ్రాద్ధ కర్మలను ఆచరించే మరణ తిథులలో; పుత్త్రవ్రజమునకున్= దుర్యోధనుడు మొదలయిన కొడుకుల సముదాయానికి; పారలౌకిక క్రియలు= పుణ్యలోకాదులు కలగటం కొరకు చేసే కర్మలను; గో= ఆవులు; కనక= బంగారం; ఆది= మొదలైన; దాన= దానాలచేత; కీర్త్యముగన్= బ్రాహ్మణాదిజనం ప్రశంసించే విధంగా; చేయునట్లుగాన్= నిర్వహించేటట్లుగ; ధర్మాత్మజుండు= ధర్మరాజు; సంఘటించున్= ఏర్పాటు చేసేవాడు.

తాత్పర్యం: 'ఆంబికేయుండు చేయునట్లుగా ధర్మాత్మజుండు సంఘటించు' అనడంలో ధృతరాష్ట్రుడికంటె ధర్మరాజులో ఎక్కువపూనిక వ్యక్తం అవుతున్నది. 'ధర్మాత్మజుండు' కాబట్టి ఇటువంటి క్రియలలో శ్రద్ధ అధికం. అపకారులకు కూడ పుణ్యలోకాలు సాధించే ఉపకారబుద్ధి విశేషం. అభిమన్యు ప్రభృతిస్వజనవిషయం ప్రత్యేకంగా చెప్పనే అక్కరలేదు.

సీ. **అతులభోగంబును నంచితత్యాగంబుఁ । దొల్లింటియట్టుల చెల్లఁజేయు**
ధృతరాష్ట్రునకు ధర్మసుతుఁడు గాంధారికిఁ । బూర్వప్రకార సంపూజ్యదాన
నిరతిఁజెల్లించు; నక్కురువృద్ధుఁ డిమ్మెయిఁ । బాండుపుత్త్రులు దన్నుఁ బరమభక్తి
శిష్యవర్తనమున సేవింపఁ దానును । గురునట్ల వాత్సల్యపరత నెపుడు

తే. **వారలకు శ్రీయు నాయువు వైరిజయము । మానసమున నాశాసించు మానవేంద్ర!**
యతని తొంటివర్తనముఁ దత్సుతుని కీడు । నాత్మఁ దలఁపఁ డెన్నండు ధర్మాత్మజుండు! 14

ప్రతిపదార్థం: మానవ+ఇంద్ర!= జనమేజయ మహారాజా!; ధర్మసుతుఁడు= ధర్మరాజు; ధృతరాష్ట్రునకున్= ధృతరాష్ట్రుడికి; తొల్లింటి అట్టులు+అ= అతడి కొడుకులు బ్రతికివున్నపుడు సార్వభౌముడుగా ఉన్నప్పటివలెనే; అతులభోగంబునున్= సాటిలేనిసుఖాలూ; అంచిత త్యాగంబున్= పూజింపదగిన దానమూ; చెల్లన్ చేయున్= సాగేటట్లుగా చేసేవాడు; గాంధారికిన్= గాంధారికి కూడా; పూర్వ= మునుపటి (కొడుకులు జీవించి ఉన్నప్పటి); ప్రకార= విధంగానే; సంపూజ్య= పూజించదగిన; దాన= దానముయొక్క; నిరతిన్= ఆసక్తిని; చెల్లించున్= చెల్లేటట్లు చేసేవాడు; పాండుపుత్త్రులు= ధర్మజుడు మొదలుగా పాండురాజు కొడుకులు అందరూ; ఇమ్మెయిన్= ఈవిధంగా; పరమభక్తిన్= శ్రేష్ఠమైన ఆరాధనా భావంతో; శిష్య వర్తనమునన్= శాసించబడే నడవడితో (శిష్యులవలె); తన్నున్= తనను; సేవింపన్= సేవిస్తూ వుండగా; ఆ+కురువృద్ధుఁడు= కురువంశంలో పెద్దవాడైన ఆ ధృతరాష్ట్రుడు; తానును= తను కూడా; గురు+అట్లు+అ= పాండవులకు గురువువలెనే; వాత్సల్య పరతన్= పిన్నలయందుండేటటువంటి స్నేహభావం, ప్రధానంగా; వారలకున్= ఆ పాండవులకు; శ్రీయున్= రాజ్యాది సంపదలూ; ఆయువున్= అధిక జీవితకాలాన్నీ; వైరిజయమున్= శత్రువులను జయించే సామర్థ్యమూ కలగాలని; మానసమునన్= తన మనస్సులో; ఎపుడున్= నిరంతరమూ; ఆశాసించున్= దీవించేవాడు; ధర్మాత్మజుండు= ధర్మరాజు; అతని= ఆ ధృతరాష్ట్రుడియొక్క; తొంటివర్తనమున్= పూర్వపు (దుర్యోధనాదులు జీవించిఉన్నప్పటి) నడవడికనూ; తద్ సుతుని కీడు= అతని కొడుకు దుర్యోధనుడు తమకు చేసిన అపకారమూ; ఎన్నండున్= ఏ సమయంలోనూ; ఆత్మన్= మనసులో (కూడా); తలఁపఁడు= స్మరింపడు.

తాత్పర్యం: జనమేజయా! పుత్రులు జీవించిఉన్నప్పటివలెనే ధృతరాష్ట్రుడికి సార్వభౌముడివలె సంపదలు అనుభవించటమూ, యథేష్టంగా దానం చేయటమూ సాగనిచ్చాడు ధర్మరాజు. అట్లాగే గాంధారికి కూడా

వ్రతాదులసందర్భాలలో బ్రాహ్మణాదులకు దానం చేయటం వగైరా యథాపూర్వం సాగనిచ్చాడు. ధర్మరాజే కాదు ఇట్లా పాండవులందరూ శిష్యులవలె ఏకాగ్రతతో తనను సేవిస్తూ ఉండడంవలన ధృతరాష్ట్రుడు కూడా పాండవులను శిష్యవాత్సల్యంతో చూచేవాడు. పాండవులకు ఇంకా సంపదలూ, ఆయుస్సూ, శత్రుజయమూ కలగాలని మనస్సులో ఆశీర్వదిస్తుండేవాడు. ధర్మరాజు కూడా ధృతరాష్ట్రుడి పూర్వ ప్రవర్తననూ అతడి కొడుకు దుర్యోధనుడు తమకు చేసిన అపకారాన్నీ మనసులోనికి రానిచ్చేవాడు కాడు.

విశేషం: గురుశబ్దానికి- ఉన్న వంశంలో పెద్దా, తండ్రీ, మొదలైన అర్థాలు ఇక్కడ అన్వయిస్తాయి. ధృతరాష్ట్రుడినుండి దీన్ని సాధించటంలో పాండవుల శిష్యవర్తనంలో పరమభక్తి ఉత్కర్షే కారణం తప్ప ధృతరాష్ట్రుడిస్వభావం కాదు. శ్రీ, ఆయుస్సు, వైరిజయం అనేవాటిలో క్రమం ఉన్నది. తన భోగత్యాగాలకు గూడా, పాండవులకు - శ్రీ, అని తనకు దూరం కాకుండా ఉండాలంటే పాండవులకు శత్రుజయమూ క్రమంగా అవసరం. ధృతరాష్ట్రుడి ఆశీస్సు ఉభయతారకం.

క. వినుమతని తెఱఁ గెఱిఁగి పరి। జనములలో నాంబికేయు చరితము దుర్యో
ధను కొఱగామియు నెవ్వా। రును వాక్రువ్వంగ వెఱతురు కురుప్రవరా! 15

ప్రతిపదార్థం: కురుప్రవరా!= కురువంశంలో శ్రేష్ఠుడ వైన జనమేజయా!; వినుము= వినవలసినది; అతని= ఆ ధర్మరాజుయొక్క; తెఱఁగు= విధం; (మనస్సు) ఎఱిఁగి= తెలిసి; పరిజనములలోన్= పరివారంలో (చుట్టూ ఉండే జనంలో); ఏ+వారును= ఏ ఒక్కడు కూడా; ఆంబికేయు= ధృతరాష్ట్రుడియొక్క; చరితము= పూర్వప్రవర్తనం గురించీ; దుర్యోధను= దుర్యోధనుడి యొక్క; కొఱ+కామియున్= (పనికిమాలినతనమూ) దుష్టమైన పని - కీడునూ; వాక్రువ్వంగన్= పలకటానికే; వెఱతురు= భయపడేవారు.

తాత్పర్యం: ఓ జనమేజయా! విను ధర్మరాజుతత్త్వం తెలిసిన అతని చుట్టు జనంలో ఎవరూ కూడా ధృతరాష్ట్రుడి పూర్వ వర్తనమూ, దుర్యోధనుడు చేసిన అకార్యమూ ఉచ్చరించడానికే భయపడేవారు.

విశేషం: పరిజనములతో - అనే పూర్వ ముద్రితపాఠం సరికాదు. పరిజనంతో ఈ విషయాలెట్లా చెప్పుతారు? రాజు మనస్సు తెలిసికొని దానికి అనుగుణంగా రాజపరిజనం వ్యవహరిస్తుంది. అందుకే ధర్మరాజు మనసులో అతడి తొంటివర్తనమూ, తత్సుతుడి కీడూ - లే వనే విషయం గ్రహించారు - 'తెఱఁ గెఱిఁగి' చాల జాగ్రత్తగా పరిశీలించి తత్త్వం తెలిసికొన్నారు. అందుకే ఆంబికేయు చరితము, (అతని తొంటివర్తనము) దుర్యోధనుకొఱగామి (తత్సుతునికీడు) గురించి ఉచ్చరించడానికీ భయపడేవారు.

సీ. రాజ్యాధిపత్య సంపూజ్యత్వమున ధృత। రాష్ట్ర పాండుసుతాంతరంబు గాన
రొకటులు జానపదోత్కరమునఁ బౌర। వర్గంబునందును వసుమతీశ!
యమ్మెయి నడపెడు నప్పాండవాగ్రజు। వలన నిజాత్మజువలని కంటె
నక్కురురాజు ప్రియం బందు; న ట్లున్న। యక్కాలమునఁ। బవనాత్మజుండు

తే. సన్నిహితుఁ డైనయప్పు డజ్జనవిభుండు। తన తనూజులఁ దలఁచి సంతాప మందు;
నతనిఁ గనుఁగొని యబ్భీముఁ డతనిసుతులు। తమ్ముఁ బఱిచిన పాటులు దలఁచి యలుగు. 16

ప్రతిపదార్థం: వసుమతీశ!= ఓ జనమేజయ భూపాలా!; జానపద ఉత్కరమునన్= గ్రామాలలో ఉండే జనాల సమూహంలోనూ; పౌర వర్గంబునందును= పట్టణాలలో ఉండే జనసముదాయంలోనూ; ఒకళులు(న్)= ఒక్కరు గూడా; రాజ్య ఆధిపత్య= రాజ్యము యొక్క దొరతనంతో; సంపూజ్యత్వమునన్= గౌరవింపబడేలక్షణంలో; ధృతరాష్ట్ర= ధృతరాష్ట్రుడికీ; పాండుసుత= పాండవులకూ; అంతరంబు= భేదం; కానరు= కనలేకపోయారు; ఆ+మెయిన్= ఆవిధంగా తన (ధృతరాష్ట్రుడి)తో ఏకాభిప్రాయంగా; నడపెడు= పరిపాలనం సాగిస్తున్న; ఆ+పాండవ+అగ్రజువలనన్= పాండు కుమారులలో జ్యేష్ఠుడైన ఆ ధర్మరాజు వలన; ఆ+కురురాజు= ఆ ధృతరాష్ట్రుడు; నిజ+ఆత్మజువలనికంటెన్= తన పెద్దకొడుకైన దుర్యోధనుడి కంటె కూడా, ప్రియంబు= సంతోషాన్ని; అందును= పొందేవాడు; అట్లు+ఉన్న= ఆవిధంగా జరుగుతూ ఉన్న; ఆ+కాలంబునన్= ఆ రోజులలో; ఆ+జనవిభుండు= ఆ ధృతరాష్ట్రుడు; పవన+ఆత్మజుండు= వాయుపుత్రుడైన భీముడు; సన్నిహితుఁడు= దగ్గర ఉన్నవాడుగా; ఐన+అప్పుడు= అయిన సమయంలో; తన తనూజులన్= దుర్యోధన దుశ్శాసనాదు లైన తన కొడుకులను; తలఁచి= స్మరించి; సంతాపము= మిక్కిలిబాధ; అందున్= పొందేవాడు; ఆ+భీముఁడు= ఆ సమయంలో భీముడు కూడా; అతనిన్= ఆ ధృతరాష్ట్రుడిని; కనుఁగొని= చూచి; అతని సుతులు= ధృతరాష్ట్రుడి కొడుకు లైన దుర్యోధనాదులు; తమ్మున్= తమను (పాండవులను); పఱిచిన పాటులు= పెట్టిన కష్టాలు; తలఁచి= స్మరించి; అలుగున్= ధృతరాష్ట్రుడిపై కోపగించేవాడు.

తాత్పర్యం: జనమేజయా! ఆ రాజ్యంలో ప్రభుత్వం నడిపే విషయంలో ధృతరాష్ట్రుడికీ, పాండవులకూ భేదం అనేది, అటు గ్రామవాసులు గాని, (ఇటు) పట్టణవాసులు గానీ చూడలేదు. ధర్మరాజు ఆ విధంగా తనను గౌరవిస్తుండటంవలన ధృతరాష్ట్రుడికి తన సొంత కొడుకుల కంటె కూడా ధర్మరాజుపైనే ఇష్టం కలిగేది. అయితే భీముడు తన దగ్గరకు వచ్చినపుడు మాత్రం కొడుకులను తలచుకొని బాధ పడేవాడు. భీముడు కూడా ధృతరాష్ట్రుడిని చూస్తే అతనికొడుకులు తమకు కల్గించిన కష్టాలను తలచుకొని ధృతరాష్ట్రుడిపై కోపించేవాడు.

విశేషం: తన పెద్దకొడుకైనా దుర్యోధనుడితో వచ్చే అభిప్రాయభేదం ధర్మరాజుతో కలగకపోవడంవలన ధృతరాష్ట్రుడికి ధర్మరాజు కన్న కొడుకుకంటె ప్రీతిపాత్ర మయ్యాడు. అక్కడ కొడుకుమాట తాను వినవలసివచ్చేది. ఇక్కడ తనమాటే ధర్మరాజు వింటున్నాడు. ధృతరాష్ట్రుడికి భీముడిని చూస్తే పుత్రులు గుర్తుకు రావటానికి కారణం దుర్యోధన దుశ్శాసనుల చావు భీముడివలన సంభవించడమే. భీముడిని చంపా లని స్వయంగా తానూ విఫలుడైనాడు కూడా. భీముడికీ ధృతరాష్ట్రుడిని చూస్తే గతం గుర్తుకు వస్తుంది. ఈ రెండింటిలో ముందు ధృతరాష్ట్రుడి విషయం ప్రస్తావించటం గమనించాలి. తనను చూచినపుడు ధృతరాష్ట్రుడిలో కలిగే మార్పువలన అటువంటి 'అతని' చూచినపుడు భీముడికీ గతం తలపునకు వస్తుంది.

తే. **హృదయముల నొండొరులదెస నిట్టివార। లయ్యు నతఁడు నతండు నన్యోన్యభాష**
ణములయప్పుడు మృదుల విన్యాస మొప్ప। నాడుదురు చుట్టములు మెచ్చునట్లు గాఁగ. **17**

ప్రతిపదార్థం: అతఁడున్= ఆ ధృతరాష్ట్రుడూ; అతఁడున్= ఆ భీముడూ; ఒండొరులదెసన్= పరస్పరం, ఒకళ్ళ విషయంలో ఇంకొకళ్ళు; హృదయములన్= తమ తమ మనస్సులలో; ఇట్టివారు= పూర్వం చెప్పినవిధంగా ద్వేషం కోపం కలిగినవారు; అయ్యున్= అయినప్పటికీ; అన్యోన్యభాషణముల+అప్పుడు= పరస్పరం మాట్లాడుకొనేటప్పుడు మాత్రం; చుట్టములు= బంధువులు; మెచ్చునట్లు+కాఁగన్= పొగడే విధంగా; మృదుల విన్యాసము= తెచ్చుకోలు మెత్తదనం; ఒప్పన్= ప్రకాశించేవిధంగా; ఆడుదురు= సంభాషిస్తుంటారు.

తాత్పర్యం: ఇంతకు ముందు (16 పద్యంలో) చెప్పినట్లుగా ధృతరాష్ట్రుడూ, భీముడూ మనస్సులో ఒకళ్ళమీద ఒకళ్ళు ద్వేషమూ, కోపమూ కలిగి ఉన్నప్పటికీ పరస్పరం మాటాడుకొనేటప్పుడు మాత్రం బంధువులందరూ మెచ్చుకొనే విధంగా మాటలలో మెత్తదనం తెచ్చిపెట్టుకొనేవారు.

విశేషం: భీముడు అన్నగారిఆజ్ఞలను పాలించటానికి అయితే ధృతరాష్ట్రుడు తన పెద్దరికాన్ని కాపాడుకొనటానికి అయినా 'అతఁడు నతఁడు అనే పదద్వయం వాళ్ళు కలివిడిగా లేక ఎవరికి వారుగా వేరుగా ఉండిపోవటాన్ని వ్యక్తం చేస్తున్నది. 'విన్యాసం' శబ్దం మృదుత్వం తెచ్చిపెట్టుకొన్నది, కృతకమే, కాని హృద్గతం కాదని తెలుపుతున్నది.

వ. ధృతరాష్ట్రుం డేకతంబ యున్నయెడ వృకోదరుం డతనికి నింత నంత నుండి గాంధారి వినుచుండ. 18

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; ఏకతంబు+అ= ఒంటరిగా; ఉన్న+ఎడన్= ఉన్న సమయంలో; అతనికిన్= ఆ ధృతరాష్ట్రుడికి; ఇంతన్, అంతన్ ఉండి= ఇక్కడ అక్కడగా నిలిచి; గాంధారి= ధృతరాష్ట్రుడిభార్య; వినుచున్+ఉండన్= వినేటట్లుగా; వృకోదరుండు= భీముడు. (ఇట్లా అంటాడు. తర్వాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు ఒంటరిగా ఉన్నపుడు అతడికి కొంచెం సమీపంగా ఉండి గాంధారి కూడా వినేటట్లుగా భీముడు ఇట్లా అంటాడు.

సీ. 'అంధుని కొడుకులయం దొకరునిఁ దప్పి। పోనీక త్రుంచితి భూరిశక్తి
దర్పితం బైన మద్బాహుపంజరము సొ। చ్చిన రిపురాజన్య సింహములకు
వెడలంగ వచ్చునే? వెంగలు లై వారు। కయ్యంబు సేసిరి గాక నన్ను
నెఱిఁగినఁ దొడరుదు రెట్టులు? దుర్యోధనాదుల ననిఁ దెగటార్చినట్టి

తే. నాదు దోర్దండములఁ జందనం బలంది। కుసుమదామముల్ సుట్టి మ్రొక్కుదు మహోప
కారు లరయంగ దైవముల్ గావె?' యనుఁ ద। దీయ మర్మంబు లెల్ల భేదిల్ల నధిప! 19

ప్రతిపదార్థం: అధిప!= ఓ జనమేజయరాజా!; తదీయమర్మంబులు= ఆ గాంధారీ ధృతరాష్ట్రుల, జీవస్థానాలు; ఎల్లన్= అన్నీ; భేదిల్లన్= చీలేటట్లుగా; అనున్= భీముడు ఇట్లా అన్నాడు; అంధుని కొడుకులయందున్= గ్రుడ్డిరాజు ధృతరాష్ట్రుడి కొడుకులలో; ఒకరునిన్= ఒక్కడిని కూడా; తప్పిపోన్+ఈక= తప్పించుకు పోకుండ, మిగల్చకుండా; భూరి శక్తిన్= గొప్ప పరాక్రమంతో; త్రుంచితిన్= చంపి వేశాను; దర్పితంబు+ఐన= మదించిన; మత్ బాహుపంజరము= నా భుజములు (వలయం) అనే బోనులోనికి; చొచ్చిన= ప్రవేశించిన; రిపు, రాజన్య సింహములకున్= శత్రువులైన రాజులు అనే సింహాలకు; వెడలంగన్= బయటపడడానికి; వచ్చునే?= సాధ్యమా?; వారు= ఆ కౌరవులు; వెంగలులు+ఐ= తెలివితక్కువవారు అయి; కయ్యంబు= (మాతో) యుద్ధం; చేసిరి= చేశారు; కాక= (వెంగలులు) కాకపోతే; నన్నున్= నన్ను; ఎఱిఁగినన్= భూరిశక్తిమంతుడుగా తెలిసికొంటే; ఎట్టులు= ఏవిధంగా; తొడరుదురు?= ఎదిరిస్తారు? (యుద్ధానికి పూనుకుంటారు?); అనిన్= యుద్ధంలో; దుర్యోధనాదులన్= దుర్యోధనుడు మొదలైనవారిని; తెగటార్చిన+అట్టి= చంపివేసినటువంటి; నాదు దోర్దండమున్= దుడ్డు కర్రలవంటి నా భుజాలకు; చందనంబు= మంచి గంధాన్ని; అలఁది= పూసి; కుసుమదామముల్= పూలమాలలు; చుట్టి= అలంకరించి; మ్రొక్కుదున్= నమస్కరిస్తాను; అరయంగన్= పరిశీలిస్తే; మహోపకారులు= ఇంత గొప్పమేలు చేసినవారు; దైవముల్= దేవతలె; కావె!= కదా!

తాత్పర్యం: జనమేజయరాజా! ఆ గాంధారీ ధృతరాష్ట్రుల ప్రాణస్థానాలు చీలిపోయేటట్లుగా భీముడు ఇట్లా అంటాడు; 'గుడ్డివాడి కొడుకులలో ఒక్కడు కూడా మిగలకుండా అందరినీ చంపేశాను. నా బాహువలయం అనే బోనులోకి ప్రవేశించిన ఏ రాజసింహమైనా ఎట్లా బయటపడగలదు? మూర్ఖులు కాబట్టి ఆ కౌరవులు మాతో యుద్ధానికి వచ్చారు

కాని, నా పరాక్రమం తెలిస్తే ఎదిరించేవారే కాదు. ఆ యుద్ధంలో దుర్యోధనప్రభృతు లందరినీ కూల్చిన యీ నా భుజాలకు చందనం పూసి, పూలమాలలు చుట్టి నమస్కరిస్తాను. నిజానికి ఇంత గొప్ప ఉపకారం చేసింది దేవతలే కదా!'

విశేషం: ధృతరాష్ట్రుడు అంధుడే అయినా దుర్యోధనాదుల మాటలను గుడ్డిగా నమ్మి ఇంతకు తెచ్చుకొన్నాడు కాబట్టి ఇక్కడ సాభిప్రాయం. 'అంధుని కొడుకులు' కావడం చేతనే దుర్యోధనాదులు కూడా అంధులై అవివేకులై ప్రాణాలమీదకు తెచ్చుకొన్నారు. 'భూరిశక్తి' అన్నపుడు భూరి అనేది తన పరాక్రమంలో గొప్పదనాన్ని చెప్తుండగా, 'త్రుంచితి' అనేది కౌరవులను 'అవలీలగా' చంపటం తెలుపుతుంది. చొచ్చిన - భూతార్థకం, ప్రవేశించడం జరిగిపోయాక - వెడలంగన్ ఆ తర్వాత కోరుకొన్నా తప్పుకోవటం అనేది మాత్రం వాళ్ళ చేతులలో లేదు. రోట్లో తల దూర్చాక చేసేదేం లేదు. త్రుంచితిన్ - అనే ఉత్తమపురుషైకవచనక్రియ, అట్లాగే 'నన్ను నెఱిఁగిన దుర్యోధనాదుల తెగటార్చినట్టి నాదు దోర్దండములు' మొదలైన మాటలో అస్మదర్థం - భీముడి వికత్థనత్వానికీ, ధృతరాష్ట్రుడిపై కోపతీవ్రతకీ నిదర్శనాలు. అంధుని మొదలుగా ఇందులో మాటలన్నీ గాంధారీ ధృతరాష్ట్రులకు మర్మభేదకాలే. మద్బాహుపంజరము చొచ్చిన - వెడలంగవచ్చునే' అనేది ధృతరాష్ట్రుడు తన బాహు పంజరంలో చంపుదామనుకున్నా తాను (భీముడు) వెడలివచ్చిన విషయాన్ని స్మరింపజేస్తూ తన సామర్థ్యంలో ధృతరాష్ట్రుడి అసమర్థతను (వెంగలితనం) ఎత్తి చూపుతుంది. ఈ మహోపకారం దేవతలు చేసిందే అనడం ఈ అంశాన్ని ప్రధానంగా ఉద్దేశించి ఉండవచ్చును. భీముడు బ్రతికి బయటపడ్డ దందువలననే కదా! చివర్లో ఆఖరిఘట్టమూ భీముడికి గుర్తు వచ్చింది.

వ. **దీని ధర్మనందనుండును ధనంజయుండునుం గుంతియు ద్రౌపదియు నెఱుంగరు; కవ లొక్కొక్క మాఱిమ్మాటలు విని సంతసిల్లుదురు; ధర్మనందను తెఱం గెఱుంగుటంజేసి పుయిలోడి తా రేమియు నాడరు; ధృతరాష్ట్రగాంధారులుం గాలపర్యాయంబు గని డెందంబులు గంద నూరకుండుదు; రట్టిభంగిఁ బంచదశవత్సరంబులు చనియె నంత నొక్కనాఁ డయ్యంధనృపతి బంధుజనంబులం గూర్చి ధర్మనందను రావించి; యతండు వినుచుండ గద్గదకంఠుం డగుచు వారలతోడ.** **20**

ప్రతిపదార్థం: దీనిన్= భీముడు ధృతరాష్ట్రగాంధారులు నొచ్చుకొనేటట్లుగా మాటాడటం; ధర్మనందనుండును= ధర్మరాజూ; ధనంజయుండునున్= అర్జునుడూ; కుంతియున్= కుంతీ; ద్రౌపదియున్= ద్రౌపదీ; ఎఱుంగరు= తెలియరు; ఈ+మాటలు= భీముడి ఈ పలుకులు; ఒక్కొక్కమారు= అపుడప్పుడూ; విని= ఆలకించి; కవలు= నకులసహదేవులు; సంతసిల్లుదురు= సంతోషించేవారు; తారు= తాము మాత్రం; ధర్మనందను= ధర్మరాజుయొక్క; తెఱంగు= (మనస్సు) విధం; ఎఱుంగుటన్ చేసి= తెలిసినందువలన; పుయిలోడి= సంకోచంతో; ఏమియున్= ఏమీ; ఆడరు= మాటాడరు; ధృతరాష్ట్రగాంధారులున్= ధృతరాష్ట్రుడూ, గాంధారీ; (ఆ మాటలు విని) కాల పర్యాయంబు= సమయం తారుమారవటం; కని= తెలిసి; డెందంబులు= మనసులు; కందన్= కలత చెందగా; ఊరకుండుదురు= మిన్నకుండేవారు; అట్టిభంగిన్= ఆవిధంగా; పంచదశవత్సరంబులు= పదిహేను ఏండ్లు; చనియెన్= గడిచాయి; అంతన్= పనిహేనోయేడు పూర్తయినతర్వాత; ఒక్కనాఁడు= ఒకానొకరోజు; ఆ+అంధనృపతి= ఆ (గుడ్డిరాజు) ధృతరాష్ట్రుడు; బంధుజనబులన్= చుట్టాలను; కూర్చి= సమావేశపరిచి; ధర్మనందనున్= ధర్మరాజును; రావించి= పిలిపించి; అతండు= ఆ ధర్మరాజు; వినుచున్+ఉండన్= వింటుండగా; వారలతోడన్= బంధువులతో; గద్గదకంఠుండు= డగ్గుత్తిక కలవాడు; అగుచున్= అవుతూ-(ఇట్లా అంటున్నాడని తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: భీముడు పలికేమాటలు ధర్మరాజుకూ, అర్జునుడికీ, కుంతికీ, ద్రౌపదికీ తెలియవు. నకుల సహదేవులు మాత్రం అప్పుడప్పుడూ ఆ మాటలు విన్నా, ధర్మరాజుపట్ల ఉన్న భయం వలన వారు మారు పల్కరు. గాంధారీ

ధృతరాష్ట్రులు కాలవైపరీత్యాన్ని గమనించి మనసులలో బాధపడుతూ మిన్నకుండేవారు. అట్లా పదిహేనేళ్ళు గడిచాయి. ఆ తరువాత ఒకనాడు ధృతరాష్ట్రుడు బంధువులనందరినీ సమావేశపరిచి, ధర్మజుడిని పిలిచి అతడు వింటూఉండగా, బొంగురుపోయిన గొంతుతో వారందరితో ఇట్లా అన్నాడు.

విశేషం: ధర్మరాజు అర్జునుడు, కుంతితోపాటు, ద్రౌపది కూడా గతంలో కౌరవులవలన కలిగిన కష్టాలను మరిచిపోయి గాంధారీ ధృతరాష్ట్రులపై గౌరవంతో వ్యవహరిస్తున్నారు. అందుకే వా ళ్ళెవరూ వినకుండానే భీముడు పై విధంగా మాటాడేవాడు. కవలు ఆమోదించేవాళ్ళు కావటం చేతనే ఒక్కొక్కమారైనా భీముడి మాటలు వినగలిగారు. ధర్మనందను తెఱంగు భీముడికీ తెలిసినా పిన్నలు కావడంచేత నకులసహదేవులు ఏమైనా అనడానికి సంకోచించేవారు. స్వభావం వలననూ, ధర్మరాజుకు వెంటనే జన్మించినవాడు కావడంవలననూ భీముడు నిస్సంకోచంగా అనదలచుకొన్నమాట లనేవాడు. పరోక్షంగా నైనా ధృతరాష్ట్రుడికి కొడుకులు బతికున్నప్పటి వలె నడపటానికి ప్రయత్నించినవాడు ధర్మరాజు (14పద్యం) తేడా లే దనిపించటానికి ధర్మరాజు ప్రయత్నించినా భీముడివలన గాంధారీధృతరాష్ట్రులకు 'కాలపర్యయ' భావన రాక తప్పలేదు. అయినా 15 సంవత్సరాలు ఊరకుండటంలో వార్ధకాదులతోపాటు ధర్మరాజునడవడీ, 'చుట్టములు మెచ్చునట్లు' ఉండాలనే అభిప్రాయం కారణం. ఇపుడొకసారి తన జీవితాన్నంతా గుర్తుచేసుకొనడమూ, నగరం విడిచిపోవటం, (ఆశ్రమవాసం) అనే నిర్ణయం ప్రకటించబోతూండటం, వలన కంఠంలో గాద్గద్యం.

ధర్మరాజును రప్పించి అతడు వింటూఉండగా బంధువులకు చెపుతున్నాడు. ధర్మరాజుతో ముఖాముఖిగా చెప్పటానికి కాకుండా, తన ఆంతర్యం, యథార్థంగా పరోక్షంగా వ్యక్తం చేసినట్లుగా గూడ. గతంలో తాను పొరపాట్లు చేశానని చెపుతున్నాడు మరి.

ధృతరాష్ట్రుఁడు ధర్మజునితోఁ దన మనోరథంబుఁ దెలుపుట (సం.15-5-1)

సీ. **నాకతంబునఁ జేసి యా కౌరవులకు నా। శంబు వాటిలుట దెల్లంబు మీకు**
జడుఁ గ్రూరు నతిలోభి జ్ఞాతి జనద్రోహ। కరు రాజుఁ జేసితిఁ గురుధరిత్రి
కచ్యుతు చెప్పిన యమలవాక్యంబులు। విననేరనైతి నా తనయువలని
ఘనతరస్నేహంబునను మొగమోటను। దగియెడుమాటలఁ దఱిమి యొత్తి

తే. **యాడకుండితి; భీష్ముండు నస్త్రగురుఁడు। విదురుఁడును సంజయుండును వే విధముల**
నాకుఁజెప్పిరి; గాంధారి నన్ను దూఱి। చెప్పె; న మ్మాట లేఁ బెడచెవుల నిడితి. **21**

ప్రతిపదార్థం: నా కతంబునన్+చేసి= నా కారణంగా; ఆ కౌరవులకున్= నా పుత్రులు మొద లైన కురువంశీయులకు; నాశంబు= చేటు; పాటిలుట= సంభవించటం; మీకున్= (నా బంధువు లైన) మీ అందరికీ; తెల్లంబు= బాగా తెలిసిందే; కురుధరిత్రికిన్= కురువు అనేపేరు గల్గిన ఈ రాజ్యానికి; జడున్= (ఒకానొక) బుద్ధిహీనుడూ; క్రూరున్= దుష్ట బుద్ధీ; అతిలోభిన్= మిక్కిలిగా పరద్రవ్యాభిలాష ఉన్నవాడూ; జ్ఞాతిజనద్రోహకరున్= దాయాదులకు కీడు చేసేవాడూ అయిన దుర్యోధనుడిని; రాజున్= పాలకుడుగా; చేసితిన్= ఏర్పరిచాను; అచ్యుతు= శ్రీకృష్ణుడు; చెప్పిన= బోధించిన; అమలవాక్యంబులు= దోషం లేని (అర్థవంతములైన) మాటలు; వినన్, నేరన్, ఐతిని= ఆలకించకపోయాను; నాతనయు వలని= దుర్యోధనుని యెడ ఉన్న; ఘనతర= మిక్కిలి అధికమైన; స్నేహంబునను= ప్రేమవలనను; మొగమోటను= సంకోచంతోనూ; తఱిమి= తనమాట వినేంతవరకూ విడువకుండా; ఒత్తి= ఒత్తిడి చేసి (బలవంతంగా); తగియెడు మాటలన్= ఉచితమైన పలుకులను; ఆడక+ఉండితిన్= చెప్పలేదు; నాకున్= నాకు;

భీష్మండున్= పితామహుడైన భీష్ముడూ; అస్త్ర గురుఁడు (ను)= పిల్లల కస్త్రవిద్య నేర్పిన ద్రోణుడూ; విదురుఁడును= విదురుడూ; సంజయుండును= సంజయుడూ, వేవిధములన్= అనేక విధాలుగా; చెప్పిరి= (కర్తవ్యం, ఉచితం) చెప్పారు; గాంధారి= నా భార్య గాంధారీ; నన్నున్= నన్ను; దూఱి= నిందిస్తూ, దృఢంగా; చెప్పెన్= మంచి ఏదో (కర్తవ్యం) గట్టిగా చెప్పింది; ఏన్= నేను; ఆ+మాటలు= వారందరి పలుకులూ; పెడచెవులన్+ఇడితిన్= నిరాదరణంతో వినిపించుకొనలేదు.

తాత్పర్యం: నా కారణంగానే కౌరవులు నాశనమైనారని మీకు బాగా తెలుసు. బుద్ధి లేనివాడూ, దుర్మార్గుడూ, ఇతరుల ద్రవ్యంపై అధికమైన అభిలాష ఉన్నవాడూ, దాయాదులకు కీడు చేసేవాడూ అయిన దుర్యోధనుడిని ఈ కురురాజ్యానికి రాజును చేశాను. కృష్ణుడు చెప్పినా వినలేదు, కొడుకుమీది వల్లమాలిన ప్రేమవలన వారికి మంచిని ముఖంమీద గట్టిగా చెప్పలేకపోయాను. భీష్ముడూ, ద్రోణుడూ, విదురుడూ, సంజయుడూ చెప్పినా, గాంధారి మరీ నొక్కిచెప్పినా ఆ మాట లేవీ నేను వినిపించుకొనలేదు.

విశేషం: 'నా కతంబున అని గతాని కంతా తానే కారణం కావడం అనే అంశంతోటే ప్రారంభించటం ధృతరాష్ట్రుడి ఆత్మ పరిశీలనకు అర్థం. కౌరవనాశనం అనే సారాంశం చిన్న వాక్యంలో సంగ్రహంగా ముందు ప్రతిపాదించి ఆ తర్వాత అందుకు కారణాలు క్రమంగా వివరిస్తున్నాడు. అందులో ముఖ్యమైనది దుర్యోధనుడిని రాజు చేయటమే, 'రాజుఁ జేసితి' అనటంలో అది పొరపాటు అనీ, అందువలన ధర్మరాజును చేసి వుండాల్సిందనీ వ్యక్తం అవుతుంది. 'యచ్చాహం పాండు పుత్రేషు గుణవత్సు మహాత్మసు, న దత్తవాన్ శ్రియం దీప్తాం పితృపైతామహీ మిమామ్'. తెలుగులో ధృతరాష్ట్రుడీ మాటలు వాచ్యంగా తననోటిమీదుగా ఇప్పటికీ అనలేకపోయాడు. దుర్యోధనుడిలోని గుణహీనతను ప్రతిపాదిస్తూ పాండవులు గుణవంతు లనీ, (రాజ్యం వారి కివ్వవలసిందనీ) వ్యంగ్యంగా అంగీకరిస్తున్నాడు. 'రాజుఁ జేసితి కురుధరిత్రికి' అన్నపుడు కురుధరిత్రి అనేమాట పితృపైతామహీయం కాబట్టి రాజ్యం పితృపితామహక్రమప్రాప్తం' (అనే అంశం అందరికీ తెలిసిన సామాన్య విషయంగా) అని ఈ మాట మొదటే(2వ) చెప్పటం అయింది. 'రాజుఁ జేసితి 'గురుధరిత్రి' కన్నపుడు రాజుఁజేసితిఁ గురుధరిత్రికి అన్నప్పుడు గు' వర్ణాన్ని ఎట్లా స్వీకరించడం? అల్పబుద్ధి అయిన దుర్యోధనుడిని రాజు చేయగూడదు. కొంత కొడుకున కిచ్చి, కొంత భాగాని కైనా పాండవులను రాజులను చేసి ఉంటే ఇంత అనర్థం, కౌరవనాశనం ఆగిఉండేది అని భావం. ఇక్కడ దుర్యోధనుడి గుణహీనతనూ, అల్పత్వాన్నీ ప్రతిపాదించే విశేషణాలు అర్థవంతాలు - జడుడు. మందబుద్ధి. మంచిచెడులు స్వయంగా తెలియలేడు. పాండవులను ద్వేషించటంద్వారా ప్రజలకు వారిపై అభిమానం ఇనుమడింపజేశాడు. క్రూరుడు - ద్రౌపదిని పరాభవించడం వగైరా విషయాలలో క్రూరత్వం. సున్నితంగా చెప్పిన తన (ధృతరాష్ట్రుడి) మాటలు వినిపించుకొనక తనను బాధించటం వలననూ పాండవుల రాజ్యం ఆశించటంలో అయిదూళ్ళయినా ఇవ్వననటంలో అతిలోభం. ఈ లక్షణాలు లేని ధర్మరాజును రాజు చేయవలసింది. జ్ఞాతిద్రోహకరున్ అనడంలో ఇతరులకు ద్రోహకారి కాదు. ప్రజలను బాగానే చూచాడు (99 పద్యం). దాయాదిశత్రుత్వం సామాన్యమే అనే అభిప్రాయం ఉండవచ్చును. 'అచ్యుతు మాటలలో చ్యుతి= పొల్లు లేదు. 'వధ్యతా సా ధ్వయం పాప సామాత్య ఇతి దుర్మతిః' అని దుర్యోధనుడిని అతడి సహచరులనీ చంపుమనే చెప్పాడు కృష్ణుడు మూలంలో. తండ్రికి ఈ మాటలు ఏ సమయంలోనైనా బాధాకరాలే. ఆ మాట లేదో ధృతరాష్ట్రుడిక్కడ చెప్పలేదు. 'నీ పుత్త్రుఁ డవినీతుఁడగుట యెఱిఁగి యెఱిఁగి వానివశంబున నేల పోయె దీవు పాండవులకు నేమి యిచ్చి తేని నడ్డపడ నెవ్వరికి వచ్చు నధిప' (ఉద్యో 3,386) అంటాడు. ఇంతకుముందు కృష్ణుడు కురుధరిత్రి మొత్తానికి దుర్యోధనుడిని రాజు చేశాననే కదా ధృతరాష్ట్ర డిక్కడ బాధ పడుతున్నది. కృష్ణ డన్నట్లు కొంతైనా పాండవుల కిచ్చి ఉన్న ట్లయితే అచ్యుతుమాటలు అమలములుగా ఆ రోజే గ్రహించి విని ఉన్నట్లయితే తన వంశానికి 'చ్యుతి' లేకుండా ఉండేది. (పాండవపక్షపాతంతో అంటున్నాడని ఆ రోజు కృష్ణుడి మాటలు నిష్కల్మషాలుగా గుర్తించలేక పోయాడు - 'అమలవాక్యంబు లని' ఇప్పుడు తలచుకొంటున్నాడు అనుభవంలోకి వచ్చాక తెలిసింది. పుత్రుడివశంలో ఆ మార్గంలో పోవద్దన్నాడు కృష్ణుడు 'నా తనయువలని ఘనతరస్నేహంబునను అనేది పూర్వంలోకే 'అన్వయిస్తుంది'.

అచ్యుతు చెప్పిన అమల వాక్యంబులు వినవేరనైతి నా తనయువలని ఘనతరస్నేహంబున. అందువలననే పుత్ర వశవర్తి అయినాడు. దుర్యోధనుడి కిష్టం లేకుండా పాండవులకు రాజ్యం ఇవ్వలేకపోయాడు. అట్లా అని దుర్యోధనుడిని ఇష్టపఱచనూ లేకపోయాడు. అదే చెప్పుతున్నాడు. స్నేహమునను మొగమోటను తగుమాటలు చెప్పలేకపోయాను కొడుక్కి అని. మొగమోటకు కారణం పుత్రస్నేహం. కొడుకు ఏం బాధపడతాడో అని అతడి కిష్టం లేని మాటలు చెప్పలేకపోయాడు. 'తఱిమి యొత్తి ఆడకుండితి' తగియెడు మాటలు, వెంటబడి, బలవంతంగా చెప్పాలి దుర్యోధనుడికి, మంచిమాటలు మామూలుగా మనసు కెక్కకపోవడం దుర్యోధనుడి స్వభావం అన్నమాట తనమాటలు కొడుకు వినలేదు; భీష్మాదులు చెప్పినమాటలు తాను పెడచెవినిపెట్టాడు, కారణాలు వేరుగా ఉన్నా తండ్రికొడుకులకు మంచి వినిపించుకొకపోవడం అనే లక్షణం సమానం. అయితే తనమాటలు వినలే దని కొడుకుపై తప్పుమోపకుండా, వినేటట్లుగా నేనే చెప్పలేకపోయానన్నాడు. తగిన మాటలు చెప్పినా - తఱిమి, ఒత్తి చెప్పలేదు అపుడపుడూ అనడమే తప్ప తనమాట వినేదాకా వెంటబడి చెప్పలేదు. చెప్పినపుడు వినితీరవలసినంత దృఢంగానూ చెప్పలేదు. దుర్యోధనుడి ముఖంలో కనిపించే అనిష్టభావం చూడలేక, అతడికి సమ్మతం కాని తగుమాటలు చెప్పటంలో ధృతరాష్ట్రుడికి మొగమోటమి ఘనతరస్నేహం అన్నప్పటి తరప్రత్యయం పాండవులకంటె, కృష్ణాదులు చెప్పినమాటలలో హితం కంటె అధిక స్నేహాన్ని వ్యక్తం చేస్తుంది. భీష్మాదుల ప్రస్తావనలో, పెద్దలూ, పిన్నలూ, అందరూ చివరికి పతివ్రత ఐనభార్యా కూడా నిందించి మరీ చెప్పినా వినకపోవడం తప్పయిందనుకొంటున్నాడు 'అస్త్రగురుడు' కావడంవలన కౌరవపాండవుల శస్త్రాస్త్ర సామర్థ్యం ద్రోణుడికి తెలుసు. యుద్ధం వస్తే తనకొడుకులకు నాశం తప్పదని అస్త్రగురుడిమాటలతో నైనా గ్రహించవలసింది. 'నన్ను దూఱి' గాంధారి ధృతరాష్ట్రుడిలో దూరిపోయి= ప్రవేశించి అంటే నిరంతరము చెప్పింది. వినవేరనైతిని, ఆడకుండితివంటి భూతార్థకాలు - అంతా అయిపోయింది. ఇపుడు బాధపడి ప్రయోజనం ఏముంది అనేభావం వ్యక్తం చేస్తున్నాయి 'పెడ చెవిని ఇడితి' అనే మాటలు తేలిపోతూ, ఆ మాటలు, ఆదరించకపోవటాన్ని ధ్వనింపచేస్తున్నాయి.

వ. ఇత్తెఱం గంతరంగంబున శల్యం బై యున్నయది, యని చెప్పి వెండియు. 22

ప్రతిపదార్థం: ఈ+తెఱంగు= పైవిధంగా ఎవరు చెప్పినా వినకుండా కొడుకులను, (హితులు మొ॥) పోగొట్టుకోవడం; అంతరంగంబునన్= మనస్సులో (గుచ్చుకొని బాధించే); శల్యంబు ఐ= బాణం, అయి; ఉన్నది= నిలిచి ఉన్నది; అని చెప్పి= అని పలికి; వెండియున్= తిరిగి ఇట్లా అంటున్నాడు.

తాత్పర్యం: ఈ విధం నా మనస్సులో ములుకై బాధపెట్టుతున్నది అని చెప్పి మరలా ఇట్లా అన్నాడు.

క. సుతులు సమరమునఁ దిరుగక। మృతు లై సద్గతికిఁ జనిన మేలిమి యస్మ
న్మతిఁ దలఁచి వరక్షత్త్ర చ। రిత మని యప్పనికి వగవఁ బ్రీతియ కలుగున్. 23

ప్రతిపదార్థం: సుతులు= కొడుకులు; సమరమునన్= యుద్ధంలో; తిరుగక= పారిపోయి తిరిగిరాకుండా; మృతులు+ఐ= చనిపోయి; సద్గతికిన్= ఉత్తమస్థితికి; చనిన మేలిమి= చేరుకున్న గొప్పతనాన్ని; అస్మద్+మతిన్= నామనస్సులో; తలఁచి= స్మరించి;- (అది), వరక్షత్త్రచరితము= శ్రేష్ఠమైన క్షత్రియుడికి తగిన లక్షణం; అని= అనుకొని; ఆ+పనికిన్=యుద్ధంలో వారి మరణానికి; వగవన్= బాధపడను; ప్రీతి+అయ= ఇంకా (ఆ పని వలన), సంతోషమే; కలుగున్= కలుగుతున్నది.

తాత్పర్యం: యుద్ధం కోరిన కొడుకులు క్రమంగా అపజయం కలుగుతున్నా పారిపోయి వెనుకకు రాకుండా అందరూ మరణించి ఊర్ధ్వలోకాలకు చేరుకొన్నారు. అది క్షత్రియులకు తగినదే కాబట్టి అందుకు నేను విచారించను. ఇంకా సంతోషమే పొందుతున్నాను.

వ. అని పలికి పాండవాగ్రజుఁ జేరం బిలిచి, యతనితోడ. 24

ప్రతిపదార్థం: అని పలికి= బంధువులతో పైవిధంగా చెప్పి; పాండవ+అగ్రజున్= పాండురాజు సుతులలో పెద్దవాడైన ధర్మరాజును; చేరన్= దగ్గరకు; పిలిచి= రమ్మని; అతని తోడన్= ధర్మరాజుతో (ఇట్లా అంటున్నాడు - తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: బంధువులతో ఈ విధంగా పలికి, ధర్మరాజును దగ్గరకి పిలిచి అతడితో ఇట్లా అంటున్నాడు.

సీ. నీ వరయంగ సుఖావాప్తిఁ గొఱఁత లే । కుండితిఁ జనవును నుజ్జ్వలంపుఁ
దేజంబుఁ గలిగి వర్తించితి దానంబు లంచితములుగఁ బె క్కాచరింపఁ
గంటి శ్రాద్ధంబులు గాంధారిసుతులకుఁ । బలుమాఱుఁ జేసితిఁ; బరమధర్మ
శీల పాంచాలికిఁ జెట్ట చేసి రగణ్య । పుణ్యుండ వగు నీదు భూరిలక్ష్మి

తే. నపహరించి రద్దుర్యోధనాదు లట్టి; కష్టచరితులఁ బాడిమైఁ గయ్యమునన
నిహతులుగఁ జేసి తక్కురునికర మూర్ధ్వ; భువనగతిఁ గాంచి సుఖ మందె భూపవర్య! 25

ప్రతిపదార్థం: భూపవర్య!= రాజులలో శ్రేష్ఠుడా!; నీవు= నీవు (ధర్మరాజు); అరయంగన్= పరిశీలింపగా; సుఖ+అవాప్తిన్= రాజ్యం మొదలైన సుఖాలు పొందటం చేత; కొఱఁత లేక= ఏలోటూ లేకుండా; ఉండితిన్= ఉన్నాను; చనవును= ప్రేమా; ఉజ్జ్వలంపు= మిక్కుటమైన; తేజంబున్= ప్రకాశమూ; కలిగి= కలిగిఉండి; వర్తించితిన్= నడుచుకొన్నాను. (అందువలననే నేను) దానంబులు= దానాలు; పెక్కు= చాలా; అంచితంబుగన్= ప్రశస్తంగా; ఆచరింపన్+కంటిన్= చేయగలిగాను; గాంధారిసుతులకున్= దుర్యోధ నాదులకు; శ్రాద్ధంబులు= శ్రాద్ధాలు; పలుమాఱున్= అనేక పర్యాయాలు; చేసితిన్= చేశాను; దుర్యోధనాదులు= దుర్యోధనుడు మొదలైన కొడుకులు; పరమ ధర్మశీల= ఉత్తమమైన న్యాయపు నడవడి గలిగిన; పాంచాలికిన్= ద్రౌపదికి; చెట్ట= కీడు; చేసిరి= చేశారు; అగణ్య= లెక్కింపరాని; పుణ్యుండవు= ధర్మములు గలిగినవాడవు; అగు= అయిన; నీదు భూరిలక్ష్మిన్= నీ గొప్ప సంపదను; దుర్యోధన+ఆదులు= దుర్యోధనుడు మున్నగువారు; అపహరించిరి= కాజేశారు; అట్టి= అటువంటి; కష్టచరితులన్= దుర్మార్గపు నడత గలిగిన దుర్యోధనాదులను; కయ్యమునన్+అ= యుద్ధంలోనే; పాడిమైన్= న్యాయంగా; నిహతులుగన్= చంపబడినవారినిగా; చేసితి(వి)= చేశావు (చంపావు); ఆ+కురునికరము= యుద్ధంలో నీవు చంపిన ఆ కౌరవ వీరు లందరూ; ఊర్ధ్వ భువన గతిన్= ఉత్తమలోకాలలో, ఉనికిని; కాంచి= పొంది; సుఖము= సుఖాన్ని; అందెన్= పొందారు.

తాత్పర్యం: 'రాజశ్రేష్ఠుడా! ధర్మరాజా! నీవు ఏలోటూ లేకుండా చూస్తూ ఉండగా సుఖంగా ఉన్నాను. అభిమానాన్నీ, ఇతర జనాలపై ప్రభావాన్నీ, (అధికారమూ) చూపుతూ వ్యవహరించాను. నీవలన గొప్పదానాలు చేయగలిగాను. మా పుత్రులకు శ్రాద్ధక్రియలు పలుసార్లు మేలుగా చేయగలిగాను. ఉత్తమురాలైన పాంచాలిని పరాభవించి, నీ సంపదలు కాజేసిన దుర్యోధనాదులను న్యాయంగా యుద్ధంలోనే చంపావు. వాళ్లందరూ ఉత్తమలోకాలలో సుఖంగా ఉన్నారు.

క. కావున నేమియుఁ జేయం । గా వలవదు వారికయి యకారణ కరుణా
శ్రీవిలసితుఁ డగునీతో । నా విధముం జెప్పవలసె నరవరముఖ్యా! 26

ప్రతిపదార్థం: నరవరముఖ్యా!= రాజ శ్రేష్ఠా! (ధర్మరాజా!); కావునన్= అందుచేత; వారికయి= పుత్రులకొరకు; ఏమియున్= ఇంక ఏ విధమైన పనులూ; చేయంగాన్= చేయటం; వలవదు= అవసరం లేదు; అకారణ= హేతువు (ప్రయోజనం మొ॥) లేకుండానే;

కరుణాశ్రీ= దయాసంపదతో; విలసితుఁడు+అగు= ప్రకాశిస్తూ ఉన్న; నీతోన్= నీతో; నా విధమున్= నన్ను గురించి; చెప్పవలసెన్= చెప్పవలసి ఉన్నది.

తాత్పర్యం: రాజా! దుర్యోధనాదులకొరకు దాన శ్రాద్ధాదికార్యాలు అనేకం చేశాను. కాబట్టి ఇక వారికొరకు కొత్తగా చేయవలసిం దేమీ లేదు. సహజంగా దయ గలిగిన నీతో ఇపుడు నావిషయమే చెప్పుకోవలసి ఉన్నది.

విశేషం: 'అకారణ కరుణాశ్రీవిలసితుఁడు' అనే విశేషణం సాభిప్రాయం. ధృతరాష్ట్రుడిపై చూపుతున్న అభిమానాన్నీ దుర్యోధనాదులకు పుణ్యలోక ప్రాప్తి దానాదు లేర్పరచటాన్నీ సూచిస్తూనే తర్వాత తాను కోరబోయే అంశం కూడా తప్పక నెరవేర్చాలి అని ధృతరాష్ట్రుడి అభిప్రాయం.

సీ. **ఏ కార్యమైనను నెవ్వఁడేనియుఁ జేయఁ । దొడఁగునప్పుడు విను పుడమిఱేని**
చే ననుజ్ఞాతుఁ డై కాని తొడంగఁ గా । దట్లు గావున వార్ధకాభిలీఢ
మైన మదీయకాయమునకు సంస్కార । మాచరింపఁగఁ దప మాచరించు
పనికి భూపాల! నీయనుమతి వడయంగ । వలసి చెప్పెద రాజవంశజునకు

ఆ. **సమరమరణ మొండె, విమలతపమునకుఁ । జొచ్చి యందు నిలిచి చచ్చు టొండె**
వలయు; నస్మదీయకులముఖ్యు లిట్టుల । నడపి రనుపు నన్ను నడవి కనఘ! **27**

ప్రతిపదార్థం: భూపాల!= ఓ, (ధర్మ) రాజా!; విను= నా విధం వినవలసింది; ఎవ్వఁడు+ఏనియున్= ఎంతటివాడు అయినప్పటికీ; ఏకార్యము+ఐనను= ఎంతటి పని అయినా గాని; చేయన్= చేయడానికి; తొడఁగు+అప్పుడు= ప్రారంభించేటప్పుడు; పుడమిఱేనిచేన్= భూపాలకుడి చేత; అనుజ్ఞాతుఁడు+అయి= అనుమతించబడినవాడు అయితేనే; కాని= తప్ప; తొడంగన్= ప్రారంభించడం; కాదు= కూడదు; అట్లు కావునన్= పద్ధతి అది కాబట్టి; వార్ధక+అభిలీఢము= ముసలితనం చేత ఆక్రమింపబడింది; ఐన= అయినటువంటి; మదీయ కాయమునకున్= నా శరీరానికి; సంస్కారము= శోధనం; ఆచరింపఁగన్= చేయటానికి; తపము= తపస్సు; ఆచరించుపనికిన్= చేయవలసిన కార్యానికి; నీ+అనుమతి= నీ అంగీకారం; పడయంగన్+వలసి= పొందవలసి ఉండటం వల్ల; చెప్పెదన్= అనుమతిమ్మని అడుగుతున్నాను; రాజవంశజునకున్= క్షత్రియుడికి; సమర మరణము+ఒండెన్= యుద్ధంలో మరణించడమో, లేదా; విమల తపమునకున్= శ్రేష్ఠమైన తపస్సునకు; చొచ్చి= పూనుకొని; అందున్= ఆ తపస్సులోనే; నిలిచి= స్థిరపడి; చచ్చుట ఒండెన్= మరణించటమో; వలయున్= అవసరం; అస్మదీయ-కుల-ముఖ్యులు= నా వంశంలో పే రున్నవాళ్ళంతా; ఇట్టులన్= ఈ విధంగానే; నడపిరి= ఆచరించారు; అనఘ!= పాప మెరుగని వాడా-ధర్మరాజా! అందువలన; నన్నున్= నన్ను; అడవికిన్= అరణ్యానికి; అనుపు= (అనుమతించి) పంపవలసింది.

తాత్పర్యం: (ధర్మ)రాజా! ముందుగా రాజునుండి అనుమతి తీసికొనకుండా, ఆ రాజ్యంలో వా డెవడైనా, ఎటువంటి పనైనా ప్రారంభించకూడదు. ఇపుడు ముసలితనం నా శరీరాన్ని మింగేస్తున్నది. ఈ శరీరాన్ని శుద్ధి చేయాలంటే తపస్సు చేయాలి. అందుకు నీవు అనుమతించాలి. క్షత్రియుడైన వాడు యుద్ధంలోనైనా మరణించాలి. లేదా తపస్సుతోనైనా శరీరాన్ని విడిచిపెట్టాలి. (వ్యాసుడూ ఇదే మాట చెప్తాడు 48 పద్యం). ముఖ్యమైనవా ళ్ళందరూ ఈ పద్ధతినే అనుసరించారు. కాబట్టి తపస్సు చేసుకోవడం కోసం నన్ను అడవులకు పంపుము.

క. **రాజు గురుఁ డెల్లవారికి; । రాజోత్తమ! గురునియాజ్ఞ రంజిల్లఁగఁ బే**
రోజం జేసిన కృత్యము । సూ జగములు రెంటియందు శోభన మిచ్చున్. **28**

ప్రతిపదార్థం: రాజ+ఉత్తమ!= రాజులలో శ్రేష్ఠుడా!; (ధర్మరాజా!); ఎల్లవారికిన్= రాజ్యంలోని పిన్నలు పెద్దలు అందరికీ; రాజు= పాలకుడు; గురుఁడు= గురువు; గురుని+ఆజ్ఞ= గురువుయొక్క శాసనం; రంజిల్లఁగన్= ఒప్పుతూ ఉండగా; పేరు+ఓజన్= మిక్కిలిగా అదే క్రమంలో; చేసిన కృత్యము+చూ= చేసినటువంటి పనే సుమా; జగములు= లోకాలు; రెంటియందున్= రెండింటిలోనూ; (ఇహపరాలలో) శోభనము= ప్రకాశం, కీర్తిని; ఇచ్చున్= కలుగజేస్తుంది.

తాత్పర్యం: రాజా! రాజ్యంలో వా రందరికీ రాజే పూజ్యుడు. అటువంటి రాజు అనే గురువు యొక్క ఆజ్ఞతో చేసినపని మాత్రమే ఇహపరసుఖా లందిస్తుంది.

తే. **ఏను గాంధారియును దపోమాననీయ । మునుల చేరువ వల్కలములు ధరించి**
కందమూల ఫలముల నాఁకలి హరించి । నిన్ను దీవించుచుండెద మన్న నతఁడు. **29**

ప్రతిపదార్థం: ఏనున్= నేను (ధృతరాష్ట్రుడు); గాంధారియును= గాంధారీ; తపన్= తపస్సుచేత; మాననీయ= గౌరవించదగిన; మునుల= మునుల యొక్క; చేరువన్= సమీపంలో; వల్కలములు= నారవస్త్రాలు; ధరించి= కట్టుకొని; కంద-మూల-ఫలములన్= దుంపలు, వేళ్లూ, పండ్లతో; ఆఁకలిన్= ఆకలిని; హరించి= పోగొట్టి; నిన్నున్= నిన్ను (ధర్మరాజును); దీవించుచున్+ఉండెదము= మేలు కలగాలని ఆశీర్వదిస్తూ ఉంటాము; అన్నన్= అని ధృతరాష్ట్రుడు అనగానే; అతఁడు= ఆ ధర్మరాజు- ఇట్లా అంటున్నాడు; (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: నేనూ గాంధారీ నారబట్టలు కట్టుకొని అడవులకు పోయి, అక్కడ మహర్షులను సేవిస్తూ, దుంపలూ, వేళ్ళూ, పండ్లూ తింటూ ఆకలి దీర్చుకొంటూ (సుఖంగా ఉండాలని) నిన్ను ఆశీర్వదిస్తూ ఉంటాము' అని ధృతరాష్ట్రుడనగా అతడితో ధర్మరాజు ఇట్లా అంటున్నాడు.

విశేషం: 'నిన్ను దీవిస్తూ వుంటాం' అనటంలో నగరంలో లేకపోయినా ఎక్కడ ఉన్నా, ఎలా (మునివృత్తితో) ఉన్నా (ధర్మరాజు) శ్రేయస్సు కోరుతూ ఉంటాము కాబట్టి మేం అడవులకు పోవటానికి అనుమతించవచ్చని అభిప్రాయం.

క. **ధరణీరాజ్యము నాకును । నరవర! సౌఖ్యంబుఁ జేయునా! నీ విమ్మై**
దురపిల్లి దుష్కరం బగు । నరణ్యవాసమున కేఁగినట్టిది యైనన్. **30**

ప్రతిపదార్థం: నరవర= రాజా; నీవు= నీవు (ధృతరాష్ట్రుడు); ఈ+మైన్= ఈ విధంగా; దురపిల్లి= దుఃఖించి; దుష్కరంబు+అగు= ఆచరణానికి సాధ్యం కాని; అరణ్యవాసమునకున్= అడవులలో నివసించటానికి; ఏఁగిన+అట్టిది+అ= వెళ్ళినట్లు; ఐనన్= అయితే; ధరణీ రాజ్యము= (నీవు లేని) ఈ భూమి పాలనం; నాకున్= నాకు మాత్రం; సౌఖ్యంబున్= సుఖాన్ని; చేయునా!= కలిగిస్తుందా?

తాత్పర్యం: మహాత్మా! నీవు ఈ విధంగా బాధపడి కఠోరమైన అరణ్యాలలో ఉండటానికి వెళ్లితే ఈ రాజ్యం నాకు మాత్రం సుఖ మిస్తుందా?

విశేషం: నీవు అడవులకు వెళ్ళితే అనటంలో నీవు లేకుంటే ఈ ప్రభుత్వం గూడా నా కక్కరలేదు. ఈ రాజ్యం కంటె నీవే ఎక్కువ అని ధర్మరాజు భావం. రాజ్యము సౌఖ్యము చేయునే - ధర్మరాజే రాజయినా పెద్దవాడుగా ధృతరాష్ట్రుడు నడిపించిన ప్రకారం పోవటంలో పాలనం బరువు ధర్మజుడికి తక్కువ. అపుడు పరిపాలనం సుఖం పెద్ద దిక్కుగా (ధృతరాష్ట్రుడు) లేకపోతే తానై అన్నిటికీ బాధ్యత తీసికొనవలసివస్తే అపుడు ప్రభుత్వంవలన సుఖం ఉండదు.

ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో మాటాడుతూ మొదటగా అన్నది నీ వరయంగ సుఖావాప్తి కొఱఁత లేకుండితి - భూపవర్య! (25పద్యం). దానికి సమాధానంగా ధర్మరాజు ధరణీరాజ్యంబు నాకును సౌఖ్యంబుఁ జేయునా అన్నాడు. రాజ్యం సుఖం కాదు గాబట్టి దాని కొరకు దుర్యోధనాదులను చంపా వనరాదని తాత్పర్యం. 'దురపిల్లి'- ఆశ్రమవాస ధర్మనిర్వహణకుగాను అరణ్యవాసం పోతే అంటే ఇట్లా పాండవులు రాజ్యం వలన సుఖపడుతున్నారని భావించే వీలుంది. ఏడుస్తూ ధృతరాష్ట్రుడు పోతే నాకు సుఖం లేదు. మనస్స్ఫూర్తిగా నిజంగా ఆశ్రమవాసం ధృతరాష్ట్రుడు కోరటం లేదని ఆంతర్యం ధర్మరాజుకు అర్థం అయింది.

ధర్మరాజాదులు సుఖపడుతున్నారనీ, బాధపడుతూ పాండవుల సుఖం చూస్తూ వాళ్ళ దగ్గర ఉండలేకపోవటంవలననే ధృతరాష్ట్రుడు అడవులకు వెళ్ళిపోదామనుకొంటున్నాడన్నమాట. ఇమ్మై- అనేమాట ధృతరాష్ట్రుడు బాధపడుతున్న కారణాలనేకంగా నిర్దేశిస్తూ - అది ఉచితం కాదని ధ్వనింపజేస్తుంది. సౌఖ్యంబు చేయునా, ఇమ్మై దురపిల్లి- అంటే - ధరణీ రాజ్యం వలన నేను సుఖపడుతున్నానని బాధపడి - ఆకారణంగా - మా సుఖం చూడలేని కారణంగా అడవులకు పోతానంటున్నావు. 'దుష్కర' మైనా అరణ్యవాసం కోరుకొనటం వలన పాండవుల రాజ్యసుఖానికి ధృతరాష్ట్రుడు ఎంతో మిక్కుటంగా విచారిస్తున్నాడని ధర్మరాజు భావంగా గోచరిస్తుంది. ఇటువంటి తక్కువస్థాయి ఆలోచనలు గలిగినవాడుగా గుర్తిస్తూ నరవర అని సంబోధించడంలో విపరీతార్థవివక్ష ఉంది.

తే. గూఢబుద్ధి వై నమ్మించి కురువరేణ్య ! । యే నెఱుంగక యుండంగ నిట్లు శోక
వనధిఁ దేలుచు నుండి తివ్వనట గంటి । నింక రాజ్యంబు నా కెట్టు లించుఁ జెపుమ. 31

ప్రతిపదార్థం: కురువరేణ్య!= కురువంశంలో శ్రేష్ఠుడా!; గూఢ బుద్ధిని+ఐ= అసలైన ఆలోచనలను రహస్యంగా దాచుకొని; నమ్మించి= బాధలు మరచినట్లుగా, నేను (ధర్మరాజు) నమ్మేటట్లుగా నడుచుకొని; ఏను= నేను, (ధర్మరాజు); ఎఱుంగక+ ఉండంగన్= తెలిసికొనలేకపోగా; ఇట్లు= ఈ విధంగా; శోకవనధిన్= దుఃఖం అనే సముద్రంలో; తేలుచున్+ఉండితి(తి)= తేలిపోతూ ఉన్నావు; ఈ+వనట= (అందువలన), ఈ విధమైన బాధ; కంటిన్= నేనూ పొందాను; ఇంకన్= ఈ బాధ వలన; నాకున్= నాకు; రాజ్యంబు= ప్రభుత్వం; ఎట్టులు= ఏ విధంగా; ఇంచున్?= ఇష్ట మవుతుంది?; చెపుమ= నీ వే చెప్పుము.

తాత్పర్యం: కురువంశశ్రేష్ఠా! బుద్ధిని దాచుకొని నమ్మించి నాకు తెలియకుండా ఈ విధంగా శోకసముద్రంలో తేలుతూ ఉండినావు. ఈ (దాచుకొన్న) నీ బాధను ఇప్పుడు చూచినాను. ఇంక రాజ్యము నాకెట్లా ఇష్టమవుతోందో చెప్పుము.

విశేషం: 25గీతం, 26 పద్యాలలో ధృతరాష్ట్రుడి మాటలలోని ఆంతర్యానికి సమాధానం ధర్మరాజు ఈ పద్యం.

ఉ. తల్లియుఁ దండ్రియున్ గురుఁడు దైవము నా కరయంగ నీవ భూ
వల్లభ! నీవు కానన నివాసము గోరి చనంగ నెట్టు లే
నుల్లము వట్టి హస్తిపురి నుండఁగ నేర్తు? యుయుత్సుఁ బెంపు శో
భిల్లఁగ రాజుఁ జేయు; నినుఁ బ్రీతి యెలర్పఁగఁ గొల్చి వచ్చెదన్. 32

ప్రతిపదార్థం: భూవల్లభ!= ఓ రాజా! (ధృతరాష్ట్రా!); అరయంగన్= పరిశీలించి చూస్తే; నాకున్= నాకు; తల్లియున్= తల్లీ; తండ్రియున్= తండ్రీ; గురుఁడున్= గురువూ; దైవమున్= దైవమూ; నీవు+అ= నీవే; నీవు= అటువంటి నీవు; కానన నివాసము= అడవులలో నివసించటాన్ని; కోరి= స్వయంగా అభిలషించి; చనంగన్= వెళ్ళిపోతే; ఏన్= నేను; ఉల్లము= మనసును; పట్టి= నిగ్రహించుకొని; హస్తిపురిన్= హస్తినగరంలో; ఉండఁగన్= ఉండటానికి; ఎటులు= ఏ విధంగా; నేర్తున్= ఓర్చుకొనగలను; పెంపు= గౌరవం; శోభిల్లఁగన్= అతిశయించేవిధంగా; యుయుత్సున్= నీ కొడుకైన యుయుత్సుణ్ణి; రాజున్= ఈ రాజ్యానికి పాలకుడిగా;

చేయు(ము)= చేయవలసింది; ప్రీతి= ఇష్టం; ఎలర్పఁగన్= అధికం కాగా; నినున్= నిన్ను; కొల్చి= సేవిస్తూ; వచ్చెదన్= నీతో అరణ్యావాసానికి నేనూ వస్తాను.

తాత్పర్యం: ఓ రాజా! పరిశీలించి చూస్తే నాకు తల్లీ, తండ్రీ, గురువూ, దైవం అన్నీ నీవే. నా సర్వస్వం అయిన నీవు బుద్ధిపూర్వకంగా అరణ్యావాసానికి వెళ్ళితే మనసు చిక్కబట్టుకుని నే నీ రాజధానిలో ఎట్లా ఉండగలను. నీ కొడుకైన యుయుత్సుడిని ఈ రాజ్యానికి రాజును చేయుము. నేను సంతోషంగా నిన్ను సేవిస్తూ నీతోపాటు అరణ్యాలకు వస్తాను.

విశేషం: రాజైన ధర్మరాజు ధృతరాష్ట్రుడిని అడవులకు అనుసరించగోరుతున్నాడు. కాబట్టి తాను హస్తిపురిలో లేకుంటే రాజ్యం అరాజకం అవుతుంది. అట్లా కాకూడదు కాబట్టి ముందుగా వేరే రాజుని ఏర్పరిచే విషయం ప్రస్తావించటం రాజనీతిజ్ఞత. అయితే యుయుత్సుడిని రాజు చేయు మనడం విశేషం. తన కొడుకులను చంపి ధర్మరాజు రాజయ్యాడని ధృతరాష్ట్రుడు బాధపడుతున్నట్లుగా అతని మాటలలో గూఢంగా ఉన్న అంశం ధర్మరాజు గ్రహించాడు. కాబట్టే ధృతరాష్ట్రుడికి కొడుకైన యుయుత్సుడిని రాజు చేయు మంటున్నాడు. తన సొంత కొడుకే రాజు అయితే ధృతరాష్ట్రుడికి కొంత బాధ తగ్గుతుంది. పాండవులు పరాయి వాళ్ళనుకొంటున్నాడు ధృతరాష్ట్రుడు. పెంపు శోభిల్లఁగ - యుయుత్సుడిని రాజు చేస్తే యుయుత్సుడికే కాక ధృతరాష్ట్రుడు తనకు (తన కొడుకు రాజైనందు వలన) పెంపు శోభిల్లుతుందని భావిస్తాడు. ధర్మరాజు రాజవటం వలన తన పెంపు పోయినట్లు భావిస్తున్నాడన్నమాట. వైశ్య స్త్రీ వలన పుట్టినా రాజును చేస్తే యుయుత్సుడికి (లేని) పెంపు శోభిల్లుతుంది. మేం రాజ్యం సంపాదించుకొన్నాం. నీవు ఇవ్వలేదు కాబట్టి యుయుత్సుడు అట్లా సంపాదించలేడు. నీవే అతడిని రాజును చేయాలి అని ధృతరాష్ట్రుడి కొడుకు అసామర్థ్యం సూచన. రాజ్యార్హత లేనివాడు కావటం వలననూ, ఇలాగే ప్రీతి యెలర్పఁగ - నీకు (ధృతరాష్ట్రుడికి) సంతోషం కలిగేటట్లుగా నీకు సేవచేస్తూ అడవులకు వస్తానని ధర్మరాజు భావం. యుయుత్సుడిని రాజును చేసిన తర్వాత కూడా అరణ్యవాసం చేయాలని నీవనుకుంటే (అప్పటికీ పాండవులు రాజధానిలో సుఖపడతా రేమో ననే బాధ ఉండి 'అహం వనం గమిష్యామి, భవా న్రాజ్యం ప్రశాస్త్విదమ్' నేనే అడవులకు పోతే నీవు రాజ్యం చేసుకోమనడం ధృతరాష్ట్రుడి దోషం మరీ ఎక్కువ చేస్తుంది. అందుకే తిక్కన ధృతరాష్ట్రుడితో అరణ్యానికి వస్తా ననిపించాడు. ఇక్కడ కూడా అప్పుడు నేనూ అడవులకు వస్తా నంటాడు ధర్మరాజు.

క. అతఁ డౌరసుండు నీ కీ। క్షితి కొడయుఁడు దుర్యశంబుచేఁ గుందుట భూ
పతివర! కని కని మీ రి। ట్లతి మాత్రము చేయఁదగునె యక్కట నాకున్? 33

ప్రతిపదార్థం: భూపతివర!= రాజులలో శ్రేష్ఠుడ వైన ధృతరాష్ట్రా!; అతఁడు= ఆ యుయుత్సుడు; నీకున్= నీకు; ఔరసుండు= ధర్మపత్నియందు పుట్టినవాడు; ఈక్షితికిన్= ఈ కురురాజ్యానికి; ఒడయుఁడు= యజమానుడు; దుర్యశంబుచేన్= (కౌరవులను) చంపటం అనే అపకీర్తి చేత; కుందుట= నేను బాధపడుతూ ఉండడం; కని కని= బాగా చూచి కూడా; అక్కట= అయ్యో; నాకున్= నాకు; మీరు= మీరు (గాంధారీ ధృతరాష్ట్రులు); ఇట్లు= ఈ విధంగా; అతిమాత్రము= (ఆ దుఃఖాన్ని) ఇంకా అధికం; చేయన్+తగునె?= చేయటం ఒప్పుతుందా?

తాత్పర్యం: రాజులలో శ్రేష్ఠుడా! ఆ యుయుత్సుడు నీకు ధర్మపత్ని యందు పుట్టినవాడే కాబట్టి ఈ కౌరవరాజ్యానికి అతడే రాజు. ఇప్పటికీ బంధువినాశాదులవలన అపకీర్తితో, విచారిస్తుండటం కళ్లారా చూచి కూడా ఇంకా నాదుఃఖాన్ని అధికం చేయటం సమంజసమేనా?

సీ. **నీవు రాజవు గాక నీ కేను రాజనే? । గురుని మహారాజుఁ గురువరేణ్యు**
నిటు చేయు మని పంప నే నొడయండనే? । దుర్యోధనాదుల దుష్కృతములు
నా మదిలో నిల్ప, నేమును వారును । విధిమోహమున నైన విరస భావ
మావహిల్లినఁ బుట్టె నంతలు పనులు; గాం । ధారియు గొంతియు గారవమున

ఆ. **నాకు నొక్కరూప; మీకుఁ గాననవాస । మెల్ల భంగిఁ గలుగు నేని యేనుఁ**
దగిలి తోన వత్తుఁ దగుమాటగా నాటఁ గాదు నాదుహృదయగతియు నిట్ల. 34

ప్రతిపదార్థం: రాజవు= ఈ రాజ్యానికీ, నాకూ రాజువి; నీవు= నీవే; కాక= అంతే కాని; నీకున్= నీకు; ఏను= నేను; రాజనే?= రాజునా?; గురునిన్= గురువు; మహారాజున్= చక్రవర్తిని; కురువరేణ్యున్= కురువంశంలో శ్రేష్ఠుడూ అయిన నిన్ను; ఇటు= ఈ విధంగా; చేయుము= చేయవలసింది; అని= అనే తీరుగా; పంపన్= ఆజ్ఞ చేయటానికి; నేను= నేను; ఒడయండనే?= ఏలికనా?; దుర్యోధనాదుల= దుర్యోధనుడు మొదలైన వారి (నీ కొడుకుల); దుష్కృతములు= చెడు పనులు; నా మదిలోన్= నా మనస్సులో, నిల్పన్= ఉంచుకోలేదు (మరిచాను); ఏమును= మేమూ (పాండవులు); వారును= దుర్యోధనాదులూ; విధిమోహమునన్= బ్రహ్మదేవుడు కల్పించిన అజ్ఞానం వలన; ఐన= పుట్టిన; విరసభావము= ద్వేషం; ఆవహిల్లినన్= ఆవరించటంవలన; అంతలు పనులు= అటువంటి దుష్కృతములు; పుట్టెన్= సంభవించాయి; నాకున్= నాకు; గారవమునన్= ఆదరం విషయంలో; గాంధారియున్= గాంధారీ; గొంతియున్= కుంతీదేవీ; ఒక్కరూపు+అ= ఒకటే; మీకున్= అటువంటి మీ యిద్దరికి; ఎల్ల భంగిన్= అన్ని విధాలుగానూ; కానన వాసము= అడవులలో ఉండడం; కలుగున్+ఏని= సంభవించే పక్షంలో; ఏనున్= నేను కూడా; తగిలి= వెన్నంటి; తోన్+అ= మీతో కలిసే; వత్తున్= అడవులకు వస్తాను; తగు మాటగాన్= మీ మాటలకుబదులుగా, ఆటన్+కాదు= పలుకుటకాదు; నాదు హృదయగతియున్= నా మనసులో ఉన్నది కూడా; ఇట్లు+అ= ఇంతే.

తాత్పర్యం: నువ్వే (నాకూ, అందరికీ) రాజువి కాని నీకు నేను రాజును కాదు. గురువువీ, మహారాజువీ, వంశశ్రేష్ఠుడివీ అయిన నిన్ను ఇట్లా చేయు మని ఆజ్ఞాపించటానికి నేను అధికారిని కాదు. నీ కొడుకులు చేసిన కీడు పనులు నేను మనసులో పెట్టుకొనలేదు (మరిచేపోయాను). విధి వలన అజ్ఞానంతో ద్వేషం ఏర్పడి అటువంటి కీడు పనులు జరిగాయి. నాకు గాంధారీ, కుంతీ ఇద్దరూ ఒకటే. సమానంగా గౌరవిస్తాను. అటువంటి గాంధారీ, నీవూ ఏ విధంగా నైనా అడవికి పోవడం తప్పకపోతే వెన్నంటి నేనూ మీతోపాటే వస్తాను. ఇది నిజం. సమయానికి తగినట్లు మాటాడటం కాదు. నా మనసులో ఉన్న మాట అదే.

విశేషం: ధృతరాష్ట్రుడు తనతో చెప్పిన మాట లన్నింటికీ సంగ్రహంగా ఇక్కడ ధర్మరాజు సమాధానం చెప్పాడు.

క. **పలికెద నే సత్యము నా । కిల ప్రీతిం జేయ దధిప! యీ వి ట్లయినం**
గులము కలఁక దైవకృతం । బలఘుమతీ! విడువు శోక మరయుము నన్నున్. 35

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా!; నేన్= నేను; సత్యము= యథార్థం; పలికెదన్= చెపుతున్నాను; ఈవు= నీవు; ఇట్లు+అయినన్= ఇట్లాగు అయితే; నాకున్= నాకు; ఇల= రాజ్యం; ప్రీతిన్= సంతోషాన్ని; చేయదు= కలిగించదు; అలఘుమతీ!= దొడ్డబుద్ధి కలవాడా; కులము కలఁక= మన వంశంలో ఏర్పడ్డ కలత; దైవకృతంబు= దేవుడు కల్పించిందే; శోకము= పుత్రవియోగాదులవలన పుట్టిన దుఃఖాన్ని; విడువు= విడిచిపెట్టుము; నన్నున్= నన్ను; అరయుము= కాపాడుము.

తాత్పర్యం: రాజా! నిజం చెపుతున్నాను. నీవు ఈ విధంగా శోకిస్తూ అరణ్యాలకు పోతే (నీవు లేని) యీ రాజ్యం వలన నాకు సుఖం లేదు. ఇంక మనకులంలో ఏర్పడ్డ కలతలు దైవం వలన కలిగినవే. దొడ్డబుద్ధి గలవాడా!. ఇక దుఃఖాన్ని విడిచిపెట్టుము, నన్ను ఉద్ధరించుము.

విశేషం: మొత్తం తన సమాధానం సారాన్ని ఇక్కడ ధర్మరాజు సంగ్రహంగా చెప్పుతున్నాడు. ఇక్కడినుండి ధర్మరాజు మాటలు సూటిగా అంతరార్థం ఇంకొక విధంగా లేకుండా తోస్తుంది. ఇదే సత్య మన్నమాట.

తే. నీకు శుశ్రూష యొనరించి నృపవరేణ్య! చిత్తతాపంబు మానంగఁ జేసికొందు
నని తలంచు నన్ విడువంగ నగునె? యవన । తుండ నై నిన్ను వేఁడెదఁ దొఱఁగు వగలు. 36

ప్రతిపదార్థం: నృపవరేణ్యా!= రాజులలో శ్రేష్ఠుడా!; నీకున్= నీకు; శుశ్రూష= (చెప్పిన పనులు చేస్తూ) సేవ; ఒనరించి= చేసి; ఆ విధంగా; చిత్త - తాపంబు= మనసులో చింతను; మానంగన్= అణగి పోయేటట్లుగా; చేసికొందున్= చేసుకుంటాను; అని= అనే విధంగా; తలంచు= ఆలోచించే; నన్= నన్ను; విడువంగన్= విడిచిపెట్టటం (అరణ్యాలకు వెళ్ళటం); అగునె?= ఉచితమా?; అవనతుండను= వినమ్రుడిని; ఐ= అయి (వంగి); నిన్నున్= నిన్ను; వేఁడెదన్= ప్రార్థిస్తున్నాను; వగలు= బాధలు; తొఱఁగు(ము)= విడిచిపెట్టుము:

తాత్పర్యం: రాజులలో శ్రేష్ఠుడి వైన ధృతరాష్ట్రుడా! నీకు సేవ చేసికొంటూ నా బాధలు మరచిపోవా లనుకొనే నన్ను విడిచి అరణ్యాలకు వెళ్ళకుము. ప్రాధేయపడుతున్నాను. నీ శోకాన్ని విడిచిపెట్టుము.

విశేషం: ధర్మరాజు ప్రాధేయపడడంలో ధృతరాష్ట్రుడి శోకం ధర్మరాజును చాలా బాధపెట్టినట్లు చెప్పుతుంది. ధృతరాష్ట్రుడిని తృప్తి పరచలేకపోవడంతో 15 సంవత్సరాలుగా తాను పడ్డ శ్రమంతా వృథా అయినపుడు ఈ విధంగా బాధపడటం సహజమే.

క. అనుచు నతని చరణంబులు । తన ఫాలతలంబు చేర్చె ధర్మతనయుఁడా
తని గ్రుచ్చి యెత్తి కౌఁగిట । నెనయంగాఁ జేర్చి యాతఁ డిట్లను నధిపా! 37

ప్రతిపదార్థం: అధిపా!= జనమేజయరాజా!; అనుచున్= పైవిధంగా అంటూనే; ధర్మతనయుఁడు= ధర్మరాజు; తన, ఫాలతలంబు= తన నుదుటి ప్రదేశాన్ని, శిరస్సును; అతని చరణంబులు= ధృతరాష్ట్రుడి పాదాలను; చేర్చెన్= చేరేటట్లు చేశాడు; అతఁడు= ఆ ధృతరాష్ట్రుడు; ఆతనిన్= పాదాభివందనం చేస్తున్న ధర్మరాజును; గ్రుచ్చి= గట్టిగా పట్టుకొని; ఎత్తి= పైకి లేపి; కౌఁగిటన్= తన బాహువుల మధ్య; ఎనయంగాన్= కుదురుగా; చేర్చి= చేర్చుకొని; ఇట్లు+అనున్= ఈ విధంగా అంటున్నాడు.

తాత్పర్యం: జనమేజయమహారాజా! 'నీ సేవ చేస్తూ నా విచారం పోగొట్టుకొంటా' నని మొదలుగా ఆ మాటలు అంటూనే ధర్మరాజు ధృతరాష్ట్రుడి పాదాలపై తన శిరస్సు ఉంచి ప్రణామం చేశాడు. ధృతరాష్ట్రుడు ఆ ధర్మరాజును పట్టుకొని లేపి కౌగిలిలో చేర్చుకొని ఇలా అంటున్నాడు.

తే. నీవు శుశ్రూష చిరకాలనియతిఁ జేసి । తేను వృద్ధుండ నైతి; నా కింకఁ దపము
వలవదయ్య? రాజును బాలివాఁడ యెవ్వ । రేమి చేసిన ఫలములయెడ నృపాల!' 38

ప్రతిపదార్థం: నృపాల!= (ధర్మ) రాజా!; నీవు= నీవు; చిరకాల నియతిన్= చాలాకాలం నియమంగా; శుశ్రూష= సేవ; చేసితి(వి)= (నాకు) చేశావు; ఏను= నేను; వృద్ధుండన్= ముసలివాడిని; ఐతిన్= అయ్యాను; ఇంకను= ఈ వార్ధక్యంలో; నాకున్= నాకు; తపము= తపస్సు చేసికొనటం; వలవదు+అయ్య?= వద్దా?; ఎవ్వరు= రాజ్యంలో ప్రజలలో ఎవరైనా; ఏమి= ఏపని; చేసినన్= చేసినా; ఫలముల - ఎడన్= దానికి కలిగే ఫలితం విషయంలో; రాజును= రాజు కూడా; పాలివాఁడు+అ= భాగస్థుడే.

తాత్పర్యం: రాజా! నీవు చాలాకాలంగా నియమంగా నాకు శుశ్రూష చేస్తూనే వున్నావు. ఇపుడు నేను పెద్దవాణ్ణయిపోయాను. ఈ వార్ధక్యంలో నైనా తపసు చేసికొనవద్దా? ప్రజలు చేసిన ప్రతిపనికి కలిగే ఫలంలో రాజుకు కూడా భాగం ఉంటుంది.'

వ. అని పలికి విదుర కృప సంజయుల నుద్దేశించి తనకు ముఖశోషయుం దనుగ్లానియుం గలిమి నుగ్గడించి, నాలుక తొట్రుపడ వారలతో మీర లనునయవచనంబుల నజాతశత్రుం దెలి వొందం జేయుం' డని చెప్పి డప్పి యెక్కుడు గదిరిన గాంధారి తనువున మేను సేర్చి మూర్ఛిల్లుటయు నార్తి నొంది యక్కుంతీనంద నాగ్రజుం డిట్లని పలవించె. 39

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; పలికి= చెప్పి; విదుర - కృప - సంజయులన్= విదురుడినీ, కృపాచార్యుడినీ, సంజయుడినీ; ఉద్దేశించి= లక్ష్యం చేసికొని - వాళ్లతో; తనకున్= తనకు (ధృతరాష్ట్రుడికి); ముఖశోషయున్= నోరు ఎండిపోవటమూ, (నాలుక తడి ఆరటం), తను గ్లానియున్= (ఎక్కువ మాటాడటం వలన) శరీరం బలహీనమై పోవటమూ; కలిమి= ఉన్నవిషయాన్ని; ఉగ్గడించి= చెప్పి; నాలుక= నాలుక; తొట్రుపడన్= తడబడుతుండగా; వారలతోన్= ఆ విదురుడు మొదలైన వారితో-మీరలు= మీరు; అనునయవచనంబులన్= ఊరడింపు మాటలతో; అజాతశత్రున్= శత్రువులు లేనివాడిని - ధర్మరాజును; తెలివి+ఒందన్= తెలివి పొందేవిధంగా; చేయుండు= చేయండి; అని= అనే విధంగా; చెప్పి= పలికి; డప్పి= దాహం; ఎక్కుడు= అధికంగా; కదిరినన్= కలుగగా; గాంధారి తనువునన్= గాంధారి శరీరంపై; మేను= తన శరీరాన్ని, చేర్చి= ఉంచి; మూర్ఛిల్లుటయున్= సొమ్మసిల్లిపోగా; ఆ+కుంతీ నందన+అగ్రజుండు= కుంతి కొడుకులలో పెద్ద అయిన ధర్మరాజు; ఆర్తిన్= దుఃఖం; ఒంది= పొంది; ఇట్లు+అని= ఈ విధంగా; పలవించెన్= దుఃఖించాడు.

తాత్పర్యం: ధర్మరాజుతో పైవిధంగా పలికిన ధృతరాష్ట్రుడు విదుర, కృప, సంజయులతో 'నాకు నాలుక తడి ఆరిపోతున్నది. శ్రమవలన శరీరం దుర్బల మవుతున్నది' అని, నాలుక తడబడుతుండగా 'ఇక మీరే ధర్మరాజుకు ఊరటపు మాటలు చెప్పి విచారం పోగొట్టండి' అని చెప్పి దాహం ఎక్కువ కావటంతో గాంధారి శరీరాన్ని ఆసరా చేసికొని స్పృహ తప్పిపోయాడు. ధర్మరాజు అది చూచి దుఃఖంతో ఇట్లా అన్నాడు.

విశేషం: విదురాదులు జ్ఞానులు, మాట నేర్పరులూ, పాండవులపై అభిమానం కలవారూ కాబట్టి వాళ్ళు జాగ్రత్తగా ధర్మరాజుకు అమోదయోగ్యంగా మాటాడగలరు. తనకంటె వాళ్ళ మాటలు ధర్మరాజు ఆప్తవాక్యంగా స్వీకరించనూ గలడు. కాబట్టి ధర్మరాజును సాంత్వనపరిచే బాధ్యత వారి కప్పగించాడు. ఉభయులకూ కావలసినవారు కాబట్టి తన అభిప్రాయాన్ని ధర్మరాజుకు నచ్చేటట్లుగా చెప్పుతారని. ధర్మరాజును అజాత శత్రువుగా పేర్కొనడంలో ధర్మరాజుకు తమపై శత్రుభావం ఉండదని మెచ్చుకోలూ, స్నేహంగా తమ అరణ్యవాసానికి అంగీకరించాలని సూచన. తనకు ముఖశోష, తనుగ్లానీ ఉన్నవన్నాడు. దానివలన నాలుక తొట్రుపాటూ, చివరికి మూర్ఛా కలిగాయి. కార్యకారణభావం కుదిరింది. మూర్ఛాస్థితి రావడం ముందుగా గుర్తించటం వలన గాంధారిని ఆశ్రయించాడు.

క. **కరి దశసహస్ర బలవి। స్ఫురితుఁ డగు విచిత్రవీర్యపుత్త్రుఁ డొక తలో**
దరి నూఁత గొనియె; విధి యె। వ్వరి హీనులఁ జేయఁ డకట వక్రుం డైనన్! **40**

ప్రతిపదార్థం: కరి= ఏనుగులు; దశసహస్ర= పదివేలయొక్క; బల= శక్తిచే; విస్ఫురితుఁడు= వెలిగేవాడు; అగు= అయిన; విచిత్ర వీర్య పుత్త్రుఁడు= విచిత్రవీర్యుడి కొడుకు ధృతరాష్ట్రుడు; ఒక తలోదరిన్= ఒకానొకస్త్రీని; ఊఁత కొనియెన్= ఆధారం చేసికొని ఉన్నాడు; అకట!= అయ్యో!; విధి= బ్రహ్మ; వక్రుండు= వంకర; ఐనన్= అయితే; ఎవ్వరిన్= ఎంతటివారిని; హీనులన్= అల్పులుగా; చేయఁడు?

తాత్పర్యం: పదివేల యేనుగుల బలం కలిగిన ధృతరాష్ట్రుడు ఈనాడు ఒక అబలను ఆధారం చేసికొనవలసి వచ్చింది. బ్రహ్మ సరిగా చూడకపోతే ఎంతటి గొప్ప వాళ్ళనైనా మిక్కిలి హీనస్థితికి తెస్తాడు.

విశేషం: అలం; అర్థాంతరన్యాసం. (సామాన్యంచేత విశేషం సమర్థింపబడుతుంది.)

చ. **'అనిలజు మేని చంద మగు నాయసరూపము చూర్ణితంబు చే**
సిన బలమాననీయుఁ డొక చేడియ నక్కట; యాశ్రయించె; నే
మనఁగల దవ్విధాతృ' నని యాతని కీడును మానసంబునం
జొనుపమి లావు పేరుకొని శోకము ధర్మజుఁ డొందె భూవరా! **41**

ప్రతిపదార్థం: అనిలజు= వాయుపుత్రుడి; మేని చందము= శరీరము వంటిది; అగు= అయిన; ఆయసరూపము= ఉక్కు విగ్రహాన్ని; చూర్ణితంబు= పొడి అయ్యేటట్లుగా; చేసిన= చేసినట్టి; బల-మాననీయుఁడు= శక్తిచే ప్రశంసించ దగిన ధృతరాష్ట్రుడు; అక్కట= అయ్యో; ఒక చేడియన్= ఒకానొక ఆడదాన్ని; ఆశ్రయించెన్= అండగా చేసుకున్నాడు; ఆ+విధాతృన్= (అంతటి బలవంతుడి కీ గతి కల్గించిన) ఆ బ్రహ్మనుగూర్చి; ఏమి+అనన్+కలదు?= ఏమనవచ్చు?; అని= అని పలికి; భూవరా!= ఓ జనమేజయ మహారాజా!; అతని కీడును= ధృతరాష్ట్రుడు చేసిన అపకారాన్ని; తన మానసంబునన్= తన మనస్సులో; చొనుపమి= పెట్టుకోకపోవడంచేత; ధర్మజుఁడు= ధర్మరాజు; లావు= ధృతరాష్ట్రుడి బలాన్ని; పేరుకొని= ప్రశంసిస్తూ; శోకము= దుఃఖాన్ని; ఒందెన్= పొందాడు.

తాత్పర్యం: 'భీముడి రూపంలో ఉన్న ఉక్కు విగ్రహాన్ని పొడిగా చేసిన బలవంతుడైన ధృతరాష్ట్రుడు ఇపుడు ఒక ఆడదానిని ఆధారం చేసికొనవలసివచ్చింది. అంతటి బలవంతుడి కింతటి హీనస్థితిని తెచ్చిన విధాతను ఏ మనగలం?' అంటూ జనమేజయా ! ధృతరాష్ట్రుడు చేసిన అపకారాన్ని మనసులో పెట్టుకొనకపోవటం వలన అతడి బలాన్ని తలచుకొని ధర్మరాజు అతడి ప్రస్తుతస్థితికి దుఃఖపడ్డాడు.

సీ. **అప్పుడు గాంధారి యల్లన ధర్మజు। తోడ 'మీతండ్రి యతుల తపంబు**
తోడి సంతతచింతఁ గూడు దొఱంగి తా। నుండుటఁ గూర్చుండ నోప కునికి
నిట్లయ్యె' ననవుడు నెవ్వని కతమున। నిమ్మహాత్మున కిట్టి యెడరు పుట్టె
నట్టి నా మనువు నే మనఁ గల?' దంచు నా। తఁడు శీతజలము హస్తమునఁ బుచ్చి

ఆ. కొని యతని మోమునందు నక్కున విదిర్చు । సమయమున విదురుండును సంజయుండు
నఖిలభరతభార్యలు నేడ్చి రవ్విభుండు । నివిరెఁ జలికేల నా నృపు నవయవములు. 42

ప్రతిపదార్థం: అప్పుడు= ధర్మరాజు దుఃఖిస్తున్న సమయంలో; గాంధారి= ధృతరాష్ట్రుడి భార్య; ధర్మజుతోడన్= ధర్మరాజుతో; అల్లనన్= మెల్లగా; (ఇట్లా అంటున్నది); మీ తండ్రి= ధృతరాష్ట్రుడు; అతుల తపంబుతోడి= సాటిలేని తపస్సుతో కూడిన; సంతత చింతన్= నిరంతరమైన ఆలోచనతో; తాను= తానుగా; కూడు= భోజనం; తొఱంగి= విడిచి; ఉండుటన్= (రోజులు గడుపుతూ) ఉండటం వలన; కూర్చుండన్= కూర్చోవడానికి; ఓపక= శక్తి చాలని; ఉనికిన్= స్థితిలో; ఇట్లు= ఈ విధంగా మూర్ఛిల్లినవాడు; అయ్యెన్= అయినాడు; అనవుడున్= అని గాంధారి చెప్పగా; అతఁడు= ఆ ధర్మరాజు; ఎవ్వని కతమునన్= ఎవరు కారణంగా; ఈ+మహాత్మునకున్= ఈ పెద్దవాడికి, (ధృతరాష్ట్రుడికి); ఇట్టి+ఎడరు= ఇటువంటి కష్టం; పుట్టెన్= కలిగిందో; అట్టి= (ధృతరాష్ట్రుడి ఈ కష్టానికి కారణమైన) అటువంటి; నా మనువున్= నా బ్రతుకు గూర్చి; ఏమి అనన్ కలదు?= చెప్పేది ఏముంది; అంచున్= అంటూ; హస్తమునన్= తన చేత్తో; శీతజలమున్= చల్లటి నీళ్ళను; పుచ్చికొని= తీసికొని; అతని= ఆ ధృతరాష్ట్రుడి; మోమునందున్= ముఖంపైన; అక్కునన్= గుండెలపైన; విదిర్చు సమయంబునన్= (విదిలించే) చల్లేటప్పుడు; విదురుండును= విదురుడూ; సంజయుండున్= సంజయుడూ; అఖిల భరత భార్యలు= ఆ భరతవంశజులందరి భార్యలూ; ఏడ్చిరి= విలపించారు; ఆ+విభుండు= ఆ ధర్మరాజు; ఆ నృపు అవయవములు= ధృతరాష్ట్రుడి శరీర భాగాలను; చలికేలన్= చల్లని నీళ్లచేతితో; నివిరెన్= నిమిరాడు.

తాత్పర్యం: అప్పుడు మెల్లగా గాంధారి ధర్మరాజుతో ఇట్లా అన్నది; 'మీ పెదతండ్రి గాఢ తపస్సును గురించి ఎల్లప్పుడూ ఆలోచిస్తూ తిండితినటం మానేసి ఉండటం వలన కూర్చుండలేకపోతున్నారు. అందులన ఇట్లా అయింది: ఆ మాటలు విని ధర్మరాజు 'ఈ మహాత్ముడికి నావలననే ఈ ఇబ్బంది కలిగిం'దని విచారించి చల్లని నీటిని చేతితో తీసికొని ధృతరాష్ట్రుడి ముఖంమీదా, గుండెలమీదా చిలకరించాడు. ఆ సమయంలో విదురుడూ, సంజయూడూ, భరతవంశపురాణులు కంటతడి పెట్టారు. ధర్మరాజు చల్లని చేతితో ఆ వృద్ధనృపతి శరీరాన్ని మెల్లగా నిమిరాడు.

క. నివురంగఁ దెలిసి యతనిం । గవుఁగిటిలోఁ జేర్చి మస్తకము మూర్కొను కౌ
రవవృద్ధు నతఁడు నా శ్లే । ష విశేషంబున నొనర్చె సంప్రీతునిఁగన్. 43

ప్రతిపదార్థం: నివురంగన్= ధర్మరాజు చల్లని చేతులతో ఒళ్ళంతా నిమరడం వలన; తెలిసి= ధృతరాష్ట్రుడికి తెలివి రాగా; (మూర్ఛనుంచి తేరుకొనగా); అతనిన్= ఆ ధర్మరాజును; కవుఁగిటిలోన్= తన కౌగిటిలో; చేర్చి= ఉంచి; మస్తకమున్= ధర్మరాజు తలను; మూర్కొను= ఆఘ్రాణిస్తున్న; కౌరవవృద్ధున్= కౌరవవంశంలో పెద్ద అయిన ధృతరాష్ట్రుడిని; అతఁడు= ఆ ధర్మరాజు; ఆశ్లేషవిశేషంబునన్= అతిశయించిన (దృఢమైన) కౌగిలితో; సంప్రీతునిఁగన్= సంతోషించినవాడిగా; ఒనర్చెన్= చేశాడు.

తాత్పర్యం: ఆ విధంగా ధర్మరాజు చల్లటినీళ్ళు ముఖం మీద గుండెలమీద చల్లి, ఆ చల్లటి చేతులతో ఒళ్ళంతా నిమరటంతో ధృతరాష్ట్రుడు మూర్ఛనుంచి తేరుకొని, ధర్మరాజును కౌగిలించుకొని అతడి శిరస్సు నాఘ్రాణించాడు. అపుడు ధర్మరాజు కూడా ధృఢమైన కౌగిలితో ధృతరాష్ట్రుడిని సంతోషపెట్టాడు.

వ. అట్లు తెలివొంది ధృతరాష్ట్రుండు ధర్మరాజుతో 'నా కెట్లునుం దపంబునకయి కాననంబునకుం బోవ వలయు' ననిన నజ్జనపతి, 'నీ వారగింపు; మప్పని మఱి చెప్పెద' నని త్రోపు మాటగాఁ బలికిన నయ్యాంబికేయుండు

'పెక్కుమాట లాడ శక్తి లేదు; న న్నింక నలజడిఁ బెట్టకుము; తపశ్చరణంబునకు నీ యాజ్ఞ వడసి కాని కుడువ' ననియె; నయ్యవసరంబున సాత్యవతేయుండు కృపావిధేయుండై యచటికి వచ్చి సకలజనంబుల వినతులు గైకొని దీవన లిచ్చి యా ధర్మతనయు నాననం బాలోకించి. 44

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; అట్లు= ఆ విధంగా ధర్మరాజుపరిచర్యలవలన; తెలివి= జ్ఞానాన్ని; ఒంది= పొంది; ధర్మరాజుతోన్= ధర్మరాజుతో; (ఇట్లా అన్నాడు)? నాకున్= నాకు, ఎట్లునున్= ఏ విధంగా నయినా; తపంబునకయి= తపస్సు చేసికొనే నిమిత్తం; కాననంబునకున్= అరణ్యానికి; పోవ(న్) వలయున్= తప్పకుండా వెళ్ళవలసిందే; అనినన్= అనగా; ఆ+జనపతి= ఆ (ధర్మ) రాజు; నీవు= నీవు (ధృతరాష్ట్రుడు); ఆరగింపుము= భోజనం చేయవలసింది; ఆ+పని= మీరు అరణ్యాలకు వెళ్ళే పనిని గురించి; మఱి= తరువాత; చెప్పెదన్= చెప్తాను; అని= అంటూ; (త్రోపు) మాటగాన్= అవతలకు త్రోయదగిన అతనిమాటను తోసిపుచ్చేవిధంగా; ధృతరాష్ట్రుడి మాట ప్రక్కకు నెట్టి; పలికినన్= ధర్మరాజు పలుకగా; ఆ+ఆంబికేయుండు= ఆ ధృతరాష్ట్రుడు; పెక్కు మాటలు ఆడన్= ఎక్కువగా మాటాడడానికి; శక్తి= సత్తువ; లేదు= నాకు లేదు; ఇంకన్= ఇంకా; నన్నున్= నన్ను; అలజడిన్= కలవరం; పెట్టకు= పెట్టవద్దు; తపస్+చరణంబునకున్= తపస్సు ఆచరించుకొనటానికి; నీ+ఆజ్ఞ= నీ మాట; పడసి= పొంది; కాని= తప్ప; కుడువన్= భోజనం చేయను; అనియెన్= అన్నాడు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; సాత్యవతేయుండు= సత్యవతి కొడుకు అయిన వ్యాసమహర్షి; కృపావిధేయుండు+ఐ= దయకు లోబడినవాడై (దయతో); అచటికిన్= ధృతరాష్ట్రాదుల వద్దకు; వచ్చి= వచ్చి; సకల-జనంబుల-వినతులు= అక్కడ వున్నవారి అందరిచేతా ప్రణామాలు; కైకొని= గ్రహించి; దీవనలు= వారికి ఆశీస్సులు; ఇచ్చి= కలుగజేసి; ఆ+ధర్మతనయు-ఆననంబు= ఆ ధర్మరాజు ముఖాన్ని; ఆలోకించి= చూచి (ఇట్లా అన్నాడు) అని (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: ఆ విధంగా ధర్మరాజు పరిచర్యలతో మూర్ఛ తేరుకొన్న ధృతరాష్ట్రుడు 'ఎలాగైనా సరే తపస్సు చేసుకొనటానికి నేను అడవికి పోవలసిందే' నన్నాడు. అపుడు ధర్మరాజు ముందు భోజనం చేయండి. ఆ విషయం తర్వాత చూద్దా' మని ధృతరాష్ట్రుడి మాటలను త్రోసి పుచ్చాడు. అపుడు 'ధృతరాష్ట్రుడు నేను ఎక్కువ మాటాడలేను. నన్ను ఇబ్బంది పెట్టకుము. (అరణ్యగమనానికి) తపస్సు చేసుకొనటానికి నీవు సెలవిచ్చే వరకు భోజనం చేయను' అన్నాడు. అటువంటి సమయంలో అక్కడికి వ్యాసమహర్షి వచ్చాడు. అక్కడ ఉన్న జనమంతా ఆయనకు వినమ్రంగా నమస్కరించారు. వ్యాసుడు వారిని దీవించాడు. ధర్మరాజు ముఖం చూసి అతడితో ఇట్లా అన్నాడు.

వ్యాసుఁడు ధృతరాష్ట్రు వనవాసంబున కనుజ్ఞ యిచ్చుట (సం.15-8-1)

సీ. **'ఆంబికేయుఁడు చెప్పినట్టుల చేయుము। వృద్ధుఁడు నాత్మజ విరహితుండు**
నైన యీతఁడు తప మాచరింపఁగఁ గోర। కున్నె? గాంధారి శోకోపశమము
తాలిమి నొదవి యుండాఁకఁ బ్రవర్తించె;। నింక నియ్యమకును నిదియ తలఁపుఁ
గావున నీకు నీ కార్యంబు చెప్పంగ। వచ్చితి; వీరిఁ బోనిచ్చు టొప్పు

తే. **ననఘ! పూర్వ రాజన్యులు చనినయట్టి। సౌమ్యపథమున నీ రాజు చనుట మేలు**
గాన నీతని కానన గమనమునకు। ని మ్మనుజ్ఞ విచారంబు లెల్లఁ దక్కి. 45

ప్రతిపదార్థం: అనఘ!= పాపం ఎరుగని వాడా! ధర్మరాజా!; ఆంబికేయుఁడు= ధృతరాష్ట్రుడు; చెప్పిన+అట్టులు+అ= చెప్పిన ప్రకారంగానే; చేయుము= చేయవలసింది; వృద్ధుఁడు= పెద్దతనం వచ్చినవాడూ; ఆత్మజ-విరహితుండు= కొడుకులను పోగొట్టుకున్నవాడూ; ఐన ఈతఁడు= అయినటువంటి ధృతరాష్ట్రుడు; తపము= తపస్సు; ఆచరింపఁగన్= చేసుకొనాలని; కోరక+ ఉన్నె?= కోరుకోకుండా ఉంటాడా!; గాంధారి= గాంధారి కూడా; శోక+ఉపశమము= దుఃఖం యొక్క ఉపశమనాన్ని; తాలిమిన్= ఓర్పుతో; ఒదవి= పొంది; ఇందాఁకన్= ఇంతవరకూ; ప్రవర్తించెన్= నడుచుకొన్నది; ఇంకన్= ఇక పైన; ఈ+అమకునున్= ఈవిడకు (గాంధారికి) కూడా; తలఁపు= ఆలోచన; ఇది+అ= ఇదే (తపస్సు చేసికొనాలనే); కావునన్= అందుచేత; ఈకార్యంబు= ఈ పని (ఈమాట); నీకున్= నీతో; చెప్పంగన్= చెప్పటానికి; వచ్చితిన్= (నీవద్దకు) వచ్చాను; వీరిన్= ఈ గాంధారీ ధృతరాష్ట్రులను; పోన్+ఇచ్చుట= పోనివ్వటం; ఒప్పును= (నీకూ తగును) మంచిది; ఈ రాజు= ఈ ధృతరాష్ట్రుడు; పూర్వరాజన్యులు= (మనవంశంలోనూ) పూర్వులైన రాజశ్రేష్ఠులు; చనిన= వెళ్ళిన; అట్టి= అటువంటి; సౌమ్యపథమునన్= తిన్ననైన (గంతవ్యమగు), మంచిమార్గంలో; చనుట= వెళ్ళటం; మేలు= మంచిది; కానన్= అందుచేత; ఎల్లన్= సమస్తములైనటువంటి; విచారములు= బాధలూ, (ఆలోచనలు); తక్కి= విడిచిపెట్టి; ఈతని - కానన - గమనమునకున్= ఈ ధృతరాష్ట్రుడు, అడవులకు వెళ్లడానికి; అనుజ్ఞన్= అనుమతిని; ఇమ్ము= ఇవ్వవలసినది.

తాత్పర్యం: పాపరహితుడా! ధృతరాష్ట్రుడు కోరినట్లు చేయుము; పెద్దతనం వచ్చింది. పైగా పిల్లలు దూరమైనవాడు తపస్సు కోరుకొనటం తప్పదు. గాంధారి కూడా ఓర్పుతో ఇన్నాళ్ళూ దుఃఖం అణచుకొన్నది. ఇపుడు ఆమె కూడా భర్తతో తపస్సు చేసుకొనటమే కోరుతున్నది. అందువలన నీ కొక మాట చెప్పుదామని నేనిక్కడికి వచ్చాను. వీళ్ళను అడవులకు పోనివ్వటం మంచిది. పూర్వపు రాజులవలె చివర్లో, వీళ్ళూ అడవులకు వెళ్ళి ఉత్తమగతులను పొందటమే శ్రేయం. ఇంక నీవు ఏ విచారమూ పెట్టుకొనకుండా వీళ్ళకు అరణ్యాలకు వెళ్ళటానికి అనుమతి ఇమ్ము.

విశేషం: అనఘ అనే సంబోధన అనుమతి నీయకపోవటం అనే అఘం చేయవద్దని తెలుపుతుంది. యుద్ధంలో చావటమో, తపస్సుతో చావటమో అవసరమన్న ధృతరాష్ట్రుడి మాటలని (27) కొంత అనువదిస్తున్నాయి. ఇక్కడి పూర్వరాజన్యులు చనిన యట్టి సౌమ్య (సౌఖ్య అనే ముద్రిత పాఠంకంటె సౌమ్యపాఠం సందర్భోచితం) పథమున నీ రాజు చనుట మేలు అనే వ్యాసవచనాలు అన్నాడు. ధర్మరాజుకు కూడా పుత్రశోకంతో పురంలోనే అన్నపానాలు లేక కళ్ళ ఎదుట మరణించాడనటం కంటే తపశ్చర్యవలన అరణ్యాలలో (పరోక్షంగా) ప్రాణాలు విడిచాడనే పేరు ధృతరాష్ట్రుడికే కాక ధర్మరాజుకూ మేలే. 'కానన్' అందుకు - ఆ కారణంగా అనుజ్ఞ ఇమ్మంటున్నాడు వ్యాసుడు. ధృతరాష్ట్రుడక్కడ అస్మదీయకుల ముఖ్యులు, (27) అంటే వ్యాసుడిక్కడ 'పూర్వరాజన్యులు' అని సామాన్యం చేశాడు. తెలుగులో ఉన్న 'మన' (నీవూ - నేనూ) అనే అర్థం ఇచ్చే శబ్దం సంస్కృతంలోనే చెప్పవలసి వస్తే అస్మదర్థకాన్ని తొలగించి 'పూర్వ రాజన్యులు' అని సామాన్యంగా చెప్తే అది మన శబ్దార్థాన్ని తెలుపుతుంది. ధృతరాష్ట్రుడు ప్రయోగించిన అస్మచ్ఛబ్దంతో అర్థం సంకోచించుకుపోతే అది తొలగించిన వ్యాసవచనం సముచితంగా ఉభయార్థ సాధకం అయింది. పద్యంలో చివరిమాట 'విచారంబు లెల్లఁ దక్కి' 'ధర్మతనయు నాననం బాలోకించి' (44) మాటాడుతున్న వ్యాసుడికి ఇన్ని చెప్పి ముగించాడు. అపుడే (విచారం విడిచినపుడే) తన మాటలతో సారం ధర్మరాజు తెలిసికొనగలుగుతాడు.

క. నీ వినయము భక్తియు, సం । భావనమును వీరి వగలఁ బాపఁగ శుశ్రూ
షావశవర్తిత నడచితి । భూవర! చిరకాల మింకఁ బోనిమ్ము తగన్. 46

ప్రతిపదార్థం: భూవర!= (ధర్మ) రాజా!; నీ, వినయము(న్)= నీయొక్క, అణకువా; భక్తియు(న్)= నీ సేవా తత్పరతా; సంభావనమును= నీవు చూపే గౌరవమూ; వీరి= గాంధారీ ధృతరాష్ట్రుల యొక్క; వగలన్= బాధలను; పాపఁగన్= పోగొట్టగా,

(పోగొట్టునట్లుగా); చిరకాలము= చాలాకాలం; శుశ్రూషా - వశ - వర్తితన్= వీరు చెప్పిన ప్రకారంగా నడుచుకునే స్థితికి లోబడి ఉంటూ; నడచితి(వి)= వ్యవహరించావు; ఇంకన్= ఇక పైన; తగన్= సముచితంగా; పోన్+ఇమ్ము= వీళ్ళని, అడవికి పోనిమ్ము.

తాత్పర్యం: ధర్మరాజా! నీ అణకువా, భక్తీ, గౌరవమూ వీరికి అన్ని బాధల్ని పోగొట్టింది. చాలా కాలం నుండి ఈవిధంగా వీరికి శుశ్రూష చేస్తూ ఉన్నావు. ఇక వీళ్ళను అడవులకు పోనిమ్ము.

చ. అన విని యాకురుప్రవరుఁ డమ్మునివల్లభుమోముఁ జూచి యి
ట్లను - మహితాత్మ! మాకు గురుఁ డన్నను ధర్మవిధోపదేష్ట య
న్నను బరదైవ మన్నను మనః ప్రియకార్యకలాపకర్త య
న్నను విను నీవ; నీదువచనంబున కడ్డము పల్కువాఁడనే?' 47

ప్రతిపదార్థం: అనన్= వ్యాసమహర్షి ఆ విధంగా పలుకగా; విని= ఆలకించి; ఆ కురుప్రవరుఁడు= కురువంశంలో శ్రేష్ఠుడైన ఆ ధర్మరాజు; ఆ+ముని వల్లభు= మునిశ్రేష్ఠుడైన ఆ వ్యాసుడి; మోమున్= ముఖాన్ని; చూచి= చూచి; ఇట్లు= ఈ ప్రకారంగా; అనున్= అంటున్నాడు; మహిత+ఆత్మ= గొప్ప మనసు కలిగిన వాడా; విను= వినవలసింది; మాకున్= మా అందరికీ; గురుఁ డు+అన్నను= గురువు అయినా; ధర్మ-విధా-ఉపదేష్ట అన్నను= ధర్మముయొక్క తీరును బోధించేవాడు అయినా; పరదైవము+అన్నను= సర్వోత్కృష్టమైన దేవుడు అయినా; మనస్= మనస్సుకు; ప్రియ= ఇష్టమైన (ఇష్టం కలిగించే); కార్య= పనులయొక్క; కలాప= సమూహానికి; కర్త= చేసేవాడు; అన్నను= అయినా; నీవు+అ= నీ వొక్కడివే; నీదు - వచనంబునకున్= అటువంటి నీమాటలకు; అడ్డము= వ్యతిరేకంగా; పల్కువాఁడను+ఏ= చెప్పేటంతటి వాడను కాను.

తాత్పర్యం: వ్యాసమహర్షి ఆ విధంగా అనగా ధర్మరాజు వ్యాసుడి ముఖం చూస్తూ ఇట్లా అన్నాడు. 'మహానుభావా! మాకు గురు వైనా; ధర్మం చెప్పేవాడవైనా, దేవుడివైనా, మా మనసులు సంతోషించే పనులు చేసేవాడివైనా నీవే. అటువంటి నీ మాటలకు భిన్నంగా నేను ఏమీ అనగలిగినవాడిని కాదు.

ఆ. అనిన నమ్మహాత్ముఁ డను 'రాజులకు రణ। మరణ మొండె దృఢ సమాధిఁ దనువు
విడుచు టొండెఁ గాక వృద్ధులై రోగ త। ల్పమునఁ జావు మేలె భరతముఖ్య!' 48

ప్రతిపదార్థం: అనినన్= ధర్మరాజు ఆ విధంగా అనగా; ఆ+మహాత్ముఁడు= మహానుభావుడైన వ్యాసుడు; అనున్= ధర్మరాజుతో ఇట్లా అన్నాడు; భరతముఖ్య!= భరతవంశంలో ప్రధానుడివైన ధర్మరాజా!; రాజులకున్= క్షత్రియులకు; రణ మరణము= యుద్ధంలో తనువు చాలించటం, ఒండెన్+కాని; (లేదా) దృఢ సమాధిన్= నిశ్చలమైన తపస్సు (ఏకాగ్ర ధ్యానం)తో; తనువున్= శరీరాన్ని; విడుచుట= వదలిపెట్టటం, ఒండెన్= కాని; కాక= అంతే తప్ప; వృద్ధులు+ఐ= పెద్దవారు అయిన తర్వాత; రోగతల్పమునన్= వ్యాధులతో మంచాన; చావు= మరణించటం; మేలు+ఎ?= మంచిదా?.

తాత్పర్యం: ధర్మరాజు అట్లా అనగా అతడితో వ్యాసుడు ఇట్లా అన్నాడు. 'భరతకులంలో ప్రధానుడివైన ధర్మరాజా! రాజు అయినవాడికి యుద్ధంలో సంభవించే చావో, కాకపోతే నిశ్చలమైన ధ్యానంతో కలిగే మరణమో మేలు. అంతే కాని ముసలితనం వచ్చాక రోగాలతో మంచానపడి చావటం మేలా?

వ. అనిన విని ధర్మతనయుం డొండు పలుక వెఱచి యిట్లనియె. 49

ప్రతిపదార్థం: అనినన్= అని వ్యాసుడు అనగా; ధర్మతనయుండు= ధర్మరాజు; విని= ఆలించి; ఒండు= దానికి భిన్నంగా; పలుకన్= మాటాడటానికి; వెఱచి= భయపడి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: వ్యాసుడట్లా అనగా విని ధర్మరాజు ఇంకొకమాట మాటాడడానికి భయపడి ఇట్లా అన్నాడు.

క. అనఘా! యిక్కురుముఖ్యున। కనుజ్ఞ యే నిచ్చితిని మహత్తర మగు మీ
యనుమతియుఁ బడసెఁ జనుఁ గా। క నిజేచ్ఛను నాకు విఘ్నకరణముఁ దగునే?' 50

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!; ఏన్= నేను; ఈ+కురుముఖ్యునకున్= కురువంశంలో ప్రధానుడైన ఈ ధృతరాష్ట్రుడికి; అనుజ్ఞన్= అడవులకు వెళ్లేందుకు అనుమతిని; ఇచ్చితిని= ఇచ్చేశాను; మహత్తరము= అంతకంటె గొప్పది; అగు= ఐన; మీ అనుమతియున్= తమయొక్క అంగీకారం కూడా; పడసెన్= (ఈ ధృతరాష్ట్రుడు) పొంది ఉన్నాడు; నిజ ఇచ్ఛను= తన ఇష్టప్రకారంగానే; చనున్ కాక= అడవులకు వెళ్ళుతాడు. నాకున్= నాకు; విఘ్నకరణమున్= అడ్డు పెట్టటం; తగునే?= తగదు కదా!

తాత్పర్యం: పాపరహితుడైన వ్యాసమహర్షీ! ఈ ధృతరాష్ట్రుడి అరణ్య గమనానికి అనుజ్ఞ ఇచ్చాను. అంతకంటె మహిమ గలిగిన మీ అనుమతి కూడా వీరికి లభించింది. కాబట్టి ఇక తన ఇష్ట ప్రకారంగానే అడవులకు వెళ్ళవచ్చును. నేను అడ్డంపడటం తగదు కదా!

విశేషం: ధర్మరాజుది 'అనుజ్ఞ' - ధృతరాష్ట్రుడు స్వయంగా కోరుకొన్నదానికి అడ్డుచెప్పకుండా ఉండటమే. (స్వయం ప్రవృత్తస్య అన్యస్య ప్రవృత్తి విఘాతాకరణేన ప్రవర్తనారూ పానుమతిః అనుజ్ఞ యేని - ఇచ్చితిన్ - అనుజ్ఞ మాత్రమే అయితే ఇచ్చేశాను. ఆజ్ఞలాంటి వైతే ఇచ్చే అధికారం లేదు - ఇవ్వనని తాత్పర్యం. ధర్మరాజు అనుజ్ఞ లాంఛనం. వ్యాసానుమతి మహిమాన్వితం మహత్తరం. తరప్ప్రత్యయంతో వ్యాసానుమతి ఆధిక్య సూచన, రాజానుమతి తర్వాత కులవృద్ధుగా వ్యాసుడి అనుమతి మరోవిధంగానూ మహత్తే 'నిజేచ్ఛను చనుఁ గాక, నాకు విఘ్నకరణముఁ దగునే' అనేది తెలుగునుడికారానికి సంస్కృతీకరణం.

సీ. అనుటయుఁ బ్రియ మంది యమ్మహాముని యమ్మ। హీశ్వరుతోఁ 'బాండుఁ డీ నృపాలు
గద్దియ నిడికొని క్రతువులు సేయించి। యవిరళభోగానుభవము నడపి
యూతని వారలఁ బ్రీతి నీక్షించి తా। శిష్యుండ పోలె సంసేవనంబు
భక్తిమై నొనరించెఁ; బదపడి నీవును। దిగ్విజయాదులఁ దేజమితని

తే. నొందునట్లుగఁ జేసితి వొకటఁ; బిదప। దాన పదుమూఁడు వర్షముల్ ధరణి యేలె;
నీవు శుశ్రూష యిత్తఱి నియతి నడపి। తితని మది లేదు కలఁక యొక్కింత యేని. 51

ప్రతిపదార్థం: అనుటయున్= ధర్మరాజు అట్లా అనగానే; ఆ+మహాముని= ఆ వ్యాసమహర్షి; ప్రియము+అంది= సంతోషించి; ఆ+మహీశ్వరుతోన్= ఆ (ధర్మ) రాజుతో, - ఇట్లా అన్నాడు; ఈ నృపాలున్= ఈ రాజును (ధృతరాష్ట్రుడిని); గద్దియన్= సింహాసనంపై; ఇడికొని= కూర్చుండబెట్టి; పాండుఁడు= మీ తండ్రి పాండు మహారాజు; క్రతువులు= యజ్ఞాలు; చేయించి=

ధృతరాష్ట్రుడి చేత చేయించి; అవిరళ - భోగ - అనుభవము= ఎడతెరపి లేని (నిరతరాయంగా) సుఖాలను పొందే స్థితిని; నడపి= (ధృతరాష్ట్రుడికి) ఏర్పాటు చేసి; ఈతని వారలన్= ధృతరాష్ట్రుడి మనుష్యులను; ప్రీతిన్= ప్రేమగా; ఈక్షించి= చూస్తూ; తాన్= తాను; శిష్యుండు+అ+పోలెన్= శిష్యుడే అన్నట్లుగా; భక్తిమైన్= భక్తితో; సంసేవనంబు= ఈ ధృతరాష్ట్రుడికి సేవలను; ఒనరించెన్= చేశాడు; పదపడి= తర్వాత; నీవును= నీవు కూడా; ఒకటన్= ఏకాగ్రతతో; దిగ్విజయ+ఆదులన్= రాజ్యం విస్తరింపజేయటం మొదలైన వాటివలన; ఇతనిన్= ఈ ధృతరాష్ట్రుడిని; తేజము= కీర్తి; (ప్రతాపం) ఒందునట్లుగన్= ప్రాపించే విధంగా; చేసితివి= చేశావు; పిదపన్= ఆ తరువాత; తాను+అ= తానే, స్వయంగా; పదుమూడు వర్షముల్= (పాండవులు వనవాసం చేసిన) పదమూడు సంవత్సరాలు; ధరణి= ఈ రాజ్యాన్ని; ఏలెన్= పాలించాడు; ఇత్తఱిన్= భారత యుద్ధానంతరం; శుశ్రూష= సేవ; నడపితి(వి)= చేశావు; ఇతని మదిన్= ఈ ధృతరాష్ట్రుడి మనసులో; కలఁక= విచారం; ఒక్క+ఇంత+ఏని= ఏ కొంచెం కూడా; లేదు= లేదు.

తాత్పర్యం: ధర్మరాజు అట్లా అనగానే వ్యాసుడు సంతోషించి ధర్మజుడితో ఇట్లా అన్నాడు. 'మీ తండ్రి పాండురాజు ఈ ధృతరాష్ట్రుడిని సింహాసనం మీద కూర్చోబెట్టి ఇతడి చేత ఎన్నో యజ్ఞాలు చేయించాడు, నిరంతరంగా సుఖాలు అనుభవింపజేశాడు. ఇతడి బంధువులను గూడా ప్రేమగా చూశాడు. గురువుకు శిష్యుడివలె ధృతరాష్ట్రుడిని పాండురాజు భక్తితో సేవించాడు. మీ తండ్రి తర్వాత నీవు గూడా దిగ్విజయంతో రాజ్యాన్ని విస్తరింపజేసి ధృతరాష్ట్రుడి కీర్తినీ, ప్రతాపాన్నీ పెంపొందించావు. తర్వాత (మీరు) అరణ్యవాసం చేసిన పదుమూడేండ్లు (దుర్యోధనుడు రాజైనపుడు) తనే ఈ రాజ్యాన్ని పాలించాడు. భారతయుద్ధం అయి రాజయ్యాక నీవు ఎంతో నియమంగా ఇతడికి శుశ్రూష చేశావు. ఈ ధృతరాష్ట్రుడికి మనసులో గూడా కొంచెమైనా కలత లేదు.

విశేషం: ధృతరాష్ట్రుడి వనవాసానికి 'అనుజ్ఞ ఇచ్చితివి' అని ధర్మరాజనటం వలన వ్యాసుడు ప్రియ మందాడు. తాను వచ్చిన పని అయినట్లే. ధర్మరాజు చేత ఆ మాట అనిపించటంలో వ్యాసుడు చాల శ్రమించాడన్నమాట. ఇది ధర్మజుడికి ధృతరాష్ట్రుడిపై గల అభిమానాధిక్యాన్ని సూచిస్తుంది. 'మహత్తర మగుమీయనుమతియుఁ బడసె' అని తనను గౌరవించటంతో, ధర్మరాజు ధర్మశీలానికి 'ప్రియము' తర్వాత వీడు కొలువు మాటల వలె చెప్పినా అందులోనూ ధర్మరాజును అనునయించటం ఉన్నది. అన్నిరకాలుగా సుఖాలు అనుభవించాడు గాబట్టి ధృతరాష్ట్రుడికి 'మదిన్ కలఁక ఒక్కింత యేని లేదు.' మాటలలో చెప్పకపోయినా మనసులో లేదని అర్థం. మదిన్ ఏని= మనసులో కూడా ఏ మాత్రమూ బాధ లేదు. 'ఇతని మది లేదు' - అనటంలో 'ఇతని' శబ్దం నీకు మనసులో కలఁక ఉన్నది (ధృతరాష్ట్రుడు దుఃఖిస్తున్నాడని) కాని ధృతరాష్ట్రుడికి మాత్రం ఏమీ లేదు అందుచేత నువ్వేమీ బాధపడకు అని సూచన. నీవును దిగ్విజయాదుల - తేజ మితని నొందునట్లుగఁ జేసితి' అనటంలో ధర్మరాజు కూడా తన తండ్రి పాండురాజువలెనే తన శక్తిని ధృతరాష్ట్రుడి సౌఖ్యానికి ఉపయోగించాడని అర్థం. ధర్మరాజు రాజసూయం చేసేకాలంలో దుర్యోధనుడూ రాజే అయినా ధృతరాష్ట్రుడు తేజ మొందేటట్లుగా చెల్లిందని వ్యక్తం అవుతుంది. పరోక్షంగా రాజుగా పరిపాలనం చేస్తూ రాజులైన పాండు, తత్కుమారులచేత సేవ లందుకొంటూ తన జీవితకాలమంతా సుఖంగా గడిపాడని సారాంశం.

క. కేవలతపః క్రియా సం సేవన తాత్పర్య మిపుడు చిత్తంబునయం
దావేశించినయది యీ। భూవరునకు నితని ననిచిపుచ్చు మడవికిన్।' 52

ప్రతిపదార్థం: ఈ భూవరునకున్= ఈరాజు (ధృతరాష్ట్రుడి)కి; ఇపుడు= ప్రస్తుతం; చిత్తంబున+అందున్= మనసులో; కేవల= అచ్చంగా (ఇంకోభావం లేకుండా); తపస్+క్రియా= తపస్సు అనే పనిని; సంసేవన= ఆచరించడంలో; తాత్పర్యము= తత్త్వము, ఏకాగ్రత; ఆవేశించినయది= నిండివున్నది, కాబట్టి; ఇతనిన్= ధృతరాష్ట్రుడిని; అడవికిన్= అరణ్యానికి; అనిచి పుచ్చుము= అనుమతించి పంపవలసింది.

తాత్పర్యం: (ధర్మరాజు!) ఈ ధృతరాష్ట్రుడి కిపుడు, అచ్చంగా తపస్సు చేసుకొనటం అనే దొక్కటే మన సంతా+నిండిపోయింది. అందుచేత ఇతడిని అనుమతించి (అడవులకు) పంపవలసింది.'

ఆ. అనిన ధర్మ తనయుఁ 'డట్టుల కా కని'। పలికెఁ దత్క్షణంబ పరమయోగి
వంద్యుఁ డయిన సత్యవతి కొడు కాత్మత। పోవనమున కరిగె భూపవర్య! 53

ప్రతిపదార్థం: భూపవర్య!= రాజులలో శ్రేష్ఠుడా! (జనమేజయా!); అనివన్= వ్యాసు డట్లా అనగా; ధర్మతనయుఁడు= ధర్మరాజు; అట్టులు+అ; కాక= అట్లే అగును గాక; అని= అని; పలికెన్= అన్నాడు; పరమయోగి వంద్యుఁడు అయిన= ఉత్తములైన యోగులచేన నమస్కరించదగిన; సత్యవతి కొడుకు= సత్యవతికి జన్మించినవాడైన వ్యాసమహర్షి; తత్క్షణంబు+అ= ఆ క్షణంలోనే; ఆత్మ తపోవనమునకున్= తాను, తపసు చేసుకొనే స్థలానికి; అరిగెన్= వెళ్లాడు.

తాత్పర్యం: జనమేజయా! ధృతరాష్ట్రుడిని అడవి కనుమతించి పంపు మని వ్యాసుడు చెప్పగా ధర్మరాజు అట్లాగే కానిమ్మన్నాడు. మహాయోగులచేత స్తుతించబడే ఆ వ్యాసుడు ఆ క్షణంలోనే తన తపోవనానికి వెళ్ళాడు.

సీ. తదనంతరమ ధర్మతనయుండు ధృతరాష్ట్రు। తోడ నీ కెట్టుల సూడఁ బోలె
విదురుండుఁ గృపుఁడు నెయ్యది కృత మని విని। శ్చయ మొనరించిరి సంజయుని యు
యుత్సుని మనముల నొలసిన కర్తవ్య। మెద్ది దానిన చేయు టెంత యేని
నాకుఁ బ్రియంబు భూనాథ యానతుఁడ నై। వేఁడెద నొకటి నీ విశదబుద్ధి

ఆ. నేమి సేయఁదలఁచి తేని నీ వక్కట। యారగించి చేయు మయ్య!' యనుడు
నరిగె నా నృపాలుఁ డభ్యంతరావాస। మునకుఁ దోన సుబలతనయ సనఁగ 54

ప్రతిపదార్థం: తద్+అనంతరము+అ= వ్యాసుడు వెళ్ళిపోయిన వెంటనే; ధర్మతనయుండు= ధర్మరాజు; ధృతరాష్ట్రుతోడన్= ధృతరాష్ట్రుడితో, (ఇట్లా అన్నాడు); భూనాథ!= రాజా!; నీకున్= నీకు; చూడన్= ఆలోచనలో; ఎట్టులు= ఏవిధం; పోలెన్= తగినదని తోచిందో; విదురుండున్= విదురుడూ; కృపుఁడున్= కృపాచార్యుడూ; ఏ+అది= ఏది; కృతము= (చేయవలసిన) కార్యం; అని= అనేవిధంగా; వినిశ్చయము= దృఢమైన నిర్ణయం; ఒనరించిరి= చేశారో; సంజయుని= సంజయుడి యొక్కయు; యుయుత్సుని= యుయుత్సుడియొక్కయు; మనములన్= మనసులలో; ఒలసిన= ఉన్న (తోచిన); కర్తవ్యము= చేయవలసినపని; ఎద్ది= ఏదో; దానిన్+అ= దానినే; చేయుట= నీవు చేయటం; నాకున్= నాకు; ఎంత+ఏని= ఎంతైనా; (చాలా) ప్రియంబు= ఇష్టం; ఆనతుఁడను+ఐ= వినమ్రంగా; ఒకటి= ఒక విషయం మాత్రం; వేఁడెదన్= నిన్ను ప్రార్థిస్తున్నాను; అక్కట!= అయ్యో!; నీ విశదబుద్ధిన్= నిష్కల్మషమైన నీ మనసులో; ఏమి= ఏపని; చేయన్ తలఁచితి(వి)+ఏని= చేయదలచుకున్నప్పటికీ; నీవు= నీవు; ఆరగించి= (ముందుగా) ఆహారం తీసికొని; చేయుము+అయ్య= ఆ తర్వాతనే నీవు చేయదలచుకున్న దేదో చేయవలసింది; అనుడున్= అని ధర్మరాజు పలుకగా; ఆ నృపాలుఁడు= ఆ ధృతరాష్ట్ర మహారాజు; తోన్+అ= తనతో కలిసి; సుబలతనయ= సుబలుడి కూతురైన గాంధారి; చనఁగన్= వెళ్ళగా; అభ్యంతర+ఆవాసమునకున్= లోపలి మందిరంలోనికి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: వ్యాసుడు వెళ్ళిపోయాక ధర్మరాజు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు. 'రాజా! నీకు మంచిది అనిపించింది ఏదో, విదురుడూ, కృపాచార్యుడూ ఏం చేయాలని నిర్ణయించారో, సంజయుడూ, యుయుత్సుడూ ఏం చేద్దామనుకుంటున్నారో నీవు ఆ పని చేయటం నాకు కూడా ఇష్టం. అయితే శిరసు వంచి నేను ఒకటే వేడుకొంటున్నాను.

నీవు మనసులో ఏం చేయాలనుకొన్నప్పటికీ ముందుగా భోజనం చేసి, తర్వాత ఆ పనిచేయుము. ధర్మరాజు అట్లా అనగానే ధృతరాష్ట్రుడు భార్య (గాంధారి) వెంటరాగా అభ్యంతర మందిరంలోకి వెళ్ళాడు.

వ. ఇట్లు కురువృద్ధుండు వృద్ధసామజంబు చందంబునం జనునప్పుడు విదురుండును, యుయుత్సుండును గృపాచార్యుండును, సంజయుండును వెనుకన చని; రజ్జనపతి దివసకృత్యంబు లాచరించి భూమిసురులం బూజించి యాహారతంత్రంబు నిర్వర్తించె; గాంధారియుఁ గుంతీ ప్రముఖ భరత భార్య లనునయింప భోజనవిధి యొనర్చెం; దదనంతరంబ విదురాదులుం బాండవేయులును వనితా జనంబులుం గృతాహారులయి యా వైచిత్ర్యవీర్యుం బరివేష్టించియుండఁ, బాండవాగ్రజు నిప్పాండునృపాగ్రజుం డేకాంతస్థానంబునకుం దోడ్కొనిపోయి యతని తోడ 'సప్తాంగం బయిన రాజ్యంబు పూజ్యం బగుధర్మంబుతో నెనయ నడపుట దుష్కరంబు గావున నా యెఱిఁగినంత బోధించెద నాకర్ణింపు' మని పలికి యిట్లనియె. 55

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; కురువృద్ధుండు= కురువంశంలో పెద్ద అయిన ధృతరాష్ట్రుడు; వృద్ధసామజంబు= ముసలి యేనుగు; చందంబునన్= విధంగా; చను+అప్పుడు= అభ్యంతరమందిరానికి వెళ్ళేటప్పుడు; విదురుండును= విదురుడూ (తమ్ముడు); యుయుత్సుండును= యుయుత్సుడూ (కొడుకూ); కృపాచార్యుండును= కృపుడూ; సంజయుండును= సంజయుడూ; వెనుకన్+అ= వెనుకగానే; చనిరి= (ధృతరాష్ట్రుడిని అనుసరించి) వెళ్ళారు; ఆ+జనపతి= ఆ ధృతరాష్ట్ర మహారాజు; దివస కృత్యంబులు= ఆ రోజు పగలు చేయవలసిన సంధ్యాది కార్యాలను; ఆచరించి= చేసి; భూమిసురులన్= బ్రాహ్మణులను; పూజించి= అర్చించి, దానాదులతో సత్కరించి; ఆహారతంత్రంబు= భోజనవిధానం; నిర్వర్తించెన్= పూర్తిచేశాడు; గాంధారియున్= గాంధారి కూడా; కుంతీ ప్రముఖభరత భార్యలు= కుంతీదేవి మొదలైన భరతవంశస్త్రీలు; అనునయింపన్= (బతిమలాడగా, ప్రార్థించగా); భోజనవిధి= భోజనం చేసే పని; ఒనర్చెన్= పూర్తిచేసింది; తద్+అనంతరంబు+అ= ఆ తర్వాత; విదుర+ఆదులన్= విదురుడూ, యుయుత్సుడూ, కృపుడూ, మొదలైన వారున్నూ; పాండవేయులును= పాండవులూ; వనితాజనంబులున్= ఆడవాళ్ళూ; కృత ఆహారులు+అయి= భోజనం చేసి; ఆ+వైచిత్ర్యవీర్యున్= విచిత్రవీర్యుడి కొడుకైన ఆ ధృతరాష్ట్రుడిని; పరివేష్టించి ఉండన్= చుట్టుకొని ఉండగా; పాండవ+అగ్రజున్= పాండుకుమారులలో పెద్దవాడైన ధర్మరాజును; ఆ+పాండునృప+అగ్రజుండు= పాండురాజు అన్నఅయిన ధృతరాష్ట్రుడు; ఏకాంతస్థానంబునకున్= ఒంటిచోటికి; తోడ్కొనిపోయి= వెంటబెట్టుకొనిపోయి; అతనితోడన్= ధర్మరాజుతో-ఇట్లా అన్నాడు; సప్త+అంగంబు అయిన= (స్వామి, అమాత్య, సుహృత్, కోశ, రాష్ట్ర, దుర్గ, బలము అనే (ప్రకృతి-8) ఏడు అంగాలు కలిగిన; రాజ్యంబు= రాజ్యాన్ని; పూజ్యంబు అగు= పూజించదగిన; ధర్మంబుతోన్= శాస్త్రాదులలో చెప్పబడినమార్గంతో; ఎనయన్= కూర్చి; నడపుట= సాగించటం; దుష్కరంబు= చాల కష్టం; కావునన్= అందుచేత; నా+ ఎఱిఁగిన+అంత= నాకు తెలిసిన మేరకు; బోధించెదన్= రాజ్య పరిపాలనా పద్ధతిని గురించి తెలుపుతాను; ఆకర్ణింపుము= చెవి ఒగ్గి (శ్రద్ధగా) విను; అని= అని పలికి; ఇట్లు+అనియెన్= ఆ రాజ్యాంగం గురించి ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: ఆ విధంగా ధృతరాష్ట్రుడు ముసలి యేనుగువలె అభ్యంతర మందిరానికి భార్యతో కలసి వెళ్ళుతున్నపుడు, అతడిని వెన్నంటి, విదురుడూ, యుయుత్సుడూ, కృపుడూ, సంజయుడూ వెళ్ళారు. ధృతరాష్ట్రుడా తర్వాత ఆరోజు చేయవలసిన పగటి పనులన్నీ చేసి బ్రాహ్మణులను అర్చించి, భోజనం చేశాడు. గాంధారి కూడా కుంతి మొదలైన స్త్రీలు బతిమిలాడగా భోజనం చేసింది. ఆ తర్వాత విదురుడు, యుయుత్సుడు మొదలైనవారూ, పాండవులూ, ఆడవాళ్ళూ భోజనం చేశారు. భోజనాలు అయినతర్వాత అందరూ ధృతరాష్ట్రుడి చుట్టూచేరారు. అప్పుడు ధృతరాష్ట్రుడు ధర్మరాజును వెంట బెట్టుకుని ఏకాంతస్థానానికి తీసికొనివెళ్ళి ఇట్లా అన్నాడు. 'ఏడు అంగాలు కలిగిన రాజ్యాన్ని ధర్మబద్ధంగా

నడపటం చాల కష్టం. ఈ పరిపాలనావిధానం నాకు తెలిసినంతవరకు చెప్పుతాను. జాగ్రత్తగా వినుము' అని రాజ్యపాలనా విధానం గురించి రాజనీతి ధర్మరాజుతో ఇట్లా చెప్పాడు.

ధృతరాష్ట్రుఁడు ధర్మజునకు రాజనీతి విశేషంబులు చెప్పుట (సం.15-9-7)

సీ. 'నీవు నిచ్చలును విద్యావృద్ధజనములఁ । దగ నుపాసింపు, మర్థముల వారిఁ
బ్రీతులఁ జేయుము; నీతులు వా రుప । దేశింప వాని నూఁదినమనంబు
గలిగి నిర్వర్తింపు; కార్యంబు నింద్రియం । బుల రాజ్యతంత్రంబుఁ బోలె నరసి
రక్షింపు; మప్పిండు రక్షితం బైన శు । భంబులం గావించు; భావశుద్ధి

ఆ. ధామములును బితృపితామహక్రమసమా । గతులు విశదమతులుఁ గాఁగవలయు
సచివు; లతివిదగ్ధ చారులఁ బనుపుము । పరుల యాప్తజనుల భంగు లరయ. 56

ప్రతిపదార్థం: నీవు= నీవు (ధర్మరాజు); నిచ్చలును= ఎల్లప్పుడూ; విద్యా వృద్ధ, జనములన్= విద్యచేత పెద్దలైనవారిని; తగన్= అర్హమైనవిధంగా; ఉపాసింపుము= సేవించు; అర్థములన్= వారు కోరిన ధనవస్తు ప్రభృతులతో; వారిన్= ఆ విద్యావృద్ధులను; ప్రీతులన్; చేయుము= ఆనందింపజేయుము; వారు= ఆ విధంగా నీ సమ్మానం చేత సంతుష్టులైనవారు; నీతులు= రాజాదులు ప్రవర్తించవలసిన విధానాన్ని - హితాన్ని; ఉపదేశింపన్= నీకు బోధించగా; వానిన్= ఆ నీతులను; ఊఁదిన మనంబు= ఆశ్రయించిన మనస్సు; కలిగి= పొంది (విద్యావృద్ధులు ఉపదేశించిన హితం-కర్తవ్యం బుద్ధితో స్థిరపరుచుకొని, తు - చ. తప్పకుండా) కార్యంబున్= చేయవలసిన పనిని; నిర్వర్తింపు= నడిపించుము (చేయవలసింది); ఇంద్రియంబులన్= జ్ఞాన, కర్మ, ఇంద్రియాలు అన్నింటినీ; రాజ్యతంత్రంబున్ పోలెన్= రాజ్యతంత్రంవలె; అరసి= జాగ్రత్తగా; రక్షింపుము= కాపాడుకొమ్ము; రక్షితంబు+ఐనన్= నిగ్రహంతో రక్షించుకొంటే; ఆ+పిండు= ఆ (రక్షించబడ్డ) ఇంద్రియ సమూహం, రాజ్యాంగాలూ; శుభంబులన్= అనేకాలైనా మేళ్ళు; కావించున్ (నీకు) కలుగ జేస్తుంది; సచివులు= మంత్రులు, (పాలనాయంత్రాంగంలో ఉన్నతోద్యోగులు); భావశుద్ధి ధామమును= మనసుశుచికి నిలయమైనవారూ, (కపటం లేని, పవిత్రమైన, మనసు కలవారు); పితృపితామహక్రమ సమాగతులు(న్)= తండ్రి, తాతలవరుసలో క్రమంగా సచివులుగా, వచ్చినవారూ; విశదమతులున్= శాంతమయిన మనసు కలవారూ; కాఁగన్ వలయు(న్)= కావాలి; పరుల= ఇతరుల యొక్క (ఇతరదేశపురాజుల); ఆప్తజనుల= తన వారియొక్క; భంగులు= నడవడికలు; అరయన్= తెలిసికొనటానికి; అతి విదగ్ధ చారులన్= మిక్కిలి నేర్పు గలిగిన వేగులను; పనుపుము= నియోగించుము (పంపించు).

తాత్పర్యం: ధర్మరాజా! 1. పాండిత్యంలో పెద్దలైనవారిని, నిరంతరమూ సేవించే వారిని తగు విధంగా సమ్మానించుము. దానివలన సంతోషించిన వాళ్ళు నీకు ఉపదేశించిన హితాన్ని మనసు కెక్కించుకొని ఆ ప్రకారం నీ పనులు (రాజ్యపాలనం) నిర్వహిస్తూ రాజ్యాంగం వలెనే ఇంద్రియాలను జాగ్రత్తగా అదుపులో ఉంచుకొని కాపాడుకొమ్ము. అట్లా రక్షింపబడ్డ ఇంద్రియాలు (రాజ్యాంగము) నీకు మేలు చేస్తాయి. 2. ఇంక తర్వాత మంత్రుల విషయానికి వస్తే- తండ్రితాతల కాలం నుండి క్రమంగా వస్తున్నవారినీ, శుచులూ, ఇంద్రియనిగ్రహం ఉన్న వాళ్ళనీ మాత్రమే మంత్రులుగా చేసికొమ్ము. 3. శత్రువుల, ఆప్తుల, నడవడికలు తెలిసికొనటానికి మంచినేర్పు గలిగిన చారులను ఏర్పాటుచేయుము.

విశేషం: అలం: ఉపమ. ఇంద్రియాలకూ రాజ్య తంత్రానికీ పోలిక. రెండింటినీ సమానంగా అదుపులో ఉంచుకొనాలి (1-61-62). రాజ్యాంగాలు ఏడూ మానవ శరీరాంగాలతో పోల్చబడ్డాయి. మంత్రులు - కన్నులు, మిత్రులు - చెవులు, దుర్గం - చేతులు,

రాష్ట్రం - పాదాలు సైన్యం - మనస్సు ఇంక రాజు - శిరస్సు. ఇట్లా రాజ్యతంత్రం అమాత్యాది అంగాలన్నీ రాజు అధీనంలో ఉండాలి. అదే విధంగా నేత్రాదులైన ఇంద్రియా లన్నీ తన అధీనంలో ఉంచుకొని వాటిని జాగ్రత్తగా నడిపిస్తే అధీనమైన రాజ్యంగంవలన రాజుకు పరిపాలనం సుఖంగా సాగినట్లు, నిగ్రహించబడిన ఇంద్రియాలవలన మేలు గలుగుతుంది. ఇట్లా అనడంలో ఇంద్రియాలు స్వాధీనం కాకపోవటంవలననే, తానూ, దుర్యోధనాదులూ అశుభం పొందవలసివచ్చిందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. మూలంలో 'ఇంద్రియాణి చ సర్వాణి వాజివ త్పరిపాలయ, హితాయ చ భవిష్యన్తి రక్షితం ద్రవిణం యథా (9-13) సారథి గుర్రాలను తన అదుపులో ఉంచుకొన్నట్లుగా ఇంద్రియాలను నీవు అదుపులో ఉంచుకుంటే అవి దాచుకొన్న డబ్బువలె మేలు చేస్తాయంటుంది. రాజ్యతంత్రంతో పోలిక తెలుగులో విశేషం.

క. **పురరక్షణము దృఢంబుగ। నరవర! చేయంగవలయు నమ్మఁగలుగు స**
త్పురుషుల నిడఁ దగుఁ గుడుపు ని। దుర మొదలగులోని పనుల తొడరువు లరయన్. **57**

ప్రతిపదార్థం: నరవర= రాజా!; పురరక్షణము= రాజధానిని శత్రువులనుండి కాపాడుకొనే పని; దృఢంబుగన్= గట్టిగా, (లోటు పాట్లు లేకుండా); చేయంగన్ వలయున్= చేయాలి; కుడుపు= భోజనం; నిదుర= నిద్ర; మొదలు+అగు= మొదలు అయినటువంటి; లోని పనుల= ఆంతరంగికాలైన పనులకు సంబంధించిన; తొడరువులు= ప్రయత్నాలను; అరయన్= చూసుకొనటానికి; నమ్మన్+ కలుగు= నమ్మదగిన; సత్ పురుషులన్= కులశీలాదులచేత ఉత్తములైన వారిని; ఇడన్ తగున్= ఏర్పరచాలి.

తాత్పర్యం: ధర్మరాజా! రాజధానిని రక్షించే ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలి. భోజనం, నిద్ర మొదలైనటువంటి ఆంతరంగికకార్యాలను చూచుకొనటానికి నమ్మదగిన మంచి మనుష్యులను ఏర్పాటు చేసికొనాలి.

విశేషం: 'లోని పనులు' అనే తెలుగు అర్థవంతం, విహారమూ, మాల్యాది అలంకారమూ, మొదలైనవి లోని పనులు.

సీ. **ఆప్త వృద్ధులఁ బెట్టు మంగనాజనులసం। రక్షకు నెల్లకార్యముల మంత్రి**
జనములతోడ విచారించి చేయంగ। వలయును; గుప్త నివాస మొండె
మాడువు మీఁ దొండె మాటు లేని యరణ్య। తల మొండె మంత్ర విధానమునకు
నర్హముల్ గేవల మైనట్టి మంత్రంబు। గోపనం బొందినఁ గురువరేణ్య!

ఆ. **యఖిల కర్మములు ఫలావాప్తి నొప్పుఁ బం। గ్వంధజడులు బధిరు లైన నీ ర**
హస్య భాషణములయప్పుడు చేరువ। నునికి యొప్ప దార్యవినుతచరిత! **58**

ప్రతిపదార్థం: కురువరేణ్య!= కురువంశంలో శ్రేష్ఠుడా! (ధర్మరాజా)! అంగనా జనుల సంరక్షకున్= అంతఃపురస్త్రీలను కాపాడటానికి; ఆప్తవృద్ధులన్= నమ్మదగిన, (బంధువులైన) ముసలివారిని; పెట్టుము= నియోగించుము; ఎల్లకార్యములన్= రాజుగా నీవు చేయవలసిన పనులన్నీ; మంత్రి జనముల తోడన్= మంత్రులతో; విచారించి= ఆలోచన చేసి; చేయంగన్ వలయును= చేయాలి; మంత్రవిధానమునకున్= ఆలోచనకు; గుప్తనివాసము+ఒండెన్= రహస్యంగా ఉండే ఇల్లు (నాలుదిక్కులూ జాగ్రత్తగా రక్షించబడుతున్న మంత్రగృహం) గానీ; మాడువు మీఁదు+ఒండెన్= (నాలుగు దిక్కులూ తెరపిగా ఉండే) మేడ పై భాగంగానీ; మాటు లేని= (పొదలు చెట్టు మొదలైనవాటిచేత) మరుగు కాని, (చుట్టు ప్రక్కలు తెఅపిగా ఉన్న); అరణ్య తలము+ఒండెన్= అడవి గాని; అర్హముల్= తగినచోట్లు; కేవలము= ఐనట్టి (ఆ విధంగా ఆలోచన చేసి నిశ్చయింపబడిన) ప్రధానమైనటువంటి; మంత్రంబు= ఆలోచన; గోపనంబు+ఒందినన్= రహస్యంగా ఉంచబడితే; అఖిలకర్మములు= అన్ని పనులూ; ఫల+అవాప్తిన్=

ఉద్దేశించిన ప్రయోజనాన్ని పొంది; ఒప్పున్= ప్రకాశిస్తాయి; ఆర్యవినుత చరిత!= పెద్దలు ప్రశంసించే నడవడి కలిగినవాడా! (ధర్మరాజా); పంగు, అంధ, జడులు (ఐనన్)= కుంటివారైనా, గుడ్డివారైనా, తెలివితక్కువవారైనా (బుద్ధిహీనులైనా); బధిరులు+ఐనన్= చెవిటివారైనా సరే; నీ రహస్య భాషణముల+అప్పుడు= నీవు చేసే రహస్యపు సంభాషణల, ఆలోచనల సమయంలో; చేరువన్= నీ సమీపంలో; ఉనికి= ఉండటం; ఒప్పదు= మంచిది కాదు.

తాత్పర్యం: కురువంశంలో శ్రేష్ఠుడి వైన ధర్మరాజా! ఇక ఆడవాళ్ళ రక్షణకు ఆత్మీయు లైన ముసలివారిని నియమించుము. ఏ పని అయినా మంత్రులతో ఆలోచించి మాత్రమే చేయాలి. ఆ ఆలోచనం చేయటానికి రహస్యమందిరం గానీ, మేడ మీద బయలు ప్రదేశం గాని, మరుగులేనటువంటి అడవి ప్రదేశం గానీ తగిన ప్రదేశాలు. ఇట్లా మంత్రులతో విచారణ చేసి చివరకు నిశ్చయించిన అంశం మాత్రం రహస్యంగా ఉంచాలి. రాజ నిర్ణయం గోప్యంగా ఉంటేనే అనుకొన్న ఫలితాన్నిస్తుంది. మంత్రులు చారులు మొదలైన వారితో రహస్యాలు మాటాడేటప్పుడు కుంటివారైనా, గుడ్డివారైనా, తెలివితక్కువవారైనా చివరకు చెవిటివారైనా సరే ఎవరినీ దగ్గరకు రానీయకుము.

క. విను మంత్ర భేదనమున వ। చ్చిన కీడున కనఘ! శాంతి సేయు టరిది గా
వున మంత్రులతో మంత్రా। వన నియమం బూఁది చెప్పవలయుం జుమ్మీ! 59

ప్రతిపదార్థం: అనఘ!= పాప రహితుడా! (ధర్మరాజా)! విను= వినవలసింది; మంత్ర భేదనమునన్= రహస్యంగా ఉండవలసిన ఆలోచన (రాజు నిర్ణయం) బయటపడితే; వచ్చిన కీడునకున్= కలిగే అపకారానికి; శాంతి+చేయుట= ప్రతీకారం చేయటం, తొలగించటం; అరిది= ఏ విధంగానూ శక్యం కాదు; కావునన్= అందుచేత; మంత్రులతోన్= నీతో ఆలోచన చేసిన మంత్రులతో; మంత్ర+అవన, నియమంబు= ఆ ఆలోచనను రక్షించవలసిన కట్టుబాటును; ఊఁది= నొక్కి (గట్టిగా); చెప్పవలయున్+చుమ్మీ!= (నీవు) చెప్పాలి సుమా!

తాత్పర్యం: అనఘుడా! రాజు చేసిన నిర్ణయాలు, ఆలోచనలు బయటకు పొక్కితే గలిగే నష్టం నివారించటం ఎవ్వరివలనా కాదు. అందుచేత మంత్రాన్ని గోప్యంగా ఉంచటం అనేది నియమంగా నీ మంత్రులకు నొక్కి చెప్పుము.

సీ. వ్యవహారములు శుచు లైన విద్వాంసులఁ। దోడుగఁ గొని తీర్పు; దుష్టజనుల
దండించునెడ వారి తప్పుల కొలఁదులు। మదిఁ దూఁచి చూచి తన్మాత్రదండ
మాచరింపుము; విను మాయవ్యయములు సం। క్షేపరూపంబున రేపకడలు
దానికి మును దేవతాపూజనము భూసు। రార్చనమును జేయు మమలబుద్ధి!

తే. ప్రొద్దు సొలంగ నెక్కినప్పుడు సమర్థ। భోజన క్రియ నిర్వహింపుము సుశీల
మాన్య! తదనంతరమ గంధమాల్యభూష। ణాంబరములు నిజేచ్ఛమై ననుభవింపు. 60

ప్రతిపదార్థం: శుచులు= నిష్కళంకులు, (నీతిమంతులు); ఐన= అయినటువంటి; విద్వాంసులన్= పండితులను; తోడుగన్= సహాయంగా; కొని= స్వీకరించి, వ్యవహారములు= (అప్పు పుచ్చుకోవటం మొదలైనవాటిలో 18 విధాలైన) తగవులు; తీర్పు(ము)= పరిష్కరించుము; దుష్టజనుల(నె)= తప్పు కలిగిన వారిని; దండించు+ఎడన్= శిక్షించేటప్పుడు; మదిన్= నీ మనస్సులో; వారి తప్పుల కొలఁదులు= వారు చేసిన తప్పులయొక్క పరిమాణం (ఎంతటి తప్పో); తూఁచి= గణించి (తూకం వేసి); చూచి= దాన్ని

జాగ్రత్తగా పరిశీలించి; తద్ - మాత్ర దండము= ఆ తప్పుయొక్క పరిమాణానికి తగినంత శిక్ష మాత్రమే; ఆచరింపుము= విధించుము; అమలబుద్ధి!= కల్మషం లేని బుద్ధి కలవాడా! ధర్మరాజా!; వినుము= వినవలసింది; రేపకడలు= ప్రాతః కాలాలలో; సంక్షేపరూపంబునన్= సంగ్రహంగా; ఆయవ్యయములు= ఆదాయమూ, ఖర్చూ (చూచుకొమ్ము); దానికిన్= ఆయవ్యయాలు చూడటానికి; ప్రాతఃకాలానికి; మును= ముందుగా; దేవతా పూజనము(న్)= ఇష్టదైవాలను అర్చించటమూ; భూసుర+అర్చనమును= బ్రాహ్మణులను పూజించటమూ; చేయుము= చేయవలసింది; చాలంగన్= మిక్కిలిగా; ప్రొద్దు= సూర్యుడు; - ఎక్కినపుడు= పైకి వచ్చినపుడు (బాగా పొద్దెక్కింతర్వాత); సమ్ అర్హ భోజనక్రియ= రాజుల కుచితమైనటువంటి భోజనకార్యాన్ని; నిర్వహింపుము= చేయవలసింది; సుశీల మాన్య!= మంచి స్వభావం చేత గౌరవించదగిన వాడా! ధర్మరాజా!; తద్+అనంతరము+అ= ఆ తర్వాతనే; నిజ+ఇచ్ఛమైన్= స్వేచ్ఛగా (నీ ఇష్టం వచ్చినట్లుగా); గంధ, మాల్య, భూషణ, అంబరములు= చందనాది గంధాలూ, పూలూ, ఆభరణాలూ, వస్త్రాలూ మొదలైన సౌఖ్యాలను; అనుభవింపు(ము)= పొందవలసింది.

తాత్పర్యం: శుచులూ, శాస్త్రజ్ఞులూ అయిన వారి సహాయంతో తగవులు పరిష్కరించుము. తప్పు చేసిన వారిని శిక్షించేటప్పుడు వారు చేసిన తప్పు ఎంతటిదో జాగ్రత్తగా లెక్కించి దానికి తగినంతటి శిక్ష మాత్రమే విధించుము. ఉదయం వేళలలో జమాఖర్చులు సంగ్రహంగా చూచుకోవాలి. అంతకు ముందే తెల్లవారటానికి పూర్వమే దేవతార్చనమూ, బ్రాహ్మణార్చనమూ చేయాలి. బాగా పొద్దెక్కినతర్వాత భోజనం చేయాలి. ఆ తర్వాతనే అలంకారాలు మొదలైన సుఖాలను పొందాలి.

క. **కొలు విమ్ము మాపుకడ యో । ధుల కెల్లను; సంధ్య వడ్డ దూతలనుం జా**
రుల సంభావింపుము; రా । త్రులఁ గాంతాభోగతత్పరుఁడ వగుము నృపా! **61**

ప్రతిపదార్థం: నృపా!= (ధర్మ) రాజా!; యోధులకున్+ఎల్లను= యుద్ధం చేసే వారికి, (వీరభటులకు) అందరికీ; మాపుకడన్= సాయం సమయంలో; కొలువు+ఇమ్ము= కలుసుకొమ్ము; సంధ్య-వడ్డన్= సంజ పడిన తర్వాత; దూతలనున్= దూతలనూ; చారుల(న్)= వేగులనూ; సంభావింపుము= (గౌరవించుము) కలుసుకొమ్ము; రాత్రులన్= రాత్రివేళలలో; కాంతా, భోగతత్పరుఁ డవు, అగుము= స్త్రీలతో సుఖాన్ని పొందుము.

తాత్పర్యం: ధర్మరాజా! సాయం సమయంలో వీరులకు నిన్ను సేవించే అవకాశం ఇమ్ము. సంజ పడినతర్వాత దూతలనూ, వేగుల వాళ్ళనీ కలిసికొమ్ము. స్త్రీ సుఖాన్ని రాత్రి సమయంలో పొందుము.

తే. **ఏమి క్రొత్తగఁ బుట్టిన నించు కేని । నలసుఁడవు గాక దాని నీ వరసి తీర్పు;**
మిది దెఱంగుగ నే ప్రొద్దు నింతవట్టు । నర్హములు కౌరవక్షితిపాగ్రగణ్య! **62**

ప్రతిపదార్థం: కౌరవ, +క్షితిప+అగ్రగణ్యా= కురువంశపురాజులలో మొదట లెక్కించదగినవాడా, (శ్రేష్ఠుడా), (ధర్మరాజా)!; క్రొత్తగన్= వింతగా; ఏమి పుట్టినన్= ఏమి జరిగినప్పటికీ; ఇంచుక+ఏనిన్= కొంచెం కూడా; అలసుఁడవు= సోమరివి; కాక= కాకుండా; దానిన్= ఆ అంశాన్ని; నీవు= నీవు (స్వయంగా); అరసి= విచారించి; తీర్పుము= పరిష్కరించుము; ఇది+తెఱంగుగన్= ఈ విధంగా; ఇంతవట్టు= ఈ చెప్పిన, పనులన్నీ; ఏ ప్రొద్దున్= నిత్యమూ; అర్హములు= చేయదగినవి.

తాత్పర్యం: కౌరవ రాజులలో శ్రేష్ఠుడా! ఎంతటి దైనా వింత సంఘటన ఏర్పడితే బద్ధకించక ఏ సమయంలో నైనా సరే వెంటనే దానిని గురించి విచారణ చేసి పరిష్కారం చేయుము. ఈ విధంగా ఆయావేళలలో ఆయా పనులు ప్రతిరోజూ తప్పకుండా ఆచరిస్తూ ఉండుము.

క. న్యాయంబుతోడ వివిధో । పాయంబుల నర్థముల నుపార్జింపుము భూ
నాయక రాజ్య విఘాతము । సేయు జనుల నెఱిఁగి చంపఁ జెఱుపన వలయున్. 63

ప్రతిపదార్థం: భూనాయక!= (ధర్మ) రాజా!; అర్థములన్= అనేకవిధాలైన సంపదలను; వివిధ ఉపాయంబులన్= రకరకాల మార్గాలలో; న్యాయంబుతోడన్= ధర్మమార్గంలో; ఉపార్జింపుము= సంపాదించుము; రాజ్యవిఘాతము= ప్రభుత్వానికి అడ్డంకులు చేసే; జనులన్= కలిగించే వారిని; ఎఱిఁగి= తెలిసికొని; చంపన్= చంపటమో, చెఱుపన్+అ= చెడగొట్టటమో; తప్పక వలయున్= అవసరం.

తాత్పర్యం: రాజా! పలువిధాలైన మార్గాలలో సంపదలను న్యాయంగా సంపాదించుము. ప్రభుత్వానికి అంతరాయం కలిగించే వారిని కనుగొని వారిని చంపివేయటమో లేదా వారి ప్రయత్నాలను నిర్మూలించటమో, తప్పనిసరిగా చేయాలి.

క. పనులయెడ మేలు గాంచిన । మనుగడ యగ్గలము చేసి మన్నింపుము రా
జనయజ్ఞ! భృత్యకోటిం । గొనియాడుము సేఁతపేరు క్రుచ్చి కొలువునన్. 64

ప్రతిపదార్థం: రాజనయజ్ఞ!= రాజధర్మం(నీతి) తెలిసినవాడా! (ధర్మరాజా)!; పనుల+ఎడన్= రాజకార్యాలలో; మేలు= నేర్పును; కాంచినన్= చూస్తే (చూపించిన అటువంటి భృత్యుల); మనుగడ= జీవనం; అగ్గలము చేసి= ఉన్నతంగా ఏర్పాటు చేసి; మన్నింపుము= వారిని గౌరవించుము; కొలువునన్= సభలో; చేఁత= భృత్యులు నేర్పుగా చేసిన ఆ పనిని; పేరు= వారి పేరూ; క్రుచ్చి= పేర్కొని; భృత్యకోటిన్= ఆసేవకులను; కొనియాడుము= ప్రశంసించుము.

తాత్పర్యం: రాజనీతిజ్ఞుడి వైన ధర్మరాజా! రాజకార్యాలలో తమనేర్పును ప్రదర్శించిన భృత్యకోటికి, వారి బ్రతుకు ఉన్నతంగా నడిచేటట్లుగా వారిని సత్కరించుము. వారు చేసిన పనులూ, వారిపేరూ సభలో ప్రత్యేకంగా ప్రస్తావించి ప్రశంసించుము.

క. నీ వలనను భక్తిస్నే । హావేశము గలిగి శూరుఁడై యలజడికిం
దా విసువని సత్కులజుం । గావింపుము సైన్యవిభునిగాఁ గురుముఖ్యా! 65

ప్రతిపదార్థం: కురుముఖ్యా!= కురువంశంలో ప్రధానుడా! (ధర్మరాజా!); నీవలనను= నీపై; భక్తి, స్నేహ, ఆవేశము= సేవాభావమూ, ప్రేమా, ఆధిక్యం; కలిగి= ఉండి; శూరుఁడు+ఐ= పరాక్రమవంతుడై; తాన్= తాను (స్వయంగా); అలజడికిన్= ఆపద (కష్టం)లో; విసువని= నిర్వేదం (విరక్తి) పొందని, (వాడు ఐన); సత్ కులజున్= ఉత్తమవంశంలో పుట్టినవాడిని; సైన్యవిభునిన్ కాన్= సైన్యానికి నాయకుడిగా; కావింపుము= నియమించుము.

తాత్పర్యం: కౌరవశ్రేష్ఠుడా, ధర్మరాజా! నీమీద భక్తీ, ప్రేమా, అధికంగా ఉండి పరాక్రమవంతుడై, కష్టం వచ్చినా నిలబడ గలిగిన, ఉన్నతవంశంలో పుట్టినవాడిని సేనాపతిగా చేసికొమ్ము.

సీ. ఆత్మరంధ్రము లించు కైనను నొరులకు । నెఱుఁగ రాకుండఁగ మఱువు సేయు
మన్య రంధ్రంబుల నారసి కనుము; శ । త్రుల కడ బుద్ధియు బలుపుఁ గలుగు
వారల నెఱిఁగి భూవర! యొక్కమై నీగి । మన్నన నెఱపి తన్మానసములు
నీ యెడ నార్ద్రంబులై యుండఁ జేయుము । చేరువన్నృపులకు వైరబంధ

ఆ. మెట్లు గలుగు దాని నేమఱకుండుము। వారి యవుల నున్నవారు మిత్రు
లగుదు రెల్ల భంగి నధిప! యుదాసీను। లట సమీపవర్తు లైన విభులు. 66

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; ఆత్మరంధ్రములు= నీలోపాలను (తప్పులను); ఒరులకున్= ఇతరులకు; ఇంచుక+ఐనను= కొంచెమైనా; ఎఱుఁగన్ రాక ఉండఁగన్= తెలియటానికి అవకాశం ఈయకుండా; మఱుఁగు చేయుము= రహస్యంగా ఉంచుము; అన్యరంధ్రంబులన్= ఇతరుల తప్పులను; అరసి= నిశితంగా పరిశీలించి; కనుము= గ్రహించుము; శత్రువులకడన్= శత్రువుల వద్ద; బుద్ధియున్= వివేకమూ; బలుపున్= శక్తి; కలుగువారలన్= ఉన్న వ్యక్తులనే; ఎఱిఁగి= తెలిసికొని; ఒక్కమైన్= అధికంగా; ఈగి= దానమూ; మన్నన= గౌరవమూ (సాయం); నెఱపి= చూపి; తద్+మానసములు= వారి మనస్సులు; నీ+ఎడన్= నీ మీద; ఆర్ద్రంబులు+ఐ= అనుకూల్యం కలిగి; ఉండన్ చేయుము= ఉండేటట్లు చేసికొమ్ము; అధిప!= ఓ రాజా!; చేరువవనృపులకున్= నీకు దగ్గరి రాజులకు; వైరబంధము= శత్రుత్వం; ఎట్లు= ఏవిధంగా నైనా; కలుగున్= కలుగుతుందో; దానిన్= ఆ అంశాన్ని; ఏమఱక ఉండుము= ఏమరుపాటు లేకుండా (అప్రమత్తంగా) ఉండుము; వారి+అవులన్= వారికి తరువాతగా; ఉన్నవారు= ఉన్నరాజులు; ఎల్లభంగిన్= అన్ని విధాలుగానూ; మిత్రులు అగుదురు= నీకు స్నేహితులు అవుతారు; అటన్= వారికి; సమీపవర్తులు+ఐన= చేరువలో ఉన్న; విభులు= రాజులు; ఉదాసీనులు= నీ విషయంలో తటస్థులు, అని గ్రహించుము.

తాత్పర్యం: రాజా! నీ తప్పులు కొంచెం కూడా ఇతరులకు తెలియకుండా దాచిపెట్టుము. ఇతరుల దోషాలు మాత్రం జాగ్రత్తగా తెలిసికొమ్ము. శత్రువులవద్ద ఉన్నవాళ్ళలో బుద్ధిమంతులూ, శక్తిమంతులూ అయిన వ్యక్తులను దానాదులతో సత్కరించి, వాళ్ళ మనసులు నీ వైపు తిప్పుకొమ్ము. నీరాజ్యానికి సమీపంలో ఉండే రాజులకు నీతో వైరం కలుగుతుంది. కాబట్టి ఆ విషయంలో జాగ్రత్తగా అప్రమత్తుడివై ఉండుము. వారికి తర్వాత రాజ్యం పాలించుకొనే వాళ్ల నీకు మిత్రులవుతారు. ఆ తర్వాత ఉండే రాజ్యపాలకులు నీవిషయంలో ఉదాసీనంగా ఉంటారని గ్రహించుము.

క. వీరుల సప్తాంగంబులు। నారసికొని యునికి కార్య మవనీశ! సదృ
క్సారబలుఁ డైన నృపుతో। గారవమున సంధి సేయఁగావలయుఁ దగన్. 67

ప్రతిపదార్థం: అవనీ+ఈశ!= రాజా!; వీరులన్= (పైన చెప్పిన) పొరుగురాజులను; సప్త+అంగంబులు= రాజ్యానికి సంబంధించిన (స్వామి) అమాత్యాది అంగములు ఏడింటినీ; ఆరసికొని= మెలకువతో గ్రహిస్తూ; ఉనికి= ఉండటం; కార్యము= (రాజుకు) కర్తవ్యం; సదృక్ సార బలుఁడు= తనతో సాటి వచ్చేటంతటి గట్టి పరాక్రమం కలిగినవాడు; ఐన= అయినటువంటి; నృపుతోన్= పొరుగురాజుతో; తగన్= తగువిధంగా; గారవమునన్= మన్ననతో; సంధి= శాంతి; ఒడంబడిక; చేయఁగాన్ వలయున్= చేసికొనాలి.

తాత్పర్యం: రాజా! శత్రువులూ, మిత్రులూ, ఉదాసీనులూ అని మూడు విధాలుగా ఉన్న పొరుగురాజులనూ, (శాంతి 6,107) (స్వామి) అమాత్య, జానపద, దుర్గ, బలాదిరూపమైన రాజ్యం సప్తాంగాలనూ, రాజు అప్రమత్తంగా గమనిస్తూ ఉండాలి. తనతో సమానమైన బలం కలిగిన రాజుతో తగువిధంగా అతడిని గౌరవించి సంధి చేసికొనాలి.

తే. దైవమానుష బలములు దఱిఁగి యుండు। నెవ్వనికి నెప్పు డప్పుడ యెసక మెసఁగ
వైర మతనితోఁ బాటింపవలయుఁ జెఱుచు। టప్పనము గొను టర్థత్వ మరసి నడపు. 68

ప్రతిపదార్థం: ఎవ్వనికిన్ = ఏ (శత్రు) రాజుకు; ఎప్పుడు= ఏ సమయంలో; దైవమానుషబలములు= దైవబలమూ, మానుషబలమూ, అతడి స్వబలమూ; తఱిఁగి+ఉండున్= తక్కువగా ఉంటాయో; అతనితోన్= ఆ రాజుతో; అప్పుడు+అ= ఆ సమయంలోనే,

వెంటనే; ఎసకము= పెంపు; ఎసఁగన్= ఒప్పుతుండగా; వైరము= శత్రుత్వాన్ని; పాటింపన్‌వలయున్= ఆచరించాలి; అర్థత్వము= అతడి అర్థతను; అరసి= గమనించి; చెఱుచుట= నాశనం చేయటమో; లేదా; అప్పనము= కానుకలు (కప్పం); కొనుట= స్వీకరించటమో; నడపు(ము)= చేయవలసింది.

తాత్పర్యం: ఎవడికి, తన బలమూ, దైవబలమూ, రెండూ ఏ సమయంలో తక్కువగా ఉంటాయో వాడితోనే ఆ సమయంలోనే శత్రుత్వాన్ని అనుసరించాలి. ఔచిత్యాన్ని బట్టి ఆ శత్రురాజును నిర్మూలించడమో లేకుంటే సామంతుడుగా ఉంచి కప్పం పుచ్చుకొనటమో చేయాలి.

క. నడపునఁ గోల్పుచ్చఁగ నగు । నెడయు విడిసి యుండి చెఱుచు నిక్కయు నీ వే
ర్పడఁ గనుఁగొని యం దర్హము । నడపుము; నిజసైన్య రక్షణము వలయుఁ జుమీ! 69

ప్రతిపదార్థం: నడపునన్= సైన్యాన్ని నడిపించటం ద్వారా; కోల్ పుచ్చఁగన్= చెడగొట్టటానికి (నిర్మూలించడానికి); అగు+ఎడయున్= వీలైన స్థానమూ; విడిది+ఉండి= సైన్యం విడిది చేసికొని; చెఱుచు+ఇక్కయున్= శత్రువును నశింపజేసే స్థానమూ; ఏర్పడన్= స్పష్టంగా; నీవు= నీవు (స్వయంగా); కనుఁగొని= తెలిసికొని, అందున్= ఆ రెండింటిలో; అర్హము= ఉచితమైన పనిని; నడపుము= చేయవలసింది; నిజ సైన్య రక్షణము= స్వసైన్యం నాశనం కాకుండా కాపాడుకొనటం; వలయున్+చుమీ= అవసరం సుమా!

తాత్పర్యం: సైన్యాన్ని నడిపి (దండెత్తి), శత్రువును నిర్మూలించాలో, లేకపోతే సైన్యాన్ని విడిది చేసి రాజ్యం చుట్టూ నిలిపి రాజ్యాన్ని దిగ్బంధం చేసి శత్రువులను నిర్మూలించాలో - ఈ రెండింటిలో ఏ మార్గం తగినదో నీవే ఆలోచించి అది అనుసరించుము. నీ సైన్యాన్ని తప్పకుండా రక్షించుకొనాలి సుమా!

విశేషం: విదేశీ రాజనీతిలో షడ్గుణాలలో 'యానం' అనేది సంధి - ఆసనం - విగ్రహం - యానం - అనీ ఇదొక క్రమంలో నిరూపితం. శత్రు నిర్మూలనం అవసరంకాని సమయంలో సైన్యప్రయోగం అవసరమైతేనే చేయాలని సారాంశం.

క. ప్రెగడల మనసులు విరసము । లగుగతి నడచు రిపురాజ్య మరసి విభిన్నం
బుగఁ జేసి కలఁచి పైకొని । జగతీవర! కొనఁగవలయు సౌకర్యమునన్. 70

ప్రతిపదార్థం: జగతీవర!= (ధర్మ) రాజా!; ప్రెగడల= అమాత్యుల యొక్క; మనసులు= హృదయాలు; విరసములు= ఇష్టం లేనివి (ప్రతికూలములు); అగుగతిన్= అయ్యే విధంగా; నడచు= సాగుతున్న; రిపురాజ్యము= శత్రురాజ్యాన్ని; అరసి= కనుగొని; విభిన్నంబుగన్+చేసి= చెదరగొట్టి; కలఁచి= క్షోభింపజేసి; పైకొని= దండెత్తి; సౌకర్యమునన్= తేలికగా; కొనఁగన్‌వలయున్= స్వీకరించాలి.

తాత్పర్యం: రాజా! మంత్రులు రాజుకు ప్రతికూలంగా ఉండి, సాగుతున్న శత్రురాజ్యాన్ని, చెదరగొట్టి (విడదీసి) వ్యాకులపెట్టి, ఆ తర్వాత ఒక్కసారిగా మీదబడి (దండెత్తి) (ఆ రాజ్యాన్ని) తేలికగా సాధించాలి.

ఆ. బలము లెసఁగ దైవబలమును గలిగి లో । గుట్టు చేటు లేనియట్టి నృపతి
వలన మత్సరంబు వల; దాశ్రయంబు చం । దంబు పొందు వడయఁ దగు నృపాల! 71

ప్రతిపదార్థం: నృపాల!= (ధర్మ) రాజా!; బలము= (రథగజాదిగా) సైనికబలం; ఎసఁగన్= ఎక్కువగా ఉండగా; దైవబలమును= అదృష్టశక్తి కూడా; కలిగి= ఉండి; లో గుట్టు= ఆంతరంగికాలైన రహస్యాలకు; చేటు= కీడు (వెల్లడి కావటం); లేని+ అట్టినృపతి వలనన్= లేనటువంటి రాజు విషయంలో; మత్సరంబు= విరోధం; వలదు= వద్దు; ఆశ్రయంబు చందంబు= అటువంటి వాడిని ఆశ్రయించే మార్గమే; (లేదా) పొందు= స్నేహమో (సంధి); పడయన్+తగున్= అనుసరించటం ఉచితం.

తాత్పర్యం: మానుష బలం ఉండీ, దానికి తోడు దైవబలం కూడా ఉండి స్వీయ రహస్యాలు వెల్లడి కాకుండా మరుగు చేయగలిగిన రాజుతో విరోధం పనికిరాదు. అతడిని అనుసరించి ఉండటమో, లేదా, సంధి (స్నేహం) చేసికొనటమో యుక్తం.

ధృతరాష్ట్రుఁడు ధర్మరాజునకు శత్రురాజుల జయించు తెఱంగు చెప్పుట (సం.15-12-6)

ఆ. **కుడువ నిచ్చు తఱియుఁ గురువర! కక్కించు । నవసరంబు నెఱిఁగి యరినృపాలు**
నీవు ధీరవృత్తి నిడుఁ ద్రాటఁ బోనిమ్ము । క్రమ్ము కపిల యనఁగ గ్రమ్మి చెఱుపు? **72**

ప్రతిపదార్థం: కురువర!= కురువంశంలో శ్రేష్ఠుడా! ధర్మరాజా!; నీవు= నీవు; అరినృపాలున్= శత్రురాజును; కుడువన్+ఇచ్చు; తఱియున్= తిన నివ్వదగిన సమయమూ; కక్కించు+అవసరంబున్= తిన్న దాన్ని కక్కించవలసిన సమయమూ; ఎఱిఁగి= గ్రహించి; కపిల అనఁగన్= పుల్లావు వలె; (శత్రురాజును) నిడుఁద్రాటన్= పొడుగైన తాడుతో; కట్టిపోన్+ఇమ్ము= విడిచిపెట్టుము; క్రమ్ము= (ఆక్రమించుము)లో బఱుచుకొమ్ము; క్రమ్మి= ఆక్రమించుకొన్నపుడు; చెఱుపు= రాపిడి పెట్టుము.

తాత్పర్యం: కురుశ్రేష్ఠుడా! తిన నివ్వదగిన సమయం ఏదో, కక్కించవలసిన సమయం ఏదో గ్రహించి శత్రురాజును పుల్లావు వలె పొడుగాటి త్రాడుతో స్వేచ్ఛగా విడిచిపెట్టుము. లోబరుచుకొమ్ము, లోబరుచుకొన్నపుడు ఆ శత్రురాజువలన లాభాలు జాగ్రత్తగా పిండుకొమ్ము.

విశేషం: అలం: ఉపమ. 'కపిల' తో ఉపమానం. ఆవు కట్టుత్రాడు చేతిలో ఉంచుకొనాలి. అపు డా తాడు ఎంత నిడుపైనా దాన్ని విడిచిపెట్టడం కట్టివేయడం అనేది తన ఇచ్ఛ ననుసరించి ఉంటుంది. త్రాడు ఎంత నిడుపైనా, కుడవనివ్వదగినంత దాకానే విడిచిపెట్టడం కాబట్టి దాని ఇచ్ఛ కట్టుఁత్రాడు పట్టుకున్నవాడి స్వేచ్ఛకు లోబడే ఉంటుంది. శత్రురాజు (నిడుత్రాటి బంధనంలో) తనకు లోబడి ఉన్నంత కాలం తన రాజ్యాన్ని అనుభవింపనీయవచ్చును. 'కక్కించు అవసరం' క్రొత్తగా తినడం కాదు. అంతకు ముందు తినిఉన్నది కూడా లాక్కోవడం. అవసరమైతే అదీ చేయాలి. 'చెఱవు' అనే ముద్రితపాఠం కంటె 'చెఱుము' అనే వ్రాతప్రతుల పాఠంలో ఔచిత్యం కనబడుతున్నది. 'చెఱవు అంటే నశింప జేయడం. అరినృపాలుడు కాబట్టి కక్కించవలసిన అవసరం వస్తే వాడిని కమ్ముకొని శత్రువును నిర్మూలించుము అని అర్థంలో చెఱవు అనే పాఠం అన్వయిస్తుంది. కాని శత్రురాజుకు 'కపిల' తో పోలిక. ('నిడుఁద్రాట' బంధించి ఉంచాలి గదా) కాబట్టి 'కపిల'ను చెఱచడం సరికాదు. 'కక్కించు నవరసంబు' అన్నపుడు కూడా కపిల పరంగా పాలు పిదుకుకోవటమే. శత్రురాజు సైన్యాది బలాలను స్వాధీనపరచుకొనటం. (ఇది శత్రురాజుకు చెఱుపే) రాజును చంపే పని లేదు. ఇది ఎంతదూరం యథేచ్ఛగా వెళ్ళి మేయదగినంత మేయనిస్తే, అవసరమైనపుడు దాని నుండి ఫలితాన్ని (పాలు), అధికంగా పిండుకొనవచ్చును. అట్లా పిండుకొనాలంటే 'చెఱుము' అంటే గంగడోలు వగైరా అవయవాలు రుద్ది (చెఱుము= ఊచు) పరవశింప జేసి ప్రయోజనాన్ని పొందాలి అనే అర్థం సాధించడంలో 'చెఱవు' అనే ముద్రిత పాఠంకంటె కూడా 'చెఱుము' అనే వ్రాతప్రతులలోని పాఠమే అర్థవంతంగా ఉంటుంది. కపిల అంటే పసుపు నిండిన తెలుపు - బంగారు రంగులో ఉన్న ఆవు 'కపిల వైశిష్ట్యం కూడా ప్రయోజనంలోనే దానికి చెరుపు చేయటం అభీష్టం కాదు కదా.

సీ. ఉత్సాహ శక్తియు నుర్వీశ మంత్రశ। క్తియుఁ బ్రభుశక్తియుఁ గెలనివాని
కిని నీకు నిట్టివి యని తారతమ్యముల్। వెరవునఁ బరికించి వేర మెత్త।
వలయుట నెఱిగల్గి పలుకక యుండంగఁ। దగుట యూహించు టుత్తమ విధంబు ;
మూలబలంబును మొత్తాలవారును। మిత్త్రబలంబును శత్రుబలముఁ

ఆ. గాననంబు బలముఁగై జీతగాండ్రును। నైనయట్టిబలము లాఱు నరసి
యుచితకాల దేశ యుక్తంబులుగఁ బన్ని। కొనఁగ వలయు వాని కొలఁదు లెఱిఁగి. 73

ప్రతిపదార్థం: ఉర్వీ+ఈశ!= రాజా!; కెలనివానికిన్= నీ పొరుగు (శత్రు) రాజుకూ; నీకున్= నీకూ; ఉత్సాహశక్తియున్= ఉత్సాహమనే శక్తి; మంత్రశక్తియున్= (ఆలోచన) మంత్ర శక్తీ; ప్రభు, శక్తియున్= ప్రభు (అధికారం) శక్తి; ఇట్టివి అని= ఈ ప్రకారంగా ఉన్నాయి అని; తారతమ్యముల్= తక్కువ ఎక్కువలు; వెరవునన్= ఉపాయంతో; పరికించి= పరిశీలించిన తర్వాతే; వేరము= విరోధం; ఎత్తవలయుట= అనుసరించాల్సి రావటమూ; నెఱి, కల్గి= పౌరుషం కలిగి కూడా; పలుకక+ఉండంగన్+తగుట= మాటాడకుండా ఊరుకోవటమూ; ఊహించుట= (ఏది ఉచితమో ఆలోచించి) నిర్ణయించుకొనటం; ఉత్తమవిధంబు= శ్రేష్ఠమైన పద్ధతి; మూలబలంబును= 1. ప్రధాన సేనా, మొత్తాలవారునూ= 2. శ్రేణీబలమూ మిత్త్రబలంబును= 3.స్నేహితులైన రాజులవలన లభించే సైన్యమూ; శత్రుబలమున్= 4. శత్రువుల నుండి లభించిన సైన్యమూ; కాననంబు బలమున్= 5. కిరాతులు మొదలైన అడవి వీరుల సైన్యమూ; కై జీత గాండ్రును= 6. తాత్కాలిక ప్రయోజనం కొరకు భృతితో నియమించబడిన సైన్యమూ; ఐన అట్టి బలములు ఆఱున్= అయినటువంటి ఆరు విధాలైన సైన్యాలను; అరసి= గమనించి; వాని కొలఁదులు= ఆ ఆరు విధాలైన సైన్యాల పరిమాణాన్ని; ఎఱిఁగి= తెలిసికొని; ఉచిత కాల దేశ యుక్తంబులుగన్= ఆయాకాలాలకూ, ప్రాంతాలకూ, తగిన విధంగా ఉండేటట్లుగా; పన్ని కొనఁగన్వలయున్= సిద్ధం చేసికొని ఉంచుకోవాలి.

తాత్పర్యం: రాజా! నీకూ నీ పొరుగు (శత్రు) రాజుకూ ఉత్సాహ మంత్ర, ప్రభుశక్తులలోని తక్కువయెక్కువలు జాగ్రత్తగా తెలిసికొని, దండెత్తాలనుకొన్నపుడు మూలశ్రేణి, మిత్ర, శత్రు, కానన, భృత్యశ్రేణులు - అనే షడ్బలాలనూ, పరిశీలించి దేశ, కాలాలకు తగిన విధంగా వ్యూహం ఏర్పాటు చేసికొనాలి.

విశేషం: యుద్ధానికి తలపడే ముందు రాజు శక్తి త్రయాన్ని అంచనా వేసికొనాలి. ఉద్యమించే శక్తి, పనిలో పూనుకోవాలనే కోర్కె ఉత్సాహశక్తి, సఫలమయ్యే విధంగా ఆలోచన చేయగలిగిఉండటం మంత్రశక్తి; తన ఆలోచనలను; ప్రయత్నాన్ని అమలు చేయగలిగిన అధికారం - ప్రభుశక్తి; కోశ సైన్యాలు ప్రభుశక్తికి చెందుతాయి. కెలనివాని శక్తి తెలిసికొనటం కష్టం కాబట్టి 'వెరవున' - ఉపాయంతో, ఎట్లాగో మార్గం చేసికొని ఎదుటివారి బలం గ్రహించాలి. తనకంటె పొరుగువాడికే శక్తి అధికం అయితే మాటాడకుండా ఊరుకొనటమే ఉత్తమం. తర్వాత ఆరు విధాలైన బలాలను సంసిద్ధం చేసికొని యుద్ధానికి దిగాలి. 'మౌల్య భృత్య సుహృచ్ఛ్రేణీ ద్విష దాటవికం బలమ్' రఘు- (4.26 మల్లినాథవ్యాఖ్య) సైన్యానికి కోశం మూలం, మూల బలం అంటే ధనబలం (నీలకంఠీయ) అర్థం. మూల బలం -(మౌల్యం) ప్రధానసేన= వంశపారంపర్యంగా రాజసేవలో కొనసాగివస్తున్న సైన్యం - మూలబలం, మొత్తాలరు అంటే శ్రేణీబలం. కొంతమందిని కూర్చుకొని సైనికులవలె తీర్చి వారికి ఒకడు నాయకత్వం వహిస్తుంటాడు. ఇట్లా కొంతమంది సైనికుల సమూహాలకు నాయకులైన వారిద్వారా ఉపయోగించే బలం శ్రేణీ బలం. వారే మొత్తాలవారు. మిత్రబలం - స్నేహితులైన రాజులు తనకు సహకారంగా పంపే సైన్యం (68.వ.) (సుహృద్బలం). శత్రుబలం. యుద్ధంలో తన చేతిలో ఓడిపోయి సామంతులైై ఉన్నరాజులు విధిగా పంపటంవల్ల వచ్చే సైన్యం. అవకాశం దొరికితే ఎదురు తిరిగేవాళ్ళు గాబట్టి వీళ్ళు సామంతులై కప్పాలు కడుతున్నా శత్రువులే, (ద్విషద్బలం) కిరాతాది సైన్యం ఆటవికబలం; కైజీతగాండ్రు భృత్యబలం; జీతం (కూలి) ఇచ్చి తాత్కాలికంగా పెట్టుకొన్న సైన్యం. ఈ ఆరు విధాలైన బలగాలను 'వాని కొలఁదులు ఎరిఁగి దేశ - కాల ఉచితంగా ఉపయోగించాలి'. తనకున్న

ఆయా బలగాల పరిమాణం, శత్రువుకున్న బలాల పరిమాణం - తెలిసికొని - యుద్ధం జరిగే ప్రదేశాన్నీ కాలాన్నీ అనుసరించి షడ్బలాలలో దేన్ని ఏ పరిమాణంలో ఎట్లా వాడుకొనాలో జాగ్రత్తగా (ఎరిగి) గ్రహించి చేయాలి.

తే. సంపదల నాపదల నొక్కచంద మగుట। వికృతి నొందుట యా బలవితతులందుఁ
గాంచి యెల్లప్పుడును హితకారి యైన। బలము నెక్కుడుగాఁ బ్రోవు భరతముఖ్య! 74

ప్రతిపదార్థం: ఒందుట= పొందటమూ; కాంచి= పరిశీలించి; హితకారి ఐన= ప్రభువులకు మేలు కూర్చగలిగిన; బలమున్= బలాన్ని; ఎల్లప్పుడును= అన్నివేళలా; ఎక్కుడుగాన్= అధికంగా; ప్రోవుము= (కాపాడుతూఉండు) వృద్ధి చేసుకొమ్ము.

తాత్పర్యం: భరతవంశంలో శ్రేష్ఠుడా, ధర్మరాజా! మూలబలం, మిత్రబలం మొదలుగా ఆరువిధాలైన బలాలలోనూ కష్ట సుఖాలలో ఒకే విధంగా నిలబడగలిగినదేదో, నిలబడలేనిదేదో గ్రహించి రాజుకు మేలు చేసే బలగాన్ని ఎప్పుడూ అధికంగా పోషించుము.

క. పరుల గెలిచి నిర్భయముగ। ధరణిఁ బ్రజం గాచువెరవు ధర్మపథమునం
బరిపాలించిన వెలయుం। గురువర! కృపపెంపు వదలకుము ప్రజలయెడన్. 75

ప్రతిపదార్థం: కురువర!= కురువంశంలో శ్రేష్ఠుడివైన ధర్మరాజా!; పరులన్= శత్రువులను; గెలిచి= ఓడించి; ధరణిన్ ప్రజన్= (ఆశత్రు రాజ్యంలోని) ప్రజలను; నిర్భయముగన్= భయం లేకుండే విధంగా; కాచు వెరవు= రక్షించే ఉపాయం; ధర్మపథమునన్= ధర్మమార్గంలో; పరిపాలించినన్= ప్రజా సంరక్షణం చేస్తే; వెలయున్= ప్రశస్త మవుతుంది; ప్రజల+ఎడన్= ప్రజలమీద; కృప పెంపు= అధికమైన దయను; వదలకుము= విడిచిపెట్టకు.

తాత్పర్యం: కురుశ్రేష్ఠుడా! శత్రురాజులను ఓడించి ఆ రాజ్యాన్ని వశం చేసికొన్న తర్వాత, ఆ శత్రురాజ్యంలోని ప్రజలు, నీ గురించి భయపడకుండేటట్లుగా నీవు రక్షించే విధం, ధర్మబద్ధంగా ప్రజా సంరక్షణం చేయటం వలన ఇంకా కీర్తించబడుతుంది. నీ ప్రజలమీద ఎప్పుడూ మిక్కిలి దయతో ఉండాలి.

క. వినికి గలిగి రక్షించుచు। ననువున దయతోడిపాడి నాయతు లెల్లం
గొనుచుఁ దగ నేలి పొగడొం। దినరాజున కుర్వి కామధేనువ కాదే! 76

ప్రతిపదార్థం: వినికి కలిగి= రాజ ధర్మాది వివిధ శాస్త్రాలను విని (తెలిసికొని); రక్షించుచున్= ప్రజలను కాపాడుతూ; అనువునన్= ఉపాయంతో; దయతోడి పాడిన్= దయ గలిగిన నీతితో; ఆయతులు= రాబడులు; ఎల్లన్= అన్నీ; కొనుచున్= సమకూర్చుకొంటూ; తగన్= తగువిధంగా; ఏలి= రాజ్యాన్ని పాలించి; పొగడు= ప్రశంసలను; ఒందిన రాజునకున్= పొందేటటువంటి రాజుకు; ఉర్వి= ఈ రాజ్యం; కామధేనువు+అ= కామధేనువే; కాదే!= కదా!

తాత్పర్యం: వివిధ శాస్త్రాలు గ్రహించి, ప్రజలను, జాగ్రత్తగా కాపాడుతూ, ఉపాయంతోనూ, దయ గలిగిన పద్ధతిలోనూ, రాబడులను కూర్చుకొంటూ ధర్మబద్ధంగా భూమిని పరిపాలించే రాజుకు ఆ రాజ్యమే కామధేను వవుతుంది.

విశేషం: అలం: రూపకం.

సీ. ధర్మమార్గంబున ధరణిఁ బాలించిన । నైహిక సుఖములు నగ్గలంపుఁ
బొగడును బరలోక భూరి సౌఖ్యములును । సిద్ధించు; విపుల దక్షిణలు పెట్టి
యశ్వమేధ ప్రముఖాధ్వరంబులు పెక్కు । లాచరించుట కంటె నధిక మండ్రు
మేదినీ ప్రజల నత్యాదరంబును గరు । ణాతిశయంబు మధ్యస్థతయును

తే. గలిగి బిడ్డల నరసిన కరణి గాఢ । రక్షణం బొనరించుట రాజవర్య!
వినుము తమ్ముల నీగి మన్ననల ననుది । నంబుఁ గొనియాడు మానందనంబు గాఁగ. 77

ప్రతిపదార్థం: రాజవర్య!= రాజులలో శ్రేష్ఠుడా! (ధర్మరాజా!); వినుము= వినవలసింది; ధరణిన్= ఈ భూమిని; ధర్మ మార్గంబునన్= ధర్మంతో కూడిన (ధర్మబద్ధమైన) పద్ధతిలో; పాలించినన్= రక్షిస్తే; ఐహిక సుఖములున్= ఈ లోకానికి, సంబంధించిన సుఖాలూ; అగ్గలంపు పొగడును= అధికమైన ప్రశంసలూ; పరలోక భూరి సౌఖ్యములును= స్వర్గలోకంలో మిక్కుటమైన సుఖాలూ; సిద్ధించున్= లభిస్తాయి; విపుల= విస్తారంగా; దక్షిణలు పెట్టి= దక్షిణలు ఇచ్చి; మేదినీ ప్రజలన్= రాజ్యంలోని ప్రజలను; అతి+ఆదరంబును= మిక్కుటమైన వాత్సల్యమూ; కరుణా+అతిశయంబు(న్)= మిక్కుటమైన దయా; మధ్యస్థతయును= నిష్పక్షపాతబుద్ధీ; కలిగి= ఉండి; బిడ్డలన్= కన్న బిడ్డలను; అరసిన కరణిన్= చూసుకునే విధంగా; గాఢ-రక్షణంబు= దృఢమైన రక్షణం; ఒనరించుట= చేయటం; అశ్వమేధ, ప్రముఖ+అధ్వరంబులు= అశ్వమేధం మొదలైన యాగాలు; పెక్కులు= అనేకంగా; ఆచరించుట కంటెన్= చేయటం కంటె; అధికము= ఎక్కువ; అండ్రు= అంటారు; తమ్ములన్= నీ సోదరులను; ఆనందనంబు కాఁగన్= సంతోషం కలిగేటట్లుగా; ఈగి- మన్ననలన్= దానమూ, సమ్మానాలతో; అనుదినంబున్= ప్రతీరోజూ; కొనియాడుము= ప్రశంస చేస్తూ ఉండుము.

తాత్పర్యం: రాజశ్రేష్ఠుడా! రాజ్యాన్ని ధర్మమార్గంలో పరిపాలిస్తే ఈ లోకంలో సుఖాలు మాత్రమే కాకుండా, పదుగురి చేత పొగడ్తలూ, ఊర్ధ్వ లోకంలోనూ గొప్ప సుఖాలూ కలుగుతాయి. ప్రజలను ప్రేమతో, దయతో, నిష్పక్షపాతంగా, కన్నబిడ్డలవలె, గట్టిగా కాపాడటం - గొప్ప దక్షిణలు ఇచ్చి అశ్వమేధం మొదలైన అనేక యజ్ఞాలు చేసిన దానికంటె కూడా ఎక్కువ అని అంటుంటారు. ఓ రాజా! వినుము. నీ తమ్ముళ్ళను, వాళ్ళు సంతోషించేటట్లు దానమూ, సమ్మానమూ చేస్తూ ప్రతిరోజూ ప్రశంసిస్తూ ఉండుము.

చ. నరవర! రాజనీతుల జనస్తుతుఁడైన నదీ తనూజుఁడున్
హరియుఁ బరాశరాత్మజుఁడు నాదిగఁ గల్గిన పెద్ద లెల్ల నీ
కరయఁగఁ బెక్కు సెప్పిరి; మదాత్మయు నీదెసఁ బ్రీతి పెద్దయుం
బొరయుట నేనుఁ గొన్ని యిటు పోలిన భంగి నెఱుంగఁ జెప్పితిన్. 78

ప్రతిపదార్థం: నరవర!= ఓ రాజా!; అరయఁగన్= పరిశీలించి చూస్తే; జనస్తుతుఁడుఁ+ఐన= ప్రజలచేత పొగడబడేవాడు అయిన; నదీ తనూజుఁడున్= గంగాపుత్రుడు, భీష్ముడూ; హరియున్= శ్రీకృష్ణుడూ; పరాశర+ఆత్మజుఁడున్= పరాశరమహర్షి కొడుకైన వ్యాసుడు; ఆదిగన్, కల్గిన పెద్దలు= మొదలయిన పెద్దవారు; ఎల్లన్= అందరూ; నీకున్= నీకు; రాజనీతులు= రాజధర్మాలు; పెక్కు= చాలా (వివరంగా); చెప్పిరి= చెప్పి ఉన్నారు; మత్ ఆత్మయున్= నా మనసు కూడా; నీదెసన్= నీ మీదే; పెద్దయున్= మిక్కుటంగా; ప్రీతి= వాత్సల్యం; పొరయుటన్= పొంది ఉండటం చేత; నేనున్= నేను కూడా; ఇటు= ఈ విధంగా; కొన్ని= కొద్దిగా రాజనీతులును; పోలిన భంగిన్= సాధ్యమైన (చేతనైన) విధంగా; ఎఱుంగన్, చెప్పితిన్= (నీకు) తెలియజెప్పాను.

తాత్పర్యం: నరశ్రేష్ఠుడా! ఇంతకు మునుపే భీష్ముడూ, కృష్ణుడూ, వ్యాసుడూ మొదలైన పెద్దలు నీకు రాజనీతులు విస్తారంగా చెప్పారు. అయినా, నీ మీద ఉండే వాత్సల్యం వలన నేను కూడా ఏదో నాకు తెలిసినంత మేర కొద్దిగా రాజధర్మాలు చెప్పాను.

క. **నిత్యవిధి సద్వివేకము । సత్యవ్రతశీల! ధర్మసారజ్ఞ! భవ**
న్మత్యాకలితమ యైనను । నిత్యంబును వృద్ధసేవ నిష్ఠఁ జలుపుమీ!' 79

ప్రతిపదార్థం: సత్యవ్రతశీల!= సత్యమందే తాత్పర్యం ఉన్న నడవడి కలవాడా; ధర్మసారజ్ఞ!= ధర్మం యొక్క సారాన్ని (తత్త్వాన్ని) తెలిసినవాడా! ధర్మరాజా!; నిత్యవిధి(న్)= ఎల్లప్పుడూ, ఆచరించడంలో; సత్+వివేకము= శ్రేష్ఠమైన రాజనీతి జ్ఞానం; భవత్+మతి+ఆకలితము+అ= నీ బుద్ధిలో ఉన్నదే; ఐనను= అయినప్పటికీ; నిత్యంబును= ఎప్పుడూ; నిష్ఠన్= శ్రద్ధతో; వృద్ధసేవ(న్)= పెద్దలను సేవించటం; చలుపుమీ!= చేయుమా!

తాత్పర్యం: సత్యవ్రతం కల ప్రవర్తన కలవాడా! ధర్మసూక్ష్మం ఎరిగినవాడా! ధర్మరాజా! ఎల్లప్పుడూ ఆచరిస్తుండటం వలన రాజనీతిజ్ఞానం నీకు బుద్ధిస్థమే. అయినా నిత్యము శ్రద్ధతో పెద్దలను సేవించుము.'

సీ. **అన విని ధర్మజుం డంబికా పుత్త్రుతో । 'నాపగాసుతుఁడు లేఁ' డబ్జనాభుఁ**
డాత్మపురంబున కరిగె; వాత్సల్యత । నీవు దక్కఁగ నాకు హితము సెప్ప
నొడయఁ డెవ్వఁడు? భవదుపదిష్ట పథమున । నిష్ఠమై నడచెద; నెమ్మనమున
నీవు ప్రీతిని బొందు నృపముఖ్య!' నావుడు । నాతఁడు సంతసమంది యతని

ఆ. **'నధిప! విశ్రమింపు మధికశ్రమంబు నా । తనువునందుఁ జెందె' నని తగంగఁ**
బోవఁ జెప్పి; బాంధవావళి కభిముఖుఁ । డయి నిజాలయముల కరుగఁ బనిచి. 80

ప్రతిపదార్థం: అనన్= ధృతరాష్ట్రు డీ విధంగా రాజనీతులను చెప్పగా; విని= గ్రహించి; ధర్మజుండు= ధర్మరాజు; అంబికా పుత్త్రుతోన్= అంబిక కొడుకైన ధృతరాష్ట్రుడితో (ఇట్లా అన్నాడు); నృపముఖ్య= రాజులలో ప్రధానుడా; ఆపగా సుతుఁడు= గంగాపుత్రుడైన భీష్ముడు; లేఁడు= ప్రస్తుతం లేడు (మరణించాడు); అబ్జనాభుఁడు= కృష్ణుడు; ఆత్మపురంబునకున్= తన నగరానికి (ద్వారకకు); అరిగెన్= వెళ్ళాడు కాబట్టి; నాకున్= నాకు; వాత్సల్యతన్= ప్రేమగా; హితము= మంచిని, (కర్తవ్యాన్ని); చెప్పన్= తెలియజెప్పడానికి; నీవు= నీవు (ధృతరాష్ట్రుడు); తక్కఁగన్= తప్ప; ఒడయఁడు= నాథుడు; ఎవ్వఁడు?= ఎవరున్నారు?; భవత్+ఉపదిష్ట, పథమునన్= నీవు ఉపదేశించిన మార్గంలోనే; నిష్ఠమైన్= శ్రద్ధగా (ఏకాగ్రతతో) నడచెదన్= నడచుకొంటాను; నీవు= నీవు; నెమ్మనమునన్= (నీ) నిండు మనస్సులో (మనసునిండా); ప్రీతిని= సంతోషం; పొందు= పొందవలసింది; నావుడున్= అని ధర్మరాజు పలుకగా; అతఁడు= ఆ ధృతరాష్ట్రుడు; సంతసము= సంతోషాన్ని; అంది= పొంది; అతనిన్= ఆ ధర్మరాజుతో (ఇట్లా అన్నాడు); అధిప!= (ధర్మ) రాజా!; విశ్రమింపుము= నీ విక విశ్రాంతి తీసికొమ్ము; నా తనువునందున్= నా శరీరంలో; అధిక శ్రమంబు= మిక్కిలి అలసట; చెందెన్= కలిగింది; అని= అని చెప్పి; తగంగన్= తగు విధంగా; పోవన్+చెప్పి= ధర్మరాజునకు వీడుకోలు పలికి; బాంధవ+ఆవళికిన్= తన బంధు సమూహానికి; అభిముఖుఁడు+అయి= ఎదురుగా ఉండి, బంధువులవైపు తిరిగి, వాళ్ళతో వాళ్ళని; నిజ+ఆలయములకున్= తమ తమ ఇండ్లకు; అరుగన్= వెళ్ళటానికి; పనిచి= నియోగించి; (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు చెప్పిన రాజనీతులు విన్న తర్వాత ధర్మరాజు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు: రాజశ్రేష్ఠుడా! ఇపుడు భీష్ముడు అసలు లేడు. కృష్ణుడు ద్వారకకు వెళ్ళాడు. ప్రేమతో హితం చెప్పగలిగిన పెద్దవాడివి నీవు తప్ప నాకు ఇంకెవ రున్నారు? నీవు ఉపదేశించిన మార్గంలో శ్రద్ధగా నడుస్తాను. మనసు నిండుగా సంతోషించుము.' ధర్మరాజు పలికిన ఈ మాటలు విని ధృతరాష్ట్రుడు సంతోషించాడు. 'ధర్మరాజా! ఇక విశ్రాంతి తీసికొమ్ము. నాకు కూడా ఒళ్ళంతా బాగా అలసిపోయింది' అని ధర్మరాజును మంచి మాటలతో వీడుకొలిపాడు. బంధువులను వాళ్ళ ఇళ్ళకు పంపించాడు ధృతరాష్ట్రుడు.

వ. తాను నభ్యంతర గృహంబున కరిగి సుఖాసీనుం డైయున్న నమ్మానవనాథుతో గాంధారి 'దేవా! వనంబున కెపుడు విచ్చేయువాఁడ?' వని యడిగిన, నా భూవల్లభుం డద్దేవి కిట్లనియె. 81

ప్రతిపదార్థం: తానున్= తాను కూడా; అభ్యంతర గృహంబునకున్= లోపలి మందిరానికి; అరిగి= వెళ్ళి; సుఖ ఆసీనుండు, ఐ= సుఖంగా కూర్చున్న వాడై; ఉన్నన్= ఉండగా; ఆ+మానవ నాథుతోన్= ఆ (ధృతరాష్ట్ర) రాజుతో; గాంధారి= భార్య ఐన గాంధారి - (ఇట్లా అన్నది); దేవా= రాజా!; వనంబునకున్= అరణ్యానికి; ఎపుడు= ఎప్పుడు; విచ్చేయువాఁడవు= వస్తావు; అని అడిగినన్= అని ప్రశ్నించగా; ఆ భూవల్లభుండు= ఆ (ధృతరాష్ట్ర) రాజు; అ+దేవికిన్= ఆ పట్టపురాణితో; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజునూ, ఇతర బంధువులనూ అందరినీ పంపి వేసిన తరువాత ధృతరాష్ట్రుడు కూడా తన మందిరానికి వెళ్ళి సుఖంగా ఆసీనుడయ్యాడు. అపుడు గాంధారి, 'రాజా! అరణ్యానికి ఎప్పుడు వెళ్ళుతావు?' అని అడిగింది. భార్యతో ధృతరాష్ట్రుడిట్లా అన్నాడు.

క. మా తండ్రి పరాశరసుతు। చేతం బడసితి ననుజ్ఞ; శీలపరత్వో
పేతుఁ డగు ధర్మతనయుఁడు। ప్రీతి నొడంబడియె బంధుబృందయుతముగన్. 82

ప్రతిపదార్థం: మా తండ్రి= మా తండ్రి; పరాశర సుతు చేతన్= వ్యాసమహర్షి చేత; అనుజ్ఞన్= అనుమతిని; పడసితిన్= పొందాను; శీలపరత్వ+ఉపేతుఁడు= నడవడియొక్క ఉత్తమధర్మంతో కూడినవాడు (మంచి నడవడి గలవాడు); అగు= అయిన; ధర్మ తనయుఁడు= ధర్మరాజు; బంధు బృంద యుతముగన్= చుట్టాలందరితో కలిసి; ప్రీతిన్= ఇష్టపూర్వకంగా; ఒడంబడియెన్= అంగీకరించాడు.

తాత్పర్యం: 'మా కన్నతండ్రి వ్యాసమహర్షి నుండి ఆశ్రమవాసానికి అనుమతి పొందాను. నేను అరణ్యాలకు వెళ్ళటానికి ఉత్తమశీలుడైన ధర్మరాజు కూడా బంధువులతో సహా అంగీకరించాడు.

ఆ. ఇంకఁ దడయ నేల? యింతి! వే వెడలుద। మట్లు కల్లజూద మాడి పాప
భాగు లైన నీదు పట్టుల సుగతికి। ననుచువాఁడఁ దపము నతిశయమున. 83

ప్రతిపదార్థం: ఇంతి!= ఓ వనితా!; ఇంకన్= ఇంకా; తడయన్= ఆలసించటం; ఏల?= ఎందుకు?; వే= త్వరగా; వెడలుదము= అడవికి బయలుదేరుదాం; అట్లు= ఆ విధంగా; కల్ల జూదము= అబద్ధపు (మోసపు) జూదం; ఆడి= ఆడి; పాపభాగులు= పాపాన్ని పొందిన వారు; ఐన= అయినటువంటి; నీదు పట్టులన్= నీకొడుకులను; తపము+అతి శయమునన్= (నా) తపస్సు మేలిమి చేత; సుగతికిన్= మంచి ఊర్ధ్వలోక స్థితులకు; అనుచువాఁడన్= పంపుతాను.

తాత్పర్యం: వనితా! ఇంకా ఆలస్యం ఎందుకు? వెంటనే అడవులకు బయలుదేరుదాం. అబద్ధపు జూదమాడి పాపాన్ని పొందిన నీ కొడుకులను, అడవులలో గొప్ప తపస్సు చేసి మంచిలోకాలకు పంపుతాను.

విశేషం: కారణాలు ముందుగా గాంధారిచేత కూడా అనిపించింది మూలం. ప్రశ్న మాత్రం గాంధారిది. ధృతరాష్ట్రుడే సమాధానంలో కారణం చెప్పడం తెలుగులో మార్పు. 'పాపభాగులైన' అనే సందర్భంలో 'నీదుపట్టులు' నీ (గాంధారి) కొడుకులు - అనటం గమనించదగింది. గొప్ప పనులు చేసినపుడు నా పుత్రులనీ, తప్పుడు పనులు చేసినపుడు నీ కొడుకు లనీ భార్యాభర్తలు వ్యవహరించడం సహజం. ఆ స్వభావానికి ఇది అనుగుణం. వార్ధకదశలో ఆశ్రమవాసం చేయడం కులోచితం. కాని ధృతరాష్ట్రుడి అసలు ఆంతర్యం ఇక్కడ బయటికివచ్చింది. దుర్మార్గాల వలన పాపులైన కొడుకులకు మరణానంతరం దుర్గతులే కలిగి ఉంటాయని ధృతరాష్ట్రుడి నిశ్చయం. పైకి ఊర్ధ్వగతులు పొందా రంటున్నా (25), తపస్సు చేసి కొడుకులకు సుగతులు సాధించడం కోసం అడవులకు వెళ్ళటం అని ఇక్కడ చెప్పుతున్నాడు. 'నీదుపట్టు' లన్నా కొడుకుల మీది ప్రేమ నిది నిరూపిస్తుంది. మూలంలో ఈ అంశం ఇపుడు కానరాదు.

ధృతరాష్ట్రుండు వనవాసంబునకుం బురజనులచే ననుజ్ఞ గొనుట (సం.15-13-8)

వ. అని పలికి యమ్మగువదిక్కు మొగం బయి ' వారికి సుగతి గల్గునట్లుగా నిప్పుడును గొన్ని పుణ్యక్రియ లజాతశత్రుననుమతితో నాచరించి పోదము గాక!' యని నిశ్చయించి తనకుఁ దపోవనగమనంబునకై పౌరులయనుజ్ఞ గొనవలయు నని పాండవాగ్రజునకుం జెప్పం బనిచిన నతండు దగుపురజనంబుల నెల్లను బడి చేసి వెలార్చికొనుచు నఖిలబంధుమిత్త్రులునుం దానును వచ్చి ధృతరాష్ట్రు మందిర ద్వారపురోభాగం బున నిలిచె; నయ్యాంబికేయుండు గాంధారియుం దోడ రా వెడలి వారి సన్నిధికిం జని, బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర సంకులం బైయున్న యన్నగర జన ప్రకరంబు నుద్దేశించి. 84

ప్రతిపదార్థం: అని పలికి= ఈ విధంగా చెప్పి; ఆ+మగువదిక్కు= ఆ గాంధారివైపుగా; మొగంబు అయి= ముఖం తిప్పి; వారికిన్ = కొడుకులకు; సుగతి= ఉత్తమ లోకస్థితి; కల్గునట్లు గాన్= సిద్ధించే విధంగా; ఇప్పుడును= ఇప్పుడు కూడా; అజాత శత్రు= ధర్మరాజు యొక్క; అనుమతితోన్= అంగీకారంతో; కొన్ని పుణ్యక్రియలు= శ్రాద్ధ దానాది కర్మలు కొన్ని; ఆచరించి= చేసి; పోదము, కాక= (తర్వాత) అడవికి వెళ్దాం; అని= అనే విధంగా; నిశ్చయించి= నిర్ణయం చేసికొని; పాండవ+అగ్రజునకున్= పాండు కుమారులలో మొదటివాడైన ధర్మరాజుతో; తనకున్= ధృతరాష్ట్రుడికి; తపోవనగమనంబునకున్+అయి= తపస్సు చేసికొనడానికి, అరణ్యాలకు వెళ్ళటం కొరకు; పౌరుల అనుజ్ఞ= ప్రజలయొక్క అనుమతి; కొనవలయున్= పొందవలసి ఉన్నది; అని= అని; చెప్పన్+పనిచినన్= నివేదింపగా; అతండు= ఆ ధర్మరాజు; తగు పురజనులన్= అర్హులైన నగర వాసులను; ఎల్లను= అందరినీ; పడిచేసి= ఆజ్ఞాపెట్టి; వెలార్చికొనుచున్= పంపుతూ; అఖిలబంధు మిత్రులున్= చుట్టాలూ; స్నేహితులూ అందరూ; తానును= స్వయంగానూ (ధర్మరాజూ); వచ్చి= వచ్చి; ధృతరాష్ట్రు= ధృతరాష్ట్రుడియొక్క; మందిర-ద్వార-పురస్+భాగంబునన్= భవనంయొక్క వాకిటిముందు; నిలిచెన్= నిలువబడ్డాడు; ఆ+ఆంబికేయుండు= అంబికా పుత్రుడైన ఆ ధృతరాష్ట్రుడు; గాంధారియున్= గాంధారి కూడా; తోడన్ రాన్= వెంట రాగా; వెడలి= బయలుదేరి; వారి సన్నిధికిన్= వాకిట ఉన్న పౌర, బంధు మిత్రాదుల వద్దకు; చని= వెళ్ళి; బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర, సంకులంబు+ఐన= బ్రాహ్మణులతోనూ, క్షత్రియులతోనూ, వైశ్యులతోనూ, శూద్రులతోనూ నిండిన; ఆ+నగర జనప్రకరంబు= ఆ నగరంలో ఉండే ప్రజలయొక్క సమూహాన్ని; ఉద్దేశించి= లక్ష్యం చేసికొని (వారితో) ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: తర్వాత గాంధారివైపు తిరిగి 'కొడుకులకు ఊర్ధ్వలోకాలు కలిగేటట్లుగా ఇపుడు కూడా ధర్మరాజు అంగీకారంతో, శ్రాద్ధాది పుణ్యకర్మలు కొన్ని చేసి తర్వాత అడవులకు పోదాం' అని నిర్ణయించాడు ధృతరాష్ట్రుడు. తపస్సుకై అరణ్యాలకు పోవటానికి పౌరుల అనుమతి తీసికొనా లని ధర్మరాజుకు కబురంపాడు. వెంటనే ధర్మరాజు రాజధానిలో ఉన్న ప్రజలలో అర్హులైన వారికి ఆజ్ఞ చేసి రప్పించాడు, బంధువులనూ, స్నేహితులనూ అందర్నీ తీసికొని తానూ వెళ్ళాడు. అందరూ కలిసి ధృతరాష్ట్రుడి ముందరి వాకిటి ముందు నిలిచారు. అపుడు గాంధారి వెంట రాగా ధృతరాష్ట్రుడు వారి వద్దకు వచ్చి, బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులతో నిండి ఉన్న ఆ నగర ప్రజలతో ఇట్లా అన్నాడు.

సీ. **'కౌరవ కోటియు మీరుఁ బెద్దయుఁ గాల । మనఁగి పెనంగి యన్యోన్య సంభృ**
తాధిక స్నేహుల రై ప్రవర్తించితి । రనఘవర్తనులార! వినుఁడు నాదు
పలుకు; వృద్ధునకుఁ దపశ్చరణంబున । కై వనంబున కేఁగు టర్హకర్మ;
ముచిత కృత్యంబుల యోజ మీ రెఱిఁగిన - యదియ కా మదిముదమార మీర

ఆ. **లెల్ల నా కనుజ్ఞ యిచ్చి కానకుఁ బుచ్చుఁ । డనుడు సర్వజనులు నశ్రు పిహిత**
దృష్టు లగుచు గద్గదిక నెలుం గెడలఁగ । నార్తి దోఁప నేడ్చి రధిపముఖ్య! **85**

ప్రతిపదార్థం: అనఘవర్తనులార!= పాపం లేని నడవడి కలిగిన జనులారా!; కౌరవకోటియున్= కురువంశీయుల సమూహమూ; మీరున్= మీరూ; పెద్దయున్+కాలము= చాలా కాలంగా; అనఁగి-పెనంగి= కలిసి మెలసి; అన్యోన్య-సంభృత+అధిక+స్నేహులరు+ఐ= ఒకరి మీద ఒకరికి నిండిన అధికమైన ఆదరం కలిగినవారై; ప్రవర్తించితిరి= వ్యవహరించారు; నాదు పలుకు= (ఇపుడు) నా మాట; వినుఁడు= వినండి; వృద్ధునకున్= వయసు మీరినవాడికి; తపస్+చరణంబునకున్+ఐ= తపస్సు ఆచరించటం కొరకు; వనంబునకున్= అరణ్యాలకు; ఏఁగుట= వెళ్ళడం; అర్హవిధము; తగిన పద్ధతి; ఉచిత కృత్యంబుల ఓజ= తగిన పనుల క్రమం; మీరు= మీ రందరు; ఎఱిఁగిన+అది+అకా= తెలిసినదే కదా; మీరలు= మీరు; ఎల్లన్= అందరూ; మదిన్= మనస్సులో; ముదము+ఆరన్= సంతోషం నిండగా; నాకున్= నాకు; అనుజ్ఞ= అనుమతిని; ఇచ్చి= ఇచ్చి; కానకున్= అరణ్యానికి; పుచ్చుఁడు= పంపండి; అనుడున్= ధృతరాష్ట్రుడు అట్లా అనగానే; అధిపముఖ్య!= ఓ జనమేజయ మహారాజా!; సర్వజనులు= అక్కడ ఉన్నవారు అందరూ; అశ్రు పిహిత దృష్టులు= కన్నీటి చేత కప్పబడిన చూపు కలిగినవారు; అగుచున్= అవుతూ; గద్గదికన్= డగ్గుత్తికచేత; ఎలుంగు= కంఠస్వరం; ఎడలఁగన్= క్షీణించగా; ఆర్తి= దుఃఖం; తోఁపన్= వ్యక్తం కాగా; ఏడ్చిరి= విలపించారు.

తాత్పర్యం: 'పుణ్యాత్ములారా! కౌరవులూ, మీరూ చాలా కాలంగా పరస్పరం దృఢ స్నేహంతో కలిసి మెలిసి ఉన్నారు. ఇపుడు నా మాట వినండి. వయసు మీరిన వాడికి తపస్సు చేసికొనే నిమిత్తం అడవులకు పోవటం అనేది తగిన పద్ధతి. యుక్తమైన పనుల క్రమం (ఎప్పుడు ఏ పని చేయాలో) మీకు తెలిసిందే కదా! అందుచేత మీ రందరూ సంతోషంగా అనుమతించి నన్ను అడవికి పంపండి. (అన్నాడు ధృతరాష్ట్రుడు). జనమేజయ మహారాజా! ధృతరాష్ట్రుడు అట్లా అనగానే అక్కడ ఉన్న వారంతా కళ్ళలో నీళ్ళు నిండిపోగా చూపు సరిగా లేనివారై, డగ్గుత్తిక వలన కంఠస్వరం క్షీణించి దుః ఖంతో విలపించారు. (అన్నాడు వైశంపాయనుడు).

వ. **విని ధృతరాష్ట్రుఁడు వారి కిట్లనియె.** **86**

ప్రతిపదార్థం: విని= వారి ఏడుపులు ఆలకించి; వారికిన్= వారితో; ధృతరాష్ట్రుఁడు= ధృతరాష్ట్రుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: బంధుజనాదుల ఏడుపులు విని ధృతరాష్ట్రుడు వాళ్ళతో ఇట్లా అన్నాడు.

సీ. **'ప్రజ ముద మొందంగఁ బాలించెఁ బుడమి శం । తనుఁ; డనంతరము శాంతనవు చేత**
రక్షితుఁ డగుచు మీరలు ప్రీతిఁ బొదల వి । చిత్రవీర్యుండు నిద్ధాత్రి యేలెఁ ।
బదపడి పాండు నృపాలుండు మీరు హ । ర్షింపంగ భూమి రక్షించెఁ బిదప
ధర్మనందనుని చందము మీ యెఱింగిన । యది; సత్యధర్మాత్ముఁడైన యితని

తే. **ననుసరింపక యన్యాయ మాచరించి । దుర్ణయంబున నిల యేలి త్రుంచెఁ గులము**
నుర్విఁ గల భూపతులను దుర్యోధనుండు; । వాని దుశ్చేష్టలకు మూల మేన కాదె! 87

ప్రతిపదార్థం: శంతనుఁడు= (భీష్ముడి తండ్రి) శంతన మహారాజు; ప్రజ= జనం; ముదము= సంతోషం; ఒందఁగన్= పొందే విధంగా; పుడమిన్= ఈ భూమిని; పాలించెన్= పాలించాడు; అనంతరము= శంతనుడి తర్వాత; శాంతనవు చేతన్= శంతనుడి కొడుకైన భీష్ముడి చేత; రక్షితుఁడు= కాపాడబడినవాడు; అగుచున్= అవుతూ; మీరలు= మీరు(ప్రజలు); ప్రీతిన్= సంతోషంతో; పొదలన్= వర్ధిల్లగా; విచిత్రవీర్యుండున్= విచిత్రవీర్యుడు కూడా; ఈ+ధాత్రిన్= ఈ భూమిని; ఏలెన్= పాలించాడు; పదపడి= ఆ తర్వాత; మీరు= మీరు (ప్రజలు); హర్షింపంగన్= సంతోషించే విధంగా; పాండు నృపాలుండు; భూమిన్= ఈ భూమిని; రక్షించెన్= కాపాడాడు; పిదపన్= ఆ తర్వాత (రాజవడం మొ॥); ధర్మనందనుని చందము= ధర్మరాజు సంగతి; మీ ఎఱింగిన+అది= మీకు తెలిసిందే; సత్య ధర్మాత్ముఁడు= యథార్థమైన ధర్మరూపుడు; ఐన= అయినటువంటి; ఇతనిన్= ఈ ధర్మరాజును; అనుసరింపక= అతడివలె ఆచరించకుండా; అన్యాయము= అధర్మం; ఆచరించి= చేసి; దుర్ణయంబునన్= అనుచితమార్గంలో; ఇల= ఈ భూమిని; ఏలి= పాలించి; దుర్యోధనుండు= దుర్యోధనుడు; కులమున్= కౌరవవంశాన్నీ; ఉర్విన్= ఈ భూమిపై; కల= ఉన్న; భూపతులన్= రాజులను; ఎల్లన్= అందరినీ; త్రుంచెన్= నాశనం చేశాడు; వాని= ఆ దుర్యోధనుడియొక్క; దుశ్చేష్టలకున్= దుర్మార్గాలకు; మూలము= ప్రధాన కారణం; ఏను+అ= నేనే; కాదె!= కదా!

తాత్పర్యం: (పౌరులారా!) ఈ రాజ్యాన్ని శంతను మహారాజు ప్రజారంజకంగా పరిపాలించాడు. తర్వాత అతడి కొడుకు భీష్ముడు కాపాడుతూ ఉండగా విచిత్రవీర్యుడు రాజ్యం చేశాడు. ఆ తర్వాత పాండురాజు ఈ రాజ్యాన్ని రక్షించాడు. అటు పిదప ధర్మరాజు రాజు కావటం అతడి పాలనం అంతా మీకు తెలిసిందే. ధర్మహృదయుడైన ఈతడిని అనుసరించకుండా అన్యాయంగా అవినీతితో రాజ్యాన్ని పాలించిన దుర్యోధనుడు కురువంశాన్నీ మిత్రులైన రాజులనూ నాశనం చేశాడు. నిజానికి దానికి కారణం నేనే.

వ. **అది మీ మనంబులం బెట్టక. 88**

ప్రతిపదార్థం: అది= దుర్యోధనుడి దుర్మార్గాలకు తానే (ధృతరాష్ట్రుడే) మూలం అనే విషయం; మీ మనంబులన్= మీ హృదయాలలో; పెట్టక= ప్రవేశింపనీయకుండా.

తాత్పర్యం: దీనిని మీ మనసులలో పెట్టుకొనకుండా (తరువాతి పద్యంతో అన్వయం)

క. **మహి లెస్సఁగ రక్షించిన । మహిత గుణుల యన్న కొడుకు మనుమం డని నా**
కు హితంబు గోరి కరుణా । సహితుల రై యిం డనుజ్ఞ సద్వ్రతమునకున్. 89

ప్రతిపదార్థం: మహిన్= ఈ భూమిని; లెస్సగన్= మంచిగా; రక్షించిన= పాలించినట్టి; మహిత గుణుల= గొప్ప గుణవంతు లైన; పాండు - విచిత్ర వీర్య - శంతనులకు; అన్న= అగ్రజుడూ; కొడుకు= పుత్రుడూ; మనుమండు= పౌత్రుడూ; అని= అనే అభిప్రాయంతో (నైనా); హితంబు= మేలు; కోరి= కోరుకొని; కరుణా-సహితులరు-ఐ= దయగలవారై; సత్+వ్రతమునకున్= తపశ్చరణం అనే మంచిపనికై; నాకున్= నాకు; అనుజ్ఞ= అనుమతి; ఇండు= ఇవ్వండి.

తాత్పర్యం: (పౌరులారా)! ఈ రాజ్యాన్ని చక్కగా పాలించిన గుణవంతులైన పాండురాజుకి అన్ననని, విచిత్రవీర్యుడికి కొడుకునని, భీష్మశంతనులకు మనుమడినని మనసులో ఉంచుకొని (అయినా) నాకు మేలు కోరుతూ నా తపశ్చరణానికి దయతో అనుమతించండి.

విశేషం: దుర్యోధనుడి దుశ్చేష్టలకు మూలం కావడం చేత తనమీద ప్రజలకు కోపం ఉండాలి. ఒకవేళ అది మనసులో పెట్టుకొనకపోయినా ధృతరాష్ట్రుడిని అభిమానించాల్సిన గుణ విశేషం అతడిలో లేదు. అందుకే నన్ను చూసి కాకపోయినా ప్రజలు కీర్తించే, పాండురాజు, విచిత్రవీర్యుడు - (భీష్ముడు శంతనుడు - అనే పెద్దవారితో ఉన్న బంధుత్వాన్ని అనుసరించి అయినా తనకు మేలు కోరుకొమ్మని, ధృతరాష్ట్రుడి తాత్పర్యం.)

వ. **అని యప్పు డజ్జనంబులమనంబుల లేకున్నను దన కీ ళ్లుగ్గడించి యరణ్యగమనానుజ్ఞాకరణంబునకుఁ బ్రార్థించి యవ్విభుండు వెండియు.** **90**

ప్రతిపదార్థం: అని= అట్లా పలికి; అప్పుడు= ఆ సమయంలో; ఆ+జనంబుల= అక్కడ ఉన్న పౌరుల; మనంబులన్= మనస్సులలో; లేకున్నను= లేకపోయినప్పటికీ; తన కీళ్ళు= తాను చేసిన తప్పిదాలు; ఉగ్గడించి= చెప్పి; అరణ్య గమన అనుజ్ఞా కరణంబునకున్= అడవులకు వెళ్ళడానికి అనుమతి చేయటం కొరకు; ప్రార్థించి= వేడుకొని; ఆ+విభుండు= ఆ ధృతరాష్ట్రుడు; వెండియున్=మరలా,

తాత్పర్యం: (జనమేజయ మహారాజా!) ఆ పౌరులమనసులలో అపుడు లేకపోయినా ధృతరాష్ట్రుడు తాను లోగడ చేసిన తప్పిదాలను చెప్పి, అడవులకు వెళ్ళటానికి అనుమతిమ్మని వాళ్ళను ప్రార్థిస్తూ ఆ రాజు (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. **వృద్ధ కృపణ పుత్త్ర విరహిత గాంధారి । యీ నెలంతఁ జూచి యైన మీర**
లకట! కాననమున కరుగుట మే లని । మా కనుజ్ఞ యిండు మాన్యులార!' **91**

ప్రతిపదార్థం: మాన్యులార!= గౌరవించదగినవారలార!; గాంధారి= ఈ గాంధారి; వృద్ధ= వయసుచేత పెద్దది; కృపణ= తపః ప్రభృతి కర్మలచేత కృశించినదీ; పుత్త్రవిరహిత= కొడుకులను పోగొట్టుకొన్నది; అకట!= అయ్యో!; ఈ నెలంతన్= ఇటువంటి స్థితిలో ఉన్న ఆడదాన్ని, చూసి ఐన; కాననమునకున్= అడవికి; అరుగుట= వెళ్ళటం; మేలు+అని= మంచిదని; మీరలు= మీరందరు; మాకున్= మాకు; అనుజ్ఞ ఇండు= అనుమతి ఇవ్వండి.

తాత్పర్యం: పూజ్యు (లైన పౌరు) లారా! గాంధారి వృద్ధురాలు. వ్రతాదులవలన కృశించింది. కొడుకులను పోగొట్టుకొన్నది. అటువంటి గాంధారిని చూచి ఐనా మేము అడవులకు వెళ్ళటమే మంచిదని గ్రహించి అందుకు మాకు అనుమతి ఇవ్వండి.'

వ. అని పలికి పాండవాగ్రజుం జూపి. 92

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; పలికి= మాటాడి; పాండవ+అగ్రజున్= ధర్మరాజును; చూపి= చూపించి.

తాత్పర్యం: ఆ విధంగా చెప్పి ధృతరాష్ట్రుడు పౌరులకు ధర్మరాజును చూపిస్తూ (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. తమ్ముల నడుమ నీతండు దిక్పాలక । మధ్య భాసితుఁ డైన మఘవుఁ బోలి
మహనీయ విభవ సమగ్రత వెలిఁగెడు । నేమిట నేమఱ కెపుడు మీర
లీతనిఁ బొదివి సంప్రీతిగ వర్తింపుఁ । డయ్య! యిల్లడ యిమ్మహానుభావు
నిడితి మీకడ; మిమ్ము నెల్ల భంగులఁ దన । పరిపాలనంబునఁ బరమసుఖులఁ

ఆ. గా నొనర్చువాఁడు గా నప్పగించిన । వాఁడ నేను మీకు వేఁడి దాఁకు
నట్లుగాఁ జరింప నస్మత్కులీనుల ।కధిక దుఃఖకారి నైతిఁ గాని. 93

ప్రతిపదార్థం: ఈతండు= ఈ ధర్మరాజు; తమ్ముల నడుమన్= భీముడు మొదలైన నలుగురు తమ్ముళ్ళ మధ్య; దిక్పాలక మధ్య భాసితుఁడు= దిక్పాలకులైన దేవతలకు నడుమ ప్రకాశించేనాడు; ఐన= అయినటువంటి; మఘవున్= దేవేంద్రుడిని; పోలి= వలె; మహనీయ విభవ సమగ్రతన్= గొప్పదీ, లోటు లేనిదీ అయిన వైభవంతో; వెలిఁగెడున్= వెలుగుతున్నాడు; మీరలు= మీరు; ఏమిటన్= ఏవిషయంలోనూ; ఏమఱక= (మరుపు లేకుండా) అప్రమత్తతతో; ఎపుడు(న్)= నిత్యమూ; ఈతనిన్= ఈ ధర్మరాజును; పొదివి= దగ్గరకు తీసికొని, (జాగ్రత్తగా); సంప్రీతిగన్= ఇష్టంగా; వర్తింపుఁడయ్య= నడుచుకొనండి; ఈ+మహానుభావున్= గొప్పవాడైన ఈ ధర్మరాజును; మీకడన్= మీవద్ద; ఇల్లడ= న్యాసంగా; ఇడితిన్= ఉంచాను; తనపరిపాలనంబునన్= తన యొక్కరాజ్యరక్షణ విధానంచేత; ఎల్ల భంగులన్= అన్ని విధాలుగానూ; మిమ్మున్= ప్రజలను; పరమసుఖులన్= మిక్కిలి సుఖపడేవారలు; కాన్= అయ్యేటట్లుగా; ఒనర్చువాఁడు కాన్= చేసేవాడిగా; అప్పగించిన వాఁడన్= ఒప్ప జెప్పుతున్నాను; నేను= నేను; అస్మత్కులీనులకున్= నా వంశంవారికి; అధిక దుఃఖకారిన్= మిక్కిలి కష్టం కల్గించినవాడిని; ఐతిన్= అయ్యాను; కాని= అంతేతప్ప; మీకున్= ప్రజలకు; వేఁడి= కష్టం; తాఁకునట్లుగాన్= తగిలేవిధంగా; చరింపన్= నడవను; అధిక దుఃఖకారిన్= మిక్కిలి కష్టం కలిగించినవాడిని; ఐతిన్= అయ్యాను; కాని= అంతే తప్ప; మీకున్= ప్రజలకు; వేఁడి= కష్టం, (నొప్పి); తాఁకునట్లు కాన్= తగిలేవిధంగా; నేను= నేను (ధృతరాష్ట్రుడు); చరింపన్= నడవను.

తాత్పర్యం: ఈ ధర్మరాజు తమ్ములనడుమ దిక్పాలకుల మధ్య దేవేంద్రుడివలె వైభవంగా వెలిగిపోతున్నాడు. ఏ విషయంలోనూ ఏమరుపాటు లేకుండా, మీరు ఈతడిని పొదుపుకొని ఇష్టంగా నడుచుకొండి. మీవద్ద న్యాసంగా నేను ఈ ధర్మరాజును ఉంచుతున్నాను. తన పరిపాలనా విధానం చేత అన్ని విధాలుగా మిమ్మల్ని సుఖపెడతాడనే ఇతడిని మీకు రాజుగా అప్పగిస్తున్నాను. నా వాళ్ళకు కష్టం కలిగించాను కానీ, మీకు కష్టం కలిగే పని నేను ఎప్పుడూ చేయను.

క. అరయ నెన్నం డైనను । మీరలు నా కెగ్గు గాఁగ మెలఁగుట లే; దో
పౌరవరులార! నన్నున్ । గారవమున ననుపరయ్య కాననమునకున్!' 94

ప్రతిపదార్థం: ఓ పౌరవరులార!= ఓ పురజనోత్తములారా!; ఆరయన్= పరిశీలించి చూడగా; మీరలు= మీరు; ఎన్నండు, ఐనను= ఏ నాడు కూడా; నాకున్= నాకు; ఎగ్గు= కీడు; కాఁగన్= కలిగేటట్లుగా; మెలఁగుట= వ్యవహరించటం; లేదు= జరగ లేదు; నన్నున్= అటువంటి నన్ను; గారవమునన్= ప్రేమతో; కాననమునకున్= అడవికి; అనుపరయ్యా= పంపండి.

తాత్పర్యం: ఓ పౌరశ్రేష్ఠులారా! ఏనాడూ నాకు అపకారం కలిగే విధంగా మీరు ప్రవర్తించలేదు. ఇపుడు గూడా అదేవిధంగా ఆదరంతో నన్ను అడవికి పంపించండి.'

వ. అనినం బౌరజనంబు లేడ్పులు మ్రింగికొని యొండొరులం జూచుచు నూరకున్న నమ్మహీశ్వరుండు మఱియును. 95

ప్రతిపదార్థం: అనినన్= అని (ధృతరాష్ట్రుడు) పల్కగా; పౌరజనంబులు= ఆ పురజనులు; ఏడ్పులు= ఏడుపులను; మ్రింగికొని= అణచుకొంటూ; ఒండొరులన్= ఒక ళ్ళొకళ్ళని - పరస్పరం; చూచుచున్= చూస్తూ; ఊరకున్నన్= మాటాడకుండా ఉండగా; ఆ +మహీ+ఈశ్వరుండు= ఆ ధృతరాష్ట్రుడు; మఱియును= మరలా - (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు పై విధంగా చెప్పగా ఆ పురజనులు ఏడుపులు దిగమ్రింగుకొంటూ పరస్పరం ఒకళ్ళ నొకళ్ళు చూచుకొంటూ ఏమీ మాటాడకుండా ఊరకున్నారు. అప్పుడు ధృతరాష్ట్రుడే మళ్ళీ (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. 'సాధుచరిత్రయు శాంతయు నైన యి। గ్గాంధారియును నేను గాఢ వినయ
మార మీ తెలి విట్లు గోరుచు నున్నార। మఖిల ధర్మాభిజ్ఞుఁ డగు పరాశ
రాత్మజుండును ధార్మికాగ్రణి పాండవా। గ్రజుఁడును నాకు నరణ్య గమన
మునకు నిచ్చి రనుజ్ఞ; మోడ్పుఁ గే లౌదలఁ। గదియించి మిమ్ము వేఁడెదఁ గృపాఢ్యు

తే. లార! యనుమతి సేయుఁడు మీరు' ననుడు। వార లుత్తరీయంబులు వదన వినిహి
తములుగాఁ జేసికొని రోదనము రవంబు। లెసఁగఁ జేసిరి విను ధరణీశవర్య! 96

ప్రతిపదార్థం: సాధు చరిత్రయున్= గుణవంతమైన శీలం కలిగిందీ; శాంతయున్= నిర్వికారయూ; ఐన= అయినటువంటి; ఈ+గాంధారియును= గాంధారీ; నేను(న్)= నేనూ; వినయము+ఆరన్= మిక్కిలి అణకువతో; ఇట్లు= ఈ విధంగా; మీ తెలివి= మీ యొక్క అంగీకారాన్ని; కోరుచున్+ఉన్నారము= కోరుకొంటున్నాము; అఖిల+ధర్మ+అభిజ్ఞుఁడు= సమస్తములైన ధర్మములను చక్కగా తెలిసినవాడు; అగు= అయిన; పరాశర+ఆత్మజుండును= పరాశరమహర్షి కొడుకైన వ్యాసుడూ; ధార్మిక+అగ్రణి= ధర్మబద్ధమైన వర్తనం గల వారిలో ప్రథముడు అయిన; పాండవ+అగ్రజుండును= ధర్మరాజు కూడా; అరణ్య గమనమునకున్= అడవులకు వెళ్ళటానికి; నాకున్= నాకు; అనుజ్ఞ= అనుమతిని; ఇచ్చిరి= ఇచ్చారు; మోడ్పుఁగేలు= అంజలించిన చేతులు; ఔదలన్= శిరస్సుపై; కదియించి= గట్టిగా కూర్చి; మిమ్ముమ్= మిమ్మల్ని; వేఁడెదన్= ప్రార్థిస్తున్నాను; కృపా+ఆఢ్యులార!= అత్యధికమైన దయ గలిగిన వారలారా!; మీరును= మీరు కూడా; అనుమతి+చేయుఁడు= మా వన గమనానికి అనుజ్ఞ ఇవ్వండి; అనుడున్= అని ధృతరాష్ట్రుడు పల్కగా; ధరణీ+ఈశవర్య!= రాజ శ్రేష్ఠుడివైన జనమేజయమహారాజా!; విను= వినవలసింది; వారలు= ఆ పౌరులు; ఉత్తరీయములు= పై వస్త్రాలను; వదన వినిహితములు= ముఖం మీద ఉండేవి; కాన్= అయ్యేటట్లుగా; చేసికొని= చేసికొని; రవంబులు= (ఏడుపు) ధ్వనులు; ఎసఁగన్= మిక్కుటం కాగా; రోదనము చేసిరి= ఏడ్చారు.

తాత్పర్యం: సద్వర్తనం కలిగిందీ, ప్రశాంత చిత్తురాలూ, అయిన ఈ గాంధారీ నేనూ అరణ్య గమనానికి మీ అనుమతిని వినయంగా అర్థిస్తున్నాం. సమస్త ధర్మాలు తెలిసిన వ్యాసమహర్షీ, ధర్మరాజూ మాకు అనుమతి ఇచ్చారు. రెండు చేతులు మోడ్చి శిరస్సుపై ఉంచి మిమ్మల్ని వేడుకొంటున్నాను దయావంతులైన నా పౌరులారా! మీరు కూడా మాకు అనుమతి ఇవ్వండి'. ఓ జనమేజయ మహారాజా! ధృతరాష్ట్రుడు అట్లా అనగానే అక్కడి పౌరులందరూ ఉత్తరీయాలు ముఖాలమీద కప్పుకొని, బిగ్గరగా ఏడ్చారు.

వ. అట్లేడ్చి యుడిగి తమయంతవట్టునుం గూడికొని కార్య వచనంబు లార్యచరితుండును జతురాలాప కల్యుం డును నగు శంబు వను విప్రోత్తమునకుం జెప్పి యిత్తెఱంగున ధృతరాష్ట్రునితో నాడుమని నియోగించిన నాతం డారాజు నగ్రభాగంబునఁ జేరి సవినయంబుగా ని ట్లనియె. 97

ప్రతిపదార్థం: అట్లు= ఆవిధంగా; ఏడ్చి= (కొంతసేపు) రోదించి; ఉడిగి= ఏడుపులు మానుకొని; తమ అంతవట్టునున్= తమలో తాముగా అందరూ; కూడికొని= కలిసి నిశ్చయించుకొని; కార్యవచనంబులు= అవసరమైన మాటలు; ఆర్య చరితుండును= ఉత్తమవర్తనం కలవాడూ; చతుర+ఆలాప+కల్యుండును= నిపుణము లైన మాటలలో సమర్థుడూ; అగు= అయినటువంటి; శంబువు+అను= శంబువు అనే పేరు గలిగిన; విప్ర+ఉత్తమునకున్= బ్రాహ్మణ శ్రేష్ఠుడికి; చెప్పి= వినిపించి; ఈ+తెఱంగునన్= ఈ (తాము చెప్పిన) విధంగా; ధృతరాష్ట్రునితోన్= ధృతరాష్ట్రుడికి; ఆడుము= చెప్పు; అని; నియోగించినన్= ఆ పౌరులు ఏర్పరచగా; ఆతండు= ఆ శంబువు; ఆ రాజు+అగ్రభాగంబునన్= ఆ ధృతరాష్ట్రుడికి ఎదురుగా; చేరి= నిలిచి; సవినయంబుగాన్= అణకువతో; ఇట్లు= ఈప్రకారంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి మాటలకు పెద్దగా ఏడవటం ప్రారంభించిన పౌరులు కాసేపు అట్లా ఏడ్చిన తర్వాత ఏడుపు మానుకొని అందరూ కలిసి మాటాడుకొని, శంబువు అనే మాట నేర్పరికి ధృతరాష్ట్రుడితో ఈ విధంగా చెప్పుమని (కొన్ని మాటలు చెప్పి) ఏర్పాటు చేశారు. అపుడు ఆ శంబువు ధృతరాష్ట్రుడి వద్దకు వెళ్ళి ఎదురుగా ఉండి ఇట్లా చెప్పనారంభించాడు.

విశేషం: సాంబాఖ్యో బహ్వృచో - అని యీ బ్రాహ్మడి పేరు సాంబుడు అని ఒక మూలం, శాకల్యుడని తెనుగుభారతం ప్రత్యంతరాల్లో ఉన్నదట!. తిక్కన కాధారమైన మూలం నేటిదానికి కొంత భిన్నంగా ఉన్నదని ఇట్లాంటి సందర్భాలను బట్టి గుర్తించవచ్చును.

ధృతరాష్ట్రునితో శంబు వను విప్రుఁడు పౌరజన సమ్మతి చెప్పుట (సం. 15-15-10)

సీ. 'భరతవంశోత్తమ । పౌరజనంబులు తమ మాటలుగ భవత్సన్నిధాన
మున న న్నుపన్యాస మొనరింపఁ బంచిన । యట్టిభాషణము లేకాగ్రబుద్ధి
నవధరింపుము! మీ మహాన్వయంబున మహీ । విభులయం దొప్పమి వెదకి యైనఁ
గానము మము మీరు గన్నట్టి ప్రజల నె । ట్లట్ల రక్షించితి రాదరమున

తే. వినుము! దుర్యోధనుండు చేసిన యనర్థ । మొక్కటియు లేదు; నినుఁ ద్రిలోకోత్తరుండు
సత్యవతి కొడు కే మని సమ్మతించి । పంచె దానిన చేయుము పరమనియతి. 98

ప్రతిపదార్థం: భరతవంశ+ఉత్తమ!= భరతవంశంలో గొప్ప వాడివైన ధృతరాష్ట్ర మహారాజా!; భవత్ సన్నిధానమునన్= నీ సన్నిధిలో; తమమాటలుగన్= తమ సొంతమాటలుగా; ఉపన్యాసము ఒనరింపన్= తెలియజేయడానికి (ఉంచడానికి); నన్నున్= నన్ను; పౌరజనులు= ఈ పుర ప్రజలు; పంచిన+అట్టి= నియోగించినటువంటి; భాషణములు= మాటలు; ఏకాగ్రబుద్ధిన్= అవధానమతితో; అవధరింపుము= విను; మీ మహా+అన్వయంబునన్= మీ ఉత్తమవంశంలో; మహీవిభులయందున్= (పుట్టిన) రాజులలో; వెదకి+ఐనన్= వెదికి చూచినప్పటికీ; ఒప్పమి= తగనిది. (అనుచితం); కానము= చూడలేము; మీరు= భరతవంశపురాజులు; కన్న అట్టి ప్రజలన్= కన్న కొడుకులను; ఎట్లు= ఏవిధంగానో; అట్లు= ఆవిధంగా; మమున్= ఈ పౌరులను; ఆదరమునన్= వాత్సల్యంతో; రక్షించితిరి= పాలించారు; వినుము= ధృతరాష్ట్ర మహారాజా విను; దుర్యోధనుండు= నీకొడుకైన దుర్యోధనుడు; చేసిన= మాకు చేసిన; అనర్థము= తగనిపని; ఒక్కటియున్= ఒక్కటి కూడా; లేదు= లేదు; త్రిలోక+ఉత్తరుండు= మూడులోకములను, దాటిన మేలిమి కలవాడైన; సత్యవతి కొడుకు= వ్యాసమహర్షి; సమ్మతించి= అంగీకరించి; నినున్= నిన్ను; ఏమి+అని= ఏవిధంగా చేయుమని; పంచెన్= నియమించాడో; పరమ నియతిన్= దృఢమైన నియమంతో; దానిన్+అ= అదే; చేయుము= ఆచరించవలసింది.

తాత్పర్యం: భరతవంశంలో శ్రేష్ఠుడివైన ధృతరాష్ట్ర మహారాజా! ఈ పౌరులంతా కలిసి తమ మాటలుగా నీకు చెప్పుమని నన్ను నియమించిన మాటలను జాగ్రత్తగా విను. మీవంశంలో పుట్టిన రాజులలో వెదకినప్పటికి ఎక్కడా తగనిది అంటూ కనబడదు. మీరు కన్న కొడుకుల వలె, మమ్మల్ని (ప్రజలని) ప్రేమగా పాలించారు. నిజానికి దుర్యోధనుడైనా ప్రజలకు చేసిన అకృత్యమంటూ ఏమీ లేదు. ఇంక లోకోత్తరుడైన వ్యాసమహర్షి నిన్ను ఏం చేయు మని చెప్పాడో ఆ పని తప్పకుండా చేయవలసింది.

క. అడ లెడఁబడఁగా మమ్మును। విడిచితి గురు వైన శోక వేదన యే మిం
కుడిపికొనునప్పటికిఁ దో। డ్పడు నీదగు సద్గుణములు బంధులు వోలెన్. 99

ప్రతిపదార్థం: అడలు= శోకం; ఎడఁబడఁగాన్= మనస్సుల పొందగా; మమ్మును= ఈ పౌరులను; విడిచితి(వి)= విడిచి వెళ్ళుతున్నావు; ఏము= మేము, ఇంకన్= ఇక పైని; గురువు= అధికం; ఐన= అయినటువంటి; శోకవేదన= దుఃఖంవలని ఏడుపును; ఉడిపి కొను+అప్పటికిన్= పోగొట్టుకొనడానికి; నీదు+అగు సద్గుణములు= నీకు సంబంధించిన గొప్ప లక్షణాలు; బంధులు పోలెన్= చుట్టాల వలె; తోడ్పడున్= మాకు సహకరిస్తాయి.

తాత్పర్యం: మాకు దుఃఖం అతిశయించేటట్లుగా నీవు మమ్మల్ని విడిచి వెళుతున్నావు. మేమీ దుఃఖం పోగొట్టుకొనే స్థితికి నీ గుణాలే మాకు బంధువులవలె తోడు నిలుస్తాయి. నీ గుణాలు తలచుకొంటూ నీ వియోగ దుఃఖం మరిచిపోతామని భావం.

విశేషం: ఈ పద్యం ప్రాచీన ప్రతులలో లేదు. మూలాన్ని బట్టి ముద్రాపకులు తర్వాత స్వీకరించి ఉంటారు. ఉండి ఉంటుందని ఊహించటానికి, లేదని మానటానికి ఇంకా పరిశీలనం చేయాలి. తిక్కన తర్వాతి వాళ్ళెవరైనా కలిపారా? ఇది లేకుంటే (98,100) వరస బాగుంది. 'అడిఁబడు' అనేది కొత్త శబ్దం. (ఇది శ,ర,లో గాని, సూ, ని,లోగాని కానరాదు. అడలు= శోకం, ఎడన్= హృదయంలో, పడఁగాన్= పొందగా - అని భావించవచ్చునేమో)

ఆ. ధాత్రి శంతనుఁడు విచిత్రవీర్యుఁడుఁ బాండు। రాజు నెట్టు లట్ల రాజరాజు
ప్రజకు సంతసముగఁ బాలించె; నీయందు। నతనియందుఁ గలదె యధిప! యెగ్గు? 100

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; శంతనుఁడు(న్)= శంతనుడూ; విచిత్ర వీర్యుఁడున్= విచిత్రవీర్యుడూ; పాండురాజున్= పాండురాజూ; ఎట్టులు= ఏవిధంగా (పాలించారో); అట్లు+అ= ఆవిధంగానే; రాజరాజు= దుర్యోధనుడు కూడా; ప్రజకున్= మాకు; సంతసముగన్= ఆనందం కలిగే విధంగా; ధాత్రిన్= ఈ రాజ్యాన్ని; పాలించెన్= పరిపాలించాడు; నీయందున్= నీవిషయంలో గానీ; అతని యందున్= ఆ దుర్యోధనుడి విషయంలో కానీ; ఎగ్గు= తప్పు; కలదె?= ఉన్నదా? (లేదు).

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! మీ తాత శంతనుడూ, తండ్రి విచిత్రవీర్యుడూ, సోదరుడు పాండురాజూ ఎట్లాగో దుర్యోధనుడు కూడా అట్లాగే ఈ రాజ్యాన్ని ప్రజారంజకంగా పాలించాడు. నీలో గానీ, దుర్యోధనుడిలో గానీ తప్పు ఏమీ లేదు.

వ. భీష్మద్రోణ కృపద్రౌణి కర్ణ కృతవర్మ శల్యు లొక్క దిక్కును, భీమార్జుననకుల సహదేవ ద్రుపద విరాట సాత్యకు లొక్కదెసయు నై విధిప్రేరణంబునం బోరిరి; వారివలన నఖిల క్షత్త్రియసంక్షయం బావహిల్లె నది యొక్క దుర్యోధను చేతన యయ్యెనె? యట్లుం గాక రణంబు రాజుల కుత్తమ ధర్మంబ కాదె! యందుల మరణంబును సుగతికరణకల్యంబు; నీ సుతుండు సహాయులుం దానునుం బుణ్యలోకసౌఖ్యంబునంబొందియున్నవాఁడు; ధర్మాచరణశాలి వగు నీకును సుగతిప్రాప్తి సులభంబ యగు; నిట మీఁదటికి మా భాగ్యంబునం జేసి పరమ కృపాభరితు లైన పాండవులు మాకు రక్షకులుగాఁ బడసితి; మాకర్ణింపుము. 101

ప్రతిపదార్థం: భీష్మ- శల్యులు= భీష్ముడూ, ద్రోణుడూ, కృపాచార్యుడూ, ద్రోణుడి కొడుకయిన అశ్వత్థామ, కర్ణుడూ, కృతవర్మా, శల్యుడూ; ఒక్కదిక్కును= ఒక (కౌరవుల) పక్షంగానూ; భీమ......సాత్యకులు= భీముడూ, అర్జునుడూ, నకులుడూ, సమదేవుడూ, ద్రుపదమహారాజూ, విరాటరాజూ, సాత్యకీ; ఒక్కదెసయును= ఇంకొక (పాండవుల) పక్షంగానూ; ఐ= ఏర్పడి; విధిప్రేరణంబునన్= విధి ప్రేరేపించగా; పోరిరి= యుద్ధం చేశారు; వారివలనన్= వారి అందరి (యుద్ధం) కారణంగా; అఖిల క్షత్త్రియ సంక్షయంబు= సమస్తమైన (బంధు - తదితర) క్షత్రియలోకానికీ, వినాశనం; ఆవహిల్లెన్= కలిగింది; అది= ఆ విధమైన క్షత్త్రియకుల నాశం; ఒక్క దుర్యోధను చేతన్+అ= దుర్యోధనుడు ఒక్కడి వలన మాత్రమే; అయ్యెన్+ఎ= సంభవించిందా?; అట్లును+కాక= అంత మాత్రమే కాకుండా; రాజులకున్= భూపాలకులకు; రణంబు= యుద్ధం; ఉత్తమధర్మంబు+అ= శ్రేష్ఠమైన ధర్మమే; కాదె= కదా; అందులన్= ఆ యుద్ధంలో; మరణంబును= చావు కూడా; సుగతి కరణ కల్యంబు= ఉత్తమ లోకస్థితిని కలిగించే సాధనమే; నీ సుతుండు= నీ కొడుకైన దుర్యోధనుడు; సహాయులన్= తన పక్షంలో యుద్ధం చేసినవారితో కలిసి; తానునున్= స్వయంగా తనుకూడా; పుణ్యలోక సౌఖ్యంబునన్= ఉత్తమలోకాలలో సుఖాలను; పొంది ఉన్నవాఁడు= అనుభవిస్తున్నాడు; ధర్మ+ఆచరణ శాలివి= ధర్మాన్ని అనుష్ఠించడంలో సమర్థుడివి; అగు= అయినటువంటి; నీకును= నీకు (ధృతరాష్ట్రుడికి) కూడా; సుగతి ప్రాప్తి= ఉత్తమలోకాలను (పొందటం) కల్గడం; సులభంబు+అ= తేలికే; అగును= అవుతుంది; ఇటన్= ఇంక; మీఁదటికిన్= పైన (మీ తరువాత); మా భాగ్యంబునన్, చేసి= మా అదృష్టవశాన; పరమ+కృపా+భరితులు= మిక్కిలి దయతో నిండినవారు; ఐన= అయినటువంటి; పాండవులు= పాండురాజు కుమారులు; మాకున్= మాకు, (ఈ రాజ్య ప్రజలకు); రక్షకులు కాన్= కాపాడేవారుగా; పడసితిమి= పొందాము; ఆకర్ణింపుము= ఆ పై మా వినతి వినవలసింది.

తాత్పర్యం: భీష్ముడూ, ద్రోణుడూ, కృపాచార్యుడూ, అశ్వత్థామా, కృతవర్మా, శల్యుడూ, ఒక (దుర్యోధనుడి) వైపూ, భీముడూ, అర్జునుడూ, నకులుడూ, సహదేవుడూ, ద్రుపదుడూ, విరటుడూ, మరో (ధర్మరాజు) వైపూ అయి విధి ప్రేరేపించడం మూలంగా యుద్ధం చేశారు. అందువలననే క్షత్రియు లంతా నశించిపోవటం జరిగింది. ఇదంతా దుర్యోధను

డొక్కడే చేశాడా? అదీ కాక రాజులకు యుద్ధం అనేది ఉత్తమ కర్తవ్యమైన ధర్మం గదా! ఆ యుద్ధంలో మరణం కూడా ఉత్తమలోకాలు సాధించి పెట్టేదే. నీకొడుకు (దుర్యోధనుడు) తనకు సహాయంగా తన పక్షంలో యుద్ధం చేసిన వారితో కలిసి తనుగూడా ఇపుడు పుణ్యలోక సౌఖ్యాలను అనుభవిస్తున్నాడు. ఎప్పుడూ ధర్మమే ఆచరించే స్వభావం కలిగిన నీకు కూడా ఉత్తమ లోకాలు సులువుగానే లభిస్తాయి. ఇంక ఆ తర్వాత - మా అదృష్టవశాన దయ నిండిన పాండవులను మాకు (రాజ్యానికి) రక్షకులుగా పొందాము. ఆ పైన వినుము.

తే. **స్వర్గ మైనను బాలింపఁ జాలువారు। వారలకు భూమిపాలన విధి యనంగ**
నెంతపని? వీరి చేతికి నిచ్చి తిపుడు। మమ్ము నెల్ల విధంబుల మనిచి తధిప! **102**

ప్రతిపదార్థం: అధిప!= (ధృతరాష్ట్ర) రాజా!; స్వర్గము= దేవతల రాజ్యం; ఐనను= అయినప్పటికీ; పాలింపన్= రక్షించటానికి; చాలువారు= (ఈ పాండవులు) సమర్థులు; వీరలకున్= అటువంటి ఈ పాండవులకు; భూమి పాలన విధి= ఈ భూలోకాన్ని పాలించటం; అనంగన్= అనగా; ఎంత పని?= ఎంతటి కార్యము?; ఇపుడు= ఇప్పుడు; మమ్మున్= మమ్మల్ని (ఈ ప్రజలను); వీరి చేతికిన్= ఈ పాండవుల చేతికి; ఇచ్చితి(వి)= అప్పగించావు; ఎల్లవిధంబులన్= (ఈ పాండవులను మాకు రక్షకులుగా చేయటం ద్వారా మమ్మల్ని) అన్ని రకాలుగానూ; మనిచితి(వి)= బ్రతికించావు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! దేవలోకాన్నైనా పాలించే సామర్థ్యం ఉన్న పాండవులకు ఈ భూమిని పరిపాలించటం ఎంత పని? ఈ రాజ్యాన్ని పాండవులచేతి కప్పగించి, అన్ని విధాలుగా మమ్మల్ని బ్రతికించావు.

విశేషం: (స్వర్గమైనను.....యనంగ నెంతపని?...... అలంకారం కావ్యార్థాపత్తి.)

సీ. **ధర్మపుత్త్రుఁడు దీర్ఘదర్శి, మహోదాత్త। సచివుండు, బంధు రక్షణ పరుండు,**
రిపు నెడ నైనను గృప పెద్ద, భావసం। శుద్ధియుఁ బ్రతిభయు సువ్రతంబు
నితనికి వెన్నతో నిడినవి। యొరులను దనయట్ల కాఁ జూచుఁ దమ్ము లెల్ల
సన్నుతి కెక్కిన సకలగుణముల ని। మ్మహితాత్ముచందాన మమ్ముఁ బ్రోచు

తే. **మాత్రయే దేవవిషయసమంచితాగ్ర। హార సజ్జన మాన్యంబు లైన గ్రామ**
ములు దగంగ రక్షింతురు వెలయఁ దారు। నిత్తు రూళ్ళులు దేవమహీసురులకు. **103**

ప్రతిపదార్థం: ధర్మపుత్త్రుఁడు= యమ తనయుడైన ధర్మరాజు; దీర్ఘదర్శి= దూరపు చూపు కలవాడు; మహా-ఉదాత్త-సచివుండు= మిక్కిలి అధికులయిన అమాత్యులు కలవాడు; బంధు-రక్షణపరుండు= చుట్టాలను పాలించేవాడు; రిపు-ఎడన్= శత్రువుపైన; ఐనను= కూడా; కృప= దయ; పెద్ద= అధికంగా, గలవాడు; భావ సంశుద్ధియున్= నిర్మలమైన ఆలోచనలు; ప్రతిభయున్= క్రొంగ్రొత్త ఆలోచనలతోడి బుద్ధి విశేషమూ; సువ్రతంబు= మంచినడవడికా; ఇతనికిన్= ఈ ధర్మరాజుకు; వెన్నతోన్= పిన్న నాటినుండి వెన్న (ఆహారం)తో; ఇడినవి= ఇచ్చినవి; ఒరులన్= ఇతరులను (సర్వభూతాలను); తన+అట్లు+అ= తనవలెనే; కాన్= అయ్యేవిధంగా; చూచున్= చూచుకొంటాడు; తమ్ములు= ఇతనికి సహోదరులు అయిన భీముడు మొదలైనవారు; ఎల్లన్= అందరూ; సన్నుతికిన్= శ్రేష్ఠమయిన పొగడ్తలకు; ఎక్కిన= స్థానమైన; సకల గుణములన్= సమస్తమైన మంచి లక్షణాలతో; ఈ+ మహిత+ఆత్ము= గొప్ప మనసు గలిగిన ఈ ధర్మరాజుయొక్క; చందానన్= విధంగానే; మమ్మున్= మమ్మల్ని, (ప్రజలను);

ప్రోచు-మాత్ర-ఏ= రక్షించడం మాత్రమే కాదు సుమా; దేవ విషయ= దేవతల (దేవ-ఆలయాలు నిర్వాహాదిదైవ- ఉపభోగం నిమిత్తంగా); సమంచిత= ఒప్పుతున్న (ఇవ్వబడిఉన్న); అగ్రహార= అగ్రహారాలూ; సజ్జన= శ్రేష్ఠ (బ్రాహ్మణు)ల యొక్క; మాన్యంబులు= (గౌరవంగా ఇవ్వబడిన) మాన్యాలూ; ఐన= అయినటువంటి; గ్రామములు= ఊళ్ళు; తగంగన్= సముచితంగా; రక్షింతురు= కాపాడుతారు; తారున్= స్వయంగా తాము (పాండవులు) కూడా; వెలయన్= ప్రసిద్ధిగా; దేవ మహీసురులకున్= దేవతలకూ, బ్రాహ్మణులకూ; ఊళ్ళులు= గ్రామాలను; ఇత్తురు= ఇస్తారు.

తాత్పర్యం: ధర్మరాజు చాలా ముందుచూపు ఉన్నవాడు. గొప్ప మంత్రులు గలవాడు. చుట్టాలను పాలించే స్వభావం గలవాడు. శత్రువులపై గూడా దయ ఎక్కువగా గలవాడు. నిష్కల్మషమైన ఆలోచనలూ, సమయస్ఫూర్తితో గూడిన బుద్ధి వైభవమూ, మంచి నడవడిక ధర్మరాజుకు చిన్నప్పటినుంచీ అలవడ్డాయి. ఇతరు లందరినీ తనవలెనే చూస్తాడు. ఇతడి తమ్ముళ్ళు గూడా ప్రశంసించబడే మంచి లక్షణాలతో ఈ ధర్మరాజు వంటివారే. ఈ పాండవులును మమ్మల్ని (ప్రజలను) రక్షించటం మాత్రమే కాదు, దేవతల కొరకు అగ్రహారాలుగానూ, బ్రాహ్మణులకు మాన్యాలుగానూ పూర్వరాజులు ఇచ్చిన ఊళ్ళను కాపాడుతారు. అంతే కాకుండా దేవతలకూ, బ్రాహ్మణులకూ తాము స్వయంగా కూడా చాలా ఊళ్ళు ఇస్తారు.

క. మృదువులకుఁ జాల మృదువులు; । విదితయశా! వినుము పాండవేయులు కడు బె
ట్టిదులు బెడిదంపు వారికి । మదలోభిత్వములు లేవు మందున కైనన్. 104

ప్రతిపదార్థం: విదిత యశా!= ప్రసిద్ధమైన కీర్తి కల ఓ ధృతరాష్ట్ర మహారాజా!; వినుము= మా మనవి వినవలసింది; పాండవేయులు= పాండురాజు కొడుకులు; మృదువులకున్= సాధువులైన వారి విషయంలో; చాలన్= తగినంత (అధికంగా); మృదువులు= సాధు జనులు; బెడిదంపు వారికిన్= క్రూరుల విషయంలో; కడున్= మిక్కిలి; బెట్టిదులు= కఠినులు; మద లోభిత్వములు= గర్వమూ, పిసినిగొట్టుతనమూ; మందునకున్+ఐనన్= మందుకు కూడా; లేవు= (పాండవులందు) లేవు.

తాత్పర్యం: ప్రసిద్ధ మైన కీర్తి కలిగిన ధృతరాష్ట్ర మహారాజా! వినుము. పాండవులు మంచివారి విషయంలో చాలా మంచివారు. దుర్మార్గుల విషయంలో చాలా కఠినులు. ఆ పాండవులలో అహంకారం గానీ, లోభం కాని మందుకు కూడా (స్వల్పంగా నైనా) లేవు.

క. శూరులు, శాంత స్వాంతులు, । పౌరజన ప్రకర జానపదచయ నిత్యా
పార ప్రమదాపాదన । పారగు లతుల గురుభక్తి పరతంత్రాత్ముల్. 105

ప్రతిపదార్థం: శూరులు= పాండవులు శౌర్యం కలిగినవారు; శాంత-స్వాంతులు= (అయినా) ప్రశాంతమైన మనసులు కలవాళ్ళు; పౌరజన-ప్రకర= నగరవాసుల సమూహానికీ; జానపద చయ= పల్లెలలో నివసించే జనుల సమూహానికీ; అపార= మితిమీరిన; ప్రమద= సంతోషాన్ని; ఆపాదన= కల్పించటంలో; పారగులు= సర్వమూ తెలిసిన వాళ్ళు; అతుల= సాటిలేని; గురు= పెద్దల యందలి; భక్తి= సేవాభావానికి; పరతంత్ర= అధీనమైన; ఆత్ముల్= మనసులు కలిగినవారు.

తాత్పర్యం: పరాక్రమవంతులూ, నిర్వికారమైన మనస్సు కలిగిన వారూ అయిన పాండవులు పట్టణవాసులకూ, పల్లెలలో ఉండే ప్రజలకూ; నిరంతరమూ మిక్కిలి సంతోషం గలిగిస్తారు. పెద్దలమీద అత్యధికమైన భక్తి గలవారు.

తే. గొంతి దేవికిఁ గోడండ్రకును మనములఁ। గరుణ యగ్గల మై యుండు ధరణినాథ!
పౌరులందును జనపద ప్రజల యెడను। నాడుదురు మేలు తమ కగ్గ మైన యపుడు. 106

ప్రతిపదార్థం: ధరణినాథ!= (ధృతరాష్ట్ర) రాజా!; గొంతిదేవికిన్= కుంతికీ; కోడండ్రకును= ఆ కుంతీదేవికి కోడళ్ళైన ద్రౌపది, ఉలూచి, సుభద్రా మొదలైన వారికీ; మనములన్= మనస్సులలో; పౌరులందును= పుర (పట్టణ) ప్రజలపైనా; జనపద ప్రజల ఎడను= పల్లె ప్రజల విషయంలోనూ; కరుణ= దయ; అగ్గలము+ఐ= అధికంగా; ఉండున్= ఉంటుంది; తమకున్= వారికి; అగ్గము+ఐన+అపుడు= కనబడిన సమయంలో (ప్రజలకు); మేలు= మంచి; ఆడుదురు= చెపుతారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! కుంతీదేవికీ, ఆమె కోడళ్ళకూ పట్టణ ప్రజలమీదా, పల్లె జనుల మీదా దయ చాలా ఎక్కువ, వాళ్ళు ఆ ప్రజలు తమకు గోచరించినపుడు మేలు మాటలు చెపుతారు.

వ. వీర లెప్పుడు మము నీవు గారవించు। టెఱిఁగి మన్నింతు రమలినహృదయ! కలఁక
దక్కి ధర్మజుపై రాజ్యతంత్రభార। మిడి మనంబున నూఱడి యిచ్చ సలుపు.' 107

ప్రతిపదార్థం: అమలిన హృదయ!= స్వచ్ఛమైన మనసు కలిగిన వాడా! (ధృతరాష్ట్రా); నీవు= నీవు; మమ్మున్= మమ్మల్ని (ప్రజలను); ఎప్పుడు(న్)= నిరంతరమూ; గారవించుట= ఆదరించటం; ఎఱిఁగి= గ్రహించి; వీరలు= ఈ పాండవులు, వారికి సంబంధిన స్త్రీలూ; మన్నింతురు= మమ్మల్ని గౌరవిస్తారు; కలఁక= (నీవు) విచారాన్ని; తక్కి= విడిచిపెట్టి; రాజ్య తంత్ర భారము= ఈ రాజ్యాన్ని పాలించవలసిన బాధ్యతను; ధర్మజుపైన్= ధర్మరాజు మీద; ఇడి= ఉంచి; మనంబునన్= నీ మనస్సులో; ఊఱడి= ఊరట పొంది; ఇచ్చ= నీ ఇష్టం వచ్చిన పని, (నీ కిష్టమైన వనగమనం); చలుపు= చేయవలసినది.

తాత్పర్యం: నిర్మలమైన మనసు కలిగిన ధృతరాష్ట్ర మహారాజా! మమ్మల్ని నీవెప్పుడూ ఆదరించటం తెలిసిన ఈ పాండవులూ వారి స్త్రీలూ మమ్మల్ని గౌరవిస్తారు. విచారం విడిచిపెట్టు. సామ్రాజ్యం నిర్వహించవలసిన బరువు ధర్మజుడిపైన ఉంచుము. మనసు నిశ్చింత చేసికొమ్ము. నీకు తోచిన విధంగా (వనగమనం) చేయుము'.

వ. అని చెప్పె ని ట్లవ్విప్రముఖంబునఁ బౌరులభాషణంబులు విని ధృతరాష్ట్రుండు ప్రీతుం డయి సముచిత ప్రకారం బుల నజ్జనంబులం గ్రమంబున వీడుకొలిపి, కౌంతేయాది బంధువులను మిత్రులను నిజనివాసంబులకుం బోవం బనిచి, గాంధారీ సమేతుం డై యభ్యంతరమందిరంబున కరిగి యద్దినశేషంబును రాత్రియుం దగు వర్తనంబులఁ గడపి, మఱునాఁడు విదురుని రావించి 'మృతు లయిన బాంధవుల కెల్లను సవిశేషశ్రాద్ధంబులు చేయు తలంపు పుట్టి కొన్ని దివసంబులు పయనంబు మానితి; మానిత మాననీయ చరిత్రుం డగు ధర్మపు త్త్రుపాలికిం బోయి నీ విక్కార్యంబు సంఘటింపు' మని పనిచిన నతం 'డట్ల చేసెద' నని యనుజసహితుం డై యున్న యన్నరేంద్రునిం గాంచి. 108

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; చెప్పెన్(న్)= శంబువు పౌరుల అభిప్రాయాన్ని ధృతరాష్ట్రుడికి చెప్పాడు; ఇట్లు= ఈ విధంగా; ఆ+విప్రముఖంబునన్= ఆ బ్రాహ్మణుడైన శంబువు నోట; పౌరుల భాషణంబులు= అక్కడి పురజనులమాటలను; విని= ఆలకించి; ధృతరాష్ట్రుండు; ప్రీతుండు+అయి= సంతోషించినవాడై; సముచిత ప్రకారంబులన్= తగినవిధంగా; (ఎవరి

కెటువంటి పద్ధతి ఉచితమో ఆ విధంగా) ఆ+జనంబులన్= ఆ పౌరులను; క్రమంబునన్= వరుసగా అందరినీ; వీడు కొలిపి= పంపి; కౌంతేయ ఆదిబంధువులను= పాండవులు మొదలైన చుట్టాలనూ; మిత్రులనూ= స్నేహితులనూ; నిజ నివాసంబులకున్= తమతమ ఇళ్ళకు; పోవన్ పనిచి= వెళ్ళుండని పంపి; గాంధారీ సమేతుండు+ఐ= గాంధారితో కూడినవాడై; అభ్యంతర మందిరంబునకున్= తమ లోపలి ఇంటికి; అరిగి= వెళ్ళి; ఆ+దినశేషంబును= మిగిలి ఉన్న ఆరోజు పగటిసమయాన్ని; కడపి= దాటించి; మఱునాఁడు= తరువాతిరోజు; విదురునిన్= సోదరుడైన విదురుడిని; రావించి= పిలిపించి; (అతనితో ఇలా అంటున్నాడు) మృతులు+అయిన= మరణించినట్టి; బాంధవులకున్= చుట్టాలకు; ఎల్లను= అందరికీ; సవిశేష శ్రాద్ధంబులు= విశేషమైన శ్రాద్ధక్రియలు; చేయుతలంపు= చేయాలనే ఆలోచన; పుట్టి= ఏర్పడి; పయనంబు= అరణ్యాలకు చేయవలసిన ప్రయాణం; కొన్ని దివసంబులు= కొన్ని రోజులు; మానితి(న్)= మానుకొన్నాను; మానిత= గౌరవించబడేవారిచేత; మాననీయ= గౌరవించదగిన; చరిత్రుండు= నడవడిక కలిగినవాడు; అగు= అయినటువంటి; ధర్మపుత్త్రుపాలికిన్= ధర్మరాజువద్దకు; నీవు= నీవు (విదురుడు); పోయి= వెళ్ళి; ఈ+కార్యంబు= తాను మృతబాంధవులకు చేయ తలపెట్టిన శ్రాద్ధలకు అనుమతీ-ఏర్పాట్లు-అనే పని; సంఘటింపుము= సాధించవలసింది; అని= అని చెప్పి; పనిచినన్= నియోగించగా; అతండు= ఆ విదురుడు; అట్లు+అ= ఆ (ధృతరాష్ట్రుడు చెప్పిన) విధంగానే; చేసెదన్= చేస్తాను; అని= అనిచెప్పి; అనుజసహితుండు ఐ+ఉన్న= భీముడు మొదలైన తమ్ములతో కూడి ఉన్న; ఆ+నరేంద్రునిన్= ఆ (ధర్మ) రాజును; కాంచి= చూచి (ఎదురుగ ధర్మరాజుతో ఇట్లా అంటున్నాడు).

తాత్పర్యం: పౌరుల అభిప్రాయాన్ని ఆ బ్రాహ్మణుడి (శంబువు) నోట ఆ విధంగా విన్న ధృతరాష్ట్రుడు చాలా సంతోషించాడు. ఈ పౌరజనులకు ఎవరిస్థాయికి తగిన విధంగా వారికి ఆ ప్రకారంగా క్రమంగా వీడుకోళ్ళు చెప్పి ఇళ్ళకు పంపించాడు. తను గూడా గాంధారితో కలిసి లోపలి మందిరానికి వెళ్ళాడు. ఆరోజు ఇంకా మిగిలిఉన్న పగలు, ఆ రోజు రాత్రీ గడిపి, మర్నాడు విదురుడిని పిలిపించి అతడితో ఇట్లా అన్నాడు. మరణించిన బంధువులందరికి సవిశేషంగా శ్రాద్ధాలు పెట్టాలనే సంకల్పం కలిగింది. అందువలన అరణ్యగమనం కొన్నాళ్ళు మానుకొంటున్నాను. నీవిపుడు ఆ ధర్మరాజు దగ్గరికి పోయి ఈ పని ఏర్పాటు చేయుము. అనగానే విదురుడు సరే అని వెళ్ళాడు. అక్కడ తమ్ముళ్ళతో కలిసిఉన్న ధర్మరాజును చూచి అతడితో విదురుడు ఇట్లా అన్నాడు.

సీ. **'మీ తండ్రి సురనదీసూతి బాహ్లికులకు। సోమదత్తునకుఁ, దత్సూనునకును,**
దుర్యోధనాదిసుతులకును; దక్కును। గలుగు బంధులకు నుత్కర్ష మెసఁగ
శ్రాద్ధముల్ సేయు విచారంబు దోఁచిన। మసలెఁ గార్తికపౌర్ణమాసి దాఁక
వనమున కరుగ కప్పని నీకుఁ బోలిన। యట్టులు గావింపు' మనిన నాతఁ

తే. **డెంతయును వేడ్క నమ్మాట కియ్యకొనియె;। నర్జునుండును బ్రీతుఁ డై యర్హ మనియె;**
భీముఁ డపుడు కమర్చిన మోముతోడ। విదురు వదనంబు సూచుచుఁ బెదవు లదర 109

ప్రతిపదార్థం: మీ తండ్రి= (మీకు తండ్రి అయిన) ధృతరాష్ట్రుడు; సురనదీసూతి, బాహ్లికు= బాహ్లికుడికీ; సోమదత్తునకున్= (బాహ్లికుడి కొడుకు అయిన) సోమదత్తుడికీ; తద్ సూనునకునున్= ఆ సోమదత్తుడి కొడుకయిన భూరిశ్రవసుడికీ; దుర్యోధన+ఆది, సుతులకున్= దుర్యోధనుడు మొదలైన కొడుకులకూ; తక్కును కలుగు= ఇంకా మిగిలిఉన్న; బంధులకున్= యుద్ధంలో మరణించిన బంధువులకూ; ఉత్కర్షము= ఆధిక్యం; ఎసఁగన్= అతిశయించే విధంగా; శ్రాద్ధముల్= ఉత్తమ లోకాలు కలుగజేసే (శ్రాద్ధ) కర్మలను; చేయు విచారంబు= చేయాలనే ఆలోచన; తోఁచినన్= కలగటం వలన; వనమునకున్= అడవులకు; అరుగన్=

వెళ్లకుండా; కార్తిక పౌర్ణమాసి దాఁకన్= కార్తికమాస పూర్ణిమ వరకూ; మసలెన్= ప్రయాణం చేయకుండా ఆగాడు; నీకున్= నీకు; పోలిన+అట్టులు= తగిన విధంగా; కావింపుము= చేయవలసింది; అనినన్= అని విదురుడు పల్కగా; అతఁడు= ఆ ధర్మరాజు; ఎంతయున్= చాలా; వేడ్కన్= ఆనందంతో; ఆ+మాటలన్= విదురుడి మాటలకు; ఇయ్యకొనియెన్= అంగీకరించాడు; అర్జునుండును= అర్జునుడు కూడా; ప్రీతుఁడు+ఐ= ఆనందించినవాడై; అర్హము= (ధృతరాష్ట్రుడు చేయదలచినపని) తగినది; అనియెన్= అన్నాడు; అపుడు= ఆ సమయంలో; భీముఁడు= భీమసేనుడు; కమర్చిన మోము తోడన్= మండిపడుతున్న ముఖంతో; విదురువదనంబు= విదురుడి ముఖాన్ని; చూచుచున్= చూస్తూ; పెదవులు= పెదవులు; అదరన్= అదురుతుండగా (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: '(ధర్మరాజా!) మీ తండ్రి ధృతరాష్ట్రుడు, భీష్ముడికీ, బాహ్లిక, సోమదత్త, భూరిశ్రవులకూ; దుర్యోధనుడు మొదలైన కొడుకులకూ; ఇంకా యుద్ధంలో మరణించిన మిగిలిన బంధువులకూ, సవిశేషంగా, శ్రాద్ధ కర్మలు చేయాలనే ఆలోచన కలగటంవలన కార్తిక పూర్ణిమవరకూ అరణ్యాలకు వెళ్ళకుండా ఆగాడు. ఇంక నీవు తగువిధంగా చేయవలసింది' అన్నాడు విదురుడు ధర్మరాజుతో. ధర్మరాజు ఆ మాటలకు సంతోషంగా అంగీకరించాడు. అర్జునుడు కూడా అది తగిన పని అన్నాడు. భీముడు మాత్రం కోపంతో ఎర్రబడిన ముఖంతో విదురుడి ముఖంలోకి చూస్తూ పెదవులు అదురుతుండగా ఏదో అనబోయాడు.

వ. ఏమేనిం బలుకం జూచినన్ బీభత్సుండు మెలుపున నతని వారించి యల్లన యిట్లనియె. 110

ప్రతిపదార్థం: ఏమి+ఏనిన్= ఏదో; పలుకన్+చూచినన్= మాట్లాడబోతుండగా; బీభత్సుండు= అర్జునుడు; మెలుపునన్= చాకచక్యంతో; అతనిన్= ఆ భీముడిని; వారించి= (మాటాడకుండా) ఆపి; అల్లన= మెల్లగా; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: (భీముడు కోపంతో విదురుడితో ఏదో) అనబోతూ ఉండగా అర్జునుడు నేర్పుగా భీముడిని మాటాడకుండా నివారించి మెల్లగా ఇట్లా అన్నాడు.

సీ. 'రాజు వృద్ధుఁడు ధృతరాష్ట్రుండు భీష్మము। ఖ్య జ్ఞాతులకు శ్రాద్ధకర్మ మాచ
రింపఁ దలంచి యర్థించె; భవజ్జిత। ధనధాన్యములు నీవు దాని కియ్య
కొనమి యశంబునకును ధర్మమునకు వి। ధ్వంసంబు సేయదే? ధర్మతనయు
తలఁచినపని విఘ్నితము సేయఁదగునయ్య? । మనకు నయ్యంబికాతనయుఁ దొల్లి

ఆ. వేఁడికొందు మతఁడు వేఁడెడుఁ గానకు। నేఁగుచుండి మనల నిప్పు డింత
సూడవలదె? యొండులాడక యప్పని। సలుపు టొప్పు బాహుశాలి! నీకు. 111

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; రాజు= మనకు పాలకుడు; వృద్ధుఁడు= పైగా (వయసు మళ్ళిన) పెద్దవాడు; భీష్మ- ముఖ్య జ్ఞాతులకున్= భీష్ముడు మొదలైన దాయాదులకు; శ్రాద్ధకర్మము= సుగతులు కలగటం కొరకు శ్రాద్ధక్రియలు; ఆచరింపన్= చేయాలని; తలంచి= అనుకొని; భవత్-జిత-ధనధాన్యములు= నీవు ఇతరరాజులను జయించి తెచ్చిన సంపదలు; అర్థించెన్= కోరుతున్నాడు; దానికిన్= ధృతరాష్ట్రుడి ఆ కోరికను; నీవు= నీవు; ఇయ్యకొనమి= ఒప్పుకొనకపోవటం; యశంబునకును= కీర్తికి; ధర్మమునకున్= ధర్మానికీ; విధ్వంసంబు= వినాశనం; చేయదే?= కలిగింపదా?; ధర్మతనయు= ధర్మరాజు; తలఁచిన పని= ఉద్దేశించిన పని; విఘ్నితము చేయన్= అడ్డగించటం; మనకున్= (అతడి తమ్ములమైన) మనకు; తగునయ్య?= ఉచితమా?;

తొల్లి= పూర్వం; ఆ+అంబికాతనయున్= ఆ ధృతరాష్ట్రుడిని; వేఁడికొందుము= మనమే అర్థించేవాళ్ళం; అతఁడు= అటువంటి ధృతరాష్ట్రుడు; ఇప్పుడు= ఈనాడు; మనలన్= మనలను; కానకున్= అరణ్యానికి; ఏఁగుచున్+ఉండి= వెళ్ళుతూ; వేఁడెడున్= అర్థిస్తున్నాడు; ఇంత= ఈ మాత్రం ధృతరాష్ట్రుడి చిన్న పని; చూడన్వలదె?= మనం చేసిపెట్ట నవసరం లేదా?; బాహుశాలి!= మిక్కిలి భుజబలం కలిగిన భీమా!; ఒండులు= విరుద్ధమైనమాటలు; ఆడక= చెప్పక; ఆ+పని= ఆ ధృతరాష్ట్రుడి కార్యం; చలుపుట= చేయటం; నీకున్= నీకు; ఒప్పున్= తగును.

తాత్పర్యం: 'ధృతరాష్ట్రుడు మనరాజు. పైగా పెద్దవాడు. భీష్మాదు లైన దాయాదులకు శ్రాద్ధక్రియలు చేయుటకొరకు నీవు రాజులను జయించి సంపాదించిన ధనధాన్యాలు అడుగుతున్నాడు. నీవు దానికి ఒప్పుకోకపోవటం (మన) కీర్తిని, ధర్మాన్ని నాశనం చేస్తుంది. ధర్మరాజు చేయదలచుకొన్న పనిని మనం అడ్డగింపవచ్చునా? పూర్వం మనమే ధృతరాష్ట్రుడిని అర్థించేవాళ్ళం. అటువంటి ధృతరాష్ట్రుడు ఇప్పుడు, అదీ అడవులకు పోతూ, మనలను అర్థిస్తున్నాడు. ఆ పని మనం చేసి పెట్టవద్దా? మరొక మాట చెప్పకుండా నీవు ధృతరాష్ట్రుడి పని చేయటం ఉచితం' (అన్నాడు భీముడితో అర్జునుడు).

క. అని చెప్పఁగ జెవిఁ దాటిచి । విని ధర్మతనూజుఁ డంత విజయునిఁ బొగడెన్
మనమున నమ్మాటల క । య్యనిలతనయుఁ డిట్టు లనియె నన్నరుతోడన్. 112

ప్రతిపదార్థం: అని= పై ప్రకారంగా; చెప్పఁగన్= అర్జునుడు భీముడితో పల్కగా; అంతన్= అపుడు; ధర్మతనూజుఁడు= ధర్మరాజు; చెవిన్= తన చెవిని; తాటిచి= ఆ వైపు కూర్చి; విని= ఆలకించి; మనమునన్= తనమనస్సులోనే; విజయునిన్= అర్జునుడిని; పొగడెన్= ప్రశంసించాడు; ఆ+మాటలకున్= అర్జునుడన్న మాటలకు; ఆ+అనిలతనయుఁడు= వాయుపుత్రుడైన ఆ భీముడు; ఆ+నరుతోడన్= ఆ అర్జునుడితో; ఇట్టులు= ఈ ప్రకారంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు ఆ విధంగా భీముడితో చెప్పినమాటలను అటువైపు చెవిపెట్టి ధర్మరాజు విన్నాడు. చాల సంతోషించి, అర్జునుడిని మనసులోనే ప్రశంసించాడు. అర్జునుడి మాటలకు అతడితో భీముడు ఇట్లా అన్నాడు.

భీముఁ డర్జునునితో ధృతరాష్ట్ర నుద్యోగంబునకుఁ బ్రతికూలించి చెప్పుట (సం.15-17-15)

క. 'ముని చేసినయవి చాలవె? । విను గాంగేయాది బంధువితతికిఁ దగ నిం
కను శ్రాద్ధంబులు వలసిన । మనము దగమె చేయ దుష్టమతి యతఁ డేలా? 113

ప్రతిపదార్థం: మును= (ధృతరాష్ట్రుడు) ఇంతకు మునుపు; చేసిన+అవి= ఆచరించిన శ్రాద్ధాదికర్మలు; చాలవె?= సరిపోవా?; విను= (అర్జునా) వినవలసింది; గాంగేయ+ఆది బంధు వితతికిన్= భీష్ముడు మొదలైన బంధువుల సమూహానికి; ఇంకను= ఇంకా; తగన్= తగు విధంగా; శ్రాద్ధంబులు= శ్రాద్ధక్రియలు; వలసినన్= చేయవలసి వస్తే; చేయన్= చేయడానికి; మనము= మనం (పాండవులము); తగమె?= అర్హులం కాదా?; దుష్టమతి= దుర్బుద్ధి అయిన; అతఁడు= ఆ ధృతరాష్ట్రుడు; ఏలా?= ఎందుకు (ఆచరించాలి)?

తాత్పర్యం: 'అర్జునా! ధృతరాష్ట్రుడు ఇంతవరకూ చేసిన శ్రాద్ధాలు సరిపోలేదా? భీష్మాదు లైన బంధువుల మూకకు ఇంకా చేయవలసివస్తే అందుకు మనం పనికి రామా? దుష్టబుద్ధి అయిన ధృతరాష్ట్రుడే ఎందుకు చేయాలి?

క. మఱచితె యాతఁడు మనలం। బఱచిన బన్నములు భీష్మ బాహ్లిక ముఖు ల
త్తఱి నెటఁ బోయిరి? వారల। నెఱుఁగమె మన? మట్టి బంధు లేటికి మనకున్? 114

ప్రతిపదార్థం: అతఁడు= ఆ ధృతరాష్ట్రుడు; మనలన్= పాండవులను; పఱచిన బన్నములు= చేసిన అవమానాలు; మఱచితి(వి)+ఎ= మర్చిపొయ్యావా?; భీష్మ-బాహ్లిక-ముఖులు= భీష్ముడూ, బాహ్లికుడూ, మొదలైన ఆ బంధువులు; ఆ+తఱిన్= మనలను అవమానించే టప్పుడు; ఎటన్+పోయిరి?= ఎక్కడికి వెళ్ళారు? వారలన్= ఆ భీష్మాదులను; మనము= మనం; (నీవూ,నేనూ); ఎఱుఁగమె?= తెలిసిన వాళ్లం కదా?; అట్టిబంధులు= అటువంటి చుట్టాలు; మనకున్= మనకు; ఏటికిన్?= ఎందుకు?

తాత్పర్యం: ఆ ధృతరాష్ట్రుడు మనకు చేసిన పరాభవాలు మరచిపోయావా? ఆ సమయంలో భీష్ముడూ బాహ్లికుడూ మొదలైన ఈ బంధువులు ఏమైనారు? వాళ్లసంగతి మనకు తెలియదా? అటువంటి బంధువులు మన కెందుకు? (వాళ్ళకు శ్రాద్ధక్రియలు చేయ నవసరం లేదు). కాబట్టి ధృతరాష్ట్రుడికోరిక, అంగీకరించ నక్కర్లేదు.

వ. వారి విషయం బైన మేలునకు మాఱాడుట యెగ్గు గా; దాకర్ణింపుము. 115

ప్రతిపదార్థం: వారి విషయంబు= భీష్మ ముఖ్యులైన జ్ఞాతులకు సంబంధించినది; ఐన= అయినటువంటి; మేలునకున్= ప్రయోజనానికి; మాఱు+ఆడుట= విరుద్ధంగా మాటాడటం; ఎగ్గు= తప్పు; కాదు= కాదు; ఆకర్ణింపుము= (అర్జునా! ఇంకొక మాట) విను.

తాత్పర్యం: భీష్మాదులను మనం బంధువులుగా గ్రహించనే అవసరం లేదు కాబట్టి వారికి సంబంధించిన మేలు (ఊర్ధ్వలోకాలు కలగడం) కొరకు విరుద్ధంగా మాటాడితే తప్పేమీ లేదు. ఇంకొక మాట వినుము.

తే. కర్ణునకుఁ జేయవలసిన గారవమున। గొంతి యింకను శ్రాద్ధ మత్యంతవిభవ
ముల్లసిల్లంగఁ జేయుఁగా కుచిత నిరతి। యావిధమునకు మాఱాట సూవె యెగ్గు.' 116

ప్రతిపదార్థం: కర్ణునకున్= కర్ణుడికి; చేయవలసిన= ఆచరించవలసిన; గారవమునన్= వాత్సల్యంతో; ఉచిత-నిరతిన్= తగినంతటి ఆసక్తి (శ్రద్ధ)తో; ఇంకను= ఇంకా, పూర్వంకంటె అధికంగా; అత్యంత-విభవము= మిక్కిలి వైభవం; ఉల్లసిల్లంగన్= ప్రకాశించేటట్లుగా; శ్రాద్ధము= శ్రాద్ధకర్మను; గొంతి= కుంతీదేవి; చేయున్+కాక= చేస్తుంది; ఆ విధమునకున్= కర్ణుడికీ, కుంతి-శ్రాద్ధం చేసే విషయానికి మాత్రమే; మాఱు+ఆట= విరుద్ధంగా పలకటం; ఎగ్గు= తప్పు; చూవె= సుమా.

తాత్పర్యం: ఊర్ధ్వ దైహిక క్రియలు కర్ణుడికి చేయాలనుకొంటే, పుత్రవాత్సల్యంతో, శ్రద్ధగా అపూర్వమైన వైభవంతో కుంతీదేవి చేయవచ్చు. దానికి ఎదురు మాటాడటం తప్పు.

వ. అని పలికి వెండియు. 117

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; పలికి= (అర్జునుడితో, భీముడు) చెప్పి; వెండియున్= మళ్ళీ ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అట్లా చెప్పి భీముడు అర్జునుడితో మళ్ళీ ఇలా అన్నాడు.

సీ. 'పాంచాలి నవమానపఱిచిన తెఱఁగును। నయ్యింతి వెనుక రా నడవిఁ గలయ
ధర్మజుఁచన్న చందంబును మది గీఱి। యుండక మఱి పెట్టు లొలసె నీకు
నాంబికేయుఁడు తండ్రి యగుట నాఁ డెటఁబోయె। భీష్ముండు మొదలగు పెద్దవారి
బాంధవం బేమయ్యెఁ బార్థ! యీవిదురుఁ డె। ఱుంగఁడే వారల భంగి?' యనిన

ఆ. ధర్మజుండు భీముఁ దగువచనముల న। దల్చె నరుఁడు మఱియుఁ దగఁడె పూజ
కాంబికేయుఁ? డిట్టు లనకుము మనకు న। గ్రజుని పనుపు సేఁత వ్రతము గాదె!' 118

ప్రతిపదార్థం: పార్థ!= అర్జునా!; పాంచాలిన్= (పాంచాలరాజు కూతురైన) ద్రౌపదిని; అవమాన పఱిచిన తెఱఁగును= పరాభవించిన విధమూ; ఆ+ఇంతి= ఆద్రౌపది; వెనుకన్= వెన్నంటి; రాన్= రాగా (అనుసరింపగా); అడవిన్= అడవులలో; కలయన్= చుట్టి; ధర్మజు-చన్న చందంబును= ధర్మరాజు తిరిగిన విధమూ; మదిన్= మనసులో; గీఱి+ఉండక= నాటుకొని నిలువకుండా; నీకున్= నీకు (అర్జునుడికి); మఱపు= మర్చిపోవటం; ఎట్టులు= ఏ విధంగా; ఒలసెన్= సంభవించింది; ఆంబికేయుఁడు= ధృతరాష్ట్రుడు; తండ్రి= మనకు (పెద్ద) తండ్రి; అగుట= కావటం, నాఁడు= ద్రౌపదిని, (మనలను) పరాభవించినరోజు; ఎటన్= ఎక్కడికి; పోయెన్?= పోయింది?; భీష్ముండు= భీష్ముడూ; మొదలు-అగువారి-బాంధవంబు= మొదలైన వాళ్ళకు మనతో ఉన్న చుట్టరికం; ఏమి-అయ్యెన్?= ఆ రోజు ఏమయిపోయింది?; వారల భంగి= ఆ ధృతరాష్ట్రుడు భీష్ముడు మొదలైనవారి విధానం; ఈ విదురుఁడు= (ధృతరాష్ట్రుడి మాట మోసుకొనివచ్చిన) ఈ విదురుడు; ఎఱుంగఁడే?= తెలిసిన వాడు కాదా?; అనినన్= అని (భీముడు) పల్కగా; భీమున్= భీముడిని; ధర్మజుండు= ధర్మరాజు; తగు వచనములన్= తగిన మాటలతో; అదల్చెన్= వారించాడు; నరుఁడు= అర్జునుడు; మఱియున్= ఇంకా (ఇట్లా అంటున్నాడు); ఆంబికేయుఁడు= ధృతరాష్ట్రుడు; పూజకున్= (మనం) గౌరవించడానికి; తగఁడె?= అర్హుడా కాదా?; ఇట్టులు= ఈ విధంగా, (భీష్మ ధృతరాష్ట్రాదులను నిందిస్తూ); అనకుము= మాటాడకు; అగ్రజుని పనుపు= అన్నగారి ఆజ్ఞ; చేఁత= ఆచరించటం; మనకున్= అతడికి తమ్ముళ్లమైన మనకు అందరికీ; వ్రతము= నియమం; కాదె!= కదా!.

తాత్పర్యం: 'అర్జునా! ఆ రోజు ద్రౌపదిని సభలో పరాభవించిన విధమూ, ఆ ద్రౌపది వెన్నంటి రాగా ధర్మరాజు అడవుల వెంట తిరగటమూ, మనసులో నాటుకొనకుండా మర్చిపోవటం నీకు ఎట్లా సంభవించింది? ద్రౌపదిని అవమానించిన ఆ రోజు ఈ ధృతరాష్ట్రుడు తండ్రి కాడా? అపుడు భీష్మాదుల బాంధవ్యం ఎక్కడికి పోయింది? వాళ్ళ సంగతి ఈ విదురుడికి తెలియదా?' అని అంటూంటే ధర్మరాజు భీముడిని తగు మాటలతో వారించాడు. అర్జునుడింకా భీముడితో ఇట్లా అన్నాడు. ధృతరాష్ట్రుడు గౌరవానికి అర్హుడు కాడా? ఈ విధంగా మాటాడకుము. అన్నగారి ఆజ్ఞ నిర్వహించటం మనకు నియమం గదా!'

క. అని భీము నదిమి విదురునిఁ । గనుఁగొని మా తండ్రి పుణ్య కర్మము లెమ్మైఁ
దన బంధులకై చేయఁగ। మనంబునం దలఁచె నా సమంచితభంగిన్. 119

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; భీమున్= భీముడిని; అదిమి= మాటాడకుండా చేసి, (అదిమిపట్టి); విదురునిన్= విదురుడిని; కనుఁగొని= చూచి ఇట్లా అన్నాడు; మా తండ్రి= ధృతరాష్ట్రుడు; తన బంధులకున్= తన చుట్టాలకొరకుగా; పుణ్య కర్మములు= శ్రాద్ధ క్రియలు; ఏ+మైన్= ఏ విధంగా; చేయఁగన్= చేయటానికి; మనంబునన్= తన మనస్సులో; తలంచెన్= అనుకొన్నాడో; ఆ సమంచిత భంగిన్= ఆ గొప్ప తీరుగా (చేయవచ్చును). (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: అని చెప్పి భీముడిని బలవంతంగా మాటాడకుండా చేసి అర్జునుడు విదురుడిని చూచి ఇట్లా అన్నాడు. 'మా తండ్రిగారైన ధృతరాష్ట్రుడు తన బంధువుల కొరకు శ్రాద్ధాది పుణ్యకర్మలు ఏ విధంగా చేయాలని మనసులో అనుకొన్నాడో ఆ విధంగా, ఘనంగా చేయవచ్చును.

క. నా యింటి ధనము గైకొని। చేయఁగలాఁ డమ్మహీశు చిత్తము సంతో
షాయత్తంబుగ వేగమ। పోయి యనఘ! చెప్పు మవ్విభుఁడు ప్రియ మందన్. 120

ప్రతిపదార్థం: నా+ఇంటి ధనము= (నా ఇంట ఉన్న= నేను సంపాదించిన) నా ధనం; కైకొని= స్వీకరించి; ఆ+మహీ+ఈశు చిత్తము= ఆ ధృతరాష్ట్రుడి మనస్సు; సంతోష+ఆయత్తంబుగన్= (ఆనందానికి అధీనం కాగా) ఆనందంతో నిండిపోగా; చేయఁ గలాఁడు= చేస్తాడు; అనఘ!= పుణ్యాత్ముడా! (విదురా); ఆ+విభుఁడు= ఆ ధృతరాష్ట్రుడు; ప్రియము-అందన్= సంతోషించేటట్లుగా; వేగము+అ= త్వరగా; పోయి= ధృతరాష్ట్రుడి వద్దకు వెళ్ళి; చెప్పుము= ఈ విషయం చెప్పవలసింది.

తాత్పర్యం: నా సంపదను గ్రహించి తన మనసు సంతోషించే విధంగా (తన బంధువులకు పుణ్యకర్మలు ఘనంగా) ధృతరాష్ట్రుడు చేస్తాడు. పుణ్యాత్ముడా! (విదురా!) ఆ ధృతరాష్ట్రుడికి ఆనందం కలిగించే ఈ విషయాన్ని తొందరగా వెళ్ళి చెప్పవలసింది' (అన్నాడు అర్జునుడు).

చ. అన విని మెచ్చి ధర్మసుతుఁ డర్జుననిం గొనియాడి యాదరం
బున విదురుం గనుంగొని 'ప్రభూత విధానములన్ నిజేచ్ఛ నా
ధనమును నర్జునార్థమును దాఁ గొని శ్రాద్ధము లాచరించు నాఁ
డనఘ! కురూద్వహుం డిది మదాత్మకు నిం పని విన్నవింపుమీ!' 121

ప్రతిపదార్థం: అనన్-అని (అర్జునుడు) చెప్పగా; ధర్మసుతుఁడు= ధర్మరాజు; విని= ఆలకించి; అర్జునున్= అర్జునుడిని; మెచ్చి= మెచ్చుకొని; ఆదరంబునన్= వాత్సల్యంతో; కొనియాడి= ప్రశంసించి; విదురున్= విదురుడిని; కనుంగొని= చూచి (ఇట్లా అన్నాడు); అనఘ!= పాపరహితుడా!; కురు+ఉద్వహుండు= కురువంశాన్ని ఉద్ధరించేవాడైన-ధృతరాష్ట్రుడు; తా(న్)= తాను (స్వయంగా); నా ధనమును= నా సంపదనూ; అర్జున+అర్థమును= అర్జునుడి సంపదను; కొని= స్వీకరించి; శ్రాద్ధములు= భీష్మాదులకొరకు శ్రాద్ధకర్మలు; ప్రభూత విధానములన్= శ్రేష్ఠమయిన పద్ధతులలో- ఘనంగా; నిజ+ఇచ్ఛన్= తన ఇష్టానుసారంగా; ఆచరించువాఁడు= చేస్తాడు; ఇది= ఇట్లా చేయటం; మత్+ఆత్మకున్= నా అంతరంగానికి; ఇంపు= ఇష్టం; అని= అని; విన్నవింపుమీ= ఆ ధృతరాష్ట్రుడికి (నా మాటగా) వినయంగా చెప్పుము.

తాత్పర్యం: అర్జునుడి మాటలు విని ధర్మరాజు చాలా సంతోషించాడు. వాత్సల్యంతో అర్జునుడిని ప్రశంసించాడు. విదురుడిని చూచి - 'పుణ్యాత్ముడా! కురువంశాన్ని ఉద్ధరించే దృతరాష్ట్రుడు నా సంపదలూ, అర్జునుడి సంపదలూ తీసికొని తన ఇష్టప్రకారం ఘనంగా శ్రాద్ధకర్మలు చేస్తాడు. ఇట్లా చేయటమే నా మనసుకు ఇష్టం అని నీవు ధృతరాష్ట్రుడితో విన్నవించుము' (అన్నాడు).

వ. అని చెప్పి మఱియు ని ట్లనియె. 122

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; చెప్పి= విదురుడితో పలికి; మఱియున్= మళ్ళీ; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= (ధర్మరాజు) అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పి మళ్ళీ ధర్మరాజు విదురుడితో ఇట్లా అన్నాడు.

క. **'వనవాసాయాసంబుల । ననయంబును నలఁగి దాని నాత్మ నిడి మరు**
త్తనయుండు పెక్కులాడెఁ ద । గని మాటల; దీన రాజుఁ గనలకు మనుమీ! **123**

ప్రతిపదార్థం: మరుత్+తనయుండు= (వాయుపుత్రుడు) భీముడు; వనవాస-ఆయసంబులన్= అరణ్యావాసంలో కలిగిన శ్రమ వలన; అనయంబును= మిక్కిలిగా; నలఁగి= బాధపడి; దానిన్= ఆ బాధను; ఆత్మన్= మనసులో; ఇడి= ఉంచుకొని; తగని మాటలన్= అనుచితమైన మాటలు; పెక్కులు= చాలా; ఆడెన్= అన్నాడు; రాజున్= ధృతరాష్ట్రుడిని; దీనన్= ఈ అంశంలో; కనలకుము= కోపించవద్దు; అనుము+ఈ= అని చెప్పుము.

తాత్పర్యం: అరణ్యావాసంలో చాలా శ్రమపడ్డవాడు కాబట్టి భీముడు ఆ బాధలు మనసులో పెట్టుకొని అనుచితమైన మాటలు ఏవో చాలా అన్నాడు. అందుకు, ధృతరాష్ట్రుడితో కోపగించుకొనవద్దని చెప్పుము. (అని ధర్మరాజు విదురుడితో అన్నాడు).

క. **ఇతఁ డేమి యన్ననే మగు? ధృతరాష్ట్రుఁడు మాకుఁ బరమదేవత; విను స**
మ్మతిఁ దత్ప్రసాదముం బడ । సితి మేమును దత్కృతాభిషిక్తుల మనఘా! **124**

ప్రతిపదార్థం: ఇతఁడు= ఈ భీముడు; ఏమి+అన్నన్= ఏ విధంగా మాటాడితే మాత్రం; ఏమి-అగున్?= ఏమవుతుంది?; ధృతరాష్ట్రుడు= ధృతరాష్ట్రుడు; మాకున్= పాండవులకు; పరమ దేవత= ఉత్కృష్టమైన దేవుడు; అనఘా!= పాపం లేనివాడా! (విదురా!); విను= వినవలసింది; సమ్మతిన్= నిండు మనస్సుతో; తద్-ప్రసాదమున్= ఆ ధృతరాష్ట్రుడియొక్క అనుగ్రహాన్ని; పడసితిమి= పొందాము; ఏమును= మేం; తద్+కృత+అభిషిక్తులము= ఆ ధృతరాష్ట్రుడి చేత ఈ రాజ్యానికి అభిషేకించబడినవాళ్ళం.

తాత్పర్యం: (విదురా!) ఈ భీము డేమంటే మాత్రం ఏమవుతుంది? ధృతరాష్ట్రుడే మాకు ఉత్తమ దైవం. హృదయపూర్వకంగా ఆయన అనుగ్రహాన్ని మేము పొందాము. ఆయనే ఈ రాజ్యానికి మమ్మల్ని అభిషేకించాడు'.

వ. **అని పలికి యప్పుడమితేఁడు వికచవదనుం డగుచు.** **125**

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; పలికి= చెప్పి; ఆ+పుడమితేఁడు= ఆ (ధర్మ)రాజు; వికచవదనుండు= వికసించిన ముఖం కలిగినవాడు; అనుచున్= అవుతూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: ఆ విధంగా చెప్పిన తరువాత ధర్మరాజు ముఖవికాసంతో.

క. **మా తండ్రి నిష్ట విధములఁ । బైతృక విధు లాచరింపఁ బంపుము రథ్య**
వ్రాత కనక గో రథములన్ । జేతి కొదవ నర్జునుండు చేర్చుచు వచ్చున్. **126**

ప్రతిపదార్థం: మా తండ్రిన్= ధృతరాష్ట్రుడిని; పైతృక విధులు= భీష్మాది పితృదేవతలకు శ్రాద్ధకర్మలు; ఇష్ట విధములన్= తనకు నచ్చిన తీరుగా; ఆచరింపన్= చేయటానికి; పంపుము= సిద్ధం చేయుము; అర్జునుండు= అర్జునుడు; చేతికి+ఒదవన్= చేతికి అందేటట్లు; రథ్యవ్రాత, కనక, గో, రథములన్= గుర్రాల సమూహము, బంగారమూ, ఆవులూ, రథాలూ; చేర్చుచున్= ఏర్పాటు చేస్తూ; వచ్చున్= వస్తాడు.

తాత్పర్యం: భీష్మాదులైన పితృదేవతలకు శ్రాద్ధకర్మలు తనకు నచ్చినట్లుగా నిర్వహించేటట్లు ధృతరాష్ట్రుడిని సిద్ధం చేయుము. అర్జునుడు ఉత్సాహంగా పెక్కు గుర్రాలూ, బంగారమూ, ఆవులూ, రథాలూ ఏర్పాటు చేస్తాడు.

క. గ్రామములు దేవతలకును । భూమిసురులకును గురు ప్రభువు ని మ్మను మీ
పో మసలితి చెపు మాతని । కీ మాటలు వలయు పనుల కీవు మెలఁగుమీ! 127

ప్రతిపదార్థం: గురు ప్రభువున్= గురువైన (కురునాథుడైన) ఆ ధృతరాష్ట్ర మహారాజును; దేవతలకును= దేవతలకూ; భూమిసురులకును= బ్రాహ్మణులకూ; గ్రామములు= ఊళ్ళు; ఇమ్ము+అనుము+ఈ= దానంగా ఇవ్వుమని చెప్పు; పోన్= ధృతరాష్ట్రుడి వద్దకు వెళ్ళడానికి; మసలితి(వి)= ఇప్పటికే ఆలస్యం చేశావు; అతనికిన్= ఆ ధృతరాష్ట్రుడికి; ఈ మాటలు= (మేము)-నేను (అర్జునుడూ) చెప్పుమన్న మాటలు; చెపుము= నువ్వు చెప్పవలసింది; వలయు పనులకున్= అతడికి అవసరమైన పనులకు; ఈవు= నీవు (విదురుడు); మెలఁగుము+ఈ= నడుచుకొమ్ము (ఆయనకు అవసరమైన పనులు నీవు దగ్గరుండి చూస్తూ వుండుము).

తాత్పర్యం: మాకు తండ్రీ, పాలకుడూ అయిన ధృతరాష్ట్రుడిని దేవతలకూ బ్రాహ్మణులకు ఊళ్ళు ఇమ్మని చెప్పుము. నీవు ధృతరాష్ట్రుడి వద్దకు తిరిగి వెళ్ళటానికి, ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. నేను చెప్పిన మాటలు అతడికి చెప్పుము. అవసరమైన పనులు నీవు చూస్తూ ఉండుము.

క. అనినఁ బ్రియ మంది విదురుఁడు । చని యాన్నృపుతో నజాతశత్రు కడకు నీ
పనిచిన పనికిం బోయితి । వినిపించితిఁ దెఱఁ గతండు విని మోదమునన్. 128

ప్రతిపదార్థం: అనినన్= ధర్మరాజు ఆ విధంగా చెప్పగా; విదురుఁడు= విదురుడు; ప్రియము+అంది= సంతోషించి; చని= ధృతరాష్ట్రుడి వద్దకు వెళ్ళి; ఆ నృపుతోన్= ఆ (ధృతరాష్ట్ర) రాజుతో, - (ఇట్లా అన్నాడు). అజాతశత్రు కడకున్= ధర్మరాజు వద్దకు; నీ-పనిచినపనికిన్= నీవు పంపిన పనికొరకు; పోయితిన్= వెళ్ళాను; తెఱఁగు= నీవు చెప్పిన విధం; వినిపించితిన్= (ధర్మరాజుకు) చెప్పాను; అతండు= ఆ ధర్మరాజు; విని (నీ ఉద్దేశాన్ని)= నేను చెప్పినదాన్ని గ్రహించి; మోదమునన్= ఆనందంతో - (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: ధర్మరాజు మాటలకు విదురుడు చాలా సంతోషించాడు. వెంటనే ధృతరాష్ట్రుడి వద్దకు వెళ్ళాడు. ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు. 'నీవు పంపిన పనికొరకు ధర్మరాజు వద్దకు వెళ్ళాను. విషయం చెప్పాను. అతడు సంతోషించాడు.

క. నరువలను సూచె నతఁడుం । బరమ ప్రియ భరితుఁ డయ్యెఁ బార్థివవర! య
య్యిరువురుఁ బ్రాణంబులు డాఁ । పరు నీకును ధనము దాఁచు పని కలిగెడినే? 129

ప్రతిపదార్థం: నరు వలను= (ధర్మరాజు) అర్జునుడి (దిక్కు) వైపు; చూచెన్= చూచాడు; అతఁడున్= అర్జునుడు కూడా; పరమ ప్రియ భరితుఁడు= అత్యధిక సంతోషంతో నిండినవాడు; అయ్యెన్= అయినాడు; పార్థివవర!= ఓ ధృతరాష్ట్ర రాజా!; ఆ+ఇరువురు= ఆ ఇద్దరు, (ధర్మరాజూ, అర్జునుడూ); నీకును= నీకోసం; ప్రాణంబులు(ను)= తమ ప్రాణాలు సైతం; డాఁపరు= దాచుకునే వారు కాదు; ఇంక, ధనము= సంపద; దాఁచుపని= ఇవ్వకుండా దాచి పెట్టుకొనటం అనేది; కలిగెడిన్+ఏ?= సంభవిస్తుందా?

తాత్పర్యం: నీ కోరిక విని సంతోషించిన ధర్మరాజు అర్జునుడివైపు చూచాడు. అర్జునుడు ఇంకా ఎంతో సంతోషించాడు. ఓ రాజా! ఆ ధర్మరాజూ, అర్జునుడూ ఇద్దరూ నీ కొరకు తమ ప్రాణాలు సైతం దాచుకొనరు. ఇక సంపద దాచుకొనటం అనేది సంభవమా?

విశేషం: (అ-య్యిరువురు.....పని కలిగెడునే?....అలంకారం= కావ్యార్థాపత్తి...కైముత్యే నార్థసంసిద్ధిః కావ్యార్థాపత్తి రిష్యతే! (సజితస్త్వన్ముఖేనేందుః కా వార్తా సరసీరుహమ్)

క. చేయుము విచ్చలవిడి గాం। గేయ ప్రముఖులు నిరస్త కిల్బిషు లై మో
దాయత్త చిత్తులుగ భూ। నాయక! శ్రాద్ధములు జగమునం బొగ డెసఁగన్. 130

ప్రతిపదార్థం: భూ-నాయక!= రాజా!; గాంగేయ ప్రముఖులు= భీష్ముడు మొదలైనవారు; నిరస్త-కిల్బిషులు+ఐ= తొలగిపోయిన పాపాలు కలవారై; మోద+ఆయత్త-చిత్తులు గన్= సంతోషంతో నిండిన మనసు కలవారు అయ్యే విధంగా; జగమునన్= లోకంలో; పొగడు= ప్రశంస; ఎసఁగన్= పెరిగే విధంగా; శ్రాద్ధములు= పరలోక క్రియలు; విచ్చలవిడిన్= యథేచ్ఛగా; చేయుము= ఆచరించుము.

తాత్పర్యం: రాజా! భీష్ముడు మొదలైన వాళ్ళందరూ తమ తమ పాపాలు పోగొట్టుకొని, మనసు నిండా సంతోషించే విధంగానూ, లోకంలో (నీకు) మంచిపేరు వచ్చే విధంగానూ, నీ ఇష్టం వచ్చిన విధంగా వాళ్ళకు శ్రాద్ధకర్మలు చేయుము.

చ. కనకము మేలి రత్నములు గ్రామములన్ హయగోవ్రజంబులుం
దనియఁగ నిమ్ము సర్వవసుధాసుర కోటులకున్ నిజేచ్ఛ నీ
తనయులు పుణ్యలోక సుఖధామము లై విలసిల్లునట్లుగా'
ననుటయు నాంబికేయుహృదయంబున మోదమెలర్చె భూవరా! 131

ప్రతిపదార్థం: నీ తనయులు= నీ కొడుకులైన దుర్యోధనాదులు; పుణ్యలోక సుఖ ధామములు+ఐ= పుణ్యకర్మలు ఉండే మంచి లోకాలలోని సుఖాలకు నిలయాలు, అయి; విలసిల్లు+అట్లు కాన్= ప్రకాశించే తీరుగా; సర్వ వసుధా సురకోటులకున్= సమస్తమైన బ్రాహ్మణుల సమూహాలకు; తనియన్= తృప్తిగా; కనకము= బంగారూ; మేలి రత్నములు= మంచి విలు వైన రత్నాలూ; గ్రామములున్= ఊళ్ళూ; హయ, గో, వ్రజంబులున్= గుర్రాలు, ఆవుల మందలూ; నిజ+ఇచ్ఛన్= నీ యిష్టం వచ్చినట్లుగా; ఇమ్ము= దానం చేయుము; భూవరా!= (ఓ జనమేజయమహా) రాజా!; అనుటయున్= విదురుడు అట్లా అనగానే; ఆంబికేయు హృదయంబునన్= ధృతరాష్ట్రుడి మనస్సులో; మోదము= సంతోషం; ఎలర్చెన్= అతిశయించింది.

తాత్పర్యం: నీ కొడుకులు - దుర్యోధనాదులు పుణ్యలోక సుఖాలకు నివాసాలు అయ్యే విధంగా, సమస్తమైన బ్రాహ్మణ సమాజానికీ, వాళ్ళు తృప్తిపడేంతగా, నీ ఇష్టం వచ్చినట్లుగా, బంగారమూ, మంచి రత్నాలూ, ఊళ్ళూ గుర్రాల, ఆవుల మందలూ, దానం చేయుము. 'ఓ జనమేజయ మహారాజా! విదురు డిట్లా అనటంతోటే ధృతరాష్ట్రుడికి మనసులో సంతోషం అధికమైనది.

చ. పదపడి భీముమాట లొకభంగి నెఱుంగఁగఁ జెప్పి, 'వాఁడు దు
ర్మదుఁ, డవి పాటి గావు కురురాజ మహత్తర! పెట్టకుండు నీ

హృదయమునందు వాని నని యేర్పడ ధర్మజు పార్థువాక్యముల్
విదురుఁడు సెప్పె సంతసము వెల్లిగొనంగ ననేకభంగులన్. 132

|ప్రతిపదార్థం: పదపడి= అనంతరం; భీము మాటలు= ధృతరాష్ట్రుడి కోర్కె విషయమై భీముడు అన్న మాటలను; ఒక భంగిన్= ఒక విధంగా; ఎఱుంగఁగన్= (ధృతరాష్ట్రుడికి) తెలిసేటట్లుగా; చెప్పి= పలికి; కురురాజ మహత్తర!= కురువంశపు రాజులలో మేలైన (ధృతరాష్ట్ర) రాజా!; వాఁడు= ఆ భీమసేనుడు; దుర్మదుఁడు= (చెడు) గర్వం కలవాడు; అని= (మదంతో) ఆ (భీముడు) పలికిన మాటలు; పాటి కావు= లెక్క చేయదగినవి కావు; వానిన్= ఆ మాటలను; నీ హృదయమునందున్= నీ మనస్సులో; పెట్టక+ఉండు(ము)= పెట్టుకొనకుము; అని= అనే ప్రకారంగా; సంతసంబు= (ధృతరాష్ట్రుడికి) సంతోషం; అనేక భంగులన్= బహువిధాలుగా - (మిక్కుటంగా); వెల్లి; కొనంగన్= ప్రవాహం కాగా; విదురుఁడు= విదురుడు; ధర్మజు, పార్థు, వాక్యముల్= ధర్మరాజూ, అర్జునుడూ చెప్పిన మాటలను; ఏర్పడన్= వివరంగా; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: తరువాత ఆ సందర్భంలో భీముడన్న మాటలు గూడా విదురుడు ఒక విధంగా ధృతరాష్ట్రుడికి తెలియజేశాడు. 'కురు రాజా! ఆ భీముడు దురహంకారి. అహంకారంతో అతడు అన్న మాటలు లెక్క చేయదగినవి కావు. నీవు వాటిని మనసులో పెట్టుకొనవద్దు' అని ధృతరాష్ట్రుడికి ఆనందం పొంగి ప్రవహించే విధంగా ధర్మరాజూ, అర్జునుడూ చెప్పిన మాటలను విదురుడు ధృతరాష్ట్రుడికి వివరంగా చెప్పాడు (అని వైశంపాయనుడు జనమేజయుడితో చెప్పాడు.)

ఆ. **అట్లు సంతసిల్లి యధిప కార్తిక పౌర్ణ। మాసి నవ్విభుండు మహిత భూమి**
దేవకోటి నెల్ల రావించి యంచిత। శ్రద్ధఁ జేయఁ దొడఁగె శ్రాద్ధవిధులు. 133

|ప్రతిపదార్థం: అధిప!= (ఓ జనమేజయ) రాజా!; అట్లు= ఆ ప్రకారంగా; ఆ+విభుండు= ఆ (ధృతరాష్ట్ర) రాజు; సంతసిల్లి= ఆనందించి; కార్తిక పౌర్ణమాసిన్= కార్తికమాసంలో పూర్ణిమనాడు; మహిత భూమి దేవ కోటిన్= శ్రేష్ఠులైన బ్రాహ్మణుల సమూహాన్ని; ఎల్లన్= అంతటినీ; రావించి= రప్పించి; అంచిత శ్రద్ధన్= మిక్కిలి ఆసక్తితో; శ్రాద్ధ విధులు= పితృదేవతలకు శ్రాద్ధ కర్మలను; చేయన్+తొడఁగెన్= చేయటం మొదలుపెట్టాడు.

తాత్పర్యం: జనమేజయ మహారాజా! ఆ ప్రకారంగా, ధర్మరాజార్జునుల అభిప్రాయాన్ని విదురుడి మాటలలో విని ధృతరాష్ట్రుడు చాలా సంతోషించాడు. కార్తికమాసంలో పూర్ణిమనాడు మంచి బ్రాహ్మణులను అందర్నీ పిలిపించి, భీష్మాదుల నుద్దేశించి మిక్కిలి ఏకాగ్రతతో, శ్రాద్ధకర్మలు చేయ నారంభించాడు.

సీ. **కనకాది వస్తువుల్ గడువేడ్క ధర్మనం। దనుఁడు పుత్తేర నుదాత్త భంగి**
బాహ్లికునకు, గంగపట్టికి, సోమద। త్తునకుఁ దదీయపుత్త్రునకుఁ దొలుత
నంచిత శ్రాద్ధంబు లాచరించె సుయోధ। నాది కుమారుల కందఱకును
బేర్వేర క్రియలు నీప్సిత విధంబులఁ దగ। నొనరించె సింధురాజునకుఁ దక్కుఁ

ఆ. **గలుగు బంధులకును వలయు రాజులకును। ద్రోణునకును బుద్ధిఁ దోఁచినట్టి**
యిష్టజనములకు నహీన భవ్యప్రకా। రములఁ బారలౌకికము లొనర్చి. 134

ప్రతిపదార్థం: ధర్మనందనుఁడు= ధర్మరాజు; కడున్= మిక్కిలి; వేడ్కన్= ఉత్సాహంతో; కనక+ఆది వస్తువుల్= బంగారం మొదలైన అవసర వస్తువులను; పుత్తేరన్= పంపించగా; ఉదాత్త భంగిన్= మంచిమార్గంలో ధృతరాష్ట్రుడు; తొలుతన్= మొదట; బాహ్లికునకున్= బాహ్లికుడికీ; గంగపట్టికిన్= గంగ కొడుకైన భీష్ముడికీ; సోమదత్తునకున్= సోమదత్తుడికీ; తదీయ పుత్త్రునకున్= సోమదత్తుడి కొడుకైన భూరిశ్రవసుడికీ; అంచిత శ్రాద్ధంబులు= తగిన (గొప్ప) విధంగా శ్రాద్ధ కర్మలను; ఆచరించెన్= చేశాడు; సుయోధన+ఆది కుమారులకున్= దుర్యోధనుడు మొదలైన కొడుకులు; అందఱకును= అందరికీ; పేర్వేర!= పేరు పేరునా; ఈ పితృవిధంబులన్= తన ఇష్టం వచ్చినట్లుగా; తగన్= తగినట్లుగా; క్రియలు= శ్రాద్ధకర్మలు; ఒనరించెన్= చేశాడు; సింధురాజునకున్= సింధుదేశపు రాజైన (అల్లుడు) సైంధవుడికీ; తక్కు కలుగు బంధులకును= మిగిలిన తన ఇతర బంధువులకూ; వలయు రాజులకును= అవసరమైన మిత్ర రాజులకూ; ద్రోణునకును= ద్రోణాచార్యుడికీ; బుద్ధిన్= తన మనస్సుకు; తోఁచిన అట్టి ఇష్ట జనములకున్= స్ఫురించిన తనకు ఇష్టమైన వాళ్ళకు; అహీన భవ్య ప్రకారములన్= తక్కువ కాని, తగిన (మన) పద్ధతులలో; పార లౌకికములు= ఊర్ధ్వలోకాలు కలిగించేటటువంటి (శ్రాద్ధ) కర్మలను; ఒనర్చి= చేసి.

తాత్పర్యం: ధర్మరాజు ఎంతో ఉత్సాహంగా, బంగారం, రత్నాలు, ఆవులు మొదలైన వస్తువులు పంపించాడు. ధృతరాష్ట్రుడు వాటితో, గొప్పగా-బాహ్లికుడికీ, సోమదత్తుడికీ, భూరిశ్రవసుడికీ, శ్రేష్ఠమైన విధంగా శ్రాద్ధకర్మలు చేశాడు. తన కొడుకులు అందరికి పేరు పేరునా, ఇష్టానుసారం తగు విధంగా శ్రాద్ధకర్మలు చేశాడు. తర్వాత అల్లుడైన సైంధవుడికీ, ఇంకా మిగిలి ఉన్న బంధువులకూ, అవసరం అనిపించిన మిత్రులైన రాజులకూ, ద్రోణుడికీ, ఇంకా మనసుకు తోచిన, తన కిష్టమైన వారికీ, లోటు లేనివిధంగా ఉత్తమలోకాలు కలిగించే శ్రాద్ధక్రియలను చేసి. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. అతులితరత్న కాంచన గవాశ్వ విభూషణ వస్త్రకన్యకా
క్షితిముఖ వస్తుదానములు గీర్తన కెక్కఁగ నవ్విభుండు సు
వ్రతుఁ డయి చేసెఁ బంచదశవాసరముల్ నిజదానలౌల్య మ
ప్రతిహత వృత్తిఁ జెల్ల విని పాండుసుతాగ్రణి ప్రీతిఁ బొందఁగన్. 135

ప్రతిపదార్థం: ఆ+విభుండు= ఆ ధృతరాష్ట్రుడు; సువ్రతుఁడు+అయి= మిక్కిలి దీక్ష కలిగినవాడై; నిజ దాన లౌల్యము= దానం చేయాలనే తన అత్యధికమైన వాంఛ; అప్రతిహత వృత్తిన్= అడ్డులేని విధంగా; చెల్లన్= సాగుతుండగా; పాండుసుత+అగ్రణి= పాండురాజు కొడుకులలో పెద్దవాడైన ధర్మరాజు; విని= అది (ధృతరాష్ట్రుడు స్వేచ్ఛగా చేస్తున్న దానాది విషయాలు) తెలిసికొని; ప్రీతిన్= ఆనందాన్ని; పొందఁగన్= పొందుతుండగా; కీర్తనకున్= అందరి ప్రశంసకు; ఎక్కఁగన్= పొందే విధంగా; పంచదశవాసరముల్= పదిహేను రోజుల పాటు; అతులిత-రత్న-కాంచన-గో-అశ్వ-విభూషణ-వస్త్ర-కన్యకా-క్షితి-ముఖ-వస్తు-దానములు= సాటి లేనటువంటి రత్నాలూ, బంగారమూ, ఆవులూ, గుర్రాలూ, ఆభరణాలు, వస్త్రాలూ, కన్యలూ, నేలా, మొదలైన వస్తువుల దానం; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: ఆ ధృతరాష్ట్రుడు శ్రాద్ధ కర్మాచరణంలో మిక్కుటమైన దీక్ష కలిగినవాడై దానం చేయాలనే తన కోరిక అడ్డు లేని విధంగా సాగుతుంటే, అది తెలిసి ధర్మరాజు ఆనందిస్తుండగా, అందరూ ప్రశంసించే విధంగా, పదిహేను రోజులపాటు సాటిలేని రత్నాలూ, బంగారమూ, ఆవులూ, గుర్రాలూ, అలంకారాలూ, వస్త్రాలూ, కన్నెలూ, ఊళ్ళూ, మొదలైన అనేక వస్తువులను దానం చేశాడు.

ఆ. భూమి దాన విధులు భూవర యొక మాత్ర। నంబికాతనూజుఁ డాచరింప
నంతఁ బోక యూళు లగ్రజన్ములకు నీ నతనిఁ బనిచెఁ బాండవాగ్రజుండు. 136

ప్రతిపదార్థం: భూవర!= ఓ జనమేజయ మహారాజా!; అంబికా తనూజుఁడు= అంబిక కొడుకైన ధృతరాష్ట్రుడు; అగ్రజన్ములకున్= బ్రాహ్మణులకు; భూమిదానవిధులు= నేలను దానం చేసే పనులు; ఒక మాత్రన్= కొంతగా; ఆచరింపన్= చేయగా; పాండవ+అగ్రజుండు= (పాండురాజు కొడుకులలో పెద్దవాడైన) ధర్మరాజు; అంతన్+పోక= అంతటితో ఆగకుండా; ఊళులు= గ్రామాలు; ఈన్= ఇంకా దానం చేయటానికి; అతనిన్= ఆ ధృతరాష్ట్రుడిని; పనిచెన్= ప్రోత్సహించాడు.

తాత్పర్యం: ఓ జనమేజయ మహారాజా! ధృతరాష్ట్రుడు బ్రాహ్మణులకు భూదానం కొంత చేస్తే, ధర్మరాజు అంతటితో ఆగకుండా, ఇంకా ఊళ్లకు ఊళ్ళు ఆ ధృతరాష్ట్రుడిచేత దానం చేయించాడు.

ధృతరాష్ట్రుఁడు గాంధారీసహితుండై వనంబునకుఁ బోవుట (సం.15-20-1)

వ. పనిచినం బ్రియంబు పెంపున హృదయంబు పల్లవింప నా భూవల్లభుం డనేకగ్రామంబు లగ్రహారంబులు గావించి గాంధారరాజు మొద లయిన నిజ బంధువులకు బహుళ దక్షిణలుగాఁ బార లౌకిక క్రియలు చేసెనిట్లు ధృతరాష్ట్రుండు; భారత రణంబున మరణంబు నొందిన బంధు లోకంబునకుం బుణ్యలోక సౌఖ్యాతిశయ పదంబు లగు పరమ శ్రాద్ధంబులు నిర్వర్తించి కృతకృత్యుం డై సర్వ కృత్యంబులుం జలిపి పాడ్యమి నాఁడు। రేపకడ ఋత్విక్సమేతుం డై యిష్టి నడపి। పాండవులను దక్కటి బంధువులను మిత్రులను రావించి వనవాసంబునకు సంకల్పంబు చేసి, సకల భృత్యజనంబులకు నర్థదానంబు లిచ్చి, గాంధారీ సమన్వితుం డై వల్కలాజినంబులు ధరియించి, యక్షత గంధ పుష్పంబుల గృహంబుఁ బూజించి సర్వపదార్థంబులుం బరిత్యజించి యద్దేవియుఁ గదిసి నడవ యాజకు లగ్నులు నుపకరణంబులును ధరియించి ముందటం జేరువ నరుగ నగరు వెడలె, నట్టియెడ నేతెంచి. 137

ప్రతిపదార్థం: పనిచినన్= ధర్మరాజు ఇంకా ఊళ్ళు దానం చేయుమని చెప్పగా; ఆ భూవల్లభుండు= ఆ ధృతరాష్ట్ర మహారాజు; ప్రియంబు పెంపునన్= ఆనందంయొక్క ఆధిక్యంతో; హృదయంబు= మనస్సు; పల్లవింపన్= చిగురించగా; అనేక గ్రామంబులు= చాలా ఊళ్లను; అగ్రహారంబులు= బ్రాహ్మణులకు దానంగా; కావించి= ఇచ్చి; గాంధార రాజు= గాంధార దేశపు రాజు (భార్య గాంధారికి తండ్రి సుబలుడు) మొదలు అయిన; నిజ-బంధువులకున్= మొదలుగా కలిగిన తన చుట్టాలకు; బహుళ దక్షిణలుగాన్= అనేకం (అధికమూ) అయిన దక్షిణలతో; పార లౌకిక క్రియలు= ఉత్తమ లోకాలు కలుగజేసే పనులు (శ్రాద్ధకర్మలు); చేసెన్= నిర్వహించాడు; ఇట్లు= ఈ విధంగా; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; భారత-రణంబునన్= మహాభారత యుద్ధంలో; మరణంబున్-ఒందిన= (చావును పొందిన) మరణించిన; బంధులోకంబునకున్= బంధువుల సముదాయానికి; పుణ్య-లోక-సౌఖ్య అతిశయ-పదంబులు= ఉత్తమ లోకాలకు సంబంధించిన, సుఖం యొక్క ఆధిక్యానికి, ఆశ్రయాలు; అగు= అయినటువంటి; పరమ-శ్రాద్ధంబులు= ఉత్కృష్టములైన శ్రాద్ధకర్మలు; నిర్వర్తించి= ఆచరించి; కృత-కృత్యుండు+అయి= చేయదలచిన (వారందరికి) శ్రాద్ధకర్మలు చేసినవాడై; సర్వకృత్యంబులున్= సమస్త కార్యాలూ; చలిపి= (కార్తిక పూర్ణిమ నుండి 15 రోజులలో పూర్తిగా) చేసి; పాడ్యమి నాఁడు= ఆ మరుసటి రోజు (మార్గశీర్ష? శుద్ధ) పాడ్యమి రోజున; రేపకడ= ప్రాతఃకాలంలోనే; ఋత్విక్+సమేతుండు+ఐ= ఋత్విక్కులతో కూడినవాడై; ఇష్టి= అరణ్యయాత్రకొరకు; ఉదవసీయం అనే యజ్ఞం; నడపి= జరిపి; పాండవులను= పాండురాజు కొడుకులనూ (ధర్మరాజాదులనూ); తక్కటి-బంధువులను= ఇంకా ఇతర బంధువులనూ; మిత్రులను= స్నేహితులనూ; రావించి= రప్పించి; వనవాసంబునకున్= అరణ్యాల (కు వెళ్ళి) అందు నివసించటానికి; సంకల్పంబు చేసి= తన ఉద్దేశాన్ని చెప్పి;

సకల-భృత్య-జనంబులకున్= సమస్తమైన సేవకులకూ; అర్థ ధనంబులు= వారి వారి స్థాయికి తగినంతగా సంపదలను; ఇచ్చి= ఇచ్చి; గాంధారీ-సమన్వితుండు+ఐ= భార్య గాంధారితో కూడినవాడై; వల్కల+అజినంబులు= నారబట్ట, జింకచర్మాలూ; ధరియించి= కట్టుకొని; గృహంబున్= తన మందిరాన్ని, (విడిచేముందు); అక్షత-గంధ-పుష్పంబులన్= అక్షతలతోనూ, గంధంతోనూ, పూలతోనూ; పూజించి= అర్చించి; సర్వ పదార్థంబులున్= అన్ని విధములైన (గృహసంబంధి) వస్తువులనూ; పరిత్యజించి= విడిచిపెట్టి; ఆ+దేవియున్= భార్య; (గాంధారి); కదిసి-నడవన్= వెన్నంటి నడచి వస్తూండగా; ముందటన్= ఎదుట; చేరువన్= సమీపంలో; యాజకులు= యజ్ఞం చేసేవారు; అగ్నులు= అగ్నులనూ; ఉపకరణంబులును= సమిధలు మొదలైన ఇతర సాధనాలూ; ధరియించి= పుచ్చుకొని; అరుగన్= నడుస్తుండగా; (ధృతరాష్ట్రుడు) నగరు= తన అభ్యంతరమందిరాన్ని; వెడలెన్= దాటాడు; అట్టి-ఎడన్= ఆ సమయంలో; ఏతెంచి= అక్కడికి వచ్చి, (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ధర్మరాజు ఇంకా అధికంగా బ్రాహ్మణులకు గ్రామాలు దానం చేయుమని ధృతరాష్ట్రుడిని ప్రోత్సహించగా ధృతరాష్ట్రుడు అందుకు మనసులో చాలా సంతోషించాడు. అనేకాలైన గ్రామాలను బ్రాహ్మణులకు దానంగా అగ్రహారాలుగా ఇచ్చాడు. గాంధారరాజు మొదలైన చుట్టాలకు అధిక దక్షిణలతో శ్రాద్ధకర్మలు చేశాడు. ఈ విధంగా ధృతరాష్ట్రుడు భారతయుద్ధంలో మరణించిన తన బంధువులందరికీ ఉత్తమలోకాల సౌఖ్యం కలుగజేసే శ్రాద్ధ కర్మలు చేసి తన కోర్కె నెరవేర్చుకొన్నాడు. (అరణ్యగమనానికి వీలుగా) మిగిలిన అన్ని పనులూ పూర్తిచేసికొని మర్నాడు అంటే మార్గశీర్ష శుద్ధ పాడ్యమి నాడు ఉదయాననే ఋత్విక్కులను కూర్చుకొని, గృహం విడిచిపోవడానికి-ఉదవసీయం అనే యజ్ఞం చేశాడు. పాండవులనూ, మిగిలిన బంధువులనూ, తన స్నేహితులనూ అందరినీ పిలిపించాడు. అరణ్యాలకు బయలుదేరుతున్న విషయం చెప్పాడు. సేవకులకు అందరికీ వారి వారి స్థాయికి తగిన విధంగా ధనమిచ్చి గౌరవించాడు. గాంధారితో కలిసి, నారచీరలూ, జింకచర్మాలూ ధరించి, అక్షతలూ, గంధమూ, పుష్పాలతో ఇంటిని పూజించాడు. అందుకు సంబంధించిన వస్తువులన్నిటినీ విడిచిపెట్టాడు. భార్య వెన్నంటి నడుస్తుండగా, యాజకులు, అగ్నులు, సమిధలు మొదలైన సాధనాలను తీసికొని తనకు ముందుగా సమీపంలో వెళ్లుతుండగా వారి వెనుకే బయలుదేరి మందిరం దాటి వచ్చాడు. ఆ సమయంలో అక్కడికి-కుంతీ ప్రభృతులు వచ్చారు.

విశేషం: కార్తిక పూర్ణిమనాడు శ్రాద్ధకర్మ లారంభించాడు ధృతరాష్ట్రుడు. దానాదులతో 15 రోజులు (135పద్యం) ఆ పనులు చేశాడు. మర్నాడు పాడ్యమి అంటే మార్గ శీర్ష శుద్ధ ప్రతిపత్తు నాడు అరణ్యానికి బయలుదేరాడన్నమాట. ధృతరాష్ట్రుడు గృహాన్ని వీడు కొలిపిన సన్నివేశాన్ని ఒక క్రమంలో ప్రత్యక్షంగా ప్రదర్శించటం ఇక్కడి రచనలో విశేషం.

క. గొంతి మొద లైన కౌరవ। కాంతా జను లెల్ల నెవ్వగలఁ బొగులుచుఁ బ
క్ష్మాంతంబుల బాష్పసలిల। సంతానము లురలఁ దోన చనుదేరంగన్ 138

ప్రతిపదార్థం: గొంతి= కుంతీదేవి; మొదలు+ఐన= మొదలైన; కౌరవ-కాంతా-జనులు= కురువంశపు స్త్రీలు; ఎల్లన్= అందరూ; నెవ్వగలన్= సంపూర్ణమైన విచారంతో; పొగులుచున్= దుఃఖిస్తూ; పక్ష్మ+అంతంబులన్= కనురెప్పల కొనలనుండి; బాష్ప-సలిల-సంతానములు= కన్నీటి బిందువుల సమూహాలు; ఉరలన్= దొర్లిపడుతుండగా; తోన్+అ= ఆ ధృతరాష్ట్రుడి వెంట; చనుదేరంగన్= వస్తూ ఉండగా- (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: కుంతి మొదలైన కురువంశపు స్త్రీలు అందరూ, మిక్కిలి దుఃఖంతో కుమిలిపోతూ కనురెప్పల చివరల నుండి కన్నీటి చుక్కలు రాలి పడుతుండగా వెంట వస్తూ ఉంటే-

వ. అజ్జనపతి చనుచుండె. 139

ప్రతిపదార్థం: ఆ+జనపతి= ఆ ధృతరాష్ట్రుడు; చనుచున్+ఉండె(న్)= పోతూ ఉన్నాడు.

తాత్పర్యం: (కుంతీప్రభృతి స్త్రీ లందరూ విచారిస్తూ వెంట వస్తూ ఉండగా) ఆ ధృతరాష్ట్రుడు (అరణ్యాభిముఖంగా) ముందుకు వెళ్ళుతూ ఉన్నాడు.

తే. పాండవాగ్రజుఁ డక్కురుభర్తవలను । శోకదీనుఁడై తప్పక చూచి యేడ్చి
'హా మహారాజ ముఖ్య! యెం దరిగె?' దనుచు । నొడలు కంపింపఁ జదికిలఁ బడియె నధిప! 140

ప్రతిపదార్థం: అధిప!= ఓ జనమేజయ మహారాజా!; పాండవ+అగ్రజుఁడు= (పాండురాజు కొడుకులలో పెద్దవాడైన) ధర్మరాజు; ఆ+కురు భర్తవలను= ఆ (కురువంశపురాజు) ధృతరాష్ట్రుడి వైపు; శోక-దీనుఁడు+ఐ= విచారం వలన జాలికొలిపే వాడు అయి; తప్పక= అదే పనిగా (దీర్ఘంగా); చూచి= చూచి; ఏడ్చి= రోదించి; హా-మహారాజ ముఖ్య!= అయ్యో! మహారాజులలో ప్రధానుడా? (ధృతరాష్ట్రుడా); ఎందున్= ఎక్కడికి; అరిగెదు= వెళ్తున్నావు; అనుచున్= అంటూ; ఒడలు= తన శరీరం; కంపింపన్= వణకుతుండగా; చదికిలఁ బడియెన్= కూలబడిపోయాడు.

తాత్పర్యం: జనమేజయ మహారాజా! ఆ విధంగా నగరు విడిచివెళ్ళిపోతున్న ధృతరాష్ట్రుడిని, ధర్మరాజు రెప్పవేయకుండా, దుఃఖంతో జాలిగొలుపుతూ చూచి, 'ఏడ్చి అయ్యో మహారాజా!' ఎక్కడికి వెళ్ళుతావు అంటూ ఒళ్ళు వణకిపోతూ ఉండగా కూలబడిపోయాడు.(అని వైశంపాయనుడు జనమేజయుడితో అన్నాడు)

క. నరుఁ డనునయించె వెస న । న్నరపతి నెత్తుచును దా ననయమున్ వనటం
బురపురఁ బొక్కెం గురు భూ । వర! యద్దెస తెఱఁగు రాదు వాక్రువ్వంగన్. 141

ప్రతిపదార్థం: కురు-భూ-వర= (కురువంశపు రాజులలో శ్రేష్ఠుడా!) (జనమేజయ) రాజా!; నరుఁడు= అర్జునుడు; వెసన్= త్వరగా, వెంటనే; ఆ+నరపతిన్= ఆ ధర్మరాజును; ఎత్తుచును= లేవదీస్తూ; అనునయించెన్= ఓదార్చాడు; తాన్= తాను గూడా; అనయమున్= మిక్కిలిగా; వనటన్= దుఃఖంచేత; పురపురన్-పొక్కెన్= అధికంగా కుమిలిపోయాడు; ఆ+దెస-తెఱఁగు= ఆ సన్నివేశం విధం; వాక్రువ్వంగన్= మాటలతో చెప్పటానికి; రాదు= సాధ్యం కాదు.

తాత్పర్యం: జనమేజయా! (దుఃఖాతిశయంచేత ధర్మరాజు నేలమీద చతికిలబడిపోవటంతో) అర్జునుడు వెంటనే సత్వరంగా ఆ ధర్మరాజును లేవదీసి ఓదార్చాడు. తాను కూడా దుఃఖంతో కుమిలిపోయాడు. వారిద్దరి దురవస్థ తీరు మాటలతో చెప్పడం సాధ్యం కాదు.

వ. భీమసేన నకుల సహదేవులును గృప యుయుత్సు సంజయులును ధౌమ్యాది ధరణీ సురులును శోక వ్యాకులత్వంబు నొందిరి; గొంతి యడలుచు గాంధారి కరంబు నిజస్కంధంబున నిడికొని నడవ నంధనృపతి గాంధారీ స్కంధ భాగ కలిత బాహుం డై పోవుచుండె నప్పడు పాంచాలియు సుభద్రయుఁజిత్రాంగదయు నులూపియు, సపుత్ర యగు నుత్తరయు మఱియుం గల యట్టి మగువలుం గురరీనిచయ నాదంబుల చందంబు దోఁప నాక్రందనంబు సేసి రయ్యవస్థ జూదంబునాఁడు పాండవులు పురంబు వెలువడునప్పటి దశం బోలియుండె నట్లు ధృతరాష్ట్రకానన గమనంబు నిశ్చితం బగుటయు నాబాల వృద్ధంబుగాఁ బురజనంబు గనుంగొనం జనుదెంచిన. 142

ప్రతిపదార్థం: భీమసేన-నకుల-సహదేవులును= భీముడూ, నకులుడూ, సహదేవుడూ; కృపయుయుత్సు-సంజయులును= కృపాచార్యుడూ, యుయుత్సుడూ (ధృతరాష్ట్రుడి కొడుకు), సంజయుడూ; ధౌమ్య+ఆది-ధరణీసురులును= ధౌమ్యుడు మొదలయిన బ్రాహ్మణులూ; శోక-వ్యాకులత్వంబున్= దుఃఖం చేత కలతను; ఒందిరి= పొందారు; గొంతి= కుంతీదేవి; అడలుచున్= దుఃఖిస్తూ; గాంధారి-కరంబు= గాంధారి చేతిని; నిజ-స్కంధంబునన్= తన భుజం మీద; ఇడికొని= ఉంచుకుని; నడవన్= నడుస్తుంటే; అంధ-నృపతి= ఆ గ్రుడ్డిరాజు, (ధృతరాష్ట్రుడు); గాంధారీ-స్కంధ-భాగ-కలిత-బాహుండు+ఐ= భార్య గాంధారియొక్క భుజ దేశం మీద (ఉంచిన తన చేయి కలవాడై) చేయి ఇచ్చి; పోవుచున్-ఉండెన్= పోతున్నాడు; అప్పుడు= ఆ సమయంలో; పాంచాలియున్= పాంచాల దేశపు రాజు (ద్రుపదుడి) కూతురు ద్రౌపదీ; సుభద్రయున్= సుభద్రా; చిత్రాంగదయున్= చిత్రాంగదా; ఉలూపియున్= ఉలూపీ; సపుత్ర= కొడుకుతో కలిసి (వచ్చి) ఉన్నది; అగు= అయిన; ఉత్తరయున్= (అభిమన్యుడి భార్య) ఉత్తరా; మఱియున్= ఇంకా; కల-అట్టి మగువలున్= మిగిలిన స్త్రీలూ; కురరీ-నిచయ-నాదంబుల-చందంబు= గొఱ్ఱె గుంపుల అరుపుల తీరు; తోఁపన్= స్ఫురించగా; ఆక్రందనంబు-చేసిరి= పెద్దగా ఏడ్చారు; ఆ+అవస్థ= ఆ స్థితి; జూదంబునాఁడు= ధర్మరాజు దుర్యోధనాదులతో జూదమాడిన రోజు; పాండవులు= పాండురాకుమారులు; పురంబున్= రాజధానిని; వెలువడిన-అప్పటి దశన్= విడిచి వెళ్ళేటప్పటి స్థితితో; పోలి-ఉండెన్= సమానమై ఉన్నది; అట్లు= ఆ విధంగా; ధృతరాష్ట్ర-కానన-గమనంబు= ధృతరాష్ట్రుడు అడవులకు వెళ్ళటం; నిశ్చితంబు= రూఢి; అగుటయున్= కాగా; పురజనంబు= ఆ నగరంలోని ప్రజలు; ఆబాలవృద్ధంబుగాన్= పిల్లలు మొదలుకొని వృద్ధులవరకూ అందరూ; కనుంగొనన్= ఆ ధృతరాష్ట్రుడిని చూడడానికి; చనుదెంచినన్= రాగా.

తాత్పర్యం: భీమనకుల సహదేవులూ, కృపుడూ, యుయుత్సుడూ, సంజయుడూ ఇంకా ధౌమ్యుడు మొదలైన బ్రాహ్మణులూ, దుఃఖంతో క్షోభించారు. కుంతి శోకిస్తూ గాంధారిచేతిని తన భుజంపై ఉంచుకొని నడుస్తున్నది. ధృతరాష్ట్రుడు గాంధారి భుజంపై చెయ్యివేసి పోతున్నాడు. అపుడు ద్రౌపదీ, అర్జునుడి భార్యలైన సుభద్రా, చిత్రాంగదా, ఉలూచీ, తనకొడుకును తీసికొని అభిమన్యుడి భార్య ఉత్తరా, ఇంకా అక్కడ ఉండే స్త్రీ జనం అంతా గొర్రెలమందల అరపులను స్ఫురింపజేస్తూ పెద్దగా ఏడ్చారు. వారి ఆ అవస్థ జూదం ఆడిన ఆ రోజు పాండవులు నగరు విడిచి వెళ్ళే సమయంలో వలె ఉన్నది. ఆ విధంగా ధృతరాష్ట్రుడు అరణ్యానికి పోవటం రూఢి కావడంతో పౌరుల పిల్లలు, పెద్దలూ అంతా ఆ ధృతరాష్ట్రుడిని చూడటానికి వచ్చారు.

వ. **వచ్చి రెండ కన్ను వాన కన్నును నెఱుం । గనిపురంధ్రు లెల్లఁ గరము వంతఁ**
దలరు నంతరంగములతోడ నక్కురు । వృద్ధుఁ జూడ నార్తి వికలగతుల. **143**

ప్రతిపదార్థం: ఎండకన్నును= ఎండ (ముఖమూ) పొడనూ; వాన కన్నును= వర్షపు (ముఖమూ) తీరునూ; ఎఱుంగని-పురంధ్రులు= ఎప్పుడూ తెలియని (చూడని), కుటుంబినులు (ఇల్లాళ్ళు); ఎల్లన్= అందరూ; ఆ+కురువృద్ధున్= కురువంశంలో పెద్ద అయిన ఆ ధృతరాష్ట్రుడిని; చూడన్= చూడడానికీ; కరము= మిక్కిలి; వంతన్= బాధతో; తలరు-అంతరంగముల తోడన్= చెదరిపోయిన మనస్సులతో; ఆర్తిన్= వ్యథవలన; వికల-గతులన్= వికలమైన (తడబడే) నడకలతో; వచ్చిరి= వచ్చారు.

తాత్పర్యం: ఎండా వానల పొడ తెలియని (ఎప్పుడు ఇల్లు విడిచి బయటకు రాని) ఇల్లాళ్ళు అంతా ఆ వృద్ధుడైన ఆ ధృతరాష్ట్రుడిని చూడటానికి దుఃఖంతో చెదరిన మనస్సులతోనూ, వ్యథ వలన తడబడుతున్న నడకలతోనూ బయటకు వచ్చారు.

విశేషం: 'ఎండకన్ను - వానకన్ను - నెఱుంగని' అనేది తెలుగు జాతీయం.

క. నేలను హర్మ్యంబులపై। నోలి నిలిచి చూచు మానవోత్కరముల శో
కాలాప విలాపంబులు। నేలకు మింటికిని నడుమ నిండి చెలంగెన్ 144

ప్రతిపదార్థం: నేలను= నేలమీదా; హర్మ్యంబులపైన్= ఎత్తైన మేడలమీదా; ఓలిన్= వరుసగా; నిలిచి= నిలువబడి; చూచు= (ధృతరాష్ట్రుడిని), చూస్తున్న; మానవ+ఉత్కరముల - శోక+ఆలాప-విలాసంబులు= మనుష్యుల సమూహాలు, దుఃఖంతో అనే మాటలూ, ఏడుపులూ; నేలకును= భూమికీ; మింటికిని= ఆకాశానికీ; నడుమన్= మధ్య ప్రాంతం అంతా; నిండి= వ్యాపించి; చెలంగెన్= అతిశయించాయి, ధ్వనించాయి.

తాత్పర్యం: అడవులకు వెళ్ళుతున్న ధృతరాష్ట్రుడిని చూడటానికి ఇండ్లలోనుండి బయటకు వచ్చిన జనం నేలమీదా, ఎత్తైన మేడలమీదా, క్రింది నుండి పైదాకా బారులు తీరి నిలబడి చూస్తూ ఉన్న మనుష్యుల గుంపులు దుఃఖంతో అనుకునే మాటలూ, ఏడుపులూ నేలకూ నింగికీ మధ్యభాగం అంతా నిండి విజృంభించాయి.

వ. ధృతరాష్ట్రుండుఁ బురద్వారంబు నిర్గమించుచుండి సకల పౌరజనంబుల నిలువం బనిచె; విదురుం డక్కురు వృద్ధునితోడ వనంబున కరుగుటకు దృఢనిశ్చయుం డై పలికె; సంజయుండు నవ్విధంబు వాఁ డయ్యెఁ; గృపాచార్యుండును యుయుత్సుఁడు నత్తెఱంగుమాట లాడిన నాంబికేయుండు వారిని వారించి ధర్మనందనున కప్పగించి నిలిపి, కోడండ్ర నెల్లను సముచిత వచనంబుల మరల నియమించిన, వార లా వైచిత్రవీర్యునకు గాంధారికిం బ్రణమిల్లి బాష్పంబులు వదనంబున వెల్లిగొనుచుండ వీడ్కొనియును బాండురాజమహిషిం జూచి కొని వెనుకం జనుచుండి; రా సమయంబున నజాతశత్రుం డాగొంతి కి ట్లనియె. 145

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండును= ధృతరాష్ట్రుడు కూడా; పురద్వారంబు= హస్తినగరం సరిహద్దు ద్వారాన్ని; నిర్గమించుచున్+ఉండి= దాటిపోతూ; సకలపౌరజనంబులన్= తనను వెన్నంటి వస్తున్న నగరవాసుల నందరినీ; నిలువన్= (ఆ పైన ముందుకు రాకుండా) ఆగిపొమ్మని; పనిచెన్= నియోగించాడు; విదురుండు= విదురుడు; ఆ+కురు వృద్ధునితోడన్= కురువంశంలో పెద్ద అయిన ఆ ధృతరాష్ట్రుడితో; వనంబునకున్= అరణ్యానికి; అరుగుటకున్= వెళ్ళటానికి; దృఢనిశ్చయుండు+ఐ= గట్టిగా, నిర్ణయించుకొన్న వాడై; పలికెన్= తన నిశ్చయాన్ని చెప్పాడు; సంజయుండును= సంజయుడు కూడా; ఆ+విధంబు వాఁడు+అయ్యెన్= అదేవిధంగా చేశాడు (వనగమనానికి దృఢంగా నిశ్చయించుకొని ఆ నిర్ణయాన్ని ధృతరాష్ట్రుడికి చెప్పాడు); కృపాచార్యుండును= కృపుడూ; యుయుత్సుఁడున్= యుయుత్సుడూ; ఆ+తెఱంగుమాటలు= ఆ విధమైన మాటలే (ధృతరాష్ట్రుడితో అడవులకు తామూ వస్తామని); ఆడినన్= చెప్పగా; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; వారినిన్= ఆ కృప యుయుత్సులను; వారించి= నివారించి; ధర్మనందనునకున్= ధర్మరాజుకు; అప్పగించి= వారిని ఒప్పజెప్పి; నిలిపి= నగరంలోనే ఉండేటట్లు చేసి; కోడండ్రన్= ద్రౌపదీ, సుభద్రా మొదలైన కోడళ్ళను; ఎల్లన్= అందరినీ; సముచిత వచనంబులన్= తగుమాటలతో; మరలన్= తిరిగి ఇళ్లకు వెళ్ళడానికి; నియమించినన్= నియోగించగా; వారలు= ద్రౌపది మొదలైన ఆ కోడళ్ళు; ఆ వైచిత్ర వీర్యునకున్= ఆ ధృతరాష్ట్రుడికీ; గాంధారికిన్= గాంధారికీ; ప్రణమిల్లి= పాదాభివందనం చేసి; వదనంబునన్= ముఖంమీద; బాష్పంబులు= కన్నీటి బిందువులు; వెల్లిగొనుచుండన్= ప్రవహిస్తుండగా; వీడ్కొనియును= ధృతరాష్ట్రుడికి వీడ్కోలు (వెళ్ళి వస్తాం అని) చెప్పి గూడా; పాండురాజు మహిషిన్= పాండురాజు భార్య (తమ అత్త) అయిన కుంతిని; చూచికొని= దృష్టిలో ఉంచుకొని; వెనుకన్= వారి (ఆమె) వెనకే; చనుచుండిరి= అనుసరించి పోతూ ఉన్నారు; ఆ సమయంబునన్= అప్పుడు; అజాతశత్రుండు= ధర్మరాజు; ఆ గొంతికిన్= తల్లి అయిన కుంతితో; ఇట్లు= ఈప్రకారంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు హస్తినగరద్వారం దాటిపోతూ తనవెంట వస్తూ ఉన్న పౌరులందరినీ అక్కడే ఆగిపొమ్మన్నాడు. విదురుడు ధృతరాష్ట్రుడితో అడవులకు పోవటానికి తిరుగులేని నిశ్చయం చేసికొని అదే విన్నవించాడు. సంజయుడూ అట్లాగే చేశాడు. కృపుడూ, యుయుత్సుడూ కూడా తనతో అడవులకు వస్తామంటే ధృతరాష్ట్రుడు వారిని నివారించాడు. వాళ్ళను ధర్మరాజు కప్పగించి నగరంలోనే ఉండుమన్నాడు. ద్రౌపది మొదలైన (పాండురాజు) కోడళ్ళను గూడా తగుమాటలతో తిరిగి ఇండ్లకు వెళ్ళండని చెప్పాడు. వాళ్లు ఆ ధృతరాష్ట్రుడికీ, గాంధారికీ ప్రణామం చేసి కన్నీళ్ళు ముఖమంతా నిండి ప్రవహిస్తుండగా, ధృతరాష్ట్రుడికి వీడ్కోలు చెప్పారు. అయినా తమ అత్తగారు ధృతరాష్ట్రుడిని అనుసరించి వెళ్ళుతూ ఉండడం చూచి తాము కూడా (కుంతికి) వెనకే ముందుకు వెళ్ళసాగారు. అప్పుడు ధర్మరాజు కుంతితో ఇట్లా అన్నాడు.

విశేషం: ఊరి పొలిమేర వరకు సాగనంపడం ధర్మం గాబట్టి తనవెంట వస్తున్నవారిని పురద్వారం వరకు రానిచ్చిన ధృతరాష్ట్రుడు అక్కడినుండి వెనక్కు వెళ్ళుమన్నాడు. 'కురువృద్ధుఁడు' అన్నప్పటి వృద్ధశబ్దం విదురుడు ఆయనను సేవార్థం (179) అనుసరించాలనే నిశ్చయంలో 'ధృఢ' త్వానికి హేతువుగా వ్యక్తం చేస్తుంది. ఈ దార్ఢ్యం వలన ధృతరాష్ట్రుడు మారుమాటాడక ఒప్పుకొన్నాడు. కృప యుయుత్సుల అత్తెఱంగు మాటలాడారు మనసేమిటో, విదుర సంజయులలోని దృఢ నిశ్చయస్థితి లేకపోవడంవలన ధృతరాష్ట్రుడు 'వారిని వారించి' ఆపగలిగాడు తేలికగా, ఇంతవరకు తన ననుసరించి ఉన్నారు. గాబట్టి ఇకపై వారి బాగోగులు చూడటం కొరకు 'ధర్మనందనున కప్పగించాడు వాళ్ళను. తర్వాత కోడళ్ళను వెనక్కి వెళ్ళండన్నాడు. వీళ్ళను గూడ ఇక్కడ ప్రస్తావించటం తిక్కన జాగరూకతకు నిదర్శనం. మరలిపొమ్మంటే వాళ్ళు చివరిసారి అన్నట్లుగా గాంధారీ ధృతరాష్ట్రులకు పాదాభివందనం చేశారు. వెళ్ళి వస్తామని వీడ్కోలూ చెప్పారు. అయినా అత్తగారు ముందుకు వెడుతుంటే తాము తిరిగిపోవటం సరి గాదు కాబట్టి 'పాండురాజ మహిషి' చూచికొని' ఆమె అభిప్రాయంకొరకు ఎదురుచూస్తూ ఆమెనే చూస్తూ వెన్నంటి ముందుకే పోతున్నారు. ద్రౌపదీ ప్రభృతులింటికి పోవాలి. కుంతి నిర్ణయం తేలితే కాని అది కుదరదు. ఆ సంగతి గ్రహించిన ధర్మరాజు కుంతితో అదే మాటాడుతున్నాడు. కార్యకారణభావంతో క్రమంగా సన్నివేశాన్ని చిత్రీకరించటం ఇక్కడి విశేషం.

క. **'మా యయ్య కాననమునకుఁ । బోయెడు; నే నితనితోడఁ బోయెద శుశ్రూ**
షాయత్తుఁడ నై యుండెద । నీ యువిదలఁ గొనుచు మగిడి యేఁగుము తల్లీ!' **146**

ప్రతిపదార్థం: మా+అయ్య= మాకు తండ్రి (పూజనీయుడు) అయిన ధృతరాష్ట్రుడు; కాననమునకున్= అడవికి; పోయెడున్= పోతున్నాడు; నేను= నేను; ఇతని తోడన్= ఈ ధృతరాష్ట్రుడితో కూడి; పోయెదన్= అడవికి పోతాను; శుశ్రూషా+ఆయత్తుఁడను+ఐ= ఆయన సేవకు వశపడి; ఉండెదన్= అడవులలోనే ఉంటాను; తల్లీ= అమ్మా!; ఈ+ఉవిదలన్= ద్రౌపదీ ప్రభృతులైన కోడళ్ళను (ఇతర స్త్రీలను); కొనుచున్= తీసికొని; మగిడి= తిరిగి; ఏఁగుము= అంతఃపురానికి వెళ్ళుము.

తాత్పర్యం: 'అమ్మా! ఈ ధృతరాష్ట్రుడు అడవికి వెళ్ళుతున్నాడు. నేనూ ఇతడితో వెళ్ళుతున్నాను. ఆయనకు సేవ చేసికొంటూ అక్కడే ఉంటాను. నీవు నీ కోడళ్ళను తీసికొని ఇంటికి తిరిగివెళ్ళుము.'

చ. **అనుటయు గొంతి యక్కురుకులాగ్రణి కి ట్లను 'నీవు తోడఁ గా**
ననమున కేఁగుదెంచుట జనస్తవనీయచరిత్రుఁ డివ్విభుం
డనుమతి చేయునే? యుడుగు మా పని; యియ్యమ యత్త నాకు, నీ
మనుజవిభుండు మామ; గరిమంబుగ వీరలఁ గొల్చి పోయెదన్. **147**

ప్రతిపదార్థం: అనుటయున్= (ధర్మరాజు ఆ విధంగా) అనగానే; గొంతి= కుంతీదేవి; ఆ+కురుకుల+అగ్రణికిన్= కురువంశంలో శ్రేష్ఠుడైన ఆ ధర్మరాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనున్= అన్నది; జన స్తవనీయ చరిత్రుఁడు= జనాలచేత స్తుతించబడే నడవడి కలిగిన వాడు అయిన; ఈ+విభుండు= ఈ ధృతరాష్ట్రుడు; నీవు= నీవు; తోడన్= తనతో; కాననమునకున్= అడవికి; ఏఁగుదెంచుట= రావటం, అనుమతి - చేయునే= అంగీకరిస్తారా?; ఆ పని= ధృతరాష్ట్రుడితో అడవికి వెళ్ళే పని; ఉడుగుము= మానుకొమ్ము; నాకున్= నాకు; ఈ+అమ= ఈమె (గాంధారి); అత్త= అత్త; ఈ+మనుజవిభుండు= ఈ ధృతరాష్ట్ర మహారాజు; మామ= మామ; వీరలన్= (అత్తమామలైన) గాంధారీ ధృతరాష్ట్రులను; గరిమంబుగన్= గౌరవంతో; కొల్చి= సేవిస్తూ; పోయెదన్= వీళ్ళతో అడవులకు వెళ్ళుతాను.

తాత్పర్యం: ఆ మాటలు విని కుంతి ధర్మరాజుతో ఇట్లా అన్నది. 'నీవు తనతో కలసి అడవులకు రావటానికి ధృతరాష్ట్రుడు అంగీకరిస్తాడా? కాబట్టి ఆ పని మానుకొమ్ము నాకు గాంధారీదేవి అత్త. ధృతరాష్ట్ర మహారాజు మామ. వీరిని సగౌరవంగా సేవిస్తూ నేను అడవులకు పోతాను.

తే. ఇతని కియ్యమకును విను మేన చువ్వె। వలఁతి శుశ్రూష సేయంగ వత్స! మీర
లాపనికి నేర్తురే? వీర లడవి కరుగ। నింట నుండఁగ నా మన మియ్యకొనునె? 148

ప్రతిపదార్థం: వత్స!= నాయనా!; వినుము= వినుము; ఇతనికిన్= ఈ ధృతరాష్ట్రుడికీ; ఈ+అమకును= ఈమె (గాంధారి) కీ; శుశ్రూష= సేవ; చేయంగన్= చేయటానికి; ఏను+అ= నేను మాత్రమే; వలఁతిన్= సమర్థను; చువ్వె= సుమా; ఆ పనికిన్= వీరిని సేవించడానికి; మీరు; నేర్తురే?= సమర్థులా?; వీరలు= ఈ గాంధారీ ధృతరాష్ట్రులు; అడవికిన్= అరణ్యానికి; అరుగన్= వెళ్ళితే; ఇంటన్= ఇంట్లో; ఉండఁగన్= ఉండడానికి; నా మనము= నా మనసు; ఇయ్యకొనునే?= ఒప్పుకొంటుందా?

తాత్పర్యం: నాయనా! వినుము, గాంధారీ ధృతరాష్ట్రులకు సేవచేయటానికి నేను మాత్రమే సమర్థురాలిని. మీకు ఈ సేవలు చేయటం సాధ్యపడదు. గాంధారీ ధృతరాష్ట్రులు అడవికి పోగా ఇంట్లో ఉండటానికి నాకు మనసొప్పదు.'

వ. అనిన నా ధర్మపుత్త్రుండును దమ్ములు నుచిత వచనంబుల వేఁడికొనిన నద్దేవి యగ్రతనయుం గనుంగొని. 149

ప్రతిపదార్థం: అనినన్= అని కుంతి పలుకగా; ఆ ధర్మపుత్త్రుండును= ఆ ధర్మరాజు; తమ్ములును= ఆ ధర్మరాజు తమ్ముళ్ళు భీమాదులూ; ఉచిత వచనంబులన్= తగినమాటలతో; వేఁడికొనినన్= కుంతిని (ఆగిపొమ్మని) ప్రార్థించగా; ఆ+దేవి= ఆ కుంతి; అగ్రతనయున్= పెద్దకొడుకును; కనుంగొని= చూచి; (ఇట్లా అన్నది).

తాత్పర్యం: అని కుంతీదేవి పలుకగా ధర్మరాజు అతడి తమ్ములూ కలిసి తగిన మాటలతో ఆమెను ఆగిపొమ్మని వేడుకొనగా, ఆమె ధర్మరాజుతో (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'వీరలయెడఁ గొడుకా! యప। చారంబులు పలుకుదునె? విచారము విడు; మే
నే రూపంబున నిలువన। గారవమున నిది వ్రతంబుగాఁ గైకొంటిన్.' 150

ప్రతిపదార్థం: కొడుకా!= పుత్రుడా!; వీరల+ఎడన్= ఈ గాంధారీ ధృతరాష్ట్రుల విషయంలో; అపచారంబులు= అకార్యములైన మాటలు; పలుకుదును+ఎ?= చెప్పేదా?; విచారము= చింతను; విడుము= విడిచిపెట్టు; ఏన్= నేను; ఏ రూపంబునన్= ఏ విధంగానూ; నిలువన్+అ= (వీళ్ళతో వెళ్ళకుండా), ఆగనే ఆగను; ఇది= వీళ్ళతో వెళ్ళటం; వ్రతంబు కాన్= తప్పక ఆచరించవలసిన పనిగా; గారవమునన్= వీళ్ళ మీద ప్రేమతో; కైకొంటిన్= స్వీకరించాను.

తాత్పర్యం: 'పుత్రా! విచారించకుము. ఈ గాంధారీ ధృతరాష్ట్రుల విషయంలో నేను అపచారపు మాటలు అంటానా? ఏ విధంగానూ నేను ఆగను. వీళ్ళమీద ప్రేమతో వీళ్ళతో వెళ్ళి వీళ్ళను సేవించటమే వ్రతంగా పెట్టుకొన్నాను.'

వ. అని పలికి నిజస్కంధంబున నున్న గాంధారి కరంబుఁ గరంబు నయంబునం బాపి, యతని దిక్కు మొగం బై. 151

ప్రతిపదార్థం: అని పలికి= ఆ విధంగా అని; నిజ-స్కంధంబునన్= తన భుజమ్మీద; ఉన్న= ఉన్నటువంటి; గాంధారికరంబున్= గాంధారి చేతిని; కరంబు= మిక్కిలి; నయంబునన్= మృదువుగా; పాపి= తొలగించి; అతని దిక్కు= ఆ ధర్మరాజువైపు; మొగంబు+ఐ= (ముఖ ముంచి) చూస్తూ- (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: అని చెప్పి కుంతి తనభుజం మీద ఉన్న గాంధారి చేతిని మృదువుగా తొలగించి ధర్మరాజును చూస్తూ, (ఇట్లా అన్నది)

క. 'నీ వేమియు ననకుము సహ । దేవుని నేమఱక యరయు; దినకరసుతునిన్
భావమునఁ దలఁపు; మే నా । దేవసముని పుట్టు వడఁచితిం గపటమునన్. 152

ప్రతిపదార్థం: నీవు= నీవు; ఏమియున్= ఇంక ఏమీ; అనకుము= మాటాడకు; సహదేవునిన్= సహదేవుడిని; ఏమఱక= అప్రమత్తంగా; అరయు(ము)= జాగ్రత్తగా చూచుకొమ్ము; భావమునన్= నీ మనసులో; దినకరసుతునిన్= (సూర్యతనయుడైన) కర్ణుడిని; తలఁపుము= స్మరిస్తూ ఉండు; ఏను= నేను; ఆ దేవసముని-పుట్టువు= దైవంతో సమానమైన ఆ కర్ణుడి పుట్టుకను; కపటమునన్= మోసంతో; అడఁచితిన్= దాచి పెట్టాను.

తాత్పర్యం: నేను ధృతరాష్ట్రుడితో అడవులకు వెళ్ళవలసిందే. ఇంక నీవేమీ ఎదురు మాటాడకుము. సహదేవుడిని ఏమరుపాటు లేకుండా జాగ్రత్తగా చూచుకొమ్ము. కర్ణుడిని మనసులో స్మరిస్తూ ఉండుము. దేవుడివంటి ఆ కర్ణుడు నాకు జన్మించిన సంగతి వంచనతో మరుగుపరచాను.

క. అది పాపము దానికి నా । మది నెప్పుడు వగతు విమలమానస! యక్కీ
డు దొలంగునట్లుగా స । త్పదార్థ దానములు చేయు తాత్పర్యమునన్. 153

ప్రతిపదార్థం: విమల మానస!= స్వచ్ఛమైన మనసు కలవాడా, ధర్మరాజా!; అది= కర్ణుడి పుట్టువు మరుగుపరచటం; పాపము= పాపకర్మ; దానికిన్= అందుకు; ఎప్పుడున్= నిరంతరమూ; నా మదిన్= నా మనసులో; వగతున్= దుఃఖిస్తుంటాను; ఆ+కీడు= దానివలన కలిగిన అపచారం (కూడా); తొలగించునట్లుగాన్= తొలగిపోయే విధంగా; తాత్పర్యమునన్= తదేక బుద్ధితో; సత్-పదార్థ-దానములు= శ్రేష్ఠములైన వస్తువులను దానంగా; చేయు(ము)= ఇమ్ము.

తాత్పర్యం: ఆ కర్ణుడి జననాన్ని గురించి తెలియకుండా చేయటం పాపం. అందుకు నా మనసులో ఎప్పుడూ బాధపడుతూనే ఉంటాను. నిర్మల హృదయుడివైన ధర్మరాజా! ఆ పాపం (కూడా) తొలగిపోయేటట్లుగా నీవు గొప్ప గొప్ప వస్తువులు దానాలు చేయుము.

ఆ. **అవ్విధమునఁ గర్ణుఁ డాఱడిఁ బోయిన। నాదు మానసంబు పోదు నూఱు**
పఱియ లై తలంప బలుఱాతఁ జేసిన। వారు గాఁగ వలయు వంశవర్య! 154

ప్రతిపదార్థం: వంశవర్య!= కురువంశంలో శ్రేష్ఠుడా! (ధర్మరాజా!); కర్ణుడు= పెద్దకొడుకైన కర్ణుఁడు; ఆ+విధమునన్= ఆ తీరుగా; ఆఱడిన్ పోయినన్= మరణించగా; నాదు మానసంబు= నా హృదయం; నూఱుపఱియలు= వందముక్కలుగా; ఐపోదు= ఐపోలేదు; తలంపన్= ఆలోచించగా; బలుఱాతన్= (నా హృదయాన్ని) దృఢమైన రాతితో; చేసినవారు= తయారు చేసినవారు; కాఁగవలయున్= అయి ఉండవచ్చును.

తాత్పర్యం: కులంలో శ్రేష్ఠుడివైన ధర్మరాజా! కర్ణు డావిధంగా మరణించటం, తెలిసి కూడా నా మనసు నూరు ముక్కలైపోలేదు. చూడగా ఈ మనసును ఎంతో బలమైన రాతితో తయారుచేసి ఉంటారు.

క. **'నీవును దమ్ములు భక్తి భ। రావేశముతోడఁ దలఁపుఁ డమ్మహితాత్మున్;**
ద్రోవది నెప్పుడు దృఢ సం। భావన మన్నింపు మయ్య పౌరవముఖ్యా! 155

ప్రతిపదార్థం: పౌరవ-ముఖ్యా!= పురువంశ్యులలో శ్రేష్ఠుడా!, ధర్మరాజా!; నీవును= నీవూ; తమ్ములు(న్)= నీ తమ్ముళ్ళూ; భక్తి-భర+ఆవేశముతోడన్= భక్తితో నిండిన పూనికతో; ఆ+మహిత+ఆత్మున్= మహానుభావుడైన ఆ కర్ణుడిని; తలఁపుఁడు= స్మరిస్తూ ఉండండి; ద్రోవదిన్= ద్రౌపదిని; ఎప్పుడు(న్)= నిరంతరమూ; దృఢ - సంభావనన్= పటిష్ఠమైన గౌరవంతో; మన్నింపుము+అయ్య= ఆదరించండి.

తాత్పర్యం: పౌరవ శ్రేష్ఠుడా! నీవూ, నీ తమ్ముళ్ళూ, మహాత్ముడైన ఆ కర్ణుడిని భక్తితో స్మరిస్తూ ఉండండి. ద్రౌపదిని సగౌరవంగా ఎప్పుడూ ఆదరించండి.

విశేషం: కర్ణుడు బ్రతికి, ఉన్నన్నినాళ్ళూ అగ్రజుడుగా తెలియక ఆదరించలేకపోయారు పాండవులు. అందుకే ఇప్పుడు ఎలాగూ మరణించాడు కాబట్టి గతకాలపు వైరం మనసులో ఉంచుకోకుండా భక్తిభావంతో తలచుకొమ్మంటుంది కుంతి. అవమానమూ, వనవాసము వగైరా కష్టాలు అనేకం మిగిలిన సుభద్రాదుల కంటె అనుభవించి ఉన్నది కాబట్టి అయిదుగురికీ భార్యగా ఉండేది కావటం వలన ద్రౌపది విషయంలో సంభావనతో కూడిన ఆదరం చూపాలని ప్రత్యేకంగా చెప్పడంతో కుంతి ఆంతర్యం అది. అందుకే ఇక్కడ 'ఎప్పుడున్' అని విశేషంగా చెప్పటం కూడా.

క. **భీమార్జున నకుల మనః। కామంబులు సఫలతా ప్రకాశంబులు గా**
భూమీశ! యరసి యొనరుపు। మేమిట నేమఱకు ధర్మ మిల యరయు నెడన్. 156

ప్రతిపదార్థం: భూమి+ఈశ!= రాజా!; భీమ+అర్జున-నకుల-మనస్+కామంబులు= భీముడూ, అర్జునుడూ, నకులుడూ మనసులో వాంఛించిన వాటిని; అరసి= తెలుసుకొని; సఫలతా-ప్రకాశంబులు-కాన్= ఫలవంతములై ఒప్పే విధంగా; ఒనరుపుము= చేయుము; ఇల= రాజ్యం; అరయు+ఎడన్= పాలించే విషయంలో; ఏమిటన్= ఏ అంశంలోనూ; ధర్మము= ధర్మం; ఏమఱకు(ము)= ఉపేక్షించకుము.

తాత్పర్యం: రాజా! భీముడూ, అర్జునుడూ, నకులుడూ ఏమి కావాలని మనసులో అనుకొంటున్నారో తెలిసికొని ఆ వాటిని నెరవేర్చుము. రాజ్య పాలనంలో ఎప్పుడూ, ధర్మాన్ని ఉపేక్షించకుము.

వ. **అని పలికి నానిశ్చయంబు శిథిలంబు గాదు। మీరు మరలుండని పలికినఁ బాండవాగ్రజుండు విషాదం బంది యూరకుండె; భీమాదులు డెందంబులు గొందలం బంద నశ్రు లొలుకం దలలు వాంచి; రిట్ల మ్మొత్తంబుగ మనంబు గుదిపడుచు మందం బై చెల్ల ధృతరాష్ట్రుండు గొండొకయెడగలుగం జనియె; నా ధర్మతనయుండు తల్లియాననం; బాలోకించి.** **157**

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; పలికి= చెప్పి; నా నిశ్చయంబు= నేను చేసికొన్న నిర్ణయం; శిథిలంబు= సడలేది; కాదు= కాదు; మీరు= మీరు అందరూ; మరలుండు= తిరిగి ఇండ్లకు వెళ్ళండి; అని= అని; పలికినన్= కుంతీదేవి చెప్పగా; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; విషాదంబు= బాధను; అంది= పొంది; ఊరక+ఉండెన్= మాటాడకుండా ఊరుకొన్నాడు; భీమ+ఆదులు= భీముడు మొదలైనవారు; డెందంబులు= మనసులు; కొందలంబు= కలత; అందన్= చెందగా; అశ్రులు= కన్నీళ్ళు; ఒలుకన్= ఉబికి జారి పడుతుండగా; తలలు-వాంచిరి= తలవంచుకొన్నారు; ఇట్లు= ఈ విధంగా; ఆ+మొత్తంబుగన్= సంపూర్ణంగా అందరికీ; మనంబు= మనసు; గుదివడుచున్= చేష్టలు దక్కి (చైతన్యం పోయి); మందంబు-ఐ= బరువై; చెల్లన్= ఉండగా; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; కొండొక= కొంచెం; ఎడ= దూరం; కలుగన్= కలిగేటట్లుగా; చనియెన్= వెళ్ళాడు; ఆ ధర్మతనయుండు= ఆ ధర్మరాజు; తల్లి-ఆననంబు= కుంతి ముఖం; ఆలోకించి= చూచి-ఇట్లా అంటున్నాడు.

తాత్పర్యం: అని చెప్పి కుంతి 'ఇక నా నిర్ణయం సడలేది కాదు. మీరు తిరిగి యిండ్లకు వెళ్ళండి అన్నది. అపుడు ధర్మరాజు విచారంతో మాటాడకుండా ఊరుకున్నాడు. భీముడు మొదలైనవారు మనసులు కలతపడి కన్నీళ్లు ఉబికి జారుతుండగా తలలు వంచుకొని నిలుచున్నారు. ఈ విధంగా అక్కడ అంతా మనసులు జడత్వంతో, బరువెక్కిపోయి ఉండగా ధృతరాష్ట్రుడు వాళ్ళకు కొంచెం దూరంగా వెళ్ళాడు. అపుడు ధర్మరాజు తల్లితో ఇట్లా అన్నాడు.

ధర్మరాజు కుంతిని వనంబునకుఁ బోవలదని ప్రార్థించుట. (సం.15-22-19)

సీ. **ఇది యేమి సేయంగ నెత్తి కొం టిమ్మాట। యాడకు; మేను ని న్నడవి కేఁగఁ**
బనుతునే? మముఁ దొల్లి పనిచి పనుల్ గొను। భంగిన సామ్రాజ్య భార నిర్వ
హణము తెఱంగులు నప్పటి కప్పటి। కి ట్లని యానతి యిచ్చి నడపఁ
బంపక యున్న నొప్పమి రాదె మాకు? ము। న్నీవును గృష్ణుండు నేవిధమున

తే. **నడిపితిరి కార్య మెఱుఁగవే యడలు వెల్లి। మమ్ముఁ బాంచాలి నిటు ముంచి యమ్మ! యడవి**
నెట్టు లుండెద?' వనఁగ నయ్యింతి బాష్ప। పూర్ణనయన యై యూరక పోవుచుండె. **158**

ప్రతిపదార్థం: అమ్మ!= తల్లీ!; ఇది= ఈ విధంగా; ఏమి+చేయంగన్= ఏం చేయాలని; ఎత్తికొంటి?(వి)= పూనుకొన్నావు?; ఈ+మాట= అడవులకు వెళ్ళుతాను అనేమాట; ఆడకుము= మళ్ళీ అనకు; నిన్నున్= (తల్లివై సంరక్షించే) నిన్ను; అడవికిన్= అరణ్యానికి; ఏఁగన్= వెళ్ళటానికి; ఏను= నేను; పనుతును+ఏ?= పంపగలనా?; తొల్లి= ఇంతకుపూర్వం; మమున్= నీ కొడుకులను (కోడళ్ళనూ); పనిచి= ఆజ్ఞాపించి; పనుల్= పనులు; కొనుభంగిన్+అ= చేయించుకొన్న విధంగానే; ఇపుడు గూడా-సామ్రాజ్య-భార-నిర్వహణము-తెఱంగులు= ఈ విశాలమైన ఈ రాజ్యంయొక్క బరువు మోపే మార్గాలు - (పరిపాలనం తీరు); అప్పటికిన్+అప్పటికిన్= ఎప్పటికప్పుడు; ఇట్లు+అని= ఈ విధం (ఇట్లా చేయుమని) అని; ఆనతి+ఇచ్చి= ఆజ్ఞలు చేసి; నడపన్= పంపక; ఉన్నన్= మమ్మల్ని, నడిపించేవిధంగా చేయకపోతే; మాకున్= మాకు; రాజ్యపాలనంలో, ఒప్పమి= పొరపాటు; రాదె=

కలుగదా?; మున్ను= ఇంతకు పూర్వం; ఈవును= నీవూ; కృష్ణుండున్= కృష్ణుడూ; ఏ విధమునన్= ఏ తీరుగా; కార్యము జరగవలసిన దానిని; నడిపితిరి= జరిపించారో; ఎఱుఁగవే?= తెలియదా!; మమ్మున్= నీ కొడుకులైన మమ్మల్నీ; పాంచాలిన్= ద్రౌపదినీ (కోడళ్ళను); అడలు-చెల్లిన్= శోక ప్రవాహంలో; ముంచి= మునిగేటట్లు చేసి; అడవిన్= నీవు అడవిలో; ఎట్టులు= ఏ విధంగా; ఉండెదవు?= ఉండగలవు?; అనఁగన్= అని ధర్మరాజు పల్కగా; ఆ+ఇంతి= ఆ కుంతి; బాష్ప-పూర్ణ-నయన+ఐ= కన్నీరు నిండిన కనులు కలిగినదై; ఊరక= సమాధానం చెప్పకుండా; పోవుచున్+ఉండెన్= ముందుకు వెళ్ళిపోతూ ఉన్నది.

తాత్పర్యం: 'అమ్మా! నీవు చేయదలచుకొన్న ఈ పని ఏమిటి?-ఇట్లా (అడవికి వెళ్ళుతానని) మాటాడకుము. నేను నిన్ను అడవులకు పంపుతానా? లోగడ మమ్మల్ని ఆజ్ఞాపించి మా చేత పనులు చేయించిన విధంగానే ఇప్పుడు కూడా నీవు దగ్గరుండి ఎప్పటికప్పుడు సమయోచితంగా ఇట్లా చేయండి అని శాసించి ఈ సామ్రాజ్యాన్ని పరిపాలించే విధానం చెప్పి మమ్మల్ని నడిపించకపోతే మాకు ప్రమాదం సంభవించదా? పూర్వం నీవూ, కృష్ణుడూ ఏ విధంగా వ్యవహారాలు నడిపించారో మరచిపోయావా? మమ్మల్ని, ద్రౌపదినీ (కోడళ్ళనూ) దుఃఖ ప్రవాహంలో ముంచి నీవు, అడవులలో ఎట్లా ఉండగలవు?' అని ధర్మరాజు అంటుంటే కుంతి ఏమీ సమాధానం చెప్పకుండానే నీళ్ళు నిండిన కళ్ళతో ముందుకు సాగిపోతున్నది.

విశేషం: (అడలువెల్లి-అడలు అనే వెల్లి-రూపకం)

ఉ. అయ్యమలాత్మతోడఁ బవనాత్మజుఁడి ట్లను 'ధర్మపుత్త్రు నీ
వెయ్యది యుక్త హేతువుగ నిమ్మెయిఁ బాసెదు? నీదు పన్పునం
గయ్యము సేసి భూపతినికాయములం బరిమార్చెఁ దల్లి! నీ
కియ్యన లక్ష్మి నూఁది చరియింపక యిప్పడు వాయఁ బాడియే? 159

ప్రతిపదార్థం: పవన+ఆత్మజుఁడు= (వాయుపుత్రుడైన) భీముడు; ఆ+అమల+ఆత్మతోడన్= నిర్మలమైన మనసు గలిగిన కుంతితో; ఇట్లు= ఈ ప్రకారంగా; అనున్= అన్నాడు; తల్లి!= అమ్మా!; నీవు= నీవు (కుంతి); ధర్మపుత్త్రున్= ధర్మరాజును; ఏ+అది= ఏది; యుక్తహేతువుగన్= తగిన కారణంగా; ఈ+మెయిన్= ఈవిధంగా; పాసెదు= విడిచి వెళుతున్నావు?; నీదు పన్పునన్= నీవు ఆజ్ఞాపించిన విధంగా; కయ్యము-చేసి= కౌరవులతో యుద్ధం చేసి; భూపతి నికాయములన్= రాజుల సమూహాలను; పరిమార్చెన్= చంపాడు, అలా చేయటం; లక్ష్మిన్= (రాజ్యాది) సంపదల్ని; నీకున్+ఇయ్యన్+అ= నీకు ఇవ్వటం కొరకే, అటువంటి లక్ష్మిని; ఊఁది= గ్రహించి; చరియింపక= సుఖింపక; ఇప్పుడు= (సంపదలు కలిగి సుఖించే వీలు ఏర్పడిన) ఈ సమయంలో; పాయన్= ఈ రాజ్యాన్ని విడిచిపెట్టటం; పాడియే?= (నీకు) న్యాయమేనా?

తాత్పర్యం: అప్పుడు భీముడు కుంతితో ఇట్లా అన్నాడు. 'అమ్మా, నీవు ఇట్లా ధర్మరాజును విడిచి వెళ్ళటానికి తగిన కారణం ఏమైనా ఉన్నదా? ధర్మరాజు నీవు చెప్పిన ప్రకారం కౌరవులతో యుద్ధం చేసి రాజులందరినీ సంహరించి ఆ(రాజ్య) సంపద నీకు ఇవ్వటం కొరకే అట్లా శ్రమించి రాజ్యం సంపాదించగా సుఖించవలసిన ఈ సమయంలో రాజ్యం విడిచి నీవు అరణ్యాలకు వెళ్ళటం న్యాయమేనా?

క. మనమునఁ దోఁచిన దానము । లనుదినమును జేయుచును సమాశ్రిత జనులం
బెనుచుచు బంధులఁ బ్రోచుచు । జననుతచరితమునఁ బరఁగు సౌజన్యనిధీ! 160

ప్రతిపదార్థం: సౌజన్యనిధీ!= మంచితనానికి గని వంటిదానా! (కుంతీ!); అనుదినమును= ప్రతిరోజూ; మనమునన్= నీ మనసులో; తోయిన= అనిపించిన; దానములు= దానాలను; చేయుచును= జనాలంతా పొగడే విధంగా ప్రతిరోజూ నీకు తోచిన దానాలు చేస్తూ; సమ్-ఆశ్రిత-జనులన్= నిన్ను ఆశ్రయించిన వారిని; పెనుచుచున్= కాపాడుకొంటూ; జన-నుత-చరితమునన్= మనుష్యులచేత ప్రశంసించబడేటటువంటి నడవడితో; పరఁగుము= ఒప్పుము.

తాత్పర్యం: మంచితనానికి నిధివంటిదానా! జనాలంతా పొగడే విధంగా, ప్రతిరోజూ నీకు తోచిన దానాలు చేస్తూ, నిన్ను ఆశ్రయించిన వారిని పోషిస్తూ చుట్టాలను సాకుతూ. ఇక్కడే ఉండుము.

క. వనమున మాద్రీపుత్త్రులు। వెనుఁబడుటకుఁ దలరి తట్లు విక్రమమునకున్
గొనకొల్పి తిట్లు వీరల। ననూన దుఃఖముల ముంచి యరుగం దగునే?' 161

ప్రతిపదార్థం: మాద్రీపుత్త్రులు= (మాద్రి కొడుకులు) నకుల సహదేవులు; వనమునన్= అడవులలో; వెనుఁబడుటకున్= కష్టపడినందుకు; అట్లు= ఆ విధంగా, (ఎంతో); తలరితి(వి)= నీవు దుఃఖించావు; విక్రమమునకున్= (పిల్లలు సుఖపడటం కొరకు రాజ్యం సంపాదించుకొనాలని) పరాక్రమం ప్రదర్శించేందుకు; గొన కొల్పితి(వి)= పురికొలిపావు; వీరలన్= అటువంటి ఈ నకుల సహదేవుల్ని; ఇట్లు= ఈవిధంగా; అనూన(న+ఊన) దుఃఖములన్= అధికమైన బాధలలో; ముంచి= మునిగేటట్లు చేసి; అరుగన్= అడవులకు వెళ్ళటం; తగునే?= ఉచితమా?

తాత్పర్యం: నకుల సహదేవులు వనవాసంలో కష్టపడుతున్నారని ఆనాడు ఆ విధంగా కుమిలిపోయావు. రాజ్య సుఖాల కొరకు యుద్ధానికీ, పరాక్రమం ప్రదర్శించడానికీ ప్రేరేపించావు. మరి ఈ రోజు వీళ్ళను ఈ విధంగా బాధలలో ముంచి నీవు అడవులకు వెళ్ళటం తగునా?'

వ. అనియె, నట్టియెడ. 162

ప్రతిపదార్థం: అనియెన్= భీముడు ఆ ప్రకారంగా అన్నాడు: అట్టి ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: (పై విధంగా) అన్నాడు భీముడు. అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. ద్రోవదియు సుభద్రయు శో। కావేశం బడర మోము లశ్రులఁ దోఁగం
గా వెక్కి వెక్కి యేడ్చిరి, భూవర! పాండుక్షితీశ పుత్త్రులు నేడ్వన్! 163

ప్రతిపదార్థం: భూ-వర!= ఓ జనమేజయ మహారాజా!; పాండు-క్షితి+ఈశ-పుత్త్రులున్= పాండురాజు కుమారులు కూడా; ఏడ్వన్= ఏడుస్తూ ఉండగా; ద్రోవదియున్= ద్రౌపదీ; సుభద్రయున్= సుభద్రా; శోక+ఆవేశంబు= దుఃఖంయొక్క వ్యాప్తి; అడరన్= అతిశయించగా; మోములు= ముఖాలు; అశ్రులన్= కన్నీళ్ళతో; తోఁగంగాన్= తడిసి (మునిగి) పోగా; వెక్కి, వెక్కి= వెక్కిళ్ళతో; ఏడ్చిరి= శోకించారు.

తాత్పర్యం: జనమేజయ మహారాజా! ద్రౌపదీ, సుభద్రా మనసులో దుఃఖం ప్రవేశించి వ్యాపించగా, ముఖాలు కన్నీళ్ళలో మునిగిపోతూ ఉంటే, వెక్కి వెక్కి ఏడ్చారు. పాండవులు కూడా ఏడ్వసాగారు.

విశేషం: కొడుకులూ కోడళ్ళూ దుఃఖిస్తున్నారు. ఏడ్చేవాళ్ళను చూస్తే దుఃఖం అతిశయించి చూచేవాళ్ళు కూడా ఏడ్వటం సహజం. పాండు కుమారు లేడుస్తుంటే ద్రౌపది సుభద్రలు వెక్కి వెక్కి ఏడ్చారు. స్త్రీ రోదనం గూర్చి ముందుగా వర్ణించి పాండు 'రాజకుమారుల'

ఏడ్పు చివరలో చెప్పటం రచనా విధానంలో విశేషం. స్త్రీలు కాబట్టి 'వెక్కి వెక్కి' ఏడ్చిరి. రాకుమారులు 'ఏడ్వన్'.....మామూలుగా కుంతి ముందూ, వీళ్ళంతా వెనకా పోతూనే ఉన్నారు.

క. పరిజనములు కన్నీళ్లులు। దొరఁగఁగ నడ లొంది వారితోడం జని రి
ప్పరుసునఁ దనదుతనూజులు మరలమికిం బాండురాజమహిషి మఱుఁగుచున్. 164

ప్రతిపదార్థం: పరిజనులు= భృత్యులు; అడలు= దుఃఖం; ఒంది= పొంది; కన్నీళ్ళులు= కన్నీళ్ళు; తొరఁగఁగన్= జారుతుండగా; వారితోడన్= పాండవుల (వారి స్త్రీల వెంట); చనిరి= ముందుకు వెళ్ళారు; ఈ+పరుసునన్= ఈ విధంగా; తనదు తనూజులు= తన కొడుకులు; మరలమికిన్= తిరిగి వెళ్ళనందుకు; పాండు-రాజ-మహిషి= పాండురాజు భార్య; మఱుఁగుచున్= విచారిస్తూ;

తాత్పర్యం: వారి సేవకులు కూడా దుఃఖంతో కన్నీరు కారుస్తూ పాండవుల వెంట, ముందుకు వెళ్ళారు. కొడుకులు తిరిగి వెళ్ళకుండా తననే అనుసరిస్తున్నందుకు కుంతి దుఃఖపడుతూ.(తరువాతి వచనంతో అన్వయం)

వ. 'తెగ నాడకున్నఁ బోవ' రని కన్నీరు దుడిచికొని వారలం గలయం గనుంగొని, వారలు వినుచుండం దత్పరి
జనంబుల తోడ. 165

ప్రతిపదార్థం: తెగన్+ఆడక+ఉన్నన్= కఠినంగా మాటాడకపోతే; పోవరు= (కొడుకులు) తిరిగి వెళ్ళరు; అని= అనుకొని; కన్నీరు-తుడిచికొని= తన కంటి నీరు తొలగించుకొని; వారలన్= తన కొడుకులను; కలయన్-కనుంగొని= పరిశీలనగా (దీర్ఘంగా) చూచి; వారలు= కొడుకులు; వినుచున్+ఉండన్= వింటుండగా; తద్-పరిజనంబుల తోడన్= వారి వెంట వస్తున్న భృత్యులతో; (ఇట్లా అన్నది).

తాత్పర్యం: ఖండితంగా, కటువుగా మాటాడకపోతే ఇక వీళ్ళు వెనుకకు పోరు అనుకొని కుంతి తన కన్నీరు తుడుచుకొని, ఒక్కసారి పాండవులందరినీ చూచి వాళ్ళు వింటూ ఉండగా వారి వెంట ఉన్న భృత్యులతో ఇట్లా అన్నది.

సీ. 'దుర్ద్యూతమునఁ దారు దూలపోవుటయును। నా సభ యపకీర్తి యగు తెఱంగు
పాటిల్లుటయుఁ, బెక్కుభంగుల నడవుల। నిడుమలఁ బడుటయు నే సహింపఁ
జాలక కార్యంబు చర్చించి సంధిమై। నొవ్వని వా రెల్ల నవ్వఁ దలలు
వంచి కౌరవులలో వర్తింప నే? లని। హరితోడ నాడితి; నవ్విధమున

ఆ. మాననీయు ధర్మసూను నాగాయుత। బలుని భీము శత్రుభంజనైక
శీలుఁ బార్థు శౌర్యలోలురఁ గవల దై। న్యంబు నొందఁ జూచు టర్హమగునె?' 166

ప్రతిపదార్థం: తారు= తమరు-పాండవులు; దుర్ ద్యూతమునన్= మోసపు జూదంలో; తూలపోవుటయున్= చిన్న బోవటమూ; ఆ సభన్= ఆ విధమైన సభలో; అపకీర్తి= పాడుపేరు; అగు తెఱంగు= కలిగే పని; పాటిల్లుటయున్= సంభవించటమూ; అడవులన్= తరువాత, అడవులలో; పెక్కు-భంగులన్= అనేక విధాలుగా; ఇడుమలన్-పడుటయున్= కష్టాలు అనుభవించటమూ; సహింపన్-చాలక= ఓర్చుకొనలేక; నేను= నేను (కుంతి); కార్యంబు= తర్వాత జరగవలసిన పనిని గురించి; చర్చించి= ఆలోచనలు చేసి; సంధిమైన్= కౌరవులతో సంధి చేసికొనటం వలన; ఒవ్వనివారు= పాండవులంటే పడనివారు (శత్రువులు); ఎల్లన్= అందరూ; నవ్వన్=

అపహాస్యం చేసే విధంగా; తలలు వంచి= (కౌరవులకు) తల ఒగ్గి; కౌరవులలోన్= దుర్యోధనాదులతో; వర్తింపన్= కలిసి ఉండటం; ఏల?= ఎందుకు; అని= ఎందుకు; అని= అనుకొని; హరితోడన్= కృష్ణుడితో; ఆ+విధమునన్= ఆ ప్రకారంగా; ఆడితిన్= మాటాడాను; మాననీయున్= గౌరవింపదగినట్టి; ధర్మసూనున్= ధర్మరాజునూ; నాగ+అయుత-బలునిన్= పదివేల యేనుగుల బలం కలిగిన; భీమునిన్= భీముడినీ; శత్రు-భంజన-ఏక-శీలున్= విరోధులను రూపు మాపడమే ప్రధానం ఐన చరిత్ర కలిగిన; పార్థున్= అర్జునుడినీ; శౌర్య-లోలురన్= పరాక్రమవంతులైన; కవలన్= నకుల సహదేవులనూ; దైన్యంబున్= (దరిద్రంవంటి) దురవస్థను; ఒందన్= పొందగా; చూచుట= చూస్తూ ఉండటం; అర్హము-అగును+ఏ?= (నాకు) తగిన దేనా?

తాత్పర్యం: ఆ రోజు దుర్మార్గపు జూదంలో తమరు చిన్నబోవడమూ, ఆ సభలో దుష్కీర్తి కలిగించే పని, (ద్రౌపదీ పరాభవం) జరగటమూ (ఉద్యో4-19) ఆ తరువాత అడవులలో అనేక విధాలుగా కష్టాలపాలు కావడమూ (ఉద్యో3-183) చూచి, నేను ఓర్చుకొనలేకపోయాను. ఏం చేయాలి అని కర్తవ్యాన్ని గురించి అనేక విధాలుగా ఆలోచనలు చేశాను. కౌరవులతో సంధి చేసికొని, పాండవులంటే గిట్టని వాళ్ళు అందరూ ఎగతాళి చేసేవిధంగా తల ఒగ్గి కౌరవులతో కలిసి ఉండటం ఎందుకు? అని కృష్ణుడితో ఆ రోజు ఆ విధంగా చెప్పాను. పూజించదగిన ధర్మరాజూ, పదివేల యేనుగుల బలం కలిగిన భీముడూ, శత్రువులను నిర్మూలించటమే ప్రధానమైన పనిగా కలిగిన అర్జునుడూ, పరాక్రమవంతులైన నకుల సహదేవులూ, వీళ్ళందరూ ఎందుకూ కొరగాని వారివలె దురవస్థలపాలు కావటాన్ని చూస్తూ ఉండడం నాకు తగునా?'

వ. అని ధర్మతనయు వదనంబు వీక్షించి, పాంచాలిం జూపి. 167

ప్రతిపదార్థం: అని= అని పలికి; ధర్మతనయు-వదనంబు= ధర్మరాజు ముఖం; వీక్షించి= చూచి; పాంచాలిన్= ద్రౌపదిని; చూపి= చూపించి. (ఇట్లా అన్నది).

తాత్పర్యం: అని చెప్పి కుంతి ధర్మరాజు ముఖం చూచి, అతడికి ద్రౌపదిని చూపిస్తూ (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. 'గౌరవంబున సుకుమారత్వమున నొప్పు। నిప్పొల్తిఁ దలవట్టి యీడ్చి తెచ్చి
సభలోన నట్లు దుశ్శాసనుం డవమాన। పెట్టంగ నచ్చటి పెద్ద లెల్లఁ
బలుకక యుండ నబ్బన్నంబునకు నోర్వ। వలసె మీ కప్పటి కలఘుతేజ!
నీ తేజ మట్టులు నీ అయి పోయినఁ। బాండునికులము చెప్పంగఁ జూప

తే. లేకపోదె యబ్భంగిఁ బల్కితి ముకుందు। తోడ నేను మీ రెమ్మెయి రూఢి కెక్కి
వెలుఁగఁ గోరుట కతమునఁ దలఁచి; దాని। ననిలసుతుఁ డెత్తిపెట్టె; నే మనఁగఁ గలదు?' 168

ప్రతిపదార్థం: అలఘుతేజ!= గొప్ప పరాక్రమం కలిగినవాడా! ధర్మరాజా!; గౌరవంబునన్= గౌరవింపదగిన లక్షణంతోనూ; సుకుమారత్వమునన్= కష్టాన్ని తట్టుకొనలేని మెత్తదనంతోనూ; ఒప్పు= ఒప్పుతున్న; ఈ+పొల్తిన్= ఈ కాంతను (ద్రౌపదిని); తల+పట్టి= జుట్టు పట్టుకొని; ఈడ్చి= లాక్కుంటూ; తెచ్చి= తీసికొనివచ్చి; సభలోనన్= (పదుగురు ఉండే) కొలువులో; దుశ్శాసనుండు= దుశ్శాసనుడు; అట్లు= ఆ విధంగా; అవమాన పెట్టంగన్= అవమానం చేస్తుంటే; అచ్చటి పెద్దలు= ఆ సభలో ఉన్న వృద్ధులు; ఎల్లన్= అందరూ కూడా; పలుకక-ఉండన్= ఏమీ(అది తప్పని) మాటాడక ఊరుకొనగా; ఆ+బన్నంబునకున్=

ఆ కష్టపాటుకు; మీకున్= మీకు (పాండవులకు); అప్పటికిన్= ఆ సమయంలో; ఓర్వన్-వలసెన్= సహించవలసివచ్చింది; నీ తేజము= నీ తేజస్సు; అట్టులు= ఆ విధంగా, (ధర్మబద్ధత వలన); నీఱు-అయిపోయినన్= బూడిద (వ్యర్థం) అయిపోగా; పాండునికులము= పాండురాజు వంశం; చెప్పంగన్= చెప్పుకొనటానికీ; చూపన్= చూపించటానికి; లేక= లేకుండా; పోదె= పోదా; మీరు= మీరు, పాండవులు; ఏ+మెయిన్= ఏ విధంగా నైనా; రూఢికిన్= ప్రసిద్ధికి; ఎక్కి= వచ్చి; వెలుఁగన్= ప్రకాశించాలని; కోరుట కతమునన్= కోరినందులవలననే; నేను= నేను (కుంతి); తలఁచి= ఆలోచించి; ముకుందు తోడన్= కృష్ణుడితో; ఆ+భంగిన్= ఆ విధంగా; పల్కితిన్= అన్నాను; దానిన్= దానిని, కృష్ణుడితో ఆ విధంగా మాటాడటాన్ని; అనిలసుతుఁడు= భీముడు; ఎత్తిపెట్టెన్= ఎత్తి చూపెట్టాడు; ఏమి-అనఁగన్-కలదు?= ఇంక నేను ఏమని చెప్పేది?

తాత్పర్యం: 'పరాక్రమవంతుడా! ధర్మరాజా! పూజించదగిన లక్షణమూ, సౌకుమార్యమూ కలిగి ఉన్న ఈమె (ద్రౌపది)ని జుట్టు పట్టుకొని ఈడ్చుకొంటూ తీసికొని వచ్చి సభలో (పదుగురి సమక్షంలో) దుశ్శాసను డా విధంగా అవమానం చేస్తుంటే, ఆ సభలో ఉన్న వృద్ధులంతా ఏమీ మాటాడకుండా చూస్తూ ఉంటే అటువంటి కష్టాలను చూస్తూ మీకు అప్పటికి ఊరుకొనవలసి వచ్చింది. నాడు మీ తేజస్సు ఆ విధంగా బూడిదయిపోతుంటే పాండురాజు వంశమే ఇక భూమి మీద చెప్పటానికి, చూపటానికి లేకుండా నశించిపోవడమేనా? అని ఏ విధంగా నైనా మీరు మళ్ళీ ప్రసిద్ధులై పేరు పొందాలనీ అనుకొనటం వలన ఆలోచించి నేను కృష్ణుడితో ఆ రోజు ఆ విధంగా చెప్పాను. భీముడు దాన్ని ఎత్తి చూపిస్తున్నాడు. ఇంక నేను మాటాడేదేమున్నది?'

వ. అనిన విని ధర్మసుతుండును భీముండును సిగ్గు వడి; రిట్లు పలికి గొంతి యిమ్మాటకు భీము చిత్తం బె ట్లగునో యనుతలంపున ధర్మసుతున కతనిం జూపి. 169

ప్రతిపదార్థం: అనినన్= కుంతి పై విధంగా పల్కగా; విని= ఆలకించి; ధర్మసుతుండును= ధర్మరాజు; భీముండును= భీముడూ; సిగ్గు+పడిరి= (తగని మాటలు అన్నందుకు) సిగ్గుపడ్డారు; ఇట్లు= ఈ ప్రకారంగా; పలికి= అని; గొంతి= కుంతీదేవి; ఈమాటకున్= తానన్నమాటకు; భీముచిత్తంబు= భీముడి మనస్సు; ఎట్లు+అగునో?= ఏమవుతుందో?; అను తలంపునన్= అనే ఉద్దేశంతో; అతనిన్= ఆ భీముడిని; చూపి= చూపించి; ధర్మసుతునకున్= ధర్మరాజుతో (ఇట్లా అన్నది).

తాత్పర్యం: కుంతి అన్న మాటలు విని ధర్మరాజూ, భీముడూ పొరపాటు మాటాడినందుకు సిగ్గుపడ్డారు. తాను అన్న మాటలకు భీముడు మనసులో బాధపడుతున్నాడేమో అనుకొని కుంతి భీముడిని చూపిస్తూ (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: కుంతి మాటలు విని ధర్మరాజు, భీముడు సిగ్గుపడ్డారు. అంటే వీళ్ళన్న మాట పొరపాటన్నమాట. అందులో భీముడి పొరపాటును కుంతి వాచ్యంగానే చెప్పింది. మొత్తంమీద 'నీవు ఆజ్ఞాపించటం వలన యుద్ధం చేయవలసి వచ్చింది అని కుంతిమీద నెపంపెట్టినందుకు (మీ సౌఖ్యం, వంశగౌరవం నిల్పటం కొరకే చేశాను తప్ప ఇందులో నా స్వార్థం ఏం లేదని చెప్పిన కుంతి మాటలకు) ధర్మజ భీములు సిగ్గుపడ్డారు. సిగ్గుపడ్డారంటే తాము పొరపాటుగా మాటాడామని గ్రహించారన్నమాట (157వ.) అయితే భీముడిని గురించి వాచ్యంగా అన్నది కాబట్టి, అతడి స్వభావాన్ని బట్టి గూడా భీముడు బాధపడతాడేమో నని కుంతి మళ్ళీ ఇట్లా అంటున్నది. తల్లిగా ఎపుడూ భీముడిని గురించి ధర్మరాజుతోనే మాటాడుతున్నది. ఇట్లా మనసు పరిశీలించి నడుచుకొనటం తిక్కన పాత్రలలో ప్రత్యేకత.

ఉ. 'నామది నొండు లేదు; విను నవ్వితి నీతనితోడ; నీదు ల
క్ష్మీ మహిమన్ మనం బలరఁ జేసితి నుత్తమదానముల్; జన
స్తోమ నుతంబుగా నడపఁజూచితి జన్నము గన్నులార; నిం
కేమి కొఱంత నా; కుడుగ; నెట్లును బోదు నరణ్యవృత్తికిన్. 170

ప్రతిపదార్థం: విను(ము)= ధర్మరాజా-వినుము; నామదిన్= నా మనసులో; ఒండు= వేరే ఉద్దేశం ఏమీ; లేదు= లేదు; ఈతని తోడన్= ఈ భీముడి విషయంలో; నవ్వితిన్= నవ్వుతూ అన్నమాటలే సుమా; నీదు-లక్ష్మీ-మహిమన్= నీ సంపదల పెంపుతో; మనంబు= (నా నీ మనస్సు); అలరన్= తృప్తిపడే విధంగా; ఉత్తమ దానముల్= గొప్ప గొప్ప దానాలు; చేసితిన్= చేశాను; జన-స్తోమ-నుతంబుగాన్= జన సమూహాలు పొగడేవిధంగా; జన్నము= యజ్ఞం (అశ్వమేధయాగం); నడపన్= నీవు నిర్వహించగా; కన్నులారన్= కంటినిండా; చూచితిన్= చూచాను; ఎట్లును= ఏ విధంగా చూచినా; ఉడుగన్= అరణ్యాలకు వెళ్ళకుండా ఆగను; నాకున్= నాకు; ఇంకన్= ఇంకా; కొఱంత= లోటు; ఏమి= ఏమి ఉన్నది; అరణ్య వృత్తికిన్= అడవులలో ఉండడానికి; పోదున్= పోతాను.

తాత్పర్యం: 'కొడుకా! విను, నా మనసులో వేరే ఉద్దేశం ఏమీ లేదు. ఊరకే భీముడితో నవ్వులాటగా అన్నాను. నీ సంపదలతో మనసు తృప్తి తీరా ఎన్నో గొప్ప గొప్ప దానాలు చేశాను. నీవు అశ్వమేధయాగం చేస్తుంటే కళ్లారా చూచాను. ఇక నాకు కొఱత ఏమున్నది? అడవులకు వెళ్ళకుండా ఉండను. (నా జీవితానికి ఏ కొఱతా లేదు.) అడవులలో ఉండడానికే వెళ్ళుతాను.

విశేషం: నా మనసులో వేరే ఉద్దేశం లేదు. అంటే ధర్మరాజు భీముడు అన్న మాటలను గురించి వాళ్ళపై కోపం లేదని భావం. ఏదో నవ్వుతూ అన్నాను. అంటే తానన్న మాటలను గట్టిగా పట్టించుకుని బాధపడవద్దని భావం. ఇటువంటి మాటలకు భీముడు మెత్తబడటం అతడి స్వభావానికి సహజం. తల్లిగా కుంతికి తెలుసు. పిల్లలతత్త్వం. భీముడు ఆ తర్వాత లక్ష్మి నూఁది భరియింపక యిప్పుడు వాయఁ'బాడియే'. 'మనము తోఁచిన దానములు' రోజూ చేసికొంటూ ఇక్కడే ఉండుమన్నాడు. అందుకు సమాధానంగా కుంతి నీదులక్ష్మీ మహిమన్ మనం బలర నుత్తమదానముల్ చేసితి నన్నది. భీముడన్న మాటలనే ఉపయోగించడంలో దానికి సమాధానంగానే అంటున్నట్లు సూచన. ఏన్నో దానాలు మనసు తీరా చేశాను అనటం వలన పాండవలక్ష్మిని ఉపయోగించుకొనటమూ సత్కార్యాలు చేయటమూ రెండూ జరిగాయి కాబట్టి బాధపడనక్కరలేదని ఆంతర్యం- నడపఁ జూచితి' అనే కాక 'జన స్తోమనుతంబుగా నుత్తమదానముల్ చేసితి' అనీ అన్వయం. తను చేసిన దానాలు జనబాహుళ్యం ప్రశంసించారు. అంటే అధికంగా అధికులకు దానాలు చేసినట్లు తాత్పర్యం. మా చేత యుద్ధం చేయించావని వాళ్ళంటే ఎందుకోసం చేయించానో ఆ లక్ష్యం నెర వేరింది అని కుంతి ఇక్కడా వ్యంగ్యంగా సమాధానం చెప్తున్నది. ఇన్నీ సాధించిన తర్వాత ఇంకా ఏ కోర్కె ఉన్నదని? నగరంలో ఉండిపోవటానికి? అందుచే అడవులకు ప్రయాణం ఆపుకోవలసిన కారణం ఏమీ లేదు. అడవులకు వెళ్ళడం (పాడియే- అని భీముడి ప్రశ్న) న్యాయమే అని కుంతి సమాధానం. కాబట్టి 'అరణ్య వృత్తికిన్ పోదు' అని ఫలితాంశంగా తన నిర్ణయం మళ్ళీ చెప్పింది. ఇక్కడ అన్వయంలో కొంచెం మార్పుతో-ఈ నిర్ణయం కొంచెం కటువుగా కూడా వ్యక్తం అవుతుంది. 'ఇంకేమి కొఱంత నాకు'- నాకు లోటేముంది? ఉడుగన్= ఎట్లును అడవులకు పోవడం ఏ విధంగా కూడా మానుకోను. ఎట్లును బోదు నరణ్య వృత్తికిన్. ఏ విధంగానైనా మీరెన్ని చెప్పినా అడవులకు వెళ్ళి తీరుతాను- అని మార్దవం పనిచేయకపోతే ఇట్లా కఠినంగా అన్వయించాలి.

తే. రాజ్య ఫలము కామింపఁ బుత్త్రా! సమగ్ర। తపమునకు ఫల మైన యుత్తమ గతి ప్ర
సిద్ధి గోరుదు నది గల్గఁ జేఁత కిట్టి। తోడు మఱి నాకుఁ గలుగునే? దురితదూర! 171

ప్రతిపదార్థం: పుత్రా!= కొడుకా! (ధర్మరాజా), రాజ్యఫలము= రాజ్యం వలన కలిగే సుఖాలను; కామింపన్= నేను కోరను; సమగ్ర-తపమునకు(న్)= సంపూర్ణమైన తపస్సుకు; ఫలము= ప్రయోజనం; ఐన= అయినటువంటి; ఉత్తమగతి= శ్రేష్ఠమయిన లోకాలను; ప్రసిద్ధి= చక్కగా లభించటాన్ని; కోరుదున్= కోరుకొంటాను; దురితదూర!= పాపాలకు దూరంగా ఉండేవాడా!; అది= అటువంటి, ఉత్తమగతి; కల్గన్-చేతకున్= కలిగేటట్లు చేయటానికి, (సంపాదించుకోవటానికి); ఇట్టి తోడు= ఇటువంటి (గాంధారీ ధృతరాష్ట్రుల) సాయం; నాకున్= నాకు; మఱి= వేరొక సమయంలో; కలుగునే?= దొరుకుతుందా?

తాత్పర్యం: కొడుకా! నేను రాజ్య సుఖాలను కోరను. నిండైన తపస్సుకు ఫలితం ఐన ఉత్తమ లోకాలను పొందటమే నా కోరిక. పుణ్యాత్ముడా ధర్మరాజా! (తపస్సుతో సాధించుకొనవలసిన) అటువంటి ఉత్తమగతిని సంపాదించుకొనటానికి ఈ ధృతరాష్ట్రుడివంటి తోడు మళ్ళీ యింకొకసారి నాకు లభిస్తుందా?

క. కురు రాజునకును దేవికిఁ । బరిచర్య లొనర్చుచుం దపంబునఁ గృశతం
బొరయు తనువుతోఁ గడపెదఁ । గరము నియతి నింకఁ గలుగు కాలము వత్సా! 172

ప్రతిపదార్థం: వత్సా!= నాయనా!; ఇంకన్= ఇకపైన; కలుగుకాలము= వచ్చే రోజులన్నీ; కురు రాజునకును= ధృతరాష్ట్రుడికీ; దేవికి(న్)= అతడి భార్య గాంధారికీ; పరిచర్యలు= సేవలు; ఒనర్చుచున్= చేస్తూ; తపంబునన్= తపస్సుతో; కృశతన్= క్షీణతను; పొరయు= పొందే; తనువుతోన్= శరీరంతో; కరము= మిక్కిలి; నియతిన్= నియమంగా; కడపెద(న్)= గడుపుతాను.

తాత్పర్యం: నాయనా! ఇంక పై కాలమంతా, గాంధారీ ధృతరాష్ట్రులకు సేవ చేస్తూ, తపస్సుతో శరీరాన్ని కృశింపజేసికొంటూ నియమంగా గడిపేస్తాను.

వ. మీరు మరలుం' డనియె; నట్టియెడ నప్పాండురాజమహిషి, తమతోడ వనవాసంబునకై వచ్చుటకుం గడంగుటయు, దాని కొడంబడక పాండవులు దగు పలుకులం బ్రార్థించుటయు నెఱుంగుం గావున ధృతరాష్ట్రుండు 'ధర్మతనయుం డెట్లు సెప్పెనట్లు సేయు' మని విదురసంజయులచేత నద్దేవికిఁ జెప్పి పుత్తెంచిన వార లేతెంచి యబ్భంగి చెప్పినను వదలక వారి పలుకు లాయమ వారించి దృఢనిశ్చయంబునఁ గొడుకులఁ గోడండ్రను దక్కటి బంధుజనులకు సర్వభరత భార్యలను బరిజనంబులను గలయం గనుంగొని 'యి ట్లేల వచ్చెదరు? నిలువుండు; సుఖుల రై యుండుం' డనుటయు. 173

ప్రతిపదార్థం: మీరు= మీరు (పాండవులు); మరలుండు= తిరిగి నగరుకు వెళ్ళండి; అనియెన్= అన్నది (కుంతి); అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆ+పాండురాజు-మహిషి= ఆ పాండురాజుగారి పట్టపుదేవి (కుంతి); వనవాసంబునకై= అడవులలో ఉండి పోవటం కొరకు; తమతోడన్= తమతో (గాంధారీ ధృతరాష్ట్రులతో) కలిసి; వచ్చుటకున్= (అడవులకు) రావడానికి; కడంగుటయున్= పూనుకొనటమూ; పాండవులు= పాండురాజు కొడుకులు; దానికిన్= కుంతి అడవులకు వెళ్ళటానికి; ఒడంబడక= అంగీకరించకుండా; తగు పలుకులన్= తగిన మాటలతో; ప్రార్థించుటయున్= (వద్దని) వేడుకొనటమూ; ఎఱుంగున్= తెలుసు; కావునన్= కాబట్టి; ధర్మతనయుండు= ధర్మరాజు; ఎట్లు= ఏ ప్రకారంగా; చెప్పెన్= చెప్పాడో; అట్లు= ఆ ప్రకారంగా; చేయుము= చేయవలసింది అని అనే విధంగా; ఆ+దేవికిన్= ఆ కుంతీదేవికి; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; విదుర-సంజయులచేతన్= విదురుడితోనూ, సంజయుడితోనూ; చెప్పి= పై విధంగా పలికి; పుత్తెంచినన్= కుంతి వద్దకు పంపగా; వారలు= ఆ విదుర సంజయులు; ఏతెంచి= కుంతి వద్దకు వచ్చి; ఆ+భంగి= ధృతరాష్ట్రుడు చెప్పుమన్నమాటలు; చెప్పినను= కుంతికి చెప్పినప్పటికీ; ఆ+అమ= ఆ కుంతి;

వదలక= అడవులకు (ధృతరాష్ట్రుడితో వెళ్ళాలనే) తన నిశ్చయం విడిచి పెట్టకుండా; వారి పలుకులు= విదుర సంజయుల మాటలు; వారించి= నిరోధించి; దృఢ-నిశ్చయంబునన్= మారని గట్టి నిర్ణయంతో; (అడవులకు వెళ్ళాలని); కొడుకులన్= పాండవులనూ; కోడండ్రను= కోడళ్ళనూ; తక్కటి-బంధుజనులను= మిగిలిన బంధువులనూ; సర్వ-భరత-భార్యలను= భరతవంశపు రాజుల స్త్రీలు అందరినీ; పరిజనంబులను= భృత్యులనూ; కలయన్= ఒక్కసారి పరికించి; కనుంగొని= చూచి; ఏల= ఎందుకు; ఇట్లు= ఈ విధంగా; వచ్చెదరు?= నన్ను వెన్నంటి వస్తున్నారు?; నిలువుండు= ఇంక ఆగిపొండి; సుఖులరు+ఐ= సుఖాన్ని పొందినవారై; ఉండుండు= (నగరులో) ఉండండి; అనుటయు(న్)= అని కుంతి పల్కగానే.

తాత్పర్యం: 'ఇక మీరు తిరిగి (ఇళ్ళకు) వెళ్ళండి' అన్నది కుంతి. కుంతి తమతో అరణ్యాలకు రావటానికి పూనుకొనటమూ, అందుకు ఆమె కొడుకులు అంగీకరించకుండా ఆమెను వారించటమూ తెలిసినవాడు కాబట్టి ధృతరాష్ట్రుడు ఆ సమయంలో, విదురుడినీ, సంజయుడినీ పిలిచి, 'కుంతికి ధర్మరాజు ఏ విధంగా చేయుమంటే ఆ విధంగా చేయు' మని కబురు పంపాడు. వాళ్ళిద్దరూ వచ్చి ధృతరాష్ట్రుడి సందేశాన్ని కుంతికి చెప్పారు. అయినా కుంతి పట్టు విడవకుండా విదుర సంజయుల మాటలకు అడ్డం వచ్చి గట్టి నిర్ణయంతో కొడుకులనూ, కోడళ్ళనూ, మిగిలిన చుట్టాలనూ, భరతవంశ స్త్రీలనూ, సేవకులనూ-అందరినీ ఒక్కసారి పరికించి చూచి 'ఎందు కిట్లా వెంట వస్తారు? ఇంక ఆగండి. (ఇళ్ళకు వెళ్ళి) సుఖంగా ఉండండి' అన్నది. అప్పుడు.

విశేషం: మూలంలో గాంధారీ ధృతరాష్ట్రులు ధర్మరాజాదుల మాటలన్నీ వింటూ ఇక్కడే ఉన్నారు కాని తెలుగులో తిక్కన గాంధారీ ధృతరాష్ట్రులు - కుంతీ పాండవులకు కొంచెం దూరంగా వెళ్ళి అక్కడ ఆగారు. దుఃఖిస్తున్న కుంతికీ - తత్పుత్రులకూ ఏకాంతం కలిగించటం వారి మాటలకు తాను అడ్డంగా ఉండటం తగదని ధృరాష్ట్రుడు అనుకొని దూరంగా వెళ్ళాడన్నమాట. అట్లానే 'విషాదం బంది ఊరకున్న ధర్మరాజు, ధృతరాష్ట్రుడు 'కొండొక యెడగలుగం జనిన తర్వాత తల్లితో మాట్లాడాడు(157). ఏకారణంగా నైనా కుంతి దుర్యోధనాదుల వలన పాండవులకు కలిగిన కీళ్ళు (166,168) ప్రస్తావించింది. ఇంకా ఆ రోజు సభలో పెద్దలు ఎవరూ నోరుమెదపలేదన్నమాట ధృతరాష్ట్రుడికీ తగిలేదే. (ఉద్యో.3,198) ధృతరాష్ట్రుడు ప్రక్కన ఉంటే కుంతి కూడా ఇట్లా మాట్లాడటం కుదురుతుందా? ఏ ఉద్దేశంతో అన్నప్పటికీ ఆ మాటలు యథార్థాలే కదా! అందుకే తిక్కన ధృతరాష్ట్రుడిని ఆ సన్నివేశం నుండి తప్పించాడు. కాబట్టి యిక్కడి మాటలలో మూలానికీ తెలుగుకీ తేడా వస్తుంది. గాంధారీ ధృతరాష్ట్రు లిక్కడ లేరు కాబట్టి వారు ధర్మరాజు చెప్పినట్లు చెయ్యుమని స్వయంగా కుంతితో (మూలంలోవలె) అనే వీలు లేదు. విదుర సంజయుల చేత కబురు చేసినట్లు తెలుగులో కల్పనం, ధృఢనిశ్చయం చేసికొన్న కుంతి ధృతరాష్ట్రుడి మాటను అతడి ముఖమ్మీద కాదనటంకంటె కబురు తెచ్చిన విదుర సంజయులతో కా దనడంలో 'వారి పలుకులు వారించటం లో సౌకర్యమూ లభించింది. కుంతి నిర్ణయం అంగీకరించి (సరే అడవులకు పొమ్మని) అందరూ వెళ్ళిపోయాక గాంధారీ ధృతరాష్ట్రులు కుంతిని వారించినట్లు మూలం. తెలుగులోని మార్పు ఉచితం.

క. **హృదయములు దలర నందఱుఁ। బ్రదక్షిణము గాఁగ నేడ్పుఁ గ్రందుటెలుఁగు లె**
ల్ల దెసలఁ జెలఁగఁ దిరిగి త। త్పదంబులకు నెఱఁగి నంతఁ దనువులు దూలన్. **174**

ప్రతిపదార్థం: అందఱున్= అప్పుడు (పాండవాదులు) అందరూ కూడా; హృదయములు= మనసులు; తలరన్= చెదరిపోగా; ఏడ్పు (న్) క్రందు+ఎలుఁగు= ఒక్కసారిగా రేగిన ఏడుపుల గొంతులు, (ధ్వనులు); ఎల్ల, దెసలన్= అన్ని దిక్కులలోనూ; చెలఁగన్= రేగుతుండగా; ప్రదక్షిణము కాఁగన్= ఆ కుంతీదేవికి, ప్రదక్షిణంగా; తిరిగి= తిరిగి వచ్చి; తద్-పదంబులకున్= ఆ కుంతి పాదాలకు; ఎఱఁగి= (సాష్టాంగంగా) నమస్కరించి; వంతన్= దుఃఖంవలన; తనువులు= ఒళ్ళు (శరీరాలు); తూలన్= తూలిపోతూ ఉండగా.-(తరువాతి వచనంతో అన్వయం.)

తాత్పర్యం: అపుడు పాండవులు వారి భార్యలు మొదలుగా అక్కడ ఉన్నవాళ్లంతా కుంతి నిశ్చయానికి, మనసులు చెదరిపోవటంతో, ఒక్కసారిగా ఏడ్చారు. ఆ ఏడుపు ధ్వనులు నాల్గుదిక్కులా నిండిపోయాయి. అట్లా ఏడుస్తూ కుంతికి ప్రదక్షిణం చేసి పాదాభివందనం చేశారు. బాధవలన శరీరం తూలిపోతుండగా అక్కడే నిలబడిపోయారు.

విశేషం: పాండవులతోపాటు అందరూ కుంతికి ప్రదక్షిణం చేసి నమస్కరించడం తెలుగులో విశేషం. మనసులలో దుఃఖం, కంఠంలో నుండి ఏడుపుగా వ్యక్తమై ఈ రెంటిచేత కలిగిన నిస్సత్తువవలన ఒళ్ళు తూలిపోయింది. అంటే వాళ్ళకు ఒళ్ళంతా దుఃఖం నిండిపోయింది. ప్రదక్షిణాదులన్నీ ఏడూస్తూనే చేయడం అప్పటి మనఃస్థితికి దర్పణం.

వ. **నిలిచి రందుఁ బాండవు లేవురుం బాండురాజ మహిషి ననుప మఱియుం జని యాయమను ధృతరాష్ట్ర గాంధారులను గలిపి 'వారల నిరువుర నుద్దేశించి' మీరు వనంబునకుం బోయి తానును లేకున్న మా కెట్లు కాలంబు గడపవచ్చు ననుతలంపునం దన్ను నెంత ప్రార్థించినను గొంతి నిలుచుట కొడంబడ దయ్యెఁ; నీ సాధ్వికి బుద్ధి సెప్పికొనుచుం బరిచర్యసేయించు కొం' డని యప్పగించి, యారాజునకు నద్దేవికిం గుంతికిం బ్రదక్షిణంబు సేసి దండ ప్రణామంబు లాచరించిన, దీవించి వా రామంత్రణంబు సేయ నా ధర్మపుత్త్రాదు లశ్రుప్లావితంబు లగువదనంబులతోడ మరలి వనితాజనంబులం దోడ్కొని.** **175**

ప్రతిపదార్థం: నిలిచిరి= (అందరూ) నిలబడిపోయారు; అందున్= వాళ్ళలో; పాండవులు= పాండురాజు కుమారులు; ఏవురున్= అయిదుగురూ; పాండురాజ మహిషిన్= పాండురాజు పట్టపుదేవి కుంతిని; అనుపన్= పంపటానికి; మఱియున్= మరికొంత ముందుకు; చని= వెళ్ళి; ఆ+అమను= ఆమెను (కుంతిని); ధృతరాష్ట్ర గాంధారులను= కొంచెం దూరంగా ఉన్న గాంధారీ ధృతరాష్ట్రులతో; కలిపి= చేర్చి; వారలన్-ఇరువురన్= ఆ ఇద్దరినీ (గాంధారీ ధృతరాష్ట్రులను); ఉద్దేశించి= గురించి; మీరు= మీరిద్దరూ; వనంబునకున్= అడవికి; పోయి= వెళ్ళి; తానును= కుంతి కూడా; లేకున్నన్= మాకు తోడుగా లేకపోతే; మాకున్= మా అందరికీ; కాలంబు= ముందరిరోజులు; ఎట్లు= ఏ విధంగా; కడపన్= వెళ్ళదీయటం; వచ్చున్= సాధ్యమవుతుంది; అనుతలంపునన్= అన్న ఉద్దేశంతో; తన్నున్= కుంతిని; ఎంత= ఎంతగా; ప్రార్థించినను= వేడుకొన్నప్పటికీ; గొంతి= కుంతి; నిలుచుటకున్= ఆగటానికి; ఒడంబడదు అయ్యెన్= అంగీకరించలేదు; ఈ సాధ్వికిన్= పతివ్రత అయిన ఆమెకు; బుద్ధి-చెప్పికొనుచున్= సదుపదేశాలు చేస్తూ; పరిచర్య= సేవ; చేయించుకొండు= మీరు చేయించుకొనండి; అని= అని చెప్పి; అప్పగించి= కుంతిని గాంధారీ ధృతరాష్ట్రులకు ఒప్పజెప్పి; ఆ రాజునకున్= (ఆ) ధృతరాష్ట్రుడికీ; ఆ+దేవికిన్= గాంధారికీ; కుంతికిన్= తల్లికీ; ప్రదక్షిణంబు - చేసి= ప్రదక్షిణగా తిరిగి; దండ ప్రణామంబులు= సాష్టాంగ నమస్కారాలు; ఆచరించినన్= చేయగా; వారు= గాంధారీ, ధృతరాష్ట్రులూ, కుంతీ; దీవించి= పాండవులను ఆశీర్వదించి; ఆమంత్రణంబు - చేయన్= వీడు కొల్పగా; ఆ ధర్మపుత్త్ర-ఆదులు= ధర్మరాజు మొదలైన వారు (పాండవులు); అశ్రు ప్లావితంబులు= కన్నీళ్ళతో తడిసినవి; అగు= అయినటువంటి; వదనంబుల తోడన్= ముఖాలతో; మరలి= వెనక్కు తిరిగి; వనితా జనంబులన్= అక్కడ ఆగిఉన్న అంతఃపురకాంతలను; తోడ్కొని= తీసికొని.

తాత్పర్యం: కుంతి నిశ్చయానికి విచారిస్తూ అందరూ ఆమెకు పాదాభివందనం చేసి ఆగిపోయారు. వారిలో పాండవులు మాత్రం కుంతీదేవికి వీడ్కోలు ఇచ్చి పంపటానికి మరికొంత ముందుకు వెళ్లారు. కుంతిని గాంధారీ ధృతరాష్ట్రులు ఉన్నచోటికి తీసికొనిపోయి వాళ్ళతో 'మీరు ఇద్దరూ అడవికి వెళ్ళుతున్నారు. ఈ కుంతి కూడా మిమ్మల్ని అనుసరించివస్తే

ఆమె కూడా లేకుండా మేం కాలం గడిపేదెట్లాగని ఆమెను వెళ్లవద్దని మేము ఎంతగా ప్రార్థించినా వినటం లేదు. ఈ పతివ్రతకు మీరే మంచి మాటలు చెప్పుతూ ఆమెచేత సేవలు చేయించుకొనండి' అని కుంతిని గాంధారీ ధృతరాష్ట్రులకు అప్పగించారు. ధృతరాష్ట్రుడికీ, గాంధారికీ, కుంతికీ ప్రదక్షిణం చేసి సాష్టాంగంగా ప్రణామం చేశారు. వాళ్ళు కూడా పాండవులను దీవించి వీడ్కోలు చెప్పారు. అపుడు ధర్మరాజాదులు కన్నీళ్ళతో తడిసిన ముఖాలతో, వెనుకకు తిరిగి వచ్చి అక్కడే ఉన్న అంతఃపుర స్త్రీలను కలుపుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: ఈ వీడ్కోలు సన్నివేశం మూలంలో ఇట్లా లేదు. రాచ మర్యాదలు ప్రత్యక్షంగా చూసిన తిక్కన సహజంగా చిత్రించటం ఇందులో విశేషం. గాంధారీ ధృతరాష్ట్రులను తిక్కన దూరంగా పంపించాడు. కాబట్టి అడవులకు వెళ్లవలసిన కుంతిని ముందుకు తీసుకొని వెళ్ళి వాళ్ళతో కలిపాడు. కుంతి 'ఇట్టి తోడు మఱి నాకు కలుగునే' అన్నది (171) కాబట్టి కుంతికి వాళ్ళు తోడుగా, కుంతిని వాళ్ళ కప్పగించారు. పెద్దదిక్కయిన మీరూ లేకా, ఆమె కూడా లేకపోతే ఎట్లాగని నగరంలో ఉండుమని వేడుకున్నాం అన్నాడు ధర్మరాజు. ఆంతర్యం అదే అయినా, అక్కడ అనుకొన్న మాటలు ధృతరాష్ట్రుడు వినదగ్గవి కావు కాబట్టి తమ మాటల సారం ప్రకటించాడు. 'ఎంత ప్రార్థించినను నిలుచుట కొడంబడదయ్యె'- అనటం అందువలన మా తల్లిని మీ కప్పగించవలసి వచ్చిందని భావం. ఇట్లా అనటం వలన గాంధారీ ధృతరాష్ట్రులు మళ్ళీ ప్రత్యేకంగా అడవులకు రావద్దని చెప్పనవసరం లేకుండా పోయింది.

తే. **పొగులుచును నల్ల నల్లన పురికి నరిగి । రదియు నుమ్మలికంబు ప్రోవైన యట్లు**
చూడఁ గూడక యుండంగఁ జొచ్చి రాత్మ । మందిరము లందఱును బుధమాన్యచరిత! 176

ప్రతిపదార్థం: పొగులుచును= దుఃఖంతో కుమిలిపోతూ; అల్లన+అల్లన= అతికష్టంగా, (మిక్కిలి మెల్లగా); పురికిన్= హస్తినకు; అరిగిరి= వెళ్లారు; బుధ-మాన్య-చరిత!= విజ్ఞులచే, గౌరవింపబడే నడవడి కలవాడా - జనమేజయ మహారాజా!; అదియున్= ఆ హస్తి నగరం కూడా (అప్పుడు); ఉమ్మలికంబు= విచారం; ప్రోవు - ఐన - అట్లు= కుప్పగా ఒకేచోటకు చేరిన తీరుగా; చూడన్-కూడక= చూడలేని విధంగా; ఉండంగన్= ఉండగా; అందరును= పాండవాదులందరూ; ఆత్మమందిరములు= తమ తమ నివాసాలు; చొచ్చిరి= ప్రవేశించారు.

తాత్పర్యం: (కుంతీ ప్రభృతులు వీడ్కోలివ్వగా వెనుకకు మళ్ళిన పాండవులు అంతఃపుర స్త్రీలను కలుపుకొని) దుఃఖంతో కుమిలిపోతూ, మెల్లగా అతికష్టం మీద హస్తి నగరానికి తిరిగివచ్చారు. ఆ నగరం మొత్తం విచారం అంతా ఒక్కచోట పోగుగా కూడిందా అన్నట్లుగా చూడలేనట్లుగా ఉన్నది. గౌరవించే నడత కలిగిన ఓ జనమేజయ మహారాజా! పాండవులూ వారి కాంతలూ తమతమ ఇండ్లలో ప్రవేశించారు. (అని వైశంపాయనుడు జనమేజయుడితో అన్నాడు.)

విశేషం: ('అదియు నుమ్మలికంబు ప్రోవైన యట్లు-అలంకారం ఉత్ప్రేక్ష')

వ. **అట్లు పుర ప్రవేశంబు చేసి ధర్మనందనుండును దమ్ములుం దగిన వర్తనంబుల నుండి; రట నక్కురువృద్ధుండు నిశ్చింతుం డై గాంధారియుఁ గుంతియు విదుర సంజయులు నగ్నిహోత్రంబునకు వలయు ఋత్విగ్జనంబులతోడ నరుగుదేర నలయక భాగీరథీ తీరంబునకుం బోయి, యొక్క యోగ్య ప్రదేశంబున విడిసెఁ; దదనంతరంబ యతండు. 177**

ప్రతిపదార్థం: అట్లు= ఆ ప్రకారంగా; పురప్రవేశంబు చేసి= తిరిగి హస్తినగరానికి వచ్చి; ధర్మనందనుండును= ధర్మరాజూ; తమ్ములున్= అతడి తమ్ముళ్ళు భీమాదులూ, తగిన వర్తనంబులన్= యోగ్యమైన నడవడులతో; ఉండిరి= ఉన్నారు; అటన్= ఇంక అక్కడ; ఆ+కురువృద్ధుండు= ఆ ధృతరాష్ట్రుడు; నిశ్చింతుండు-ఐ= చింతలు (ఇతరాలోచనలు) ఏమీ లేకుండా; అగ్నిహోత్రం బునకున్= నిత్యమూ అగ్నికార్యానికి; వలయు= అవసరమైన; ఋత్విగ్జనంబులతోడన్= ఋత్విక్కులతో కలిసి; గాంధారియున్= గాంధారీ; కుంతియున్= కుంతీ; విదుర సంజయులున్= విదురుడూ, సంజయుడూ; అరుగుదేరన్= రాగా; అలయక= శ్రమ తెలియకుండా; భాగీరథీ, తీరంబునకున్= గంగానది ఒడ్డుకు; పోయి= చేరుకొని; ఒక్క-యోగ్య-ప్రదేశంబునన్= ఉండడానికి తగిన ఒకానొకచోట; విడిసెన్= విడిది ఏర్పరచుకొన్నాడు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; అతండు= ఆ ధృతరాష్ట్రుడు.

తాత్పర్యం: ఆ విధంగా నగరానికి తిరిగి వెళ్ళిన ధర్మరాజూ, అతడి తమ్ముళ్ళూ తమకు యోగ్యమైన నడవడికతో ఉన్నారు. ఇంక పాండవులు విడిచిన తర్వాత అక్కడ నిత్యమూ, అగ్నికార్యానికి అవసరమైన ఋత్విక్కులను తీసికొని గాంధారీ, కుంతీ, విదురుడూ, సంజయుడూ తనతో రాగా, ధృతరాష్ట్రుడు నిశ్చింతగా, అలుపు తెలియకుండా గంగానది ఒడ్డుకు చేరుకొన్నాడు. అక్కడ నివాసానికి తగిన ఒకానొక స్థలంలో వచ్చిన బలగంతో ఆ నాటికి బస ఏర్పాటు చేసికొన్నాడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. **స్నానాదిక విహితాను । ష్ఠానంబులు నడపి శ్రుతి విశారద భూదే**
వానీక ప్రణయనమున । మానిత రుచి వెలుఁగుచున్న మహితాగ్నులకున్ 178

ప్రతిపదార్థం: స్నాన+ఆదిక-విహిత-అనుష్ఠానంబులు= స్నానం మొదలైన (ధర్మ శాస్త్రములందు ఆచరింపవలసినవిగా) విధించబడినటువంటి పనులు ఆచరించటం; నడపి= జరిపి; శ్రుతి-విశారద-భూదేవ+అనీక-ప్రణయనమునన్= వేదపారంగతులైన బ్రాహ్మణుల సమూహంచేత తీసికొనిరాబడటం వలన; మానిత-రుచిన్= పూజ్యమైన గొప్ప కాంతితో; వెలుఁగుచున్+ఉన్న= ప్రకాశిస్తూ ఉన్నటువంటి; మహిత-అగ్నులకున్= పూజ్యా (ప్రభావ వంతా) లైన అగ్నులకు.

తాత్పర్యం: గంగానదీ తీరంలో బలగాన్ని విడిది చేసిన తరువాత ధృతరాష్ట్రుడు స్నానమూ మొదలైన శాస్త్ర విహిత కర్మలను ఆచరించి, వేద పారగులైన బ్రాహ్మణులు తయారుచేయటం వలన (గొప్పకాంతితో) ప్రకాశిస్తున్న పూజించదగిన అగ్నులకు- (అర్చనలు చేశాడు)

తే. **అర్చ లిచ్చి హోమంబు సమంచితముగఁ । జలిపి యెల్లవారలకు భోజనము సంఘ**
టించి యాహారవిధి యాచరించి విదుర । సంజయుల యొనర్చిన దర్భశయ్య నుండె. 179

ప్రతిపదార్థం: అర్చలు-ఇచ్చి= పూజలు చేసి; సమంచితంబుగన్= (తగిన విధంగా) విధ్యుక్తంగా; హోమంబు చలిపి= సమిధాదులను ఆ అగ్నిలో ప్రయోగించి, (హుతం చేసి) (వైశ్వదేవంచేసి); ఎల్ల వారలకున్= తనతో (అడవికి) వచ్చిన వాళ్ళందరికీ; భోజనము= తిండి; సంఘటించి= కూర్చి; ఆహారవిధి= తాను కూడ, భోజనం పని; ఆచరించి= పూర్తి చేసి; విదుర సంజయుల= విదురుడూ, సంజయుడూ; ఒనర్చిన= సిద్ధం చేసిన; దర్భశయ్యన్= దర్భలతో ఉన్న పడకమీద; ఉండెన్= కూర్చున్నాడు.

తాత్పర్యం: ఆ అగ్నికి అర్చనలు చేసి, విధిమంతంగా హోమం చేసి, తనతో వచ్చిన అందరికి భోజనాలు ఏర్పాటు చేసి, తానూ భోంచేసి, విదురుడూ సంజయుడూ సిద్ధం చేసిన దర్భల పడకమీద విశ్రాంతిగా కూర్చున్నాడు ధృతరాష్ట్రుడు.

ధృతరాష్ట్రుఁడు శతయూప రాజర్షి యాశ్రమంబున వసియించుట (సం.15-25-9)

వ. ఆ శయ్యకు ననతిదూరంబునం గల్పితం బైన తల్పంబున గాంధారియుం దదనంతర సన్నిహితశయనంబున గొంతియు నింత నంత విదుర సంజయులును జుట్లం దమకుఁ జూడం బోలిన చోటుల యాజకజనంబును విశ్రమించి; రట్లద్ది న శేషంబు సనిన సాయంతన కృత్యంబులు సలిపి; రయ్యామిని యచ్చటఁ గడపి సూర్యోదయ సమయంబునం గాలోచిత కరణీయంబులు నిర్వర్తించి యాంబికేయుండు తన వారును దానును గంగానది యుత్తరించి చని కురుక్షేత్రంబుఁ బ్రవేశించి యొక్క పుణ్యాశ్రమంబు నుపాంతంబునం దరుచ్ఛాయాశీతలంబైన సికతాతలంబున నాసీనుం డయ్యెఁ; నట్లక్కురురాజు నిజాశ్రమప్రదేశంబునకు వచ్చుట శతయూప నామధేయుండును గేకయవంశ వర్యుండును దపోధుర్యుండును నైన రాజర్షిసత్తముండు విని యయ్యెడకు వచ్చి. 180

ప్రతిపదార్థం: ఆ శయ్యకున్= ధృతరాష్ట్రుడు విశ్రమించిన శయ్యకు; అనతిదూరంబునన్= కొంచెం ఎడంగా; కల్పితంబు-ఐన= ఏర్పాటు చేయబడిన; తల్పంబునన్= శయ్యమీద; గొంతియున్= కుంతీదేవి; ఇంతన్-అంతన్= కొంచెం దూరంగా; విదుర సంజయులును= విదురుడూ, సంజయుడూ; చుట్లన్= వారందరికీ చుట్టూ; తమకున్= ఎవరికి వారికి; చూడన్= ధృతరాష్ట్రుడు కనబడటానికి; పోలిన చోటులన్= తగిన స్థానాలలో; యాజక జనంబును= ఋత్విక్కులూ; విశ్రమించిరి= విశ్రాంతి తీసికొన్నారు; అట్లు= ఆ ప్రకారంగా; ఆ+దిన= శేషంబు= వాళ్ళు అడవికి వచ్చిన నాటి పగలులో మిగిలిన భాగం; చనినన్= గడచిపోగా; (సాయంత్రం) సాయంతన-కృత్యంబులు= సాయంకాలంలో జరపవలసిన సంధ్యావందనాదులైన పనులను; చలిపిరి= ఆచరించారు; ఆ+యామిని= ఆరోజు రాత్రి; అచ్చటన్= భాగీరథీతీరంలోనే; కడపి= గడపి; సూర్య+ఉదయ-సమయంబునన్= సూర్యుడు ఉదయించే సమయంలో; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; కాల+ఉచిత, కరణీయంబులు= సూర్యోదయకాలంలో ఆచరించవలసిన కార్యాలు; నిర్వర్తించి= పూర్తి చేసి; తనవారును= గాంధారీ ప్రభృతులు (తనతో వచ్చినవారూ); తానును= తానూ; గంగానది= గంగానదిని; ఉత్తరించి= దాటి; చని= (అవతలి ఒడ్డుకు) వెళ్ళి; కురుక్షేత్రంబున్= కురుక్షేత్ర స్థలాన్ని; ప్రవేశించి= చేరుకొని; ఒక్క-పుణ్య-ఆశ్రమంబు-ఉపాంతంబునన్= ఒకానొక పవిత్రమైన మునులు నివసించే చోటికి దగ్గరలో; తరు-ఛాయా- శీతలంబు+ ఐన= చెట్లనీడ వలన చల్లగా ఉన్న; సికతా- తలంబునన్= ఇసుక తిన్నెమీద; ఆసీనుండు+అయ్యెన్= (తనవారందరితో గూడ) కూర్చున్నాడు; శతయూప-నామధేయుండును= శతయూపుడు అనేపేరు గలవాడూ; కేకయ-వంశ-వర్యుండును= 'కేకయ' వంశంలో శ్రేష్ఠుడూ; తపస్-ధుర్యుండును= గొప్ప తపస్వీ; ఐన= అయినటువంటి; రాజ-ఋషి-సత్తముండు= గొప్ప రాజర్షి; అట్లు= ఆప్రకారంగా (గాంధారీ ప్రభృతులలో వనవాసార్థం); ఆ+కురురాజు= ఆ ధృతరాష్ట్రుడు; నిజ-ఆశ్రమ-ప్రదేశంబునకున్= తన నివాస ప్రాంతానికి; వచ్చుట= రావటం; విని= తెలిసికొని; ఆ+ఎడకున్= ఆ ధృతరాష్ట్రాదులు విడిసిన చోటికి; వచ్చి= వచ్చి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు విశ్రమించిన శయ్యకు కొంచెం ఎడంగా ఏర్పరచిన పక్కమీద గాంధారీ, దానికి దగ్గరలో శయ్యమీద కుంతీ, అక్కడికి కొంచెం ప్రక్కగా విదురుడూ, సంజయుడూ, ధృతరాష్ట్రుడూ తమకు కనబడేవిధంగా వీలయిన స్థలాలలో వారికి చుట్టూ ఋత్విక్కులూ, విశ్రాంతి తీసికొన్నారు. ఆ విధంగా ఆ రోజు పగలు గడిచింది. సాయంకాలం కావటంతో అందరూ సంధ్యాదికృత్యాలు జరిపారు. ఆ రాత్రి భాగీరథీ తీరంలో అక్కడే గడిపారు. సూర్యోదయం కాగానే ఆ సమయంలో చేయవలసిన హోమాది విధులన్నీ పూర్తి చేశారు. తరువాత ధృతరాష్ట్రుడు తనతో అడవికి వచ్చినవారూ తానూ కలిపి, గంగానదిని దాటి ఆవలిఒడ్డుకు చేరుకొని, కురుక్షేత్రంలో ప్రవేశించి,

అక్కడ ఒక పవిత్రమైన ముని ఆశ్రమానికి దగ్గరలో చెట్టు నీడవలన చల్లగా ఉన్న ఇసుకదిబ్బమీద కూర్చున్నారు. కేకయవంశంలో శ్రేష్ఠుడూ, గొప్ప తపస్వీ అయిన శతయూపుడు అనే రాజర్షి ధృతరాష్ట్రుడు వనవాసార్థం గాంధారీ ప్రభృతులతో వచ్చి తన ఆశ్రమానికి సమీపంలో ఉన్నాడని తెలిసికొని ధృతరాష్ట్రుడి వద్దకు వచ్చాడు.

క. కని గారవంబునం దో। డ్కొని చని యర్ఘ్యాది విధు లకుంఠితవినయం
బున నడపిన నయ్యాశ్రమ। మున నతఁడు వసింపఁగోరె భూపవరేణ్యా! 181

ప్రతిపదార్థం: భూప-వరేణ్యా!= జనమేజయ మహారాజా!; కని= ధృతరాష్ట్రుడిని (అతడితో వచ్చినవారినీ) చూచి; గారవంబునన్= అభిమానంతో; తోడ్కొని= (శతయూపుడు) తనతో తీసికొని; చని= ఆశ్రయానికి వెళ్ళి; అకుంఠిత-వినయంబునన్= మిక్కిలి అణకువతో; అర్ఘ్య-ఆది-విధులు= పూజ్యమైన జలం ఇవ్వటం మొదలైన పనులు; నడపినన్= జరపగా; అతఁడు= ఆ ధృతరాష్ట్రుడు; ఆ+ఆశ్రమమునన్= ఆ శతయూపుడి ఆశ్రమంలో; వసింపన్= ఉండాలని; కోరెన్= కోరుకొన్నాడు.

తాత్పర్యం: జనమేజయ మహారాజా!; ఆ విధంగా ధృతరాష్ట్రుడి వద్దకు వచ్చిన శతయూపుడు ధృతరాష్ట్రుడిని (ఇతరులనూ) చూచి, సగౌరవంగా తనతో ఆశ్రమానికి తీసికొని వెళ్ళి గొప్పవినయంతో, అర్ఘ్యం మొదలైన సత్కారాలు చేశాడు. ధృతరాష్ట్రుడు ఆ ఆశ్రమంలోనే ఉండాలని కోరుకొన్నాడు.

క. కోరిన విదురాదులు నా। కౌరవపతితలఁపు మేలుగాఁ గొని తగ న
చ్చేరువను బర్ణశాలలు। వే రచియించి రుచితంపు విధమున నధిపా! 182

ప్రతిపదార్థం: అధిపా!= జనమేజయమహారాజా!; కోరిన= ధృతరాష్ట్రుడు శతయూపుడి ఆశ్రమంలో నివసించాలనుకొంటున్నట్లుగా చెప్పగా; ఆ కౌరవపతి-తలఁపు= ఆ ధృతరాష్ట్రుడి ఆలోచనను; మేలుగాన్= మేలైనదిగా; కొని= గ్రహించి; విదుర-ఆదులు= విదురుడు మొదలైన వారు; తగన్= తగినంతగా; ఆ+చేరువను= అక్కడికి దగ్గరలోనే; ఉచితంపు విధమునన్= అర్హమైన తీరులోనే; వే= వేగంగా; పర్ణశాలలు= ఆకుటిళ్ళు; రచియించిరి= నిర్మించారు.

తాత్పర్యం: జనమేజయమహారాజా! ధృతరాష్ట్రుడు శతయూపుడి ఆశ్రమంలోనే నివసించాలని కోరగా అతడి అభిప్రాయం మంచిదే అని గ్రహించిన విదురుడు మొదలైనవారు అక్కడికి తగినంత దగ్గరలోనే ప్రక్కనే తగిన విధంగా పర్ణశాలలు త్వరగా నిర్మించారు.

వ. అం దక్కురువిభుండు దానును గాంధారియుఁ జీరాజిన వసనులును సువ్రతపరులు నగుచుఁ గుంతీ విదుర సంజయులతో వసియించి తపం బాచరింప యాజకులు నిజకృత్యంబు నడపుచుండి రిట్లు నియమ నిష్ఠలతిశ యిల్ల నాభూవల్లభుం డచ్చటి ముని ల చ్చేరువ నతి తీవ్రతపశ్చరణంబున నిజాంగంబు నిర్మాంసత్వంబునం జర్మాస్థులు గదియునట్టి కార్శ్యంబు దనకు నొప్పుగా వర్తి ల్లె నని యిట్లు ధృతరాష్ట్ర వృత్తాంతంబు చెప్పిన విని యవ్విచిత్రవీర్య నందనుండు పదంపడి యెట్టివాఁ డయ్యె? మునీంద్రా! యెఱిఁగింపు' మనుటయు. 183

ప్రతిపదార్థం: అందున్= ఆ పర్ణశాలలో; గాంధారియున్= గాంధారీ; ఆ+కురువిభుండు= ఆ ధృతరాష్ట్రుడు; తానును= తానూ; చీర+అజినవసనులును= నారచీరలు, మృగచర్మాలూ వస్త్రాలుగా ధరించి; సువ్రత పరులున్= శ్రేష్ఠములైన వేదోక్త విధుల ఆచరణలో దీక్ష కలిగి; కుంతీ-విదుర-సంజయులతోన్= కుంతీ, విదురుడూ; సంజయుడూ-వీళ్ళతో కలిసి; వసియించి= నివసిస్తూ; తపంబు=

తపస్సు; ఆచరింపన్= చేస్తుండగా; యాజకులు= ఋత్విక్కులు; నిజకృత్యంబులు= అగ్నికార్యాదులైన తమ పనులను; నడపుచుండిరి= నిర్వహిస్తున్నారు; ఇట్లు= ఈ ప్రకారంగా; ఆ భూవల్లభుండు= ఆ ధృతరాష్ట్ర మహారాజు; నియమ-నిష్ఠలు= ఉపవాసాది నియమాలూ, వానిలో శ్రద్ధా; అతిశయిల్లన్= పెంపొందగా; అచ్చటి మునులు= ఆ ప్రాంతంలో ఉండే తాపసులు; (అచ్చెరువు-అందన్= ధృతరాష్ట్రుడి తపోవ్రతానికి ఆశ్చర్యపడుతుండగా), ఆ+చేరువన్= అచ్చట; అతి-తీవ్ర-తపస్+చరణంబునన్= మిక్కిలి కఠినమైన తపస్సును ఆచరించటం వలన; నిర్-మాంసత్వంబునన్= శరీరంలోని మాంసం నశించిపోగా; నిజ+అంగంబు= అతడి (ధృతరాష్ట్రుడి) శరీరం; చర్మ+అస్థులు= చర్మమూ, ఎముకలూ; కదియు-అట్టి-కార్శ్యంబు= అతుక్కుపోయేంతగా కృశించిపోవటం; తనకున్= ధృతరాష్ట్రుడికి; ఒప్పు-కాన్= తేజస్సు, కాగా; వర్తిల్లెన్= ఉన్నాడు; అని= అనేవిధంగా; ఇట్లు= ఈ ప్రకారంగా; ధృతరాష్ట్ర వృత్తాంతంబు= ధృతరాష్ట్రుడియొక్క (వనగమన) వృత్తాంతాన్ని; చెప్పినన్ విని= చెప్పగావిని; ముని+ఇంద్రా= మహర్షీ!; పదంపడి= ఆ తర్వాత; ఆ+విచిత్ర వీర్యనందనుండు= ఆ (విచిత్రవీర్యుడి కొడుకు) ధృతరాష్ట్రుడు; ఎట్టివాఁడు-అయ్యెను= ఏమైనాడు (ఎట్లా ఉన్నాడు); ఎఱిఁగింపుము= తెలియజెప్పవలసింది; అనుటయున్= అని అడగ్గా (వైశంపాయను డిట్లా చెపుతున్నాడని పై-ఆశ్వాసంలోనికి అన్వయం).

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు, గాంధారీ, నారచీరలూ, మృగచర్మాలూ ధరించి ఉత్తమ నియమాలనుసరిస్తున్నారు. కుంతీ, విదుర సంజయులతో కలిసి విదురాదులు నిర్మించిన పర్ణశాలలో ఉంటూ గాంధారీ ధృతరాష్ట్రులు తపస్సు చేసికొంటు న్నారు. ఋత్విక్కులు తమ తమ పనులు చేస్తున్నారు. ఈ విధంగా ధృతరాష్ట్రుడు అక్కడి మునులంతా ఆశ్చర్యపడే విధంగా, తీవ్రమైన తపస్సు చేస్తూ, శరీరంలో మాంసం లేకుండా పోవటంతో చర్మం ఎముకలకు అతుక్కుపోయేంతగా కృశించాడు. ఆ విధంగా కృశించిన శరీరం కూడా తనకు తేజస్సు కలిగిస్తుండగా ధృతరాష్ట్రుడు శతయూపుడి ఆశ్రమంలో తీవ్రమైన తపస్సు చేసుకొంటూ ఉన్నాడు అని వైశంపాయనుడు చెప్పగా విని జనమేజయుడు 'మునీంద్రా! ఆ తర్వాత ధృతరాష్ట్రుడు ఏమైనాడు (ఏం చేశాడు) అతని వృత్తాంతం ఏమిటి నాకు తెలియ జెప్పవలసింది' అని అడిగాడు. అపుడు వైశంపాయనుడు ఇట్లా అన్నాడు (తరువాత ఆశ్వాసంతో అన్వయం).

ఆశ్వాసాంతము

శా. **ఆశాపాశ విమోచనోపకరణ వ్యాకోచహృద్ధామ! సం**
క్లేశోత్పారక దివ్యనామ! వర దృగ్లీలాప్త నిస్సీమ ల
క్ష్మీశుంభత్సురలోక చక్రపరశుచ్ఛిన్నాసురానీక! వి
ద్యాశోభా స్ఫురణాకృతీ! శమదమానంతర్య భాస్వీకృతీ! **184**

ప్రతిపదార్థం: ఆశా= కోరికలు అనే; పాశ= కట్టుత్రాళ్ళను; విమోచన= విడిపించుకోవడం అనే; ఉపకరణ= సాధనం చేత; వ్యాకోచ= వికాసం పొందినటువంటి; హృద్= (భక్తులయొక్క) హృదయాలే; ధామ= నివాసంగా కలిగినవాడా; సంక్లేశ= గొప్ప కష్టాలను; ఉత్పాదక= పారదోలేటటువంటి; దివ్య= మహిమ కలిగిన; నామ!= నామము(లు) గలవాడా!; వర= శ్రేష్ఠమైన; దృక్= చూపుల (యొక్క); లీలా= విలాసం చేత; ఆప్త= పొందబడిన; నిస్సీమ= మేర లేని; లక్ష్మీ= సంపదలతో; శుంభత్= ప్రకాశిస్తున్న; సురలోక= దేవతాసమూహం కలవాడా; చక్ర= సుదర్శనం అనే చక్రాయుధంతోనూ; పరశు= గండ్రగొడ్డలితోనూ; ఛిన్న= నరికివేయబడిన; అసుర= రాక్షసుల; అనీక= సమూహం కలవాడా; విద్యా= జ్ఞానం అనే; శోభా= తేజస్సు చేత; స్ఫురణ= తెలియబడే; ఆకృతీ!= ఆకారం కలవాడా!; శమ= మనస్సును నిగ్రహించటమూ; దమ= కన్నులు మొదలైన బాహ్యేంద్రియాలను నిగ్రహించటమూ; సాధించిన; అనంతర్య= వెంటనే; భా= కాంతితో; స్వీకృతీ!= స్వీకరించేవాడా!

తాత్పర్యం: కోరిక లనే పాశాలను వదలించుకొనడంద్వారా విస్తరించిన (భక్తుల) హృదయాలలో నివసించేవాడా! భక్తుల కష్టాలు ఎంతటివైనా తొలగించే మహిమాన్వితమైన నామాలు, (పేర్లు) గలవాడా! మేలైన చూపుల లీలలచేత పొందబడిన మేరలేని సంపదలతో శోభించే దేవలోకం కలవాడా! చక్రంతోనూ, పరశువుతోనూ రాక్షసులను నరికినవాడా!, జ్ఞానం అనే కాంతితో స్ఫురించే ఆకారం కలవాడా! (జ్ఞానం చేత గోచరించేవాడా!) శాంతీ దాంతీ కలిగిన వెంటనే (ఆ భక్తులను నీ) తేజస్స్వరూపంలోకి స్వీకరించేవాడా!-ఓ హరిహరనాథా!

విశేషం: మనస్సు కోరికలు అనే కట్టుత్రాళ్లతో బంధింపబడి ఉన్నప్పుడు కుంచించుకుపోయి ఉంటుంది. ఆ బంధాలు కోరికలు తెంచుకుంటే హృదయం విశాలమవుతుంది. అటువంటి కోరికలు లేనిచోట, కోరికలు లేకపోవడం వలన సర్వసృష్టిని ఆత్మసమంగా ఆదరించగలిగిన విశాలమైన హృదయంలోనే హరిహరనాథుడు నివాసం చేస్తాడు. (2) హరిహరనాథుడి నామం పైకి ఉచ్చరించినా లేదా మనసులో అనుకొన్నా ఎంతో గొప్ప కష్టాలు కూడా తొలగిపోతాయి. దానికి కారణం హరిహరనామంలోని దివ్యత్వం, మహిమ. జ్ఞానులు తదర్థం భావిస్తే సామాన్యులు కేవలం నామస్మరణమాత్రంచేతనే కష్టాలు పోగొట్టుకుంటారు. జ్ఞానులకు కష్టాలలోను కష్టభావన ఉండదు. సామాన్యులే కష్టాలలోనే వాటి నిష్పత్తి కోసమే దేవుడిని తలచుకునేది. తావన్మాత్రం చేతనే. స్మరించిన వారి కోర్కెల కనుగుణంగా ఆ నామం - వారి కష్టాలను ఎంతటివైనా తొలగించి వేస్తుంది. ఇది నామ మహిమ (3) కటాక్షంచేతనే దేవతలకు అపారమైన సంపదలు కలుగుతున్నాయి. దేవతలపై ఉన్న ఈ కటాక్షం వలననే 'అసురానీకం చక్రపరశుచ్ఛిన్నం కాగా దేవతలు నిస్సీమ -లక్ష్మీ శుంభత్తులవుతున్నారు. చక్ర-పరశు-ఛిన్న-అసురానీక అన్నపుడు, క్రమంగా చక్ర ఛిన్నాసురుడు-సుదర్శన చక్రాయుధంతో రాక్షసులను చంపేవాడు. హరి, పరశుచ్ఛిన్నాసురానీకుడు. పరశువుచేత రాక్షసులను చంపేవాడు. హరుడు 'భూతేశః ఖండపరశుః (అమరం) ఖండ పరశువు గదా శివుడు. సుధన్వా ఖండ పరశుః. విష్ణువు సహస్రనామాలలో ఖండపరశు వొకటి. హరిహరుడు చక్ర పరశు చ్ఛిన్నాసురుడు. (4) విద్యాశోభా స్ఫురణాకృతి- జ్ఞాన (విద్య) జ్యోతి (శోభా) యే- స్ఫురించే- తోచే ఆకారంగా కలిగినవాడు. హరిహరస్వరూపం భావిస్తే అది జ్ఞానజ్యోతిగానే స్ఫురిస్తుంది. జ్ఞాన(విద్యా), జ్యోతీ(శోభ), స్ఫూర్తీ(స్ఫురణ). ఆకారంగా కలవాడని కూడా. (5) శమమూ (అంతరింద్రియ మనో-నిగ్రహము), దమమూ (బాహ్యేంద్రియ నిగ్రహమూ) సాధించిన వెంటనే తనయొక్క తేజస్స్వరూపంలోకి స్వీకరించేవాడు. తానుగా, తనలో కలుపుకొనేవాడు. శాంతిదాంతులు సాధించినవారు హరిహరుడి తేజఃస్వరూపంలో కలిసిపోతారు.

క. ముని హృదయ నిలయ పాదా! వినత జనావన వినోద! విద్యా విద్యా
ఘన చింతాంతిక దూరల।సన! పీత స్పీత సామజత్వగ్వసనా! 185

ప్రతిపదార్థం: ముని= జ్ఞానులయొక్క; హృదయ= మనసులే; నిలయ= నివాసమైన; పాదా!= పాదాలు కలవాడా!; వినత= ఆశ్రయించిన; జన= జనాలను; అవన= కాపాడటం; వినోద= వేడుక అయినవాడా!; విద్యా= జ్ఞానంయొక్క; అవిద్యా= అజ్ఞానం యొక్క; ఘన= మిక్కిలి; చింతా= విచారణం చేత; అంతిక= సమీపంలోనూ; దూర= దూరంగానూ; లసన!= ప్రకాశించేవాడా!; పీత(వసన)= పసుపుపచ్చని, (పట్టు పుట్టము); స్పీత= మందమైన; సామజ= ఏనుగుయొక్క; త్వక్= చర్మమూ; వసనా!= వస్త్రముగా గలవాడా!.

తాత్పర్యం: జ్ఞానులయొక్క హృదయాలే నివాసంగా కలిగిన పాదాలు కలవాడా! ఆశ్రయించిన వారిని రక్షించటమే వేడుక అయినవాడా! జ్ఞానులకు దగ్గరగాను, అజ్ఞానులకు దూరంగానూ ఉండేవాడా! పట్టుపుట్టమూ, ఏనుగుతోలూ, వస్త్రాలుగా ధరించినవాడా!- హరిహరనాథా!.

విశేషం: హరిహరనాథుడి పాదాలు ఎప్పుడూ జ్ఞానుల హృదయంలోనే ఉంటాయి. జ్ఞానులు సదా ధ్యానంతో హరిహరనాథుడి పాదాలు తమ తమ మనస్సులో దర్శిస్తూ ఉంటారు. ఇక సామాన్యులు ఆపదాది సమయాలలో తన్నివృత్తికొరకు రక్షణకొరకు ఆశ్రయిస్తే వాళ్ళని వినోదంగా కాపాడుతుంటాడు హరిహరనాథుడు. అజ్ఞానం చేత తాత్కాలిక సౌఖ్యాలను కోరటం వలన అవే గొప్పవి అనుకొనటం. అట్టి వారిని చూస్తూ వారి కోరికలు తీర్చటం హరిహరనాథుడికి వినోదం. జ్ఞానులు ఎప్పుడూ తలచుకొనటం వలన వారి హృదయాలలో- అత్యంతం సన్నిహితుడై ఉంటాడు. విద్యా ఘనులకు అంతిక లసనుడు. జ్ఞానంవలన ఘనులైన వారికి సమీపస్థుడు. అవిద్యా చింతకు- దూరుడు. అజ్ఞానం చేత 'చింత'లపా లైన వారికి దూరంగా చింతలు తీర్చినా భిన్నంగా భాసిస్తూ దూరంగా ఉంటాడు హరిహరనాథుడు. పీతాంబరమూ, సామజత్వక్కు వసనంగా కలిగి ఉండటంలో యథాక్రమంగా (పీతాంబరుడు) హరి (గజ చర్మిడు) హర స్వరూపం స్ఫురిస్తుంది. పీతాంబరం పట్టుపుట్టం కోమలమైతే సామజత్వక్కు, స్ఫీతం-మందం. కఠినం,పరస్పర భిన్న లక్షణాలు ఏకీభవించినతత్త్వం హరిహరనాథుడిది.

మాలిని,

అపరిమిత విభూతీ! యప్రమత్తానుయాతీ!
లపన నిభృతవేదా! లక్షణ స్వైరనాదా!
జపపర వరదాయీ! సర్వవిద్యా విధాయీ!
విపుల కృప కటాక్షా! విశ్వసంహ్లాదదక్షా! **186**

ప్రతిపదార్థం: అపరిమిత-విభూతీ!= మేర లేని ఐశ్వర్యం కలవాడా!; అప్రమత్త+అనుయాతీ!= ప్రమాదాన్ని పొందని వారే, నీవెంట వచ్చేవాళ్ళుగా కలవాడా!; లపన= మాటలలో; నిభృత= స్థిరపడ్డ, (నిండిన); వేదా!= వేదాలు గలవాడా!; లక్షణ= లక్షణం (శబ్దాదిశాస్త్రం)గా ఏర్పడిన; స్వైరం= స్వేచ్ఛగా వెలువడ్డ; నాదా!= ధ్వనులు కలవాడా!; జప= జపం చేసికొనటంలో; పర= ఏకాగ్రత కలవారికి; ఫలదాయీ!= గొప్ప ఫలితాన్ని ఇచ్చేవాడా; సర్వ= సమస్తమైన; విద్యా= విద్యలనూ; విధాయీ!= ఏర్పాటు చేసేవాడా!; విపుల= విస్తారమైన; కృప= దయ గలిగినట్టిదైన; కటాక్షా!= కడగంటి చూపు కలవాడా!; విశ్వ= సమస్తసృష్టినీ; సంహ్లాద= సంతోషపెట్టటంలో; దక్షా!= నైపుణ్యం గలవాడా!

తాత్పర్యం: కొలది లేని ఐశ్వర్యం కలవాడా! ఏకాగ్రత ఉన్న (భక్త) జనం చేత అనుసరించబడేవాడా! మాటలే వేదాలు అయినవాడా! స్వేచ్ఛగా (నీవు) చేసిన ధ్వనులే ఆయా లక్షణాలుగా ఏర్పడటం కలవాడా! ధ్యానశీలురైన వారికి తగిన ఫలితాన్ని అందజేసేవాడా! సమస్తమయిన విద్యలను కలుగజేసేవాడా! విస్తృతమైన దయ కలిగిన కొనచూపులవాడా! ~~ఈ~~ సమస్తమైన సృష్టిని సంతోషపెట్టటంలో నైపుణ్యం కలవాడా! ఓ హరిహరనాథా!.

విశేషం: అపరిమిత 'విభూతి'- విభూతి అంటే సంపద అని హరి రూపంలోనూ, భస్మమని హర రూపంలోనూ అర్థం. ఐక్యం హరిహరత్వం అప్రమత్త-అనుయాతి. అనుయాతి, వెంటబడి వచ్చేవాడు. ప్రమత్తులైతే అజ్ఞానం వలన సంసారంలో పడిపోతారు. జ్ఞానులు హరిహరనాథుడి వెంటబడిపోతారు. హరిహరుడి మాటలలో వేదాలు స్థిరపడ్డాయి. ఆ మాటలే వేదాలు. అతడు స్వైరంగా చేసిన ధ్వనులే లక్షణాలు, శాస్త్రాలు, పరమేశ్వరుడి ఢక్కానాదమే ఆఇఉణ్ మొదలైన రూపాలలో మాహేశ్వర సూత్రాలయి పాణినీయ శబ్ద లక్షణానికి మూలాలయ్యాయి. పరమేశ్వరుడే వేలాది విద్యలకు ప్రవర్తకుడు (చూ, తిక్కయజ్వ హరిహరనాథతత్త్వము పుట.383) (అలంకారం అంత్యానుప్రాసం).

గద్యము:

ఇది శ్రీమదుభయ కవిమిత్ర కొమ్మనామాత్య పుత్త్ర బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి ప్రణీతం బైన శ్రీమహాభారతంబున నాశ్రమవాసపర్వంబునందుఁ బ్రథమాశ్వాసము.

తాత్పర్యం: ఇది మహితాత్ముడు సంస్కృతాంధ్ర కవులకు మిత్రుడూ, కొమ్మనామాత్యుడి పుత్రుడూ, పండితులను ఆరాధించటం చేత ప్రకాశించేవాడూ, (విద్వాంసులు తనను సేవించటం చేత విరాజిల్లేవాడు) అయిన తిక్కన సోమయాజి చేత రచించబడిన శ్రీమహాభారతంలో ఆశ్రమవాసపర్వంలోని మొదటి ఆశ్వాసం.

ఆశ్రమవాసపర్వంలోని ప్రథమాశ్వాసం సమాప్తం.